www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 27-4-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 28 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: తదియ ఉ. 8.18 తదుపరి చవితి; నక్షత్రం: జ్యేష్ఠ తె. 4.28 తదుపరి మూల; వర్జ్యం: ఉ.9.27-11.06; దుర్ముహూర్తం: ఉ.5.54-7.35; అమృతఘడియలు: రా.7.22-9.01; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.54; సూర్యాస్తమయం: 6.30 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

రేవంత్ సర్కారును బీజేపీ కూల్చదు

అదే కూలిపోతే మాకు సంబంధం లేదు.. కేసీఆర్ ఎమ్మెల్యేలను కాపాడుకోలేకపోయారు

ముస్లిం రిజర్వేషన్లను బరాబర్ ఎత్తేస్తాం: కిషన్‌రెడ్డి



బర్కత్‌పుర, నల్లకుంట, హైదరాబాద్ ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి ప్రభుత్వాన్ని బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ కూల్చబోదని, అదే కూలిపోతే తమకు ఎలాంటి సంబంధం లేదని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి. కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం శివం రోడ్‌లోని ఓ హోటల్‌లో, బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యేలను కాపాడుకోలేని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు లోక్‌సభ ఎన్నికల్లో

మిగతా 12వ పేజీలో...

ఈవీఎంలే సరైనవి

- బ్యాలెట్ పేపర్లకు కాలం చెల్లింది.. గుడ్డిగా దేన్నీ అనుమానించవద్దు
- సంస్కరణలను వృథా చేయొద్దు.. ఈవీఎంల కేసులో సుప్రీం తీర్పు
- వీవీప్యాట్ స్లిప్పులను నూరుశాతం లెక్కించాలన్న పిటిషన్ల కొట్టివేత
- ఆ స్లిప్పులను ఓటర్లే డిపాజిట్ చేసే అవకాశం ఇవ్వాలన్న విజ్ఞప్తికీ నో
- సింబల్ లోడింగ్ యూనిట్లనూ 45రోజులు భద్రపరచాలని ఆదేశం
- ఎన్నికల పిటిషన్ దాఖలైతే.. 5% ఈవీఎంల మైక్రో కంట్రోలర్ల మెమొరీని సంబంధిత ఇంజనీర్లు తనిఖీచేయాలని మరో ఆదేశం 11
- ఎలక్ట్రానిక్ పద్ధతిలో వీవీప్యాట్ల లెక్కింపుపై ఆలోచించాలని సూచన



ప్రతిపక్షాలకు గట్టి చెంపదెబ్బ!

- విపక్ష నేతలు ప్రజలకు క్షమాపణలు చెప్పాలి
- ఈవీఎంలపై అనవసర రాద్ధాంతం చేశారు
- ముస్లింల ఓటుబ్యాంకు కోసం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు దొంగిలించే యత్నం
- బిహార్ ప్రచారంలో మోదీ



కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వారియర్లతో భేటీలో మాట్లాడుతున్న సీఎం రేవంత్

హరీశ్‌రావ్.. రాజీనామా
సిద్ధంగా ఉంచుకో!

- పంద్రాగస్టులోగా రుణమాఫీ చేసి తీరుతాం
- ఒక్క ఏడాది కడుపు కట్టుకుంటే చాలు.. బ్యాంకులకు ఎడమ చేత్తో చెల్లించేస్తాం
- ప్రభుత్వాన్ని కూల్చే కుట్రలు జరుగుతున్నాయి
- వాటిని సోషల్ మీడియా వారియర్స్ తిప్పికొట్టాలి
- ఇక్కడ కేసీఆర్‌ను ఓడించి సెమీఫైనల్‌లో గెలిచాం
- కేంద్రంలో నరేంద్ర మోదీని ఓడించడం ఫైనల్స్
- కాంగ్రెస్ సోషల్ మీడియా వారియర్స్‌తో రేవంత్
- మోదీ కాలనాగు లాంటోడు.. పగ పడతాడు
- రిజర్వేషన్లు పోవాలనుకుంటే బీజేపీకి ఓటేయండి
- జహీరాబాద్ జనజాతర సభలో సీఎం రేవంత్

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టులోగా రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని సీఎం రేవంత్‌రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. ఈ విషయమై బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు చేసిన సవాల్‌ను తాను స్వీకరిస్తున్నానని ప్రకటించారు. హరీశ్‌రావు తన రాజీనామా లేఖను రెడీగా పెట్టుకోవాలన్నారు. రైతులు తమ కుటుంబమేనని, వారికి రుణమాఫీ చేయకపోతే తమకు అధికారం ఎందుకని రేవంత్ అన్నారు. రుణమాఫీకి రూ.40 వేల కోట్ల వరకు అవుతాయని, ఇవి.. కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టులో దోచుకున్న రూ.లక్ష కోట్ల కన్నా, హైదరాబాద్ చుట్టూ ఆక్రమించుకున్న వేలాది ఎకరాల కన్నా ఎక్కువనా? అని ప్రశ్నించారు. ఒక్క ఏడాది కడుపు కట్టుకుంటే రుణమాఫీకి అయ్యే రూ.40 వేల కోట్లను ఎడమ చేత్తో బ్యాంకులకు చెల్లిస్తామన్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసే బాధ్యత తనదని చెప్పారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ

మిగతా 12వ పేజీలో...

రాజీనామాతో వచ్చా.. రేవంత్ ఎక్కడ?

- మేధావుల చేతికి నా రాజీనామా లేఖను అందిస్తున్నా
- ఆగస్టు 15లోగా రుణ మాఫీతోపాటు 6 గ్యారెంటీలను ఈ సర్కారు అమలు చేస్తే.. వాళ్లే స్పీకర్‌కు ఇవ్వొచ్చు
- ఇప్పటికైనా క్షమాపణ చెప్పాలి.. గన్‌పార్క్ వద్ద హరీశ్‌రావు

12

మంద జగన్నాథం, బాబూమోహన్ నామినేషన్ల తిరస్కరణ

- ప్రధాన పార్టీల అభ్యర్థులందరికీ ఆమోదం!
- నామినేషన్ల పరిశీలన పూర్తి
- ఉపసంహరణకు సోమవారం తుది గడువు

14



అగ్గి వీరుడు!

- రంగారెడ్డి జిల్లాలో అలెన్ పరిశ్రమలో అగ్నిప్రమాదం
- ఐదుగురిని కాపాడిన 16 ఏళ్ల బాలుడు
- 12 కోట్ల మేర ఆస్తి నష్టం.. ఒకరికి తీవ్ర గాయాలు
- బాలుడికి షాద్‌నగర్ ఎమ్మెల్యే, పోలీసుల అభినందనలు

14

రెడ్ అలర్ట్

- ఎండ తీవ్రతతో చాలా జిల్లాలకు ప్రమాద హెచ్చరిక
- నేటి నుంచి 3 రోజులు పలు జిల్లాల్లో వడగాలులు
- పొడి వాతావరణంతో 2-3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత
- ఉదయం 11 తర్వాత అత్యవసరమైతేనే బయటకు..
- నిప్పుల కుంపటి జమ్మికుంట.. 45.6 డిగ్రీలు
- వరంగల్, నల్లగొండ, కరీంనగర్ జిల్లాల్లో 45 పైనే
- వడదెబ్బతో ప్రైవేటు ఉపాధ్యాయిని, కూలీ మృతి
- ఐదు రోజులు మంటలే.. తీవ్ర వడగాలులు
- ఈసారి ఎన్నడూ లేనంత వేడి.. గత రికార్డు బద్దలు
- రాయలసీమ, తెలంగాణలోనూ ప్రభావం: ఐఎండీ

3



బళ్లారిలో చెంబు చూపిస్తున్న రాహుల్

భయంతో మోదీ వణుకుతున్నారు!

- స్టేజీపైనే కన్నీళ్లు కూడా పెడతారేమో
- ప్రధానిపై రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు
- తాము అధికారంలోకి వస్తే.. 'అగ్నివీర్' రద్దు, జీఎస్టీలో మార్పులు చేస్తామని హామీ

11

ప్రాంతీయ పార్టీలను దెబ్బతీసే కుట్ర



- పట్టు పెంచుకునేందుకు ఏకమైన బీజేపీ, కాంగ్రెస్
- చోటే భాయ్, బడే భాయ్.. ఎవరికి ఓటేసినా మీటర్లే
- ప్రతి స్కీంలో మోసం.. దగా.. చూస్తూ ఊరుకోను
- మహబూబ్‌నగర్ రోడ్ షోలో కేసీఆర్ వ్యాఖ్యలు
- తెలంగాణ కోసం అందరూ పోరాడితే తాను నాయకత్వం వహించానని వ్యాఖ్య

14

అన్నా.. నువ్వే గెలుస్తున్నవ్!



- మల్కాజిగిరి బీజేపీ అభ్యర్థి ఈటలతో బీఆర్ఎస్ నేత మల్లారెడ్డి.. ఓ వివాహంలో ఎదురుపడ్డ నేతలు
- ఆప్యాయంగా హత్తుకొని, గెలుపు నీదేనన్న మల్లారెడ్డి
- మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోనే మల్లారెడ్డి, ఆయన అల్లుడి అసెంబ్లీ స్థానాలు

13

హెచ్‌సీఎల్ టెక్ లాభం
రూ. 3,986 కోట్లు
మొత్తం ఆదాయం రూ.28,499 కోట్లు .. ఒక్కో షేరుకు రూ.18 మధ్యంతర డివిడెండ్


విజయ్ కుమార్

న్యూఢిల్లీ: టెక్నాలజీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్ మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో రూ.3,986 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,983 కోట్లతో పోల్చితే లాభం నామమాత్రంగానే పెరిగింది. అయితే అక్టోబరు-డిసెంబరు త్రైమాసికంలో ఆర్జించిన రూ.4,350 కోట్లతో పోల్చితే మాత్రం లాభం 8.4 శాతం క్షీణించిందని కంపెనీ తెలిపింది. పన్ను చెల్లింపుల ముందు లాభం (ఎబిటా) సైతం ముందు త్రైమాసికంతో పోల్చితే 10.6 శాతం దిగజారి రూ.5,018 కోట్లకే పరిమితమైంది. ఇక ఇదే కాలంలో కంపెనీ ఆదాయం 7.11 శాతం పెరిగి రూ.26,606 కోట్ల నుంచి రూ.28,499 కోట్లకు పెరిగింది. ప్రపంచవ్యాప్తంగా ఐటీ వ్యయాలు తగ్గిపోవటంతో పాటు ఉద్యోగుల వ్యయాలు గణనీయంగా పెరగటం పనితీరుపై ప్రభావం చూపించిందని హెచ్‌సీఎల్ టెక్ సీఈఓ సీ విజయ్ కుమార్ వెల్లడించారు. మార్చి త్రైమాసికంలో ఫైనాన్షియల్ సర్వీసెస్ విభాగం 12.1 శాతం, మాన్యుఫ్యాక్చరింగ్ రంగం 9.8 శాతం వృద్ధి చెందిందన్నారు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్థిర కరెన్సీ విలువల ప్రకారం కంపెనీ ఆదాయం 3 నుంచి 5 శాతం మేరకు, ఎబిటా మార్జిన్ 18 నుంచి 19 శాతం మేరకు పెరగవచ్చని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. అయితే మార్చి 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరం మొత్తానికి రూ.1,09,913 కోట్ల ఆదాయంపై రూ.15,702 కోట్ల లాభం ఆర్జించింది. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే ఆదాయం 8.33 శాతం, లాభం 5.73 శాతం పెరిగాయి. కంపెనీ డైరెక్టర్ల బోర్డు రూ.2 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.18 మధ్యంతర డివిడెండ్‌ను ప్రకటించింది. మే 15వ తేదీన మధ్యంతర డివిడెండ్‌ను వాటాదారులకు చెల్లించనున్నట్టు కంపెనీ తెలిపింది.

10,000 మంది ఫ్రెషర్స్ నియామకాలు

మార్చి త్రైమాసికంలో ఉద్యోగులపై వ్యయాలు 11.5 శాతం మేరకు పెరిగాయని, వలస రేటు మాత్రం గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 19.5 శాతం నుంచి 12.4 శాతానికి తగ్గిందని కంపెనీ ప్రకటించింది. కాగా మార్చి ముగిసే నాటికి కంపెనీ మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,27,481గా ఉందని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 10,000 మంది ఫ్రెషర్స్‌ను నియమించుకున్నామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో కూడా అదే స్థాయిలో నియామకాలు చేపట్టే వీలుందని కంపెనీ చీఫ్ పీపుల్ ఆఫీసర్ రామచంద్రన్ సుందరరాజన్ తెలిపారు. 2023-24లో మొత్తం 73 డీల్స్‌ను కుదుర్చుకోగా ఇందులో 21 డీల్స్‌ను ఒక్క మార్చి త్రైమాసికంలోనే కుదుర్చుకున్నట్టు చెప్పారు.

ఐదు రోజుల ర్యాలీకి బ్రేక్
సెన్సెక్స్ 609 పాయింట్లు డౌన్

ముంబై: వరుసగా ఐదు రోజుల పాటు లాభాల్లో పయనించిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు శుక్రవారం నష్టాల్లోకి మళ్లాయి. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాల నేపథ్యంలో మదుపరులు బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగ షేర్లలో లాభాల అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. ముడి చమురు ధరల పెరుగుదల, రూపాయి క్షీణత, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ మార్కెట్‌పై ఒత్తిడిని మరింత పెంచాయి. వారాంతం ట్రేడింగ్ ముగిసేసరికి సెన్సెక్స్ 609.28 పాయింట్లు కోల్పోయి 73,730.16 వద్దకు జారుకుంది. నిఫ్టీ 150.40 పాయింట్ల నష్టంతో 22,419.95 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 24 నష్టపోయాయి.

బజాజ్ ఫైనాన్స్ 7.73 శాతం క్షీణించి సూచీ టాప్ లూజర్‌గా మిగిలింది. బజాజ్ ఫిన్‌సర్వ్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, నెస్లే షేర్లు మూడు శాతానికి పైగా నష్టపోయాయి. టెక్ మహీంద్రా షేరు మాత్రం 7.34 శాతం ఎగిసి సెన్సెక్స్ టాప్ గెయినర్‌గా నిలిచింది. ప్రధాన షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనైనప్పటికీ చిన్న, మధ్యస్థాయి కంపెనీల షేర్లలో కొనుగోళ్లు కొనసాగాయి. దాంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 0.83 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.27 శాతం పెరిగాయి. రంగాలవారీ సూచీల్లో బ్యాంకెక్స్, ఫైనాన్షియల్ సర్వీసెస్ అర శాతానికి పైగా నష్టపోయాయి.

అపోలో 24/7లో అడ్వెంట్ పెట్టుబడులు

రూ.2,475 కోట్లతో 12.1% వాటా కొనుగోలు

హైదరాబాద్: దేశ ఫార్మా రిటైల్ రంగంపైనా అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ (పీఈ) సంస్థలు ఆసక్తి చూపిస్తున్నాయి. అపోలో 24/7 పేరుతో హెల్త్‌కేర్ రిటైల్ రంగంలో ఉన్న అపోలో హాస్పిటల్స్ గ్రూప్ సంస్థ అపోలో హెల్త్ కంపెనీ లిమిటెడ్ (ఏహెచ్‌ఎల్) ఈక్విటీలో ప్రముఖ పీఈ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ 12.1 శాతం వాటా తీసుకుంటోంది. ఇందుకోసం రూ.2,475 కోట్లు చెల్లించనుంది.అడ్వెంట్ ఇంటర్నేషనల్ రెండు విడతలుగా కన్వర్టబుల్ డిబెంచర్ల ద్వారా ఈ వాటా కొనుగోలు చేయనుంది. దీనికి తోడు అపోలో 24/7 హోల్‌సేల్ ఫార్మా డిస్ట్రిబ్యూషన్ కంపెనీ కీమెడ్ ప్రైవేట్ లిమిటెడ్‌ను వచ్చే 24-30 నెలల్లో మాతృసంస్థలో విలీనం చేయాలని అడ్వెంట్ ఇంటర్నేషనల్ షరతు విధించింది.

ఎవరి వాటా ఎంత?

విలీనం తర్వాత అపోలో హెల్త్ కంపెనీ లిమిటెడ్ (అపోలో 24/7) ఈక్విటీలో అడ్వెంట్ ఇంటర్నేషనల్‌కు 12.1 శాతం, కీమెడ్ వాటాదారులకు 25.7 శాతం, ప్రధాన ప్రమోటర్ అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏహెచ్‌ఈఎల్)కు 59.2 శాతం వాటా ఉంటుంది. విలీనానికి ముందు రెండు కంపెనీల విలువను రూ.22,481 కోట్లుగా లెక్కించారు. ఇందులో అపోలో 24/7 విలువను రూ.14,478 కోట్లుగా, కీమెడ్ విలువను రూ.8,003 కోట్లుగా లెక్కకట్టారు.

విలీనం భేష్..

అపోలో 24/7లో కీమెడ్ ప్రైవేట్ లిమిటెడ్ విలీనాన్ని అపోలో హాస్పిటల్స్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ సీ ప్రతాప్ రెడ్డి స్వాగతించారు. 'ప్రతి భారతీయుడికి అందుబాటు ధరల్లో విశ్వసనీయమైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం. అపోలో 24/7 ఈ లక్ష్యాన్ని సాధించింది. కొద్ది కాలంలోనే 3.3 కోట్ల మంది భారతీయులకు తన సేవలు అందించింది. అడ్వెంట్ పెట్టుబడులు, కీమెడ్ విలీనంతో రిటైల్ హెల్త్ కంపెనీల్లో అపోలో 24/7లో ప్రధాన కంపెనీగా నిలుస్తుంది' అని ఒక ప్రకటనలో తెలిపారు. 'అపోలో 24/7 చరిత్రలో ఇదో మైలురాయి. ఈ విలీనంతో 140 కోట్ల మంది భారతీయులకు వారంలో అన్ని రోజులూ అసలు సిసలు ఔషధాలను 24 నిమిషాల నుంచి 24 గంటల్లో అందిస్తాం' అని అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ శోభనా కామినేని అన్నారు.

స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్‌లకు ఆర్‌బీఐ ఆఫర్!
సార్వజనిక బ్యాంక్‌గా మారేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ముంబై: సార్వజనిక (యూనివర్సల్) బ్యాంకులుగా మారేందుకు అర్హత కలిగిన స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్స్ (ఎస్ఎఫ్‌బీ) నుంచి ఆర్‌బీఐ దరఖాస్తులను ఆహ్వానించింది. యూనివర్సల్ బ్యాంక్‌గా మారాలనుకుంటున్న ఎస్ఎఫ్‌బీలు ఈ మార్చితో ముగిసిన త్రైమాసికం నాటికి కనీసం రూ.1,000 కోట్ల నెట్‌వర్త్‌ను కలిగి ఉండాల్సి ఉంటుంది. అలాగే, ఎస్ఎఫ్‌బీల షేర్లు స్టాక్ మార్కెట్లో లిస్టయి ఉండాలని శుక్రవారం విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అంతేకాదు, గడిచిన రెండు ఆర్థిక సంవత్సరాల్లో నికర లాభాలను నమోదు చేసుకోవడంతో పాటు స్థూల నిరర్థక ఆస్తులు (గ్రాస్ ఎన్‌పీఏ) 3 శాతం అంతకన్నా తక్కువగా, నికర ఎన్‌పీఏలు ఒక శాతం అంతకన్నా తక్కువగా ఉండాలి. 2014 నవంబరులో ఆర్‌బీఐ ఎస్ఎఫ్‌బీల లైసెన్సు మార్గదర్శకాలను జారీ చేసింది. ప్రస్తుతం దేశంలో ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఈక్విటాస్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ సహా దాదాపు డజను ఎస్ఎఫ్‌బీలున్నాయి.

ఎల్ఎస్‌పీలకు కొత్త నిబంధనలు

బ్యాంకులకు ఏజెంట్లుగా వ్యవహరించే లెండింగ్ సర్వీస్ ప్రొవైడర్ల (ఎల్ఎస్‌పీ)కు ఆర్‌బీఐ కొత్త నిబంధనలను ప్రతిపాదించింది. ఇకపై ఎల్ఎస్‌పీలు తాము ఆఫర్ చేసే అన్ని రుణాల సమాచారాన్ని రుణగ్రహీతలకు తెలియజేయాల్సి ఉంటుంది. తద్వారా రుణగ్రహీతలు మరింత మెరుగ్గా నిర్ణయం తీసుకోగలగడంతో పాటు ఎల్ఎస్‌పీల సేవల్లో పారదర్శకత పెరగనుంది. చాలా ఎల్ఎస్‌పీలు ఏక కాలంలో పలు బ్యాంక్‌లు, ఆర్థిక సంస్థలకు చెందిన రుణ పథకాల విక్రయ ఏజెంట్లుగా వ్యవహరిస్తుంటాయి.

11 % పెరిగిన ఎస్‌బీఐ కార్డ్ లాభం

ముంబై: ఎస్‌బీఐ కార్డ్ కంపెనీ ఈ ఏడాది మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికంలో నికర లాభంలో 11 శాతం వృద్ధిని నమోదు చేసింది. గత ఏడాది ఇదే కాలంతో పోల్చితే లాభం రూ.596 నుంచి రూ.662 కోట్లకు పెరిగింది. మొత్తం ఆదాయం కూడా 14 శాతం పెరిగి రూ.3,917 కోట్ల నుంచి రూ.4,475 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం 28 శాతం వృద్ధితో రూ.2,139 కోట్లకు చేరింది. కాగా ఏడాది మొత్తానికి లాభం 7 శాతం పెరిగి రూ.2,408 కోట్లుగా నమోదైంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,710 ▲	66,650 ▲	88,000 ▲
ముంబై	72,448 ▲	66,362 ▲	81,374 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

27వ తేదీ

హైదరాబాద్	350	విజయవాడ	380
వరంగల్	352	గోదావరి	380
చిత్తూరు	453	విశాఖపట్నం	400

డజను గుడ్లు రూ.60

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	125	గోదావరి	131
వరంగల్	125	విజయవాడ	131
కరీంనగర్	125	గుంటూరు	135
మహబూబ్‌నగర్	125	ఒంగోలు	135
కర్నూలు	125	చిత్తూరు	128
విశాఖపట్నం	123		

2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ
రూ.83 లక్షల కోట్లకు...
సీఐఐ తెలంగాణ చైర్మన్ సాయి డి ప్రసాద్

హైదరాబాద్: తెలంగాణ ఆర్థిక వృద్ధి రేటు జాతీయ సగటు స్థాయిని మించిపోయింది. గత పదేళ్లలో రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధి రేటు జాతీయ సగటు కంటే అధికంగా ఉంది. ఈ కాలంలో తెలంగాణ ఏటా సగటున 10 శాతం చొప్పున వృద్ధి రేటు నమోదు చేసింది. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ), తెలంగాణ చాప్టర్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన భారత్ బయోటెక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయి డి ప్రసాద్ ఈ విషయం చెప్పారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ జీఎస్‌డీపీ రూ.14.49 లక్షల కోట్లు (17,500 కోట్ల డాలర్లు)గా ఉండొచ్చని అంచనా వేస్తున్నామన్నారు. కాగా రానున్న సంవత్సరాల్లో రాష్ట్రం ఇదే వృద్ధి రేటు కొనసాగిస్తే 2047 నాటికి తెలంగాణ ఆర్థిక వ్యవస్థ రూ.83.35 లక్షల కోట్ల (లక్ష కోట్ల డాలర్లు) స్థాయికి చేరుతుందన్నారు. ఈ లక్ష్య సాధన కోసం సీఐఐ తెలంగాణ చాప్టర్ వ్యవసాయం, ఎంఎస్ఎంఈలు, పర్యాటక రంగం, మెడికల్ టూరిజంపై ప్రధానంగా దృష్టి పెడుతుందని సాయి ప్రసాద్ చెప్పారు. విధానపరంగా ఎంఎస్ఎంఈలకు ఎదురయ్యే సమస్యల పరిష్కారంతో పాటు ఖాయిలా పడిన ఎంఎస్ఎంఈల పునరుద్ధరణకూ కృషి చేస్తామని సీఐఐ తెలంగాణ చాప్టర్ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన రాచమల్లు ఫోర్జింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ రాచమల్లు శివ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

లాభాల్లో మారుతి సుజుకీ రికార్డు
క్యూ4 లాభం రూ.3,879 కోట్లు • రూ.5 ముఖవిలువ కలిగిన ప్రతి షేరుకు రూ.125 డివిడెండ్

న్యూఢిల్లీ: మారుతి సుజుకీ 2023-24 ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.3,877.8 కోట్ల కన్సాలిడేటెడ్ లాభం ఆర్జించింది. కంపెనీ చరిత్రలో ఒక త్రైమాసికంలో ఆర్జించిన లాభంలో కొత్త రికార్డు ఇది. 2022-23 ఆర్థిక సంవత్సరం ఇదే కాలం లాభం రూ.2,623.6 కోట్లతో పోల్చితే ఇది 47.8 శాతం అధికం. ఎస్‌యూవీలు భారీగా అమ్ముడుపోవడంతో పాటు కమోడిటీ ధరల తగ్గుదల కారణంగా పెరిగిన మార్జిన్లు, వ్యయ నియంత్రణ చర్యలు, సామర్థ్యాల వినియోగం పెంపు లాభంలో వృద్ధికి కారణాలుగా ఉన్నాయని మారుతి సుజుకీ తెలిపింది. మార్చి త్రైమాసికంలో కంపెనీ 5.84 లక్షల కార్లు విక్రయించింది. గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే కార్ల విక్రయాలు 13.4 శాతం పెరిగాయి. మొత్తం అమ్మకాల్లో యుటిలిటీ వాహనాల వాటా 24 శాతం నుంచి 36 శాతానికి పెరిగింది. వరుసగా మూడో ఏడాది కూడా కంపెనీ అత్యధిక కార్ల ఎగుమతిదారుగా నిలిచింది. దేశం నుంచి ఎగుమతి అయిన కార్లలో మారుతి వాటా 41.8 శాతం ఉంది. కాగా ఏడాది మొత్తానికి కంపెనీ 21,35,323 కార్లు విక్రయించింది. తఏడాదితో పోల్చితే ఇది 8.6 శాతం అధికం. వీటిలో దేశీయ అమ్మకాలు 18,52,256 యూనిట్లు కాగా 2,83,067 కార్లు ఎగుమతి చేసింది. ఇదిలా ఉండగా కంపెనీ డైరెక్టర్ల బోర్డు రూ.5 ముఖ విలువ గల ఒక్కో షేరుపై రూ.125 డివిడెండ్‌ను సిఫారసు చేసింది. కంపెనీ చరిత్రలో చెల్లిస్తున్న అత్యధిక డివిడెండ్ ఇదే. 2022-23 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ వాటాదారులకు ఒక్కో షేరుపై రూ.90 డివిడెండ్ చెల్లించింది.

బీఓఎం లాభంలో 45% వృద్ధి

ముంబై: మార్చి త్రైమాసికంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 45 శాతం వృద్ధితో రూ.1,218 కోట్ల నికరలాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన లాభం రూ.840 కోట్లు. ఇదే కాలంలో బ్యాంక్ మొత్తం ఆదాయం రూ.5,317 కోట్ల నుంచి రూ.6,488 కోట్లకు పెరిగింది. ఇందులో వడ్డీ ఆదాయం రూ.5,467 కోట్లుంది. స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) 2.47 శాతం నుంచి 1.88 శాతానికి, నికర ఎన్‌పీఏలు 0.25 శాతం నుంచి 0.20 శాతానికి దిగి వచ్చాయి.

నేటి మ్యాచ్‌లు

ఢిల్లీ x ముంబై	మ.3.30 గం. నుంచి
లఖ్‌నవూ x రాజస్థాన్	రాత్రి 7.30 గం. నుంచి

ఇప్పటికి వీరే..

పరుగులు	వికెట్లు
విరాట్ కోహ్లి (బెంగళూరు)	హర్షల్ పటేల్ (పంజాబ్)
430 (9 మ్యాచ్‌లు)	14 (9 మ్యాచ్‌లు)


262.. ఉఫ్

18.4 ఓవర్లలోనే ఖతం

బెయిర్‌స్టో (48 బంతుల్లో 8 ఫోర్లు, 9 సిక్సర్లతో 108 నాటౌట్)

పంజాబ్ రికార్డు ఛేదన
- బెయిర్‌స్టో సూపర్ సెంచరీ
- రాణించిన శశాంక్, ప్రభ్‌సిమ్రన్
- కోల్‌కతాకు భంగపాటు

ఈ ఐపీఎల్ సీజన్‌లో అసలేం జరుగుతోంది? ప్రతీ మ్యాచ్ అంతకు మించి అన్నట్టుగా సాగుతున్న ఈ లీగ్‌లో మరో కళ్లుచెదిరే పోరు. బ్యాటింగ్‌కు స్వర్గధామంగా మారిన ఈడెన్ గార్డెన్స్‌లో ఏకంగా 262 పరుగుల రికార్డు ఛేదనను పంజాబ్ కింగ్స్ బ్యాటర్లు మరో 8 బంతులుండగానే ఊదిపారేశారు. ఇది టీ20 చరిత్రలోనే అత్యధిక ఛేదన. కలయా.. నిజమా అనే రీతిలో ప్రభ్‌సిమ్రన్ శుభారంభానికి బెయిర్‌స్టో శతకం తోడవ్వగా.. చివర్లో శశాంక్ సింగ్ సుడిగాలి ఇన్నింగ్స్‌తో కోల్‌కతా బౌలర్లు బిత్తరపోవాల్సి వచ్చింది. అంతకుముందు కేకేఆర్ బ్యాటర్లు సాగించిన జోరు కూడా కింగ్స్ ఆట ముందు చిన్నబోయింది. మొత్తంగా ఈ మ్యాచ్‌లో 523 పరుగులు నమోదు కావడం విశేషం.


1 — పురుషుల టీ20 క్రికెట్‌లో అత్యధిక ఛేదన (262) చేసిన జట్టుగా పంజాబ్

టీ20 మ్యాచ్‌లో అత్యధిక సిక్సర్లు (42) నమోదు కావడం ఇదే తొలిసారి. అలాగే ఓ ఐపీఎల్ ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు (24) బాదిన జట్టుగా పంజాబ్.

ఐపీఎల్‌లో ఇరు జట్ల ఓపెనర్లు 50+ స్కోర్లు సాధించడం ఇదే తొలిసారి.

ఈడెన్ గార్డెన్స్‌లో అత్యధిక స్కోరు (262) చేసిన ఐపీఎల్ జట్టుగా పంజాబ్.

6 — ఈ సీజన్‌లో 250+ స్కోర్లు నమోదు కావడం ఇది ఆరోసారి.


నరైన్ (71) సాల్ట్ (75)

కోల్‌కతా: ఈడెన్ గార్డెన్స్‌లో పరుగుల సునామీ. 261 పరుగులు సాధించాక ఇక గెలుపు తమదే అనుకున్న కోల్‌కతా నైట్‌రైడర్స్‌కు ఇది నిజంగా ఊహించని పరిణామమే. అసాధ్యమనుకున్న ఛేదనను అనూహ్యరీతిలో సాగిన ఆటతీరుతో పంజాబ్ కింగ్స్ సుసాధ్యం చేసింది. జానీ బెయిర్‌స్టో (48 బంతుల్లో 8 ఫోర్లు, 9 సిక్సర్లతో 108 నాటౌట్) కీలక మ్యాచ్‌లో ఫామ్ అందుకోగా.. హిట్టర్ శశాంక్ సింగ్ (28 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్లతో 68 నాటౌట్), ఓపెనర్ ప్రభ్‌సిమ్రన్ (20 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 54) కోల్‌కతా బౌలర్లను చెడుగుడు ఆడారు. దీంతో శుక్రవారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ 8 వికెట్లతో ఘనవిజయం సాధించింది. ముందుగా కోల్‌కతా 20 ఓవర్లలో 6 వికెట్లకు 261 పరుగులు చేసింది. సాల్ట్ (37 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 75), నరైన్ (32 బంతుల్లో 9 ఫోర్లు, 4 సిక్సర్లతో 71) రాణించారు. అర్ష్‌దీప్‌నకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో పంజాబ్ 18.4 ఓవర్లలో 2 వికెట్లకు 262 పరుగులు చేసి గెలిచింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా బెయిర్‌స్టో నిలిచాడు.

బాదుడే బాదుడు: భారీ ఛేదనను పంజాబ్ కళ్లు చెదిరే రీతిలో ఆరంభించింది. ఆరంభంలో ప్రభ్‌సిమ్రన్.. మధ్య ఓవర్లలో బెయిర్‌స్టో.. చివర్లో శశాంక్ ప్రతాపం సాగింది. స్పిన్నర్ నరైన్ మాత్రం రన్స్‌ను కట్టడి చేయగలిగాడు. ప్రభ్‌సిమ్రన్ మూడో ఓవర్‌లోనే 6,4,6,4తో 23 పరుగులు అందించాడు. ఐదో ఓవర్‌లో మరో 4,6తో 18 బంతుల్లోనే ఫిఫ్టీ కూడా పూర్తయ్యింది. ఇక ఆరో ఓవర్‌లో బెయిర్‌స్టో 4,6,4,4,6తో 24 రన్స్ రాగా ఆఖరి బంతికి ప్రభ్ రనౌటయ్యాడు. దీంతో పవర్‌ప్లేలో 93/1తో నిలిచింది. వన్‌డౌన్‌లో రొసో (26) కూడా ఉన్న కాసేపు వేగం కనబరిచాడు. అటు బెయిర్‌స్టో సిక్సర్‌తో 23 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. రస్సెల్ ఓవర్ (12)లో రొసో సిక్సర్, జానీ రెండు సిక్సర్లతో 24 రన్స్ రాబట్టగా అటు స్కోరు 173/1కి చేరింది. రొసోను నరైన్ అవుట్ చేసినా.. శశాంక్ రాకతో పంజాబ్ దూకుడు ఆగలేదు. 14వ ఓవర్‌లో రెండు, 16వ ఓవర్‌లో మూడు సిక్సర్లతో పాటు 18వ ఓవర్‌లో 6,6,4తో పంజాబ్ విజయాన్ని లాంఛనం చేసేశాడు. ఈ దెబ్బకు 23 బంతుల్లోనే శశాంక్ ఫిఫ్టీ పూర్తి కాగా.. మరోవైపు 45 బంతుల్లోనే బెయిర్‌స్టో తన సెంచరీని పూర్తి చేశాడు. 12 బంతుల్లో 9 పరుగులు కావాల్సిన వేళ శశాంక్ మరో సిక్సర్‌తో 8 బంతులుండగానే మ్యాచ్‌ను ముగించాడు.


శశాంక్ సింగ్ (28 బంతుల్లో 2 ఫోర్లు, 8 సిక్సర్లతో 68 నాటౌట్)

ఓపెనర్ల విధ్వంసం: 10 ఓవర్లలో 137.. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కేకేఆర్ ఇన్నింగ్స్‌లో ఓపెనర్లు నరైన్, సాల్ట్ విజృంభించిన తీరిది. ఒకరికి మించి మరొకరు అన్నట్టు అలవోకగా పంజాబ్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. పైగా నరైన్ 16 పరుగుల వద్ద, సాల్ట్ 34, 35 రన్స్ వద్ద ఇచ్చిన సులువైన క్యాచ్‌లను ఫీల్డర్లు వదిలేయడం కూడా కలిసివచ్చింది. ఆ తర్వాత కూడా ప్రతీ బ్యాటర్ వేగం కనబర్చడంతో కోల్‌కతా అవలీలగా 250+ దాటేసింది. మూడో ఓవర్‌లోనే సాల్ట్ 6,4,6తో 18 రన్స్ రాబట్టగా.. ఆ వెంటనే నరైన్ 4,6,4తో 21 రన్స్ సమకూర్చాడు. ఈ దెబ్బకు పవర్‌ప్లేలోనే జట్టు 76 పరుగులు సాధించింది. ఆ తర్వాత కూడా కేకేఆర్ జోరు తగ్గలేదు. ఎనిమిదో ఓవర్‌లో నరైన్ రెండు ఫోర్లతో 23 బంతుల్లోనే ఫిఫ్టీ పూర్తి చేయగా.. అదే ఓవర్‌లో సాల్ట్ 4,6తో 22 రన్స్ వచ్చాయి. దీంతో స్కోరు కూడా వంద దాటింది. స్పిన్నర్ రాహుల్ చాహర్ ఓవర్‌లో నరైన్‌ను ఎల్బీగా ప్రకటించినా వెంటనే అతడు రివ్యూకు వెళ్లి బతికిపోయాడు. 25 బంతుల్లోనే సాల్ట్ అర్ధసెంచరీ కూడా పూర్తయ్యింది. ఈ దశలో రాహుల్ చాహర్ కేకేఆర్‌కు ఝలక్ ఇచ్చాడు. 11వ ఓవర్‌లో నరైన్ వికెట్ తీయడంతో పంజాబ్ కాస్త ఊపిరి పీల్చుకుంది. తొలి వికెట్‌కు ఈ జోడీ 138 పరుగులు జత చేయడం విశేషం. కాసేపటికే తన ఓవర్‌లో రెండు వరుస సిక్సర్లతో ఊపు మీదున్న సాల్ట్‌ను సామ్ కర్రాన్ చక్కటి యార్కర్‌తో బౌల్డ్ చేశాడు. ఓవైపు వెంకటేశ్ అయ్యర్ భారీ షాట్లు ఆడలేకపోగా.. హిట్టింగ్ కోసం ముందుగానే పంపిన రస్సెల్ (24) కాసేపే క్రీజులో నిలిచాడు. 16వ ఓవర్‌లో అర్ష్‌దీప్ అతడిని అవుట్ చేశాడు. అప్పటికే కేకేఆర్ స్కోరు 200 దాటేసింది. 18వ ఓవర్‌లో శ్రేయాస్ (28) బ్యాట్ ఝుళిపిస్తూ వరుసగా 6,4,6,6తో 24 రన్స్‌తో జోరు చూపాడు. కానీ చివరి రెండు ఓవర్లలో కోల్‌కతాకు 22 పరుగులే రాగా శ్రేయాస్, రింకూ (5), వెంకటేశ్ వికెట్లను కోల్పోయింది.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
రాజస్థాన్	8	7	1	0	14	0.698
కోల్‌కతా	8	5	3	0	10	0.972
హైదరాబాద్	8	5	3	0	10	0.577
లఖ్‌నవూ	8	5	3	0	10	0.148
చెన్నై	8	4	4	0	8	0.415
ఢిల్లీ	9	4	5	0	8	-0.386
గుజరాత్	9	4	5	0	8	-0.974
పంజాబ్	9	3	6	0	6	-0.187
ముంబై	8	3	5	0	6	-0.227
బెంగళూరు	9	2	7	0	4	-0.721

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

కోల్‌కతా: సాల్ట్ (బి) కర్రాన్ 75, నరైన్ (సి) బెయిర్‌స్టో (బి) చాహర్ 71, వెంకటేశ్ (రనౌట్) 39, రస్సెల్ (సి) హర్షల్ (బి) అర్ష్‌దీప్ 24, శ్రేయాస్ (సి) రబాడ (బి) అర్ష్‌దీప్ 28, రింకూ (సి) అశుతోష్ (బి) హర్షల్ 5, రమణ్‌దీప్ (నాటౌట్) 6, **ఎక్స్‌ట్రాలు: 13; మొత్తం: 20 ఓవర్లలో 261/6; వికెట్ల పతనం:** 1-138, 2-163, 3-203, 4-246, 5-253, 6-261; **బౌలింగ్:** కర్రాన్ 4-0-60-1, అర్ష్‌దీప్ 4-0-45-2, హర్షల్ 3-0-48-1, రబాడ 3-0-52-0, రాహుల్ చాహర్ 4-0-33-1, హర్‌ప్రీత్ బ్రార్ 2-0-21-0.

పంజాబ్: ప్రభ్‌సిమ్రన్ (రనౌట్) 54, బెయిర్‌స్టో (నాటౌట్) 108, రొసో (సి) శ్రేయాస్ (బి) నరైన్ 26, శశాంక్ (నాటౌట్) 68, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.4 ఓవర్లలో 262/2; వికెట్ల పతనం:** 1-93, 2-178; **బౌలింగ్:** చమీర 3-0-48-0, హర్షిత్ 4-0-61-0, అనుకూల్ 2-0-36-0, నరైన్ 4-0-24-1, వరుణ్ 3-0-46-0, రస్సెల్ 2-0-36-0, రమణ్‌దీప్ 0.4-0-9-0.

టైటిల్ నిలబెట్టుకునేనా?

- భారీ అంచనాలతో భారత పురుషుల జట్టు
- సీనియర్లు లేకుండానే మహిళల బృందం
- నేటినుంచే థామస్, ఉబెర్ కప్ చాంపియన్‌షిప్


ప్రణయ్

చెంగ్డూ (చైనా): ప్రపంచ బ్యాడ్మింటన్‌లో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఆసియా జట్ల మధ్య సమరమైన థామస్ కప్, ఉబెర్ కప్‌లకు రంగం సిద్ధమైంది. పురుష జట్లు పోటీపడే థామస్ కప్, మహిళల జట్ల మధ్య జరిగే ఉబెర్ కప్ శనివారం మొదలవనుంది. ఇక, రెండేళ్ల క్రితం థామస్ కప్‌లో చాంపియన్‌గా నిలిచి చరిత్ర సృష్టించిన భారత పురుషుల బ్యాడ్మింటన్ జట్టు మరోసారి ఆ స్థాయి ప్రదర్శనతో ఆకట్టుకోవాలనుకుంటోంది. నాడు జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన సీనియర్లు కిడాంబి శ్రీకాంత్, ప్రణయ్, లక్ష్యసేన్‌తో పాటు ప్రియాన్షు రజావత్, కిరణ్ జార్జ్, డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్/చిరాగ్ శెట్టి, ధ్రువ్ కపిల/అర్జున్ జంట ఈసారీ బరిలోకి దిగుతున్నారు. అయితే, సాత్విక్ జోడీని మినహాయిస్తే సింగిల్స్ స్టార్లు శ్రీకాంత్, ప్రణయ్, లక్ష్య ఫామ్‌లేమితో తంటాలు పడుతుండడం భారత్‌ను ఆందోళనపరుస్తోంది. ఈ నేపథ్యంలో డిఫెండింగ్ చాంపియన్ హోదాలో పోటీపడుతున్న భారత జట్టు.. తమ గ్రూప్-సిలోని మాజీ విజేత ఇండోనేసియా, థాయ్‌లాండ్, ఇంగ్లండ్ జట్లను ఎలా ఎదుర్కొంటుందన్నది ఇప్పుడు కీలకంగా మారింది. భారత పురుషుల బృందం తన తొలి పోరులో భాగంగా శనివారం థాయ్‌లాండ్‌తో తలపడనుంది. సోమవారం ఇంగ్లండ్‌తో, బుధవారం ఇండోనేసియాతో భారత్ మిగతా రెండు మ్యాచ్‌లను ఆడనుంది.

అస్మిత సారథ్యంలో మహిళల బృందం: మహిళల ఈవెంట్ ఉబెర్ కప్‌కు ఈసారి భారత్ నుంచి సీనియర్లు సింధు, డబుల్స్ స్టార్ జోడీలు పుల్లెల గాయత్రి/ట్రీసా జాలీ, అశ్విని పొన్నప్ప/తనీషా క్యాస్ట్రో దూరమయ్యారు. వీరంతా పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడంలో భాగంగా వరుస టోర్నీల్లో పోటీపడాల్సి ఉండడంతో ఉబెర్ కప్ నుంచి తప్పుకొన్నారు. దీంతో అస్మితా చాలిహా సారథ్యంలో అన్మోల్ ఖర్బ్, ఇషారాణి, తన్వీ శర్మ, డబుల్స్ జోడీలు శ్రుతి మిశ్రా/ప్రియ, సిమ్రన్/రితికలతో కూడిన బృందం భారత్ నుంచి అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. చైనా, కెనడా, సింగపూర్ జట్లతో పాటు భారత్ గ్రూప్-ఎ నుంచి తలపడనుంది. తొలిపోరులో భాగంగా శనివారం కెనడాతో అస్మిత బృందం అమీతుమీ తేల్చుకోనుంది.


అస్మిత

ఫార్మాట్ ఇలా..

థామస్, ఉబెర్ కప్‌లో జట్లన్నీ నాలుగు గ్రూపులు (ఎ, బి, సి, డి)గా విడిపోయి పోటీపడతాయి. ప్రతి గ్రూపులో తొలి రెండుస్థానాల్లో నిలిచిన జట్లు క్వార్టర్‌ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. మే 2న క్వార్టర్స్, 3న సెమీఫైనల్స్ జరుగుతాయి. మే 5న ఫైనల్ జరుగుతుంది.

సెయిలింగ్‌లో నేత్రకు ఒలింపిక్ బెర్త్

న్యూఢిల్లీ: గత టోక్యో ఒలింపిక్స్‌లో పోటీపడ్డ మహిళా సెయిలర్ నేత్రా కుమనన్ పారిస్ విశ్వక్రీడలకు అర్హత సాధించింది. ఫ్రాన్స్‌లోని హైరెస్‌లో శుక్రవారం జరిగిన ఒలింపిక్ క్వాలిఫయర్ ఈవెంట్ ఎమర్జింగ్ నేషన్స్ ప్రోగ్రామ్ రెగెట్టా పోటీల్లో నేత్ర ఐదో స్థానంలో నిలిచి ఒలింపిక్ కోటా అందుకుంది.

ఫైనల్లో కార్తీక్ జోడీ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ టూర్ టెన్నిస్ 15కే ఐటీఎఫ్ ఫ్యూచర్స్ టోర్నమెంట్ డబుల్స్‌లో హైదరాబాదీ గంటా సాయికార్తీక్ రెడ్డి జోడీ ఫైనల్ చేరింది. శుక్రవారం కజకిస్థాన్‌లో జరిగిన సెమీఫైనల్స్‌లో కార్తీక్-ప్రజ్వల్ (కర్ణాటక) ద్వయం 7-5, 6-3తో భారత్‌కే చెందిన చిరాగ్-కరణ్ జోడీని ఓడించింది.

మిక్స్‌డ్ ఫైనల్లో సురేఖ ద్వయం

షాంఘై: వరల్డ్‌కప్ స్టేజ్-1లో తెలుగు ఆర్చర్ జ్యోతి సురేఖ మూడో పతకం ఖాయం చేసుకుంది. శుక్రవారం జరిగిన కాంపౌండ్ మిక్స్‌డ్ ఈవెంట్‌లో సురేఖ-అభిషేక్ జోడీ 155-151తో బెక్రెరా-మెండెజ్ (మెక్సికో)పై నెగ్గి ఫైనల్ చేరింది. మహిళల వ్యక్తిగత రికర్వ్‌లో దీపిక కుమారి 3-1తో హాన్‌యంగ్ (కొరియా)పై గెలిచి సెమీస్ చేరింది. మొత్తంగా భారత ఆర్చర్లు నాలుగు ఈవెంట్లలో ఫైనల్ చేరి పతకాలు ఖాయం చేశారు. ఇక, రికర్వ్ మిక్స్‌డ్ సెమీస్‌లో తెలుగు కుర్రాడు బొమ్మదేవర ధీరజ్-అంకిత జోడీ 0-6తో లిమ్-కిమ్ వుజిన్ (కొరియా) ద్వయం చేతిలో ఓటమిపాలైంది.

తెలంగాణ వైపు వస్తున్న ఏనుగుల గుంపు

- అప్రమత్తమైన సరిహద్దు జిల్లాల అటవీ సిబ్బంది
- గోదావరి, ప్రాణహిత పరీవాహక ప్రాంతాలపై నిఘా
- పలు దఫాలుగా ఛత్తీస్‌గఢ్ అధికారులతో సంప్రదింపులు

భూపాలపల్లి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్, ఒడిశాలో ఇన్నాళ్లుగా అలజడి సృష్టించిన ఏనుగుల గుంపు తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల దిశగా కదులుతున్నట్లు ఇరురాష్ట్రాల అటవీ శాఖ అధికారులు గుర్తించారు. దీంతో తెలంగాణ సరిహద్దు జిల్లాల్లో అటవీ శాఖ సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఇటీవల మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా నుంచి తెలంగాణలోని ఆసిఫాబాద్ జిల్లాలోకి ప్రవేశించిన ఓ ఏనుగు రెండ్రోజుల వ్యవధిలో అలజడి సృష్టించి, ఇద్దరు రైతులను చంపేసిన విషయం తెలిసిందే. అప్పట్లో ఆసిఫాబాద్ జిల్లా అటవీ శాఖ అధికారులు నానాతంటాలు పడి ఆ ఏనుగును దారి మళ్లించారు. అది మహారాష్ట్రలోని మందను చేరుకున్న తర్వాత తిరిగి తెలంగాణ వైపుగా గుంపుతో కదులుతున్నట్లు గడ్చిరోలి జిల్లా అటవీ అధికారులు గుర్తించారు. ప్రస్తుతం గడ్చిరోలి జిల్లాలో సంచరిస్తున్న ఈ ఏనుగుల మంద.. గోదావరి, ప్రాణహిత నదుల పరీవాహక ప్రాంతాల వైపు కదిలే అవకాశముందని అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఉన్న ములుగు, భూపాలపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, గడ్చిరోలి జిల్లా అధికారులు హై అలర్ట్ ప్రకటించారు. ఆయా జిల్లాల అటవీ అధికారులతోపాటు వ్యవసాయ, విద్యుత్ శాఖలకు చెందిన సిబ్బందిని కూడా అప్రమత్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ నుంచి గడ్చిరోలి వరకు ఏనుగుల కారిడార్ ఉండగా.. ఇన్నాళ్లూ గడ్చిరోలి జిల్లా పరిధిని దాటని ఏనుగుల గుంపు ఏ కారణంగా తెలంగాణ వైపు కదులుతోందనే విషయంపై అటవీ సిబ్బందికి అంతుచిక్కడం లేదు. దీంతో ఏనుగుల ప్రవర్తనను అధ్యయనం చేసేందుకు ఇక్కడి అధికారులు ఛత్తీస్‌గఢ్ అటవీ సిబ్బందిని సంప్రదిస్తున్నారు. ఈ క్రమంలోనే మూడు రోజుల క్రితం ఆసిఫాబాద్, గడ్చిరోలి జిల్లా అటవీ శాఖ సిబ్బంది, రెండు రోజుల క్రితం ఆసిఫాబాద్, మంచిర్యాల, గడ్చిరోలి జిల్లాల అధికారులు సమావేశమయ్యారు. తాజాగా శుక్రవారం భూపాలపల్లి, ములుగు జిల్లాల అధికారులు ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లి ఏనుగుల సంచారాన్ని నియంత్రించటంపై అక్కడి అధికారులతో చర్చించారు. ముఖ్యంగా ఏనుగుల మంద ఆహార అన్వేషణలో భాగంగా తెలంగాణ వైపు కదులుతోందా..? లేదా ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయా..? అనేది తెలుసుకునేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాగా ఇటీవల ఆసిఫాబాద్ జిల్లాలో సంచరించిన ఏనుగు, మంద నుంచి దారి తప్పి రాలేదని, కొత్త ప్రాంతాల్లో ఆహార, నీటి వనరులను కనుగొనేందుకే వచ్చి ఉంటుందని అటవీ అధికారులు అనుమానిస్తున్నారు.


ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూరు సమీపంలోకి వచ్చిన ఏనుగు(ఫైల్)


ఇంటర్మీడియట్ ఫలితాల్లో ఎంపీసీలో స్టేట్ మొదటి ర్యాంక్ సాధించిన ఎస్.అనూజ్ఞను సీఎం రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు శుక్రవారం అనూజ్ఞ కుటుంబసభ్యులు.. ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. - హైదరాబాద్



మాజీ సర్పంచ్ రవీందర్ గౌడ్, పరీక్ష రాసిన బాలకిషన్

వేరొకరితో పరీక్ష రాయిస్తూ... మరోసారి దొరికిన మాజీ సర్పంచ్

- పట్టుకున్న సూపరింటెండెట్... ఇద్దరిపై కేసు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఆయనో తాజా మాజీ సర్పంచ్. కానీ ఇంకా పదో తరగతి పాస్ కాలేదు. అందుకే ఓపెన్ టెన్త్ పరీక్షలు రాస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉంది. కానీ పరీక్షకు మాత్రం ఆయన హాజరు కాకుండా మరో వ్యక్తిని పంపించారు. అలా రాస్తుండగా ఆ వ్యక్తిని పోలీసులు పట్టుకొని.. ఇద్దరిపై కేసు నమోదు చేశారు. అయితే, సదరు మాజీ సర్పంచ్ ఇలాంటి ప్రయత్నం చేసి పట్టుబడటం ఇది రెండోసారి. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లి గ్రామ తాజా మాజీ సర్పంచ్ బొల్లం రవీందర్ గౌడ్ ఓపెన్ టెన్త్ పరీక్షలు రాయడానికి సిద్ధమయ్యారు. సిద్దిపేటలోని పారుపల్లి ప్రభుత్వ హైస్కూల్లో సెంటర్ పడింది. ఈసారి ఎలాగైనా పాస్ అవ్వాలనే ఉద్దేశంతో రవీందర్ గౌడ్ మరొకరితో పరీక్ష రాయించడానికి నిర్ణయించుకున్నారు. శుక్రవారం ఇంగ్లీష్ పరీక్ష కావడంతో... అదే గ్రామానికి చెందిన పంపరి బాలకిషన్‌కు ఆయన హాల్ టికెట్, ఆధార్ కార్డు ఇచ్చి పరీక్ష కేంద్రానికి పంపించారు. పరీక్ష రాస్తున్న క్రమంలో ఎగ్జామినేషన్ సెంటర్ సూపరింటెండెంట్ శ్రీనివాస్ గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, రవీందర్ గౌడ్ వచ్చే పంచాయతీ ఎన్నికలలో ప్రజాప్రతినిధిగా పోటీ చేయడానికి ప్రభుత్వం పదవ తరగతి అర్హతగా పెడుతుందని, ఎలాగైనా పదవ తరగతి పాస్ అవుతే మళ్లీ ప్రజా ప్రతినిధి కావచ్చని ఈ పనికి ఒడిగట్టినట్టు తెలుస్తుంది. గతంలో కూడా ఈయన పరీక్ష మరొకరు రాయగా, వాళ్లు ఇలాగే పట్టుబడ్డారు.


రాష్ట్రానికి రెడ్ అలెర్ట్

ఎండ తీవ్రతతో సగంపైగా జిల్లాలకు ప్రమాద హెచ్చరిక.. నేటి నుంచి మూడు రోజులు పలు జిల్లాల్లో వడగాలులు

హైదరాబాద్, ఏప్రిల్ 25(ఆంధ్రజ్యోతి): నిప్పుల కొలిమిని తలపిస్తూ.. నిరుటిని మించి రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. మధ్యాహ్నం వేళ కాలు బయటపెట్టాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా జమ్మికుంటలో 45.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఈ ఏడాది ఇప్పటికి ఇదే అత్యధికం. వరంగల్, నల్లగొండ జిల్లాల్లోనూ 45 డిగ్రీలపైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో వాతావరణ శాఖ రెడ్ అలెర్ట్ ప్రకటించింది. 45 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటితేనే ఈ హెచ్చరిక జారీ చేస్తారు. పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జగిత్యాల, ఆదిలాబాద్, కరీంనగర్, హన్మకొండ, వరంగల్, జనగామ, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, గద్వాల, నారాయణపేట, వనపర్తి, నిర్మల్, సిరిసిల్ల, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్‌తో పాటు నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఎండలు దంచికొట్టనున్నాయి. వీటికి రాబోయే మూడు రోజుల పాటు రెడ్ అలర్ట్ ప్రకటించింది. అన్ని జిల్లాల్లోనూ సోమవారం వరకు ఉష్ణోగ్రతలు సగటున 43- 47 డిగ్రీల మధ్య ఉంటాయని వాతావరణ శాఖ పేర్కొంది. పొడి వాతావరణం వల్ల గతం కంటే 2-3 డిగ్రీలు అధికంగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నట్లు తెలిపింది.

అత్యవసరమైతేనే బయటకు రండి..

శనివారం నుంచి సోమవారం వరకు రాష్ట్రంలో పలు జిల్లాల్లో వడగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. అత్యవసరమైతే తప్ప ఉదయం 11- సాయంత్రం 4 గంటల మధ్య ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించింది. శనివారం నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాల్లో తీవ్ర వడగాలులుంటాయని పేర్కొంది. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి జిల్లాలకు యెల్లో అలెర్ట్ ప్రకటించింది. ఆది, సోమవారాల్లో కూడా కొన్ని జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు వీస్తాయని తెలిపింది. అయితే, ఆదివారం అక్కడక్కడ ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, శుక్రవారం మంథని (పెద్దపల్లి) 45.2, నిడమానూరు (నల్లగొండ) 45.2, మర్యాల (యాదాద్రి) 45.1, వీణవంక (కరీంనగర్) 45.1, వెల్గటూరు 45.1, కొల్వాయి (జగిత్యాల), 45.1, మాటూర్ (నల్లగొండ) 45, కోనాయిపల్లి (వనపర్తి) 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఖమ్మం, నిజామాబాద్ జిల్లాల్లోనూ 44 డిగ్రీలు దాటింది.



3 రోజుల పాటు ఎండ తీవ్రతను సూచిస్తూ ఐఎండీ విడుదల చేసిన చిత్రం

గంటకు 2 డిగ్రీల చొప్పున పెరుగుదల

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు గంటకు సగటున రెండు డిగ్రీల చొప్పున పెరుగుతున్నాయి. ఉదయం 7 గంటలకే 30 డిగ్రీలకు చేరుతోంది. పది గంటలకు 34-36 డిగ్రీలకు, 12 కొట్టేసరికి 40కు వెళ్తోంది. తర్వాత రెండు, మూడు గంటల్లోనే మరో 4-5 డిగ్రీలు పెరుగుతున్నాయి. సాయంత్రం నాలుగు వరకు ఇదే తీవ్రత ఉంటోంది. సాయంత్రం ఆరు గంటల వరకు 40 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటోంది. కాగా, శనివారం వడదెబ్బతో సిరిసిల్ల జిల్లా వేములవాడ రూరల్ మండలం అచ్చన్నపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రం కూలీ శంకర్ సదా (33) మృతిచెందాడు. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం అడ్లూర్ గ్రామానికి చెందిన ప్రైవేటు టీచర్ బోడ అశ్రిత (35) సైతం వడదెబ్బతో ప్రాణాలు కోల్పోయింది. బజారుకు వెళ్లి వచ్చిన అశ్రిత అస్వస్థతకు గురైంది.

రాయలసీమ, తెలంగాణలో తీవ్రత

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: రానున్న ఐదు రోజుల్లో తూర్పు, దక్షిణ భారతంలో మోస్తరు నుంచి తీవ్ర వడగాలులు కొనసాగుతాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) శుక్రవారం హెచ్చరించింది. బీహార్, జార్ఖండ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ, కోస్తా కర్ణాటక, తమిళనాడు, తూర్పు ఉత్తర ప్రదేశ్‌లలో వడగాలులు వీస్తాయని తెలిపింది. ఈ ఏడాది ఎన్నడూ లేనంత వేడిగా ఉంటుందని ఐఎండీ అధికారి డీఎస్ పాయ్ అంచనా వేశారు. గరిష్ఠ ఉష్ణోగ్రతలు 2023 రికార్డుని అధిగమించొచ్చని తెలిపారు.

ఫోన్లు కొట్టేసి.. సూడాన్‌కు తరలించి

అంతర్జాతీయ ముఠా ఆట కట్టించిన పోలీసులు.. 5గురు సూడాన్ దేశస్థులు, 12 మంది నగరవాసుల అరెస్ట్

- రూ.1.75 కోట్ల విలువైన 703 మొబైల్స్ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఫోన్ దొంగలు ఒంటరిగా ఉన్నవారినే లక్ష్యంగా చేసుకుంటారు. అడ్రస్ అడిగినట్లు నటించి.. వారి చేతిలోని మొబైల్ ఫోన్‌ను లాక్కెళ్లిపోతారు. ఇలా హైదరాబాద్‌లో దొంగతనం చేసిన సెల్‌ఫోన్లను కొనుగోలు చేసి, సముద్ర మార్గంలో విదేశాలకు రవాణా చేస్తున్న అంతర్జాతీయ ముఠా సభ్యులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలో వరుసగా జరుగుతున్న సెల్‌ఫోన్ చోరీలపై లోతుగా దర్యాప్తు చేయగా.. ఈ ముఠా గుట్టు రట్టయిందని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. బషీర్‌బాగ్ సీసీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులకు కేసు వివరాలను వెల్లడించారు. ఈ కేసులో సెల్‌ఫోన్ దొంగలు, రిసీవర్లు, దుకాణ నిర్వాహకులు, విక్రేతలు మొత్తం 17 మందిని అరెస్ట్ చేశామని, వారిలో ఐదుగురు సూడాన్ దేశస్థులని తెలిపారు. ఫోన్లు దొంగిలించడానికి ముఠా సభ్యులు చోరీ చేసిన బైక్‌నే వినియోగిస్తున్నారని తెలిపిన సీపీ, స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లను బాధితులకు అందజేస్తామని చెప్పారు. తాడ్‌బండ్‌కు చెందిన మహ్మద్ ముజమ్మిల్(19), అతని స్నేహితుడు సయ్యద్ అబ్రార్(19) కలిసి డబ్బులు పంపాదించేందుకు సెల్‌ఫోన్ దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. తొలుత ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ పల్సర్ బైకును చోరీ చేశారు. ఆ బైకుపై బండ్లగూడ, ఫలక్‌నుమా, బహదూర్‌పురా, మంగళ్‌హాట్‌తోపాటు హయత్‌నగర్‌లో తిరుగుతూ ఒంటరిగా వెళుతున్న వారి దృష్టి మళ్లించి మొబైల్ స్నాచింగ్ చేస్తున్నారు. వీరు చోరీ చేసిన ఫోన్లను మహ్మద్ సలీమ్‌కు విక్రయిస్తున్నారు. స్నాచింగ్ కేసులపై లోతుగా దర్యాప్తు చేసిన పోలీసులు.. దొంగలతోపాటు రిసీవర్‌లను అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా పెద్ద ముఠా ప్రమేయం బయటపడింది. దర్యాప్తులో సంతోష్‌నగర్‌కు చెందిన బైక్ మెకానిక్ సయ్యద్ సలీం(21).. (ఇతనిపై ఆరు స్నాచింగ్ కేసులున్నాయి), హాఫీజ్‌బాబానగర్‌కు చెందిన పఠాన్ రబ్బానీ ఖాన్(34), జగదీష్ మార్కెట్‌లో మొబైల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న చాంద్రాయణగుట్టకు చెందిన మహ్మద్ అక్తర్(32), డబీర్‌పురాలో సెల్‌ఫోన్ దుకాణం నిర్వహిస్తున్న మహ్మద్ జాకీర్(35) (ఇతనిపై 11 కేసులున్నాయి), మొఘల్‌పురాకు చెందిన సెల్‌ఫోన్ వ్యాపారి షఫ్రక్ అజహర్ అలియాస్ జాఫర్(31), మహ్మద్ ఖాజా నిజాముద్దీన్ అలియాస్ కైజర్(49), సంతోష్‌నగర్‌కు చెందిన బైక్ మెకానిక్ సయ్యద్ లాయీక్(33), సంతోష్‌నగర్‌కు చెందిన షేక్ అజహర్ మొయినుద్దీన్(32)లను అదుపులో తీసుకున్నారు. వీరు చోరీ చేసిన మొబైల్ ఫోన్లను జగదీష్ మార్కెట్‌లో దుకాణాలు నిర్వహిస్తున్న మహ్మద్ షఫీ అలియాస్ బబ్లూ(28), బంజారాహిల్స్‌కు చెందిన జె.యలమందరెడ్డి(44)లకు విక్రయిస్తున్నారు. వీరిద్దరూ వాటిని సూడాన్ దేశస్థుడు ఖాలిద్ అబేదెల్‌జి మహ్మద్ అల్బాద్వీ(36)కి విక్రయిస్తున్నారు. ఇతను మాసాబ్‌ట్యాంక్ ప్రాంతంలో ఉంటున్న సూడాన్ దేశస్థులు అబ్దేలా అహ్మద్ ఉస్మాన్ బాబికర్(36), బంజారాహిల్స్‌లో ఉంటున్న అయమ్ మహ్మద్ సాత్ అబ్దేలా(34), ఆనస్ సిద్దిగి ఆల్బేండర్ అహ్మద్(24), ఒమర్ అబ్దేల్లా ఇతయాబ్ మహ్మద్(27)ల సహకారంతో సూడాన్‌కు పంపి, అక్కడ విక్రయిస్తున్నాడు. వీరిని అరెస్ట్ చేసిన పోలీసులు రూ.1.75 కోట్ల విలువైన 703 స్మార్ట్‌ఫోన్లు, పల్సర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు.


మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి

సముద్ర మార్గంలో సూడాన్‌కు..

దొంగిలించిన ఫోన్లను సముద్ర మార్గంలో దుస్తులు, ఫ్రోజెన్ ఫుడ్స్ సీఫుడ్స్ మాటున రవాణా చేస్తున్నట్లు సీపీ శ్రీనివాసరెడ్డి తెలిపారు. చోరీ చేసిన ఫోన్లను విదేశాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న వారికి విక్రయిస్తున్నారని, ఫోన్లలోని సమాచారం దుర్వినియోగమయ్యే అవకాశం ఉందని చెప్పారు. జగదీష్ మార్కెట్‌లోని కొందరు వ్యాపారులు స్నాచింగ్ ఫోన్లను కొనుగోలు చేస్తున్నారని, మరికొందరు వాటిలో పనికి వచ్చే విడిభాగాలను విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు గుర్తించామని వెల్లడించారు. ప్రస్తుతం పట్టుకున్న స్నాచింగ్ ముఠాను పోలినవి మరిన్ని ఉండవచ్చని.. దొంగలు, రిసీవర్లు, విక్రేతలపై ప్రత్యేక దృష్టి పెడుతున్నామని తెలిపారు.

పాలస్తీనాపై దాడులు ఆపండి!

- అమెరికా వర్సిటీల్లో హోరెత్తిన నిరసనలు
- భారతీయ విద్యార్థిని సహా వందలాదిమంది అరెస్టు
- క్యాంపస్‌లలో ఉద్రిక్తత

వాషింగ్టన్, ఏప్రిల్ 26: పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడులను నిలిపివేయాలంటూ అమెరికా వ్యాప్తంగా యూనివర్సిటీల్లో విద్యార్థులు నిరసనలకు దిగడంతో భారతీయ విద్యార్థిని సహా వందలాదిమందిని అరెస్టు చేశారు. ఇజ్రాయిల్‌తో ఆర్థిక సంబంధాలకు ముగింపు పలకాలని, ఆ దేశానికి అమెరికా మిలటరీ సహకారాన్ని నిలిపివేయాలని కూడా విద్యార్థులు డిమాండ్ చేశారు. న్యూయార్క్ యూనివర్సిటీలో 133 మంది, కొలంబియా యూనివర్సిటీలో 100 మంది, యేల్ యూనివర్సిటీలో 40 మందికిపైగా నిరసనకారులను అరెస్టు చేశారు. ప్రిన్స్‌టన్ యూనివర్సిటీలో భారతీయ విద్యార్థిని అచింత్య శివలింగం సహా ఇద్దరిని అరెస్టు చేశారు. క్యాంపస్‌లోకి రాకుండా వారిపై నిషేధం విధించారు. దీనికి నిరసనగా సుమారు 300 మంది విద్యార్థులు గురువారం సాయంత్రం వర్సిటీలో ధర్నా నిర్వహించారు. అచింత్య శివలింగం తమిళనాడులోని కోయంబత్తూరులో జన్మించారు. అమెరికాలోని కొలంబస్, ఒహియోల్లో ఆమె నివసించారు. సౌతరన్ కాలిఫోర్నియా యూనివర్సిటీలోనూ ఆందోళనకు దిగిన అనేకమందిని అరెస్టు చేశారు. హార్వర్డ్ యూనిర్సిటీలో పాలస్తీనా సాలిడారిటీ కమిటీని రద్దు చేయడంపై విద్యార్థుల్లో ఆగ్రహం వెల్లువెత్తింది. దీంతో 14 టెంట్లు వేసి విద్యార్థులు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఆస్టిన్‌లోని టెక్సాస్ యూనివర్సిటీలో అరెస్టులను వ్యతిరేకిస్తూ విద్యార్థులు పోలీసులతో ఘర్షణకు దిగడంతో వందలాది స్థానిక పోలీసులతోపాటు రాష్ట్ర పోలీసు బలగాలనూ రప్పించి లాఠీచార్జి చేశారు. ఎమోరీ యూనివర్సిటీలో విద్యార్థులతోపాటు ఆందోళనలో పాల్గొన్న ఇద్దరు మహిళా ప్రొఫెసర్లనూ అరెస్టు చేశారు. మిన్నెసోటా యూనివర్సిటీలో విద్యార్థుల అరెస్టును నిరసిస్తూ భారీ ప్రదర్శన నిర్వహించారు.

భారతీయులైతేనే అమెరికాలో సీఈవోలు

- అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ ఆసక్తికర వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 : అమెరికాలో చదువుకుని అత్యున్నత స్థానాలకు చేరుతూ భారతీయలు సాధిస్తున్న విజయాలను భారత్‌లో అమెరికా రాయబారి ఎరిక్ గార్సెట్టీ ప్రశంసించారు. అమెరికాలో చదువుకున్న భారతీయులు ఇప్పటికే ఎన్నో విజయాలు సాధించారని అన్నారు. ఫార్చ్యూన్ 500 కంపెనీల్లోని ప్రతీ పది మంది సీఈవోల్లో ఒకరి కంటే ఎక్కువ మంది భారతీయులే ఉన్నారని ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మీరు భారతీయులైతే అమెరికా సంస్థల్లో సీఈవోలు కాలేరని గతంలో ఓ జోక్ ఉండేదని గార్సెట్టీ గుర్తు చేశారు. అలాంటిది మైక్రోసాఫ్ట్, గూగుల్, స్టార్‌బక్స్ లేదా అమెరికాలో మరేదైనా సంస్థ కావొచ్చు భారతీయులు కాకపోతే సీఈవో కాలేరనే పరిస్థితి ప్రస్తుతం ఉందని గార్సెట్టీ వెల్లడించారు. ఇక, అమెరికాలో ఇటీవల పెరుగుతున్న భారతీయ విద్యార్థుల మరణాలపై కూడా గార్సెట్టీ స్పందించారు. చదువుకునేందుకు అమెరికా వస్తున్న ప్రతీ భారతీయుని సంరక్షణ కోసం తమ దేశం కృషి చేస్తోందని తెలిపారు. పాలస్తీనాకు మద్దతుగా అమెరికాలోని విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న ఆందోళన కార్యక్రమాలపై మాట్లాడుతూ.. ప్రతి వ్యక్తికి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంటుందని అన్నారు. అయితే, ఇతరుల హక్కులకు భంగం కలగకుండా శాంతియుతంగా నిరసనలు తెలియజేయాలని అభిప్రాయపడ్డారు.

కోమటికుంట చెరువులో.. అక్రమ నిర్మాణాలపై స్పందన సరిగ్గా లేదు

- ప్రభుత్వ న్యాయవాదులపై హైకోర్టు ఆగ్రహం
- ఫొటోలు, సర్వే నివేదిక సమర్పించాలని ఆదేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి కోమటికుంట చెరువు ఎఫ్‌టీఎల్‌లో అక్రమ నిర్మాణాలపై ప్రభుత్వ న్యాయవాదులు సరిగా స్పందించడం లేదని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అక్రమంగా నిర్మించారని ఆరోపణలు ఉన్న వాసవి ఇన్‌ఫ్రా లిమిటెడ్ నిర్మించిన అపార్ట్‌మెంట్లకు సంబంధించిన 8వ, 9వ అంతస్థుల ఫొటోలు, సర్వే రిపోర్ట్ సమర్పించాలని పిటిషనర్‌కు ఆదేశాలు జారీచేసింది. కోమటికుంట ఎఫ్‌టీఎల్ పరిధిలో వాసవి ఇన్‌ఫ్రా భారీ నిర్మాణాలు చేపట్టిందని.. చెరువు భూములను రక్షించేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ కుత్బుల్లాపూర్‌కు చెందిన ఆకుల సతీశ్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది టీ వెంకట్‌రాజు గౌడ్ వాదనలు వినిపిస్తూ.. చెరువు భూములు రక్షించాలని రెవెన్యూ, నీటిపారుదల శాఖల అధికారులకు ఇచ్చిన విజ్ఞప్తులను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. వాసవి ఇన్‌ఫ్రా తరఫున సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అపార్ట్‌మెంట్ ఎఫ్‌టీఎల్ పరిధిలో కట్టలేదని.. ఆ మేరకు అండర్‌టేకింగ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. 50 శాతం ఫ్లాట్స్ ఇప్పటికే విక్రమించినట్లు పేర్కొన్నారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. నీటిపారుదలశాఖ నుంచి తగిన స్పందన లేదని అసహనం వ్యక్తం చేసింది. 8వ, 9వ అంతస్థులపై సర్వే నివేదికను ఈనెల 25న అందజేయాలని పిటిషనర్‌కు ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణ ఈనెల 30కి వాయిదా పడింది.

లారీ ఢీ కొని మహిళ మృతి

- రోడ్డుకు అతుక్కుపోయిన మృతదేహం
- ఖమ్మం రూరల్ మండలంలో ఘటన

ఖమ్మం రూరల్, ఏప్రిల్ 26: బంధువుల వివాహానికి బయలుదేరిన ఓ మహిళ.. లారీ ఢీ కొట్టడంతో ప్రాణాలు కోల్పోయింది. లారీ టైర్లు ఆమెపై నుంచి వెళ్లడంతో మృతదేహం రోడ్డుకు అతుక్కుపోయింది. ఈ ఘటన ఖమ్మం రూరల్ మండలంలో జరిగింది. సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గోల్‌తండాకు చెందిన బానోత్ భూరి(58) గురువారం కూసుమంచి మండలంలోని తన సోదరి ఇంటికి వచ్చింది. ఇద్దరు కలిసి శుక్రవారం ఏన్కూర్‌లో జరిగే తమ బంధువుల వివాహానికి వెళ్లేందుకు బయలుదేరారు. ఖమ్మం రూరల్ మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డుకి చేరుకుని, పెండ్లి బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. భూరి మూత్ర విసర్జన కోసమని రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీ అతివేగంగా వచ్చి ఢీకొంది. లారీ టైర్లు భూరి పైనుంచి వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా.. మృతదేహం రోడ్డుకు అతుక్కుపోయింది.

ప్రాణాలు తీసిన ఈత సరదా

- బావిలో ఈతకు వెళ్లి తండ్రీకుమారుల మృతి
- యాదాద్రిభువనగిరి జిల్లా చాడ గ్రామంలో ఘటన
- రాజన్నసిరిసిల్ల జిల్లాలో మరో బాలుడి మృతి

మోటకొండూరు/బోయినపల్లి, ఏప్రిల్ 26: ఈత సరదా తండ్రీకుమారుల ప్రాణాలు తీసింది. ఈ విషాద సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా మోటకొండూరు మండలం చాడ గ్రామంలో జరిగింది. ఆత్మకూరు(ఎం) మండలం రాయిపల్లి గ్రామానికి చెందిన బోడ నరేష్(37) తాపీమేస్త్రిగా పనిచేస్తూ మండల కేంద్రంలోని రాంనగర్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. చాడ గ్రామంలోని తన తోడల్లుడు శనిగరం రవి ఇంట్లో జరుగుతున్న ఎల్లమ్మ పండుగకు కుటుంబ సభ్యులతో కలిసి వచ్చాడు. శుక్రవారం మధ్యాహ్నం తన ఇద్దరు కుమారులకు ఈత నేర్పించేందుకు గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. చిన్న కుమారుడు సాయికుమార్(11)ను తన భుజాలపై కూర్చోబెట్టుకుని బావిలోకి దూకాడు. దీంతో భయపడిపోయిన సాయికుమార్ తండ్రి నరేష్‌ను గట్టిగా పట్టుకోవడంతో ఊపిరాడక ఇద్దరూ నీటిలో మునిగిపోయారు. వారు ఎంతసేపటికీ పైకి రాకపోవడంతో గట్టు పైన ఉన్న పెద్ద కుమారుడు చంద్రశేఖర్ కేకలు వేశాడు. చుట్టుపక్కల ఉన్న గ్రామస్థులు బావి వద్దకు చేరుకుని గాలింపు చేపట్టారు. సాయికుమార్ మృతదేహాన్ని గుర్తించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది బావిలో గాలింపు చర్యలు చేపట్టి నరేష్ మృతదేహాన్ని బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. మరో ఘటనలో ఈతకు వెళ్లిన ఓ బాలుడు తండ్రి కళ్లెదుటే నీటమునిగి చనిపోయాడు. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం తడగొండకు చెందిన చేపూరి గంగయ్య-తిరుమల దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు మణితేజ(12)కు ఈత నేర్పించేందుకు తండ్రి గంగయ్య గ్రామ శివారులోని వ్యవసాయ బావి వద్దకు గత ఐదు రోజులుగా తీసుకెళ్తున్నాడు. నాలుగు రోజులపాటు వాటర్ క్యాన్ సహాయంతో ఈత నేర్చుకున్న మణితేజకు.. వాటర్ క్యాన్ సహాయం లేకుండానే నీటిలో దిగాల్సిందిగా తండ్రి సూచించాడు. దీంతో మణితేజ వాటర్ క్యాన్ లేకుండా బావిలో సగం దూరం వెళ్లి, నీటిలో మునిగిపోయాడు. వెంటనే బావిలో ఈత కొడుతున్నవారు, తండ్రి గంగయ్య అతడి కోసం గాలించారు. ఫలితం లేకపోవడంతో గజ ఈతగాళ్లతో గాలింపు చేపట్టగా మణితేజ మృతదేహం లభించింది.



నరేష్, మణితేజ(ఫైల్)

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

స్లిప్పులు-లెక్కలు

ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ (ఈవీఎం)లలో నమోదైన ఓట్లన్నింటినీ వీవీప్యాట్ స్లిప్పులతో నూటికి నూరుశాతం సరిపోల్చిన తరువాతే విజేతలను నిర్ణయించాలంటూ దాఖలైన పిటిషన్లను శుక్రవారం సుప్రీంకోర్టు కొట్టివేసింది. రెండురోజుల పాటు విచారణ జరిపి, సరిగ్గా తొలిదశ పోలింగ్ ముందురోజున తీర్పును రిజర్వుచేసిన ఇద్దరు న్యాయమూర్తులూ పదిరోజుల్లోనే దానిని ప్రకటించేయడం వారు ఈ కేసుకు ఇచ్చిన ప్రాధాన్యానికి నిదర్శనం. ఈవీఎంలమీద నిరసన ప్రదర్శనలు, చర్చాకార్యక్రమాలు జరుగుతూండటం, ఎన్నికల సంఘాన్ని ఉద్దేశించి ప్రముఖులు లేఖలు రాయడం వంటి పరిణామాల నేపథ్యంలో పిటిషన్ల విచారణ, తీర్పు ప్రకటన త్వరితంగా జరగడం అత్యావశ్యకమని సర్వోన్నత న్యాయస్థానం భావించి ఉంటుంది.

ఈవీఎం వ్యవస్థమీద న్యాయమూర్తులు అపరిమిత విశ్వాసాన్ని వెలిబుచ్చారు. ఇద్దరు న్యాయమూర్తులు వేర్వేరు తీర్పుల్లో ఏకాభిప్రాయాన్ని ప్రకటించడం మరీ విశేషం. పిటిషన్‌దారులు వెలిబుచ్చిన అన్ని అభ్యంతరాలు, అనుమానాలు, చేసుకున్న విన్నపాలు అన్నింటినీ కొట్టివేస్తూ తీవ్రమైన వ్యాఖ్యలే చేశారు. బ్యాలెట్ పేపర్ వాడిన రోజుల్లో దేశం ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నమాట నిజం. బూతుల స్వాధీనం, బ్యాలెట్ పత్రాలను నాశనం చేయడం వంటివి చాలా జరిగాయి. ఈవీఎంలు వచ్చిన తరువాత ఆ తరహా అక్రమాలకు పూర్తిగా తెరపడింది. అంతమాత్రాన ఈవీఎంలను ఎంతమాత్రం అనుమానించకూడదని ఏమీ లేదు. వాటిని ట్యాంపర్ చేయవచ్చునన్న వాదనలు, ప్రదర్శనలు జరుగుతున్నప్పుడల్లా ఎన్నికల సంఘం ఖండిస్తూ వస్తున్నది. న్యాయమూర్తులే అన్నట్టుగా, గుడ్డిగా ఒక వ్యవస్థను అనుమానించడం సరైనది కాదు. దానితోపాటే, ఆ వ్యవస్థ చక్కనిదని, అభేద్యమైనదని, ఎవరూ దానిని తాకలేరని అతిగా నమ్మడమూ సరికాదు. సాంకేతిక అంశాలను, నమోదైన డేటాను పరిశీలించిన తరువాత ఈవీఎంలపై అనుమానాలు సహేతుకమైనవి కావని నిర్ధారణకు వచ్చినట్టుగా న్యాయమూర్తులు ప్రకటించారు. ఎన్నికల సంఘం అందించిన డేటా, అది చేసిన వాదనలు న్యాయమూర్తులకు ఈ అభిప్రాయానికి రావడానికి విశేషంగా ఉపకరించినట్టుంది.

కొందరు స్వార్థపరశక్తులు ఈ దేశం సాధించిన విజయాలను తక్కువచేయాలని చూస్తున్నారని, అభివృద్ధిని బలహీనపరచేందుకు ప్రయత్నిస్తున్నారని, అటువంటి ప్రయత్నాలను మొగ్గలోనే తుంచేయాలని ఒక న్యాయమూర్తి ఆగ్రహించారు. పిటిషన్లు వేసిన సంస్థలు, వ్యక్తులు ప్రజాస్వామ్య హక్కుల కోసం పోరాడుతున్నవారే తప్ప ప్రచారకాంక్షతోనో, దేశాన్ని అప్రదిష్టపాల్జేసేందుకో ప్రయత్నిస్తున్నారని అనుకోలేం. ఈవీఎం, వివిప్యాట్ వ్యవస్థ పనితీరును నిగ్గుతేల్చి, ఇప్పుడున్న వ్యవస్థ నూరుశాతం బలమైనదేనా, దానిని మెరుగుపరచుకోవాల్సినదేమైనా ఉన్నదా అన్నవి నిర్ధారించడానికి ఇటువంటి పిటిషన్లు ఉపకరిస్తాయి. విచిత్రమేమంటే, పిటిషన్‌దారులు అడిగినవన్నీ కాదని, ఈవీఎంలమీద మరింత నమ్మకం పెంచేందుకంటూ న్యాయమూర్తులు ఓ రెండు ఆదేశాలు జారీచేశారు. లోడింగ్ యూనిట్లను 45రోజుల పాటు భద్రపరచడం అటుంచితే, ఓడిన అభ్యర్థులకు ఐదుశాతం ఈవీఎంలను పరీక్షించుకోగలిగే అవకాశం ఇచ్చారు. నూరుశాతం వీవీప్యాట్‌లను సరిపోల్చాలన్న పిటిషన్‌దారుల అభ్యర్థన నచ్చకపోయినప్పటికీ, ప్రస్తుత పరిమాణాన్ని మరికాస్తంత పెంచివుంటే బాగుండేది. ఈవీఎంలు వచ్చిన తరువాత ఎన్నికల నిర్వహణ, ఫలితాల ప్రకటన సులభం, వేగవంతం అయిన మాట నిజం. ఆ వ్యవస్థమీద నమ్మకాన్ని పెంచేందుకు వీవీప్యాట్ వచ్చి చేరింది. అనంతరకాలంలో, పరిమితసంఖ్యలోనైనా పేపర్ స్లిప్పులను లెక్కించాల్సిందేనన్న నియమమూ వచ్చింది. 97కోట్ల మంది ఓటర్లున్న దేశంలో నూరుశాతం పేపర్‌స్లిప్పులను సరిపోల్చడం అసాధ్యం, తిరోగామి చర్య అని భావించిన న్యాయస్థానం మరోపక్క ఈ స్లిప్పుల కౌంటింగ్‌కు ఎలక్ట్రానిక్ యంత్రాలు వాడే అంశాన్ని పరిశీలించమన్నది. పోలింగ్ బూతులోకి ఓటరు అడుగుపెట్టిన క్షణం నుంచి ఫలితాల ప్రకటన వరకూ ప్రస్తుత వ్యవస్థ ఎంత పటిష్ఠంగా పని చేస్తున్నదో చెప్పడానికి న్యాయమూర్తులు ఈసీ వాదనలను ఈ తీర్పులో అధికంగా ఉటంకించారు. అగ్రరాజ్యాలతో సహా అనేక దేశాలు ఈవీఎంలను వదిలి తిరిగి బ్యాలెట్‌వైపు మళ్ళిన విషయాన్ని అటుంచితే, ఈవీఎంలను మించిన పకడ్బందీ విధానం మరేదీలేదన్న ఈ తీర్పు తాత్కాలికంగానైనా ఆ వివాదాన్ని చల్లార్చుతుందని ఆశిద్దాం.

కాంగ్రెస్ మానిఫెస్టో : మోదీ కొత్త భాష్యం!

ప్రధాన ప్రతిపక్షం అయిన భారత జాతీయ కాంగ్రెస్ పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అపూర్వ సుహృద్భావాన్ని సహకార వైఖరిని చూపారు! ఇటీవల కాంగ్రెస్ పార్టీ మానిఫెస్టోను తిరగరాసి అందులో తన ఆంతరతమ (ఇన్నర్ మోస్ట్) ఆలోచనలు, భావాలను చేర్చే కార్య భారాన్ని ఆయన స్వచ్ఛందంగా తన మీద వేసుకున్నారు. మునుపెన్నడూ జరగని ఈ పని రాజకీయచర్చ గుణాధిక్యతను పెంచుతుందని ఆయన విశ్వసించారు. పాఠక మహాశయా, గతవారం చోటు చేసుకున్న సంచలనాత్మక రాజకీయ పరిణామంపై మహా ఉదార వైఖరితో నేను ఇవ్వగల వివరణ, చేయగల వ్యాఖ్య అది.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ఆ పరిణామం వెనుక ఆసక్తికరమైన కథ ఒకటి ఉన్నది. ఈ నెల 14న బీజేపీ మానిఫెస్టో విడుదలయింది. రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని ఒక కమిటీ రూపొందించిన ఆ ఎన్నికల ప్రణాళిక పట్ల నరేంద్ర మోదీ ఏ మాత్రం సంతోషంగా లేరని రాజకీయ పరిశీలకులు మొదటి నుంచీ ఘంటాపథంగా చెప్పుతున్నారు. తాము రూపొందించిన మానిఫెస్టో ఒక రాజకీయ పార్టీ ఎన్నికల ప్రణాళిక కాదని అంగీకరిస్తూ 'పార్టీకి కేంద్రంగా భాసిల్లుతున్న' ఒక నాయకుడి ప్రజ్ఞా పాటవాలకు అది ఒక ప్రశంస అని రాజ్‌నాథ్ సింగ్ సారథ్యంలోని ఆ కమిటీ పేర్కొంది. ఆ డాక్యుమెంట్‌ను 'మోదీకి గ్యారంటీ' అని పేరు పెట్టడం ద్వారా నరేంద్ర మోదీ పట్ల తన విధేయతను ఆ కమిటీ ప్రదర్శించింది. అయితే మోదీ సరిగ్గానే ఊహించినట్టు, విడుదలయిన కొద్ది గంటలలోనే 'మోదీకి గ్యారంటీ' ఎటువంటి ఆచూకీ లేకుండా పోయింది. ఇప్పుడు బీజేపీ మానిఫెస్టో గురించి నరేంద్ర మోదీతో సహా ఏ ఒక్కరూ మాట్లాడటం లేదు.

నరేంద్ర మోదీ 'మోదీకి గ్యారంటీ'ని ఒక చెత్త డాక్యుమెంట్‌గా కొట్టివేయలేరు. ఆ ప్రణాళికను రూపొందించిన కమిటీ అసమర్థంగా తన బాధ్యతను నిర్వర్తించిందని తప్పుపట్టలేరు. రాజ్‌నాథ్ సింగ్ నాయత్వంలోని కమిటీకి ఏవో అజ్ఞాత ఉద్దేశాలనూ ఆపాదించలేరు. ఇలా ఇరకాటంలో పడిన నరేంద్ర మోదీ కాంగ్రెస్ మానిఫెస్టోను తీసుకుని, ఆ ప్రణాళికపై తన వ్యాఖ్యానంతో దానికి మరింత ప్రచారాన్ని కల్పించి, పాఠక జనాన్ని మరింతగా పెంపొందించేందుకు నిర్ణయించుకున్నారు. మోదీ నిర్ణయం భారతీయ సారస్వత మహా సంప్రదాయాలకు అనుగుణంగా ఉన్నది. మన సంప్రదాయంలో మౌలిక కృతుల కంటే వాటిపై భాష్యాలు, వ్యాఖ్యానాలకే ఎక్కువ ప్రాధాన్యమున్నది.

కాంగ్రెస్ మానిఫెస్టోలో నరేంద్ర మోదీ చేసిన మార్పుల్లో రత్నాల లాంటి మాటలు ఉన్నాయి. అవేమిటో చూడండి: కాంగ్రెస్ అధికారానికి వస్తే ప్రజల భూములు, బంగారం, ఇంకా ఇతర విలువైన ఆస్తులను ముస్లింలకు పంపిణీ చేస్తుంది; ప్రతి ఒక్కరి ఆస్తి, స్త్రీల సొత్తు అయిన బంగారం, గిరిజన కుటుంబాల వద్ద ఉన్న వెండి విలువ తెలుసుకునేందుకు దేశవ్యాప్తంగా ఒక సర్వేను నిర్వహిస్తుంది. ఆ ఆస్తులను సొంతదారుల నుంచి లాక్కొంటుంది; ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన భూమి, నగదును కాంగ్రెస్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుని ప్రజలకు పంపిణీ చేస్తుంది; దేశ సహజ వనరులపై మొదటి హక్కు ముస్లింలదేనని డాక్టర్ మన్మోహన్ సింగ్ అన్నారు. ఆయన ఈ ఉద్ఘాటన చేసిన సభలో (గుజరాత్ ముఖ్యమంత్రిగా) నేనూ ఉన్నాను; కాంగ్రెస్ మీ మంళసూత్రాన్ని, స్త్రీ ధనాన్ని తీసుకుని, అధిక సంతానం ఉన్న వారికి ఇస్తుంది; మీకు స్వగ్రామంలో ఒక ఇల్లు, పట్టణంలో ఒక చిన్న ఫ్లాట్ ఉంటే ఆ రెండు గృహాలలో ఒకదాన్ని కాంగ్రెస్ తీసుకుని ఎవరో ఒకరికి ఇస్తుంది.

మోదీ స్ఫూర్తితో ఆయన విశ్వసనీయ సహచరుడు, సలహాదారు అమిత్ షా ఇలా అన్నారు: దేవాలయాల ఆస్తులను కాంగ్రెస్ స్వాధీనం చేసుకుని, పంపిణీ చేస్తుంది. ఇక రాజ్‌నాథ్ సింగ్ తన వంతుగా ఇలా అన్నారు: కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజల ఆస్తులను కైవసం చేసుకుని, చొరబాటుదారులకు పునః పంపిణీ చేస్తుంది. ఈ వ్యాఖ్య చేసిన మరుసటి రోజే రాజ్‌నాథ్ సింగ్ మరొక 'సత్యాన్ని' వెల్లడించారు: సాయుధ బలగాలలో మత ప్రాతిపదికన రిజర్వేషన్లను ప్రవేశపెట్టేందుకు కాంగ్రెస్ నిర్ణయించింది. ఈ వ్యాఖ్యాతల సంఖ్య పెరిగిపోయి, ఒకరిని మించి ఒకరు పోటా పోటీగా వివిధ అంశాలపై వ్యాఖ్యలు చేస్తున్న తరుణంలో కాంగ్రెస్ 'వారసత్వ పన్ను'ను ప్రవేశపెట్టనున్నదని నరేంద్ర మోదీ కనుగొన్నారు: వెన్వెంటనే దాన్ని వ్యతిరేకిస్తూ కాంగ్రెస్‌ను దుయ్యబట్టడం ప్రారంభించారు.

ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రంగంలోకి దిగారు. వారసత్వ పన్ను భావనపై తన అపార పాండిత్యాన్ని వెల్లడించారు. 1985లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్టేట్ సుంకం (ఇది ఒక విధమైన వారసత్వ పన్ను)ను రద్దు చేసిందని, 2015లో బీజేపీ ప్రభుత్వం సంపద పన్నును రద్దు చేసిందన్న విషయాలు ఆమెకు తెలిసినట్టు లేదు. అయితే ఇందుకు ఆమెను క్షమించవచ్చు.

కాంగ్రెస్ మానిఫెస్టోపై ఈ సమన్వయ దాడి ఎప్పుడు, ఎందుకు ప్రారంభమయిందో చూడడం కష్టమేమీ కాదు. ఏప్రిల్ 19న తొలి విడత పోలింగ్ అనంతరం ప్రధానమంత్రి కార్యాలయాన్ని, బీజేపీని భయాందోళనలు ఆవహించాయి. ఏప్రిల్ 21న రాజస్థాన్‌లోని జలోర్, బాన్సవారాలో జరిగిన బీజేపీ ఎన్నికల ప్రచార సభలలో కాంగ్రెస్ మానిఫెస్టోపై తీవ్ర విమర్శలు చేయడాన్ని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఆయన విమర్శలు విడ్డూరంగా, విపరీతంగా ఉన్నాయి. ఆయన మంత్రివర్గ సహచరులు కూడా ముందువెనుక ఆలోచించకుండా వ్యాఖ్యలు, విమర్శలు చేయసాగారు.



'మోదీకీ గ్యారంటీ'ని ఒక చెత్త డాక్యుమెంట్‌గా నరేంద్ర మోదీ కొట్టివేయలేరు. ఆ ప్రణాళికను రూపొందించిన కమిటీ తన బాధ్యతను అసమర్థంగా నిర్వర్తించిందని తప్పుపట్టలేరు. రాజ్‌నాథ్ సింగ్ నాయత్వంలోని ఆ కమిటీకి ఏవో ఉద్దేశాలనూ ఆపాదించలేరు. ఇలా ఇరకాటంలో పడిన నరేంద్ర మోదీ కాంగ్రెస్ మానిఫెస్టోను తీసుకుని, ఆ ప్రణాళికపై తన వ్యాఖ్యానంతో దానికి మరింత ప్రచారాన్ని కల్పించి, పాఠక జనాన్ని పెంపొందించేందుకు నిర్ణయించుకున్నారు!

ఈ ఉన్మాద విమర్శలను నిలిపివేయాలని అధికార పక్షానికి విజ్ఞప్తి చేయడం మీడియా విధ్యుక్త ధర్మం. అయితే వార్తా పత్రికలు ఆ విధిని విస్మరించి వివాదాస్పద అంశాలను 'వివరించాయి'. గంభీరమైన సంపాదకీయాలు రాశాయి. టీవీ ఛానెల్స్ రాజకీయ, ఆర్థిక రంగ ప్రముఖులతో ఇంటర్వ్యూలు ప్రసారం చేశాయి. నిపుణుల బృందాలతో చర్చలు నిర్వహించాయి. కాంగ్రెస్ మానిఫెస్టోపై నరేంద్ర మోదీ ప్రారంభించిన విమర్శలు అదే రీతిలో మరింతగా ఉధృతమయ్యాయి.

ఏప్రిల్ 5, 19 తేదీల మధ్య దేశవ్యాప్తంగా ప్రజల మాటా మంతీలో కాంగ్రెస్ మానిఫెస్టో ఒక ప్రధానాంశంగా ఉన్నది. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీ మీద అన్ని వర్గాల వారూ విస్తృతంగా చర్చించుకున్నారు. ఆ హామీలు వారిని విశేషంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా సామాజిక, ఆర్థిక సర్వే, నిర్వహణ, కులాలవారీ జన గణన; విద్యా ఉద్యోగాలలో రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఉపసంహరించడం; గ్రామీణ ఉపాధి హామీ కూలీల దినసరి వేతనాన్ని రూ. 400కి పెంచడం; పేద కుటుంబాలకు మహాలక్ష్మి ఆర్థిక సహాయ పథకం; వ్యవసాయక ఉత్పత్తుల కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం; వ్యవసాయ రుణాల మాఫీ విషయమై ప్రభుత్వానికి తగు సలహా ఇచ్చేందుకు ఒక కమిషన్ నేర్పాటు చేయడం; యువతకు అప్రెంటిస్‌షిప్ హక్కు కల్పించడం; అగ్నివీర్ పథకం రద్దు; కేంద్ర ప్రభుత్వంలోని 30 లక్షల ఉద్యోగ ఖాళీలను ఒక ఏడాదిలోగా భర్తీ చేయడం మొదలైనవి.

కాంగ్రెస్ మానిఫెస్టో 'లోక్‌సభ ఎన్నికల హీరో' అని తమిళనాడు ముఖ్యమంత్రి ఎమ్.కె.స్టాలిన్ అభివర్ణించారు. చాలా యథార్థమైన అభివర్ణన అది. కాంగ్రెస్ సంకల్ప పత్రంపై స్టాలిన్ అభిప్రాయం మోదీకి కోపం తెప్పించి ఉంటుంది. కనుకనే కాంగ్రెస్ మానిఫెస్టోను ఒక విలన్‌గా తూర్పారపట్టేందుకు నిర్ణయించుకున్నారు. మోదీ దురదృష్ట మేమిటంటే కాంగ్రెస్ మానిఫెస్టోలోని ఏ అంశమూ తప్పు పట్టేందుకు వీలు లేనిదే. అందుకే కాంగ్రెస్ సంకల్ప పత్రంపై మోదీ విమర్శలను ప్రజలు హర్షించడం లేదు. దీంతో ఒక దెయ్యం రాసిన మానిఫెస్టోను ఊహించుకుని దాన్ని దుయ్యబడుతున్నారు! ఇది, కాంగ్రెస్ పార్టీ నిజ మానిఫెస్టోకు బీజేపికి చెందిన ప్రధానమంత్రి ఒకరు ఇవ్వగల ఒక అంతిమ ప్రశంస అని నేను భావిస్తున్నాను.

బీజేపీ మూడోసారి విజయం సాధించి నరేంద్ర మోదీ ప్రధానమంత్రి అయితే ఎటువంటి వక్రీకరణలు, అసత్యాలు, నిందలు, దుర్భాషలను చవిచూడవలసివస్తుందో ప్రజలు తెలుసుకునేలా చేసినందుకు 'థాంక్యూ, ప్రైమ్ మినిస్టర్' అని ఆయనకు కాంగ్రెస్ ధన్యవాదాలు చెప్పాలి. మానిఫెస్టోలను పునః రచించడంలో విశేష ప్రతిభా సమన్వితంగా పట్టభద్రుడైన నరేంద్ర మోదీ భారత రాజ్యాంగాన్ని మళ్లీ రాయవచ్చు సుమా!

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

అమెరికా స్వప్నం ఇప్పుడు అంత సులువు కాదు!

'అవకాశాల పుట్టినిగడ్డ'గా (land of opportunity) పేరుగాంచిన అమెరికాలో ఇప్పటికీ అదే వాతావరణం ఉన్నదా? ఈ ప్రశ్నకు అంత సులువుగా సమాధానం చెప్పలేని పరిస్థితి నేడు ఆ దేశంలో నెలకొని ఉన్నది. అమెరికాకు తరలి వచ్చే భారతీయ యువత ఆ దేశ వాస్తవిక పరిస్థితులను పూర్తిగా అర్థం చేసుకున్నాకనే ఒక నిర్ణయం తీసుకోవటం మంచిది.

ఇండియాలో ఇంజినీరింగ్ చదివే ప్రతి కుర్రాడికీ అమెరికాలో మంచి అవకాశం వస్తే వెళ్లి ఉద్యోగం చేయాలనే కోరిక ఉంటుంది. చదువుకునే రోజుల నుంచీ ఆ దిశగా ప్రయత్నాలు ఎక్కుపెడతారు. మామూలు పరిస్థితుల్లో అయితే ఇది మంచి స్వప్నమే. కానీ ఇప్పుడు అమెరికాలో ఐటీ కొలువు అనేది కష్టసాధ్యంగా మారింది. అమెరికాలో ఐటీ ఉద్యోగ వాతావరణాన్ని, పర్యవసానాల్ని దగ్గరి నుంచి గమనిస్తున్న వ్యక్తిగా ఔత్సాహిక ఇంజినీర్లకు చెప్పగలిగిన మాట ఒక్కటే- హెచ్-1బీ వీసా వచ్చినంత మాత్రాన అమెరికా బయల్దేరేందుకు తొందరపడవద్దు!



ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాలో ఉద్యోగార్థులుగా అడుగుపెట్టడం సాహసమే. పరిస్థితి ఎల్లకాలం ఇలాగే ఉండదు. అమెరికా ఇలాంటి సంక్షోభాలను అనేకం చూసింది. ఐటీ ఉద్యోగ వాతావరణం కూడా మళ్లీ కుదుటపడుతుంది. అప్పటిదాకా నిరీక్షించడం తెలివైన పని.

నేడు అమెరికాలో పనిచేస్తున్న వారే వేల సంఖ్యలో ఉద్యోగాలను కోల్పోతున్నారు. కొత్త వారికి ఉద్యోగాలు వచ్చే అవకాశం కనిపించడం లేదు. ఐటీ మినహా తతిమ్మా రంగాలు బాగానే వృద్ధిలో ఉన్నాయి. భారతీయ యువతరానికి అత్యంత ఆకర్షణీయమైన ఐటీ రంగం మాత్రం కుదేలైపోయింది. కరోనా అనంతర వాతావరణంలో ఇంత తీవ్రంగా ఐటీ రంగం దెబ్బ తిన్నది ఎన్నడూ లేదని నిపుణులు చెబుతున్నారు.

దీని పర్యవసానాలు ఇబ్బందికరంగా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే హెచ్-1బీతో ఇక్కడకు వచ్చి, భారీ ప్యాకేజీలున్న ఉద్యోగాలు సంపాదించి, ఆ ధైర్యంతో లోనుతో సొంత ఇల్లు కల తీర్చుకున్నవాళ్లు ఇప్పుడు వాయిదాలు కట్టడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఐటీ ఉద్యోగ వాతావరణం ఊహించినట్టుగా లేకపోవడం వలన కొత్త దంపతుల మధ్య కలహాలు ముదురుతున్నాయి. హెచ్-1బీ ఉన్నది కదాని అమెరికాకు వచ్చేసే మధ్యతరగతి భారతీయ కుటుంబాలకు చెందిన యువతీ యువకులు ఇక్కడ ఉద్యోగాలు దొరక్క, ఇంటి నుంచి ఆర్థికంగా జరుగుబాటు అందక అనేక ఇతర పనుల్లోకి దిగుతున్నారు.

హెచ్-1బీ వీసా ద్వారా వచ్చినవారు తమ ప్రాజెక్ట్ అయిపోయినట్లయితే 60 రోజులకు మించి అమెరికాలో ఉండడానికి అవకాశం ఉండదు. కానీ వివిధ కన్సల్టెన్సీ కంపెనీల ద్వారా ఇక్కడ ఉద్యోగాలు దక్కించుకుంటున్న వారికి ఒక సౌకర్యం ఉంది. భారతదేశానికి ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు సంబంధించినంత వరకు ఎక్కువ కన్సల్టెన్సీ కంపెనీలు తెలుగువారివే. ఇది మన హెచ్-1బీ వీసాదారులకు కలిసి వస్తున్న అంశం. ఎలాగంటే- ఒకవేళ వారికి ప్రాజెక్ట్ అయిపోయినప్పటికీ ఈ కంపెనీలు వారిని పేరోల్స్ నుంచి తొలగించకుండా ఇన్సూరెన్స్ కూడా కొనసాగిస్తున్నాయి. అందువల్ల వారు కొత్త ప్రాజెక్టు చూసుకోవడానికి వీలు కలుగుతోంది. ఇక్కడ గమనించాల్సిన సంగతి ఏంటంటే ఇటువంటి సందర్భాలలో అమెరికన్ యాజమాన్యంలో ఉన్న కన్సల్టెన్సీలకు సంబంధించినంత వరకు ప్రాజెక్టు అయిపోయిన తర్వాత వాళ్లు 60 రోజుల లోపు దేశాన్ని ఖచ్చితంగా విడిచి వెళ్లిపోవాలి.

ఈ గడ్డు పరిస్థితిలో భారతీయ యువత స్వయంకృతాపరాధం కూడా కొంత ఉంది. కోవిడ్ సమయంలో అమెరికన్ కంపెనీలు పెద్దఎత్తున రిక్రూట్‌మెంట్ చేపట్టాయి. ఈ అవకాశాన్ని భారతీయ విద్యార్థులు అడ్డదారుల్లో కూడా వినియోగించుకున్నారు. నకిలీ సర్టిఫికెట్లు పెట్టి ఉద్యోగాలు పొందినవారు కొల్లలుగా ఉన్నారు. విద్యార్హతలు, నైపుణ్యాలు, అనుభవం అన్నింటిలోనూ నకిలీ సర్టిఫికెట్లే. కానీ పనిలో చేరిన తర్వాత వారిలోని డొల్లతనం బయటపడింది. పనికి సరిపడిన జ్ఞానం, నైపుణ్యం వారి వద్ద లేకుండా పోయాయి. చివరకు భారతీయ విద్యార్థులు అంటేనే అనుమానంతో చూసే పరిస్థితి ఏర్పడింది. ఇది ఇప్పుడు కొత్తగా ఉద్యోగాలు ఆశిస్తున్న వారికి ఇబ్బందిగా పరిణమించింది.

ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు రాష్ట్రాల నుంచి అమెరికా రావాలనుకునే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాలి. ఒకవేళ వారు పనిచేసే కంపెనీ స్పాన్సర్ చేసినట్లయితే వారికి ఎటువంటి ఇబ్బందులు ఉండకపోవచ్చు. అలాగాక సాధారణ కన్సల్టెన్సీల ద్వారా హెచ్-1బీ వీసాతో అమెరికాకు రావడం మంచి నిర్ణయం కాకపోవచ్చు. ముఖ్యంగా భారతదేశంలో ఇప్పటికే ఉద్యోగాలలో ఉన్నవారు కొందరు ఆ ఉద్యోగాలను వదిలేసి ఇక్కడకు వస్తున్నారు. ఇక్కడ ఉద్యోగాలు దొరక్క, దొరికిన ఉద్యోగాల్లో స్థిరత్వం లేక మానసిక ఒత్తిడికి లోనవటంతో పాటు, అనేక ఆర్థిక ఇబ్బందులు కూడా పడుతున్నారు.

ఈ సమస్యకు పరిష్కారాలు పరిమితంగానే ఉన్నాయని చెప్పాలి. ముందుగా హెచ్-1బీ వీసాల మీద అమెరికా వస్తున్నవారికి వారి ఎంప్లాయర్ నుంచి పూర్తి మద్దతు ఉండాలి. ఈ క్లిష్ట సమయంలో ఎంప్లాయర్లు ఇతర కంపెనీలలోనైనా ఉద్యోగాలు చూసిపెట్టగలగాలి. ఏఐ వంటి సాంకేతికత నేపథ్యంలో చాలా ఉద్యోగాలు ప్రమాదంలో పడుతున్నాయి. సాంకేతికంగా వచ్చే ప్రతి మార్పునకు ఉద్యోగార్థులు అప్‌డేట్ అవుతూ ఉండాలి. తమను తాము ఉత్తమ ప్రమాణాలతో ఎప్పటికప్పుడు నవీకరించుకుంటూ ఉంటే ఉద్యోగాలకు ప్రమాదం ఉండదు. అవకాశాలు పొందడం కూడా సులువు అవుతుంది. కంపెనీలు తమ మీద ఆధారపడే స్థాయిలో తమ నైపుణ్యాలను వృద్ధి చేసుకోవడంపై నిత్యం శ్రద్ధ పెట్టాలి. విధాన నిర్ణయాల్లో మార్పు వస్తే కూడా కొంత మేలు జరుగుతుంది. ఉదాహరణకు 60 రోజుల్లోగా తిరిగి భారత్‌కు వెళ్లిపోవాలనే నిబంధనను కొంత సడలిస్తే భారతీయ విద్యార్థులకు ఊరట.

అమెరికాలో గతంలో అనేకసార్లు ఐటీ రంగానికి సంబంధించి మార్కెట్‌లో స్తబ్ధత వచ్చినప్పటికీ ఇంతటి స్థాయిలో ఎప్పుడూ లేదు. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. కరోనా సమయంలో అన్ని కంపెనీలు అవసరానికి మించి ఉద్యోగులను తీసుకున్నాయి. అప్పటి పరిస్థితుల్లో కరోనా ఎన్ని రోజులు ఉంటుందో తెలియక, ముందు జాగ్రత్త చర్యగా కంపెనీలు ఈ విధంగా చేశాయి. అప్పట్లో అవసరానికి మించి నియమించుకున్న ఉద్యోగులను ఇప్పుడు క్రమంగా తొలగిస్తున్నాయి. దానితోపాటు ఆర్థిక మాంద్యం నుంచి పూర్తిగా బయటపడకపోవడంతో కంపెనీలు ఖర్చులను తగ్గించుకుంటున్నాయి.

2022లో అమెరికాకు భారత్ నుంచి 1,90,512 మంది విద్యార్థులు వెళ్లారు. 2023 జూన్ నాటికి అలా వెళ్లిన వారి సంఖ్య లక్ష దాటింది. అమెరికాలోని మొత్తం విద్యార్థుల్లో 25 శాతం మంది భారతీయులే అని ఒక అంచనా. ఈ స్థాయిలో అక్కడ భారతీయ యువతరం ప్రాతినిధ్యం పెరిగిపోతోంది. కానీ ఉద్యోగాల దామాషాలో చూస్తే వారి ప్రాతినిధ్యం తగ్గిపోతోంది. ఇప్పటికే అమెరికాకు వచ్చి ఇక్కడ ఉంటున్న వారికే ఉద్యోగాలు దొరక్కపోతుండగా కొత్తగా కేవలం ఉద్యోగాల కోసం హెచ్-1బీ వీసాలతో వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారు.

అమెరికా ఆశావహులు గుర్తుంచుకోవాల్సింది ఒక్కటే. ఇప్పుడు అమెరికాలో పరిస్థితి ఏమంత బాగా లేదు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాలో ఉద్యోగార్థులుగా అడుగుపెట్టడం సాహసమే! కానీ పరిస్థితి ఎల్లకాలం ఇలాగే ఉండదు. అమెరికా ఇలాంటి సంక్షోభాలను అనేకం చూసింది. ఐటీ ఉద్యోగ వాతావరణం కూడా మళ్లీ కుదుటపడుతుంది. అప్పటిదాకా నిరీక్షించడం తెలివైన పని.

• కృష్ణమోహన్ దాసరి
డల్లాస్

మధ్యభారతంలో ఆదివాసీల హననం ఆపండి

నక్సలిజాన్ని సమూలంగా తుదముట్టిస్తామని అమిత్ షా పదేపదే చెప్తున్నారు. దేశంలో ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా సృష్టించే సమస్యలు ఉన్నంత కాలం ఏదో ఒక రూపంలో పోరాటాలు, నిరసనలు జరుగుతూనే ఉంటాయనేది ఈ 75 ఏళ్ల కాలంలో నిరూపితమైంది. ఏ రాజకీయ పార్టీ మద్దతు లేకుండా సొంతంగా జరుగుతున్న ప్రజల పోరాటాలను కూడా నక్సలైట్ పోరాటాలుగా, ఉగ్రవాద కార్యకలాపాలుగా ముద్ర వేస్తున్నారు. ఇటీవల డిల్లీలో జరిగిన రైతాంగ ఉద్యమాలను ఖలిస్తాన్ వేర్పాటువాద పోరాటాలుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేశారు. ఒకవైపు ప్రజా ఆందోళనలపై ఉక్కు పాదం మోపుతూ మరోవైపు మానవ హక్కుల ఉల్లంఘన, ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిపై అర్బన్ నక్సలైట్ అని ముద్ర వేయడం ఓ సంప్రదాయంగా జరుగుతూ వస్తున్నది.

ఈ నాలుగున్నర దశాబ్దాల కాలంలో నక్సలైట్ల ఉద్యమాలను, వారు ప్రకటించుకుంటున్న లక్ష్యాలు–ఆశయాలను గమనిస్తే అసమానతలతో వేళ్లూనుకుపోయిన సమాజాన్ని సమ సమాజంగా మార్చడం; దున్నేవారికే భూమి కావాలనడం, అంటరానితనం పోవాలనడం; కింది కులాలకు కూడా చదువు, ఆత్మగౌరవం అందాలనడం; విదేశీ సామ్రాజ్యవాద దోపిడి నుంచి దేశ సంపద రక్షణ; దేశానికి రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక స్వాతంత్ర్యం తదితర అంశాలు వారి ఎజెండాలో ఉన్నాయి. దేశంలోని పీడిత ప్రజల సమస్యలను పరిష్కరించి వారిని రక్షించాల్సిన పాలకులు... ఒక వైపు కులం, మతం, ప్రాంతం పేరుతో ప్రజలను అణచివేస్తూ మరోవైపు విదేశీ సామ్రాజ్యవాదులకు రెడ్ కార్పెట్ పరుస్తున్నారనే విషయం ప్రజలకు స్పష్టమవుతున్నది.

ప్రజల సమస్యల పరిష్కారంలో భారత పాలకుల వైఖరిలో అప్పటికీ– ఇప్పటికీ ఎలాంటి మార్పు కనిపించకపోవడం బాధాకరం. అంతేగాక అనవసర సమస్యలను సృష్టించి కాలయాపన చేయడం ప్రభుత్వాలకు ఓ అలవాటుగా మారింది. ప్రజల్లో ప్రభుత్వాలపై అసహనం, వ్యతిరేకత వస్తున్న సందర్భంలో జనంలో చర్చ లేకుండా చేసేందుకు ఉద్దేశపూర్వకంగా ఓ సమస్యను సృష్టిస్తూ ఉంటాయి. నిత్యం ఆ అంశాన్ని ప్రసార సాధనాలలో ప్రచారం చేస్తూ పబ్బం గడుపుతాయి. దేశవ్యాప్త సార్వత్రిక ఎన్నికల వేళ ఆ కోవకు చెందినదే ఈ ఆపరేషన్ కగార్ దాడులు అని భావించాలి.

మావోయిస్టులు విజ్ఞాపనల రూపంలోనో, ప్రకటనల రూపంలోనో ప్రజల సమస్యలను భారత పాలకుల ముందు ఉంచుతున్నారు. వారు లేవనెత్తే అంశాలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సీరియస్‌గా దృష్టి సారించి చర్చిస్తే ప్రజలకు మేలు. అంతేగాని ప్రభుత్వాలు శాంతిభద్రతల సమస్యగా భావిస్తూ ప్రజలను అణచివేస్తే అది కూడా ప్రధాన సమస్యగా మారి నక్సలైట్ ఉద్యమాలు తీవ్రరూపం దాల్చి... ఇది ఎన్నటికీ అంతం కానీ సమస్యగానే ఉంటుంది. ఈ యుద్ధంలో ఇరువైపులా చనిపోతున్నది పేదలైన ఈ దేశ బిడ్డలే.

మధ్య భారతంలో యుద్ధం నిలిపివేసి శాంతి నెలకొల్పాలి. ఐదవ షెడ్యూల్ అటవీ ప్రాంతాలలో పోలీసు క్యాంపులు ఎత్తివేసి సైన్యాన్ని వెనక్కి పిలవాలి. దేశ సరిహద్దులను రక్షించే రక్షణ సైన్యాలను రాష్ట్రాలలో ఉపయోగించడం నిలిపివేయాలి. మావోయిస్టులతో కేంద్ర ప్రభుత్వం చర్చలు జరపాలి. ఆదివాసీల హక్కులను రక్షించి వారి సమస్యలను పరిష్కరించాలి. వారికి జల్, జంగల్, జమీన్‌లపై అధికారం ఇవ్వాలి.

– ప్రశాంత్ పగిళ్ళ, కన్వీనర్
స్టూడెంట్స్ ఫర్ పీస్ అండ్ లిబర్టీ, ఉస్మానియా యూనివర్సిటీ

కార్మిక కష్టానికి ప్రభుత్వ ఆసరా కావాలి!

గత ప్రభుత్వ పదేండ్ల పాలనలో తమ కష్టాలు పరిష్కారం కావాలని ఆర్టీసీ, అంగన్‌వాడి, ఆశ, మున్సిపాలిటీ, పంచాయతీ, కేజీబీవీ తదితర రంగాల కార్మికులు సమ్మెలు ఆందోళనలు చేశారు. కానీ గత ప్రభుత్వం సమ్మె చేస్తున్న కార్మికులను పిలిచి చర్చలు చేయకపోగా, పనికిమాలిన సంఘాలంటూ అవమానపరిచింది, సమ్మె చేస్తారా అని చీదరించుకున్నది. గత ముఖ్యమంత్రి కేసీఆర్ మొదటి నుంచి కార్మికుల సమస్యల పట్ల, సమ్మెల పట్ల, ట్రేడ్ యూనియన్ల పట్ల కఠినంగా, అసహనంతో, పెత్తందారి పోకడలతో వ్యవహరించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెను నిర్దాక్షిణ్యంగా అణిచివేశారు. యూనియన్లే లేకుండా చేశారు. ఆ పదేళ్ల కాలంలో వినతి పత్రాలను కూడా స్వీకరించలేదు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటంతో కార్మికులకు లబ్ధి చేకూరుతుందని కార్మికులు భావిస్తున్నారు. కానీ రాష్ట్రంలో కోట్లాదిమంది అసంఘటిత కార్మికులు, లక్షలాదిమంది కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల బతుకులు మార్చేందుకు ప్రభుత్వ పెద్దలు గానీ అధికారులు గానీ ఇంకా సిద్ధమైనట్టు కనిపించడం లేదు. ఎందుకంటే జనవరి 29న కాంగ్రెస్ ప్రభుత్వం 73వ షెడ్యూల్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాల సవరణ చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం శాస్త్రీయత, హేతుబద్ధత లేకుండా జరిగింది. గత ప్రభుత్వం కేవలం ప్రతి ఆరు నెలలకు ఒకసారి పెరిగిన సిపిఐ (consumer price index) పాయింట్లపై ఆధారపడి పాత జీవోలకు వి.డి.ఎ.ను (వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్) కలిపి లెక్కిస్తూ అశాస్త్రీయంగా వేతన జీవో నోటిఫికేషన్ విడుదల చేసేది. 12 నుంచి 18 సంవత్సరాల కిందట నిర్ణయించిన జీవోలను అప్‌డేట్ చేయకుండా యథాతథంగా వి.డి.ఎ కలిపి వేతనాలు ఫిక్స్ చేస్తూ చేతులు దులుపుకోవడం సరైనది కాదు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోల ప్రకారం కనీస వేతనం ధరలకు అనుగుణంగా లేకపోవడం వల్ల కోట్లాదిమంది కార్మికులు ఆందోళనలో ఉన్నారు. క్షేత్రస్థాయిలో ఇస్తున్న వేతనాల కన్నా తక్కువగా చట్టంలో పొందుపరచటం సరైంది కాదు. ప్రభుత్వం విడుదల చేసిన రైస్ మిల్లుల జీవో 86 ప్రకారం అన్‌స్కిల్డ్ వారికి రోజు కూలి రూ.456గా, ఇంజన్ డ్రైవర్‌కు రూ.12,440గా సూచించారు. కానీ క్షేత్రస్థాయిలో రోజు కూలికి రూ.500, ఇంజిన్ డ్రైవర్‌కు రూ.14 వేలకు పైగా చెల్లిస్తున్నారు. క్షేత్రస్థాయి వేతనాల కంటే జీవోలో తక్కువ వేతనాలు నిర్ధారించటం అన్యాయం! 29 నెలల క్రితం మినిమం వేజెస్ అడ్వైజరీ బోర్డు కనీస వేతనం రూ.21,253గా తీర్మానించింది. దీనిని గెజిట్ చేయాలని సలహా ఇవ్వటం జరిగింది. దీని ప్రకారం కనీస వేతనం రూ.21,220 ఫైనల్ చేస్తూ కొత్త జీవోలను తయారు చేసి గెజిట్ ముద్రించి కార్మికులకు న్యాయం చేయాలని కార్మిక లోకం ఆశిస్తున్నది.

బాలిక విద్య తక్కువ ఉన్న మండలాల్లో కేంద్ర రాష్ట్రాల జాయింట్ పథకమైన కస్తూరిబా బాలికల విద్యాలయాలలో రాష్ట్ర వ్యాప్తంగా 5000 మంది కార్మికులు పనిచేస్తున్నారు. వీరికి ప్రభుత్వం కనీస వేతనాలను చెల్లించడం లేదు. ఆంధ్రప్రదేశ్‌లో కేజీబీవీలో పని చేస్తున్న కార్మికులకు నెలకు రూ.14వేల వేతనం చెల్లిస్తుంటే, ఇక్కడ రూ.8 వేలకు మించి వేతనం ఇవ్వడం లేదు. ఈఎస్ఐ, పిఎఫ్, హెల్త్ కార్డులు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లాంటి ఏ సౌకర్యాలు కల్పించకుండా వారితో బండ చాకిరీ చేయిస్తున్నారు. వీరి సమస్యలపై ఈ ప్రభుత్వమైనా దృష్టి సారించాలి.

రాష్ట్రంలో 27వేల మందికి పైగా ఆశా వర్కర్లు పనిచేస్తున్నారు. గర్భం దాల్చిన నాటి నుంచి ప్రసవం అయ్యేవరకు తల్లిని బిడ్డను క్షేమంగా చూసుకునే ప్రధాన బాధ్యత ఆశాలదే. ఇదే కాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న అనేక కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో తీసుకెళ్ళే పని వారిదే. అలాంటి వీరికి రోజుకు రూ.300 వేతనం ఇచ్చి పని చేయించుకుంటున్నారు. ఇతర రాష్ట్రాలతో సమానంగా మన ఆశలకు కూడా వేతనాలు పెంచాల్సిన తక్షణ కర్తవ్యం ప్రభుత్వంపై ఉంది.

ప్రభుత్వం విడుదల చేసిన రైస్ మిల్లుల జీవో 86 ప్రకారం అన్‌స్కిల్డ్ వారికి రోజు కూలి రూ.456గా, ఇంజన్ డ్రైవర్‌కు రూ.12,440గా సూచించారు. కానీ క్షేత్రస్థాయిలో రోజు కూలికి రూ.500, ఇంజిన్ డ్రైవర్‌కు రూ.14 వేలకు పైగా చెల్లిస్తున్నారు. క్షేత్రస్థాయి వేతనాల కంటే జీవోలో తక్కువ వేతనాలు నిర్ధారించటం అన్యాయం!



రాష్ట్రంలో 12,769 గ్రామపంచాయతీలు, 129 మున్సిపాలిటీలు, 13 కార్పొరేషన్లలో సుమారుగా లక్ష మందికిపైగా పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు. సూర్యోదయం కంటే ముందు లేచి దుమ్ము పీలుస్తూ దుర్గంధం మధ్య పని చేస్తున్న వీరికి పని గంటలు అమలు కావటం లేదు. పండగలు, రాజకీయ పర్యటనలు, మరేదైనా విపత్తులు వచ్చినప్పుడు రాత్రీ పగలూ అన్న తేడా లేకుండా వీరితో అదనపు పని చేయించుకుంటున్నారు. పైగా రాష్ట్రంలో మూడు నుంచి ఏడు నెలలుగా అనేక పంచాయతీలలో కార్మికులకు వేతనాలు అందలేదు. గ్రామ పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత, ప్రతినెల క్రమ తప్పకుండా వేతనాలు, పెరుగుతున్న ధరలకు తగినట్టుగా వేతనాలు పెంచుతామని ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఈ హామీ నెరవేరుతుందని కార్మికులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ స్కీమ్ అయిన అంగన్‌వాడీల్లో మన రాష్ట్రంలో 70వేల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పేద మహిళలకు, బాల బాలికలకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించే గొప్ప పథకం ఇది. కానీ ప్రభుత్వాల అలసత్వం వల్ల, కేటాయిస్తున్న నిధుల వల్ల రోజు రోజుకీ ఈ వ్యవస్థ బలహీనపడుతోంది. కేంద్ర ప్రభుత్వం అంగన్‌వాడీలను నిర్వీర్యం చేసే విధానాలు తీసుకొస్తుంటే రాష్ట్రంలో గత ప్రభుత్వం దాన్ని వ్యతిరేకించకుండా మరింత వేగంగా వాటిని అమలు చేసింది. గతంలో కేసీఆర్ అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చుడే తప్ప అటువైపు కార్యచరణ ఊసే లేదు. ఈ ప్రభుత్వమైనా రెగ్యులర్ చేసేంతవరకు కనీస వేతనం, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత సౌకర్యాలను కల్పించాలి.

అంగన్‌వాడీ టీచర్లకు ప్రభుత్వం సరైన వేతనం ఇవ్వకపోగా ఆసరా కళ్యాణ లక్ష్మి తదితర ప్రభుత్వ పథకాలు వీరికి వర్తించకుండా నిబంధనలు పెట్టారు. రకరకాల ప్రభుత్వ సర్వేలు, పనులు, అనేక యాప్స్ తీసుకొచ్చి వీరిపై తీవ్ర పని ఒత్తిడి మోపారు. అంగన్‌వాడీలకు సేవ అందించి వయసు పైబడిన ఉద్యోగులను ఎలాంటి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వకుండా ఇంటికి పంపిస్తున్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం వీరి సమస్యల పరిష్కారానికి కార్యచరణ చేపడుతుందని ఎదురుచూస్తున్నారు.

రాష్ట్రంలో 30వేల చేనేత కార్మికుల కుటుంబాలు ఉన్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం వారికి బతుకమ్మ చీరల బకాయిలు సుమారు రూ.300కోట్లు వరకు చెల్లించలేదు. కార్మికులకు నేరుగా రావాల్సిన దారం సబ్సిడీని కూడా ఇవ్వలేదు. కార్మికుల పొదుపు సొమ్ముకు మ్యాచింగ్ గ్రాంట్స్, విద్యుత్ సబ్సిడీలు చెల్లించకుండా బకాయి పెట్టింది. దీంతో కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 17శాతం పెంచింది. ఫలితంగా చేనేత పరిశ్రమ సంక్షోభంలో పడింది. ప్రభుత్వం నేతన్నలను ఆదుకునేందుకు సకాలంలో చర్యలు తీసుకోలేదు. ఆ కార్మికులు ఐక్యంగా సమ్మె చేశారు. ఈ సమస్యలు పరిష్కరిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. దానిని అమలుకు పూనుకోవాలి. అనేక కష్టనష్టాలు కూర్చి సమస్త ఉత్పత్తులను పెంచుతున్న కార్మిక వర్గం కష్టాలను ప్రభుత్వాలు పట్టించుకోకుంటే రాష్ట్ర అభివృద్ధి కుంటుపడుతుంది.

వివిధ ప్రభుత్వ శాఖలో సుమారు మూడు లక్షల మంది కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల పని చేస్తున్నారు. వీరందరినీ రెగ్యులరైజ్ చేస్తామని అనేక పార్టీలు, ప్రభుత్వాలు హామీలు ఇస్తూ వస్తున్నాయి. కానీ కార్యచరణలో ముందడుగు వేయటం లేదు. దశాబ్దాలుగా ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న వీరు ఉద్యోగ భద్రత, రెగ్యులరైజేషన్, సమాన పనికి సమాన వేతనం లాంటి డిమాండ్లను తీర్చాలని వివిధ సందర్భాల్లో విజ్ఞప్తి చేస్తున్నారు. హామీలు ఇచ్చుడే తప్ప వారి సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రభుత్వం చొరవ చూపటం లేదు. ఇకనైనా ప్రభుత్వరంగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ కార్మికులనందరినీ రెగ్యులర్ చేసేందుకు ఇందిరమ్మ రాజ్యం పూనుకోవాలి.

■ అవుల అశోక్
ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ABN ఆంధ్రజ్యోతి

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



పరిశీలన పూర్తి

- వరంగల్‌లో పది, మహబూబాబాద్‌లో ఐదుగురి నామినేషన్ల తిరస్కరణ
- 29న నామినేషన్ల ఉపసంహరణ
- ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్యే పోటీ!

వరంగల్ కలెక్టరేట్/ మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 26: పార్లమెంట్ ఎన్నికల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం జరిగింది. ఈనెల 18న నోటిఫికేషన్‌తో ప్రారంభమైన నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం 25వతేదీతో ముగిసింది. ఈ క్రమంలో వరంగల్ పార్లమెంట్ పరిధిలో 10, మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలో ఐదుగురి నామినేషన్లను తిరస్కరించారు. వరంగల్ లోకసభ స్థానానికి వివిధ రాజకీయ పార్టీల అభ్యర్థులు, స్వతంత్రులు కలిపి మొత్తం 58 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా వారిలో 48 మంది నామినేషన్లు సక్రమంగా ఉన్నాయని రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. పరిశీలనలో 10 మంది అభ్యర్థుల నామినేషన్లు పలు కారణాలతో తిరస్కరణకు గురయ్యాయని వెల్లడించారు. ఇక మహబూబాబాద్ నియోజకవర్గానికి గాను మొత్తం 30మంది అభ్యర్థులు 56సెట్ల నామినేషన్లు వేయగా సరైన పత్రాలు సమర్పించని కారణంగా ఐదుగురికి చెందిన 11సెట్ల నామినేషన్లను తిరస్కరించారు.

వరంగల్‌లో తిరస్కరణకు గురైన అభ్యర్థులు

- బీజేపీ నుంచి నామినేషన్ వేసిన కొండేటి శ్రీధర్ ఫాం-ఎ, ఫాం-బి సమర్పించకపోవడంతోపాటు ఓటరు ప్రతిజ్ఞ చేయకపోవడంతో నామినేషన్‌ను తిరస్కరించినట్లు అధికారులు వెల్లడించారు.
- భారత్ రాష్ట్ర సమితి తరపున నామినేసన్ వేసిన అందే యాకయ్య ఫాం-ఎ, ఫాం-బి సమర్పించకపోవడం, ఒక్కరే ప్రాతిపాదించడం, రెండో సెట్‌లో ప్రతిపాదించిన వారి పేర్లు అనుమానాస్పదంగా ఉండటంతో తిరస్కరించారు.
- ఆమ్‌ఆద్మీ పార్టీ అభ్యర్థిగా నామినేషన్ వేసిన పాల్వాయి లక్ష్మీనారాయణ ఫాం-ఎ, ఫాం-బి సమర్పించకపోవడంతోపాటు అసంపూర్తిగా అఫిడవిట్ దాఖలు చేయడంతో తిరస్కరణకు గురయ్యారు.
- స్వతంత్ర అభ్యర్థులుగా నామినేషన్ వేసిన గాదె సురేశ్, సీనపెల్లి శంకర్, నద్దునూరి సంపత్, యాసారపు కర్ణాకర్, సి.ప్రభాకర్ అసంపూర్తి అఫిడవిట్ సమర్పించిన కారణంగా నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. ఇక స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాతంగి కావ్యశ్రీని ప్రతిపాదించిన వారి పేర్లు ఓటరు జాబితాలో లేకపోవడం, అసంపూర్తి అఫిడవిట్ కారణంగా తిరస్కరించారు.

మహబూబాబాద్‌లో...

కాంగ్రెస్ తరపున నామినేషన్లు వేసిన పోరిక సాయికిరణ్, లకావత్ లక్ష్మీనారాయణ, బీజేపీ నుంచి నామినేషన్ వేసిన జాటోత్ జమున, స్వంత్రులుగా నామినేషన్లు వేసిన జర్పుల లింగ్యానాయక్, జాటోత్ చక్రవర్తి తిరస్కరణకు గురయ్యారు. పలుకారణాల రీత్యా వీరి నామినేషన్లను తిరస్కరించినట్లు అధికారులు వెల్లడించారు.

ప్రధాన పార్టీల మధ్యే పోటీ

నామినేషన్ల ఉపసంహరణ అనంతరం బరిలో నిలిచే అభ్యర్థుల సంఖ్యపై స్పష్టత రానుండగా.. పోటీ మాత్రం ప్రధాన పార్టీల మధ్యే ఉండనుందన్న విషయం ప్రస్తుత రాజకీయ పరిస్థితులతో అర్థమవుతోంది. ఇటు వరంగల్, అటు మానుకోట లోకసభ స్థానాల్లో నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. వరంగల్‌లో కాంగ్రెస్ అభ్యర్థిగా డాక్టర్ కడియం కావ్య, బీజేపీ నుంచి అరూరి రమేష్, బీఆర్ఎస్ నుంచి డాక్టర్ మారపల్లి సుధీర్ కుమార్ పోటీ పడుతున్నారు. వీరు ఒకటి కన్నా ఎక్కువ నామినేషన్ల సెట్లను దాఖలు చేశారు. పరిశీలన అనంతరం ఈ ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగానే ఉన్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. అలాగే మహబూబాద్ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థిగా పోరిక బలరాంనాయక్, బీజేపీ అభ్యర్థిగా అజ్మీరా సీతారాంనాయక్, బీఆర్ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ మాలోతు కవిత ఢీ కొంటున్నారు. ఈ క్రమంలో రెండు నియోజకవర్గాల్లోనూ పోటీ రసవత్తరంగా మారనుండగా.. ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. అయితే నామినేషన్ల ప్రక్రియ మొదలవక ముందు నుంచే అభ్యర్థులు, ఆయా పార్టీల నేతలు ప్రచారాన్ని మొదలు పెట్టి.. ఇప్పటికే ఒక విడత ప్రచారాన్ని ముగించారు. ఈ నేపథ్యంలో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం ఎన్నికల ప్రచారం మరింత జోరందుకోనుంది.

29న ఉపసంహరణ

పరిశీలన ప్రక్రియ పూర్తవడంతో ఇక అందరి దృష్టి ఈనెల 29వ జరిగే నామినేషన్ల ఉపసంహరణపై పడింది. ఆ రోజున ఎవరెవరు తమ నామినేషన్లను ఉపసంహరించుకుంటా రోనన్న ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. అయితే ప్రధాన పార్టీల అభ్యర్థులు వారికి దగ్గరగా ఉన్న స్వతంత్రులు, ఇతర పార్టీల అభ్యర్థులు కొందరిని బుజ్జగిస్తున్నట్లు సమచారం. స్వతంత్ర, ఇతర పార్టీల నుంచి పోటీలో ఉండే అభ్యర్థులు ఓట్లను చీల్చే ప్రమాదం ఉండటంతో ప్రధాన పార్టీల అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా కొందరిని నామినేషన్లు ఉపసంహరించునేలా మంతనాలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. 29న నామినేషన్ల ఉపసంహరణ తర్వాత బరిలో ఎంత మంది నిలుస్తారనే విషయంపై స్పష్టత రానుంది.




అభ్యర్థులతో మాట్లాడుతున్న వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య

బాబు మోహన్ నామినేషన్ తిరస్కరణ



వరంగల్‌లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన పల్లి బాబు మోహన్ నామినేషన్‌లో ప్రతిపాదకుల పేర్లు ప్రస్తావించినా వారెవరూ సంతకాలు చేయలేదు. అలాగే అఫిడవిట్‌లోనూ సరైన వివరాలు నమోదు చేయకపోవడంతో అధికారులు ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు.

నిబంధనలు విస్మరిస్తే కేసులు నమోదు
- అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించొద్దు
- రూ.50వేలకు మించి తీసుకెళితే ఆధారాలు చూపించాల్సిందే..
- తనిఖీల్లో రూ.2 కోట్లు సీజ్
- వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా
7



వరంగల్ జిల్లా నెక్కొండ మండలం రాంపూర్ చెరువు ఎండలకు నీరు ఇంకిపోయి చేపలు మరణించాయి. ఓ చేప కళేబరంపై వాలిన పక్షులు నీటి కోసం పరితపిస్తున్న దృశ్యం

ఫొటో: 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, హనుమకొండ

భానుడి భగభగ

- వరంగల్ ఉర్సులో అత్యధికంగా 45 డిగ్రీలు
- గతేడాది ఇదే రోజున నమోదైన దాని కంటే 8.9 డిగ్రీలు అధికం

హనుమకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : భానుడు భగభగ మంటున్నాడు. మూడు రోజులుగా ఎండలు మరింత మండుతున్నాయి. దీనికి తోడు తీవ్ర వడగాలులు, ఉక్కపోతతో జనం అల్లాడుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో శుక్రవారం సరాసరి గరిష్ఠ పగటి ఉష్ణోగ్రత 45డిగ్రీలుగా నమోదైంది. గతేడాది ఇదే రోజున నమోదైన ఉష్ణోగ్రతకు 8.9డిగ్రీలు అత్యధికంగా నమోదైంది. ఇది అసాధారణ పరిస్థితిగా వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇక శుక్రవారం వరంగల్ జిల్లా ఉర్సు ప్రాంతంలో రికార్డు స్థాయిలో 45డిగ్రీలు నమోదవగా.. మహబూబాబాద్ జిల్లా మరిపెడలో 44.5డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కొయ్యూరులో 44.6డిగ్రీలు, ములుగు జిల్లాలో 44.5 డిగ్రీలు, హనుమకొండలో 44.3 డిగ్రీలు, జనగామ జిల్లాలో 43.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. అయితే వరంగల్ జిల్లాలో 45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడం జిల్లా చరిత్రలో ఇదే మొదటిసారి కాగా గతేడాది ఇదే తేదీన వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో అత్యధికంగా 36.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. కానీ ఈ సారి ఎన్నడూ లేనంతగా ఉష్ణోగ్రతలు అత్యధికంగా నమోదవడం గమనార్హం. జయశంకర్ భూపాపల్లి జిల్లా మహదేవ్ పూర్‌లో గతేడాది అత్యధికంగా 37.1 డిగ్రీలు నమోదైతే ఈ సారి కొయ్యూరులో అత్యధికంగా 44.6 డిగ్రీలు నమోదైంది. మహబూబాబాద్ జిల్లానూ ఇదే పరిస్థితి ఉంది. గతేడాది ఇదే రోజు కొమ్ముల వంచలో 37.6 డిగ్రీలు నమోదైతే శుక్రవారం మరిపెడలో 44.5డిగ్రీలు అంటే 7.1డిగ్రీలు అధికంగా నమోదైంది. ఈ ఎండల తీవ్రత మరో నాలుగు రోజుల వరకు ఇలాగే ఉండవచ్చునని వాతావరణ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. వడగాలుల తీవ్రత కూడా ఎక్కువగా ఉండనున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇదే క్రమంలో జలవనరులు, భూగర్భజలాలు కూడా అడుగంటుతున్నాయి.

రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడి మృతి

- ఢీకొట్టి వెళ్లిన గుర్తు తెలియని వాహనం
- అక్కడికక్కడే మృతి చెందిన జవాన్ దేవయ్య
- పోస్టుమార్టం కోసం ఎంజీఎంకు తరలింపు
- కన్నీరు మున్నీరైన కుటుంబ సభ్యులు

8



దేవయ్య (ఫైల్)

యజమాని ఇంటికి కన్నం వేసిన పనిమనిషి

- ప్రియుడు, అక్కతో కలిసి 650గ్రాముల బంగారం అపహరణ
- ముగ్గురిని అరెస్టు చేసిన పోలీసులు
- వివరాలు వెల్లడించిన వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఏప్రిల్ 26 : ఓ పనిమనిషి.. తన ప్రియుడు, అక్కతో కలిసి తాను పనిచేసే ఇంటికే కన్నం వేసిన సంఘటన హనుమకొండ పట్టణ పరిధిలోని సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి సుబేదారి పోలీసులు ముగ్గురు నిందితులు పని మనిషి కత్రి కళ్యాణి, ఆమె ప్రియుడు మూడు చంటి, సోదరి మౌర్య సునీతను శుక్రవారం అరెస్టు చేసి రూ.38లక్షల విలువైన ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలను శుక్రవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా వెల్లడించారు. వరంగల్ పట్టణ పరిధిలోని రంగశాయిపేట్‌లో నివాసం ఉంటున్న కల్యాణి హనుమకొండ సంతోష్‌నగర్‌లో నివాసం ఉంటున్న డాక్టర్ కీసర విక్రమ్‌రెడ్డి ఇంట్లో కొంతకాలంగా పనిమనిషిగా చేస్తోంది. ఈ క్రమంలో విక్రమ్‌రెడ్డి ఇంట్లో బంగారం ఉన్నట్లు తెలుసుకున్న కళ్యాణి ఎలాగైనా ఆభరణాలను అపహరించాలని నిర్ణయించుకుంది. ఆ తర్వాత పథకం ప్రకారం కల్యాణి.. హనుమకొండ దీన్‌దయాళ్‌నగర్‌లో ఉంటున్న తన ప్రియుడు మూడు చంటి, మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం అవుసల తండాలో ఉంటున్న తన సోదరి సునీత ముగ్గురూ కలిసి గత నెల మొదటి వారంలో 650గ్రాముల బంగారాన్ని అపహరించారు. అయితే గత నెల పదో తేదీన బీరువా తెరిచిచూసిన విక్రమ్‌రెడ్డికి బంగారం కనిపించకపోవడంతో వెంటనే సుబేదారి పోలీసులను ఆశ్రయించారు. దీంతో పోలీసులు విచారణ ప్రారంభించారు. అయితే శుక్రవారం ఉదయం సీఐ సత్యనారాయణరెడ్డి తన సిబ్బందితో సుబేదారి ప్రాంతంలోని ఫారెస్టు ఆఫీసు ఎదుట పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కారులో ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా తాము విక్రమ్‌రెడ్డి నివాసంలో చోరీ చేసిన విషయాన్ని అంగీకరించారు. చోరీ చేసిన బంగారంలో కొంత ప్రైవేటు ఫైనాన్స్‌లో తనఖా పెట్టి కొత్త కారు కొన్నామని చెప్పగా.. వారి నుంచి కారుతో పాటు తనఖా పెట్టగా మిగిలిన 470గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు విచారణలో ప్రతిభ కనబరిచిన హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి, సీఐ సత్యనారాయణరెడ్డి, ఏఎస్సై రాజయ్యతో పాటు సిబ్బందిని సీపీ అంబర్ కిషోర్ ఝా అభినందించారు. సిబ్బందికి రివార్డు అందించారు. విలేకరుల సమావేశంలో డీసీపీ అబ్దుల్ బారి పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా
(ఇన్‌సెట్‌లో స్వాధీనం చేసుకున్న బంగారం)

ఓటరు స్లిప్పుల పంపిణీ గడువులోగా పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్
-7లో..

మరణంలోనూ వీడని బంధం

- భార్య గుండెపోటుతో మృతి చెందిన 24 గంటల్లోనే భర్త కూడా కన్నుమూత
- ఆత్మకూరు మండలంలో ఘటన



సుగుణమ్మ, చేరాలు దంపతులు (ఫైల్)

ఆత్మకూరు, ఏప్రిల్ 26: బాల్యంలోనే వివాహం జరిగినా.. నాటి నుంచి నేటి వరకు ఎంతో అన్యోన్యంగా ఉండే దంపతులు వారు. భార్య గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలుసుకున్న భర్త 24 గంటల్లోపే మృతి చెందిన సంఘటన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలో చోటు చేసుకుంది. బంధువులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన పొగాకుల చేరాలు- సుగుణమ్మ దపంతులు. చేరాలు తాటికల్లుగీస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, వీరికి ఇద్దరు కుమారైలు ఇద్దరు పెళ్లిళ్ల అయ్యాయి. గురువారం సుగుణమ్మ (70) గుండెపోటుతో రాత్రి మృతి చెందింది. భార్య మరణం తట్టుకోలేని భర్త చేరాలు (80) సైతం శుక్రవారం ఉదయం గుండెపోటు తో మృతి చెందారు. 60 ఏళ్ల వారి వైవాహిక జీవితంలో ఏ రోజు చిన్న గొడవ జరిగిన దాఖలాలు లేవని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. ఎక్కడికి వెళ్లినా ఇద్దరు కలిసే వెళ్లేవారని అలాంటి ఆదర్శ దంపతులు మరణంలో కూడా వారి బంధం వీడలేదని గ్రామస్థులు, బంధువులు కన్నీరు పెట్టుకున్నారు.



మహిళ శక్తి సమ్మేళనంలో మాట్లాడుతున్న అరూరి



పబ్లిక్‌గార్డెన్‌లో వాకర్స్‌తో మాట్లాడుతున్న అరూరి రమేశ్

మహిళలు సంఘటితమైతే విజయమే..

- నా విజయాన్ని మహిళా లోకానికి అంకితమిస్తా...
- వరంగల్ బీజేపీ లోక్‌సభ అభ్యర్థి అరూరి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 26 : మహిళలు సంఘటితమైతే బీజేపీ సునాయసంగా విజయం సాధిస్తుందని వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం హంటర్‌రోడ్డులోని సీఎస్ఆర్ గార్డెన్‌లో మహిళ శక్తి సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా అరూరి రమేశ్ మాట్లాడుతూ.. మోదీ నేతృత్వంలో మహిళ శక్తిని పెంపొందించడంతో పాటు రక్షణ కల్పించడంలో ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. 'బేటీ బచావో... బేటీ పడావో' అంటూ బాలికల విద్యకు ప్రాధాన్యతనిస్తూ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. చాయ్ వాలా స్థాయి నుంచి వచ్చిన మోదీ పేదింటి మహిళలు వంట చేయడానికి ఇబ్బందులు పడొద్దని ఉచిత గ్యాస్‌లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ఏ విధంగా రక్షణ ఉండే మోదీ ప్రభుత్వం వచ్చాక మ హిళలకు ఏ విధంగా రక్షణ కల్పిస్తున్నారో ఆడబిడ్డ లు ఆలోచన చేయాలన్నారు. మహిళ సంఘాల భవనాలతో పాటు కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి మహిళల స్వయం ఉపాధికి కృషి చేసిందన్నారు. బూత్ స్థాయిలో మహిళలు మోదీ నాయకత్వంలో జరిగిన అభివృద్ధిని వివరించి బీజేపీకి ఓటు వేసేలా పని చేయాలన్నారు. మీ బిడ్డగా ఆదరించి అత్యధిక మెజార్టీతో గెలిపిస్తే తన విజయం మహిళా లోకానికి అంకితం చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి, రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుగుణారెడ్డి, హనుమకొండ మహిళా మోర్చా అధ్యక్షురాలు రత్నలక్ష్మీ, వరంగల్ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు కళ్యాణి, కార్పోరేటర్స్ అనిత, స్వాతి పాల్గొన్నారు.

దేశాభివృద్ధి కోసం ప్రజలు మోదీని కోరుకుంటున్నారు...

దేశాభివృద్ధి కోసం అన్ని వర్గాల ప్రజలు మోదీ పాలనను కోరుకుంటున్నారని అరూరి రమేశ్ అన్నారు. ప్రచారంలో భాగంగా శుక్రవారం ఉదయం హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని వాకర్స్‌తో మార్నింగ్ వాక్ చేస్తూ బీజేపీకి ఓటు వేయాలని అభ్యర్థించారు. అనంతరం ఆయన మాటాడుతూ 10 సంవత్సరాల నుంచి మోదీ నేతృత్వంలో దేశం సురక్షితంగా, సుభిక్షంగా ముందుకు సాగుతుందని, మరో సారి మోదీని ఆశీర్వదిస్తే దేశాన్ని ప్రపంచానికి దిక్సూచిగా మారుస్తాడన్నారు. ఇప్పటికే నరేంద్రమోదీ స్మార్ట్‌సిటీ, అమృత్ పథకంతో పాటు కాజీపేటలో రైల్వే వ్యాగన్ ఏర్పాటు చేయడం జరిగిందని, మీ ప్రతినిధిగా వరంగల్ నుంచి లోక్‌సభకు పంపిస్తే వరంగల్ మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. బీజేపీ నాయకులు ధర్మారావు, జిల్లా అధ్యక్షురాలు పద్మ, సుభాష్, రావుల కిషన్, మహేందర్, శ్రావణ్ పాల్గొన్నారు.

మే 6 నుంచి కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 26 : కాకతీయ యూనివర్సిటీ బీఏ, బీకాం, బీఎస్సీ ఇతర డిగ్రీ కోర్సుల రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్ పరీక్షలు మే 6వ తేదీ నుంచి జరుగుతాయని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎం.తిరుమలదేవిలు శుక్రవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు.

- బీఏ, బీఏ(లాంగ్వేజెస్) బీకాం, బీఎస్సీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 6, 8, 10, 16, 18, 21, 24, 27 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు.
- బీఏ, బీఏ (లాంగ్వేజెస్) బీకాం, బీఎస్సీ నాలుగవ సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 7, 9, 15, 20, 22, 25, 28, తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని తెలిపారు.
- బీఏ, బీఏ (లాంగ్వేజెస్) బీకాం, బీఎస్సీ రెండో సెమిస్టర్ పరీక్షలు ఏప్రిల్ 6, 8, 10, 16, 18, 21, 24, 27, 29, 31, జూన్ 1, 7, 11 తేదీల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి.
- కేయూ పీడీసీ మొదటి, రెండో ఏడాది తెలుగు పరీక్షలు మే 8 నుంచి జరుగుతాయని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే రెండో ఏడాది పరీక్షలు మే 15వ తేదీ నుంచి ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయని వారు వెల్లడించారు.

కేయూ దూరవిద్య డిగ్రీ, పీజీ కోర్సుల ఫీజుల గడువు 15

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 26: కేయూ దూరవిద్య కేంద్రం డిగ్రీ రెండో ఏడాది, మూడో ఏడాది టర్మ్ ఫీజులను మే 15వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామ చంద్రం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే పీజీ ఫైనల్ ఇయర్ కోర్సుల టర్మ్ ఫీజులను మే 24వ తేదీ వరకు అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని అన్నారు. ఫీజుల వివరాలు కేయూ దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు ఆయన స్పష్టం చేశారు. ఇతర వివరాలకు 0870 -2461480 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'సుమతిరెడ్డి'లో అలరించిన 'రిథమ్'



విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

హసన్‌పర్తి, ఏప్రిల్ 26: మండలంలోని అనంతసాగర్ వద్ద గల సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల పాటు జరుగుతున్న రిథమ్ సాంస్కృతిక ప్రోగ్రాం శుక్రవారం ముగిసింది. హైదరాబాద్‌కు చెందిన త్రియారి బ్యాండ్ బృందంచే హిందీ, తెలుగు సినీ గీతాలతో అలరించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సినీ గీతాలకు విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో కేరింతలతో హోరెత్తించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఐ.రాజశ్రీరెడ్డి, కన్వీనర్ డాక్టర్ పుష్పలత, ఇ.సుదర్శన్, కె.మహేందర్, ఏవో వేణుగోపాలస్వామి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నిఖార్సయిన కార్యకర్తలు బీఆర్ఎస్‌లోనే..

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మడికొండ, ఏప్రిల్ 26 : మడకొండలోని 64వ డివిజన్ కార్పొరేటర్ ఆవాల రాధికారెడ్డి ఆధ్వర్యంలో ఆమె ఇంటి ఆవరణలో శుక్రవారం 64, 46 డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి. రాజయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 28న కేసీఆర్ రోడ్‌షో సందర్భంగా అన్ని బూత్ కమిటీలను పునరుద్ధరించాలని మండల కమిటీ, క్లస్టర్ ఇన్‌చార్జిలు, ముఖ్య నాయకులకు సూచించారు. డివిజన్‌లో తాలు అంతా పోయిందని ప్రస్తుతం ఉన్న వారు నిఖార్సయిన కార్యకర్తలని పేర్కొన్నారు. వారికి తగిన బాధ్యతలు అప్పగించాలని చెప్పారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు మునిగెల రాజుముదిరాజ్, క్లస్టర్ ఇన్‌చార్జిలు, మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గడువులోపు ఓటరు స్లిప్పుల పంపిణీ
పూర్తి చేయాలి
హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్


ఆర్డీవో ఆఫీసులోని స్ట్రాంగ్‌రూంను పరిశీలిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 26 : లోక్‌సభ ఎన్నికల్లో ఓటర్లకు ఓటరు సమాచార స్లిప్‌ల పంపిణీ ప్రక్రియను గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లను ఆదేశించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గం రాంనగర్‌లోని 225, 237 పోలింగ్ కేంద్రాలు, లష్కర్ బజార్‌లోని 18వ పోలింగ్ కేంద్రం పరిధిలో జరుగుతున్న ఓటరు సమాచార స్లిప్‌ల పంపిణీ ప్రక్రియను కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సంబంధిత ఓటర్లకు ఓటరు సమాచార స్లిప్‌లను బీఎల్‌వోలు అందజేయాలని అన్నారు. ఓటరు సమాచార స్లిప్‌లను ఓటర్లు, సంబంధిత కుటుంబ సభ్యులకు అందించాలని సూచించారు. ఏక మొత్తంలో ఎవరికి కూడా ఓటరు సమాచార స్లిప్‌లను అందించొద్దన్నారు. అనంతరం గీతాంజలి మహిళా డిగ్రీ కళాశాలలో కేటాయించిన పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు.

హనుమకొండ ఆర్డీవో కార్యాలయం సందర్శన

హనుమకొండ ఆర్డీవో కార్యాలయాన్ని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా పోస్టల్ బ్యాలెట్‌కు సంబంధించిన పోలింగ్ సామాగ్రి కిట్లను పరిశీలించిన వాటి వివరాలను ఆర్డీవోను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం పక్కనే ఉన్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కోసం ఏర్పాటు చేసిన ఫెసిలిటేషన్ సెంటర్‌ను పరిశీలించారు. కలెక్టర్ వెంట హనుమకొండ ఆర్డీవో వెంకటేష్, స్థానిక తహసీల్దార్ విజయ్ కుమార్, ఆర్ఐ కృష్ణ, బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు రాకేష్, శ్యాంసుందర్, బీఎల్‌వోలు ఉన్నారు.

ఓరుగల్లు.. ఉద్దండులు

- ప్రధాని పీఠాన్ని అధిరోహించిన పీవీ
- కేంద్ర పౌరసరఫరాల మంత్రిగా కమాలొద్దీన్ అహ్మద్
- మరో కేంద్ర మంత్రిగా బలరాం నాయక్



హనుమకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్, మహబూబాబాద్‌తో పాటు రద్దయిన హనుమకొండ లోకసభ స్థానాల నుంచి ఎన్నికై పార్లమెంట్‌లో అడుగుపెట్టిన ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నేతలు కేంద్ర మంత్రులుగా తమ సత్తా చాటారు. కీలక శాఖల బాధ్యతలను చేపట్టిన వీరు తమదైన శైలిలో ఉన్నతంగా రాణించారు. ఓరుగల్లు ఖ్యాతిని యావద్దేశానికి చాటారు.

పీవీ నర్సింహారావు :

రద్దయిన హనుమకొండ లోకసభ స్థానం నుంచి వరుసగా రెండు సార్లు గెలుపొందిన పీవీ నర్సింహారావు ప్రధాన మంత్రి పీఠాన్ని అధిష్ఠించి ఓరుగల్లు ఖ్యాతిని నలుదిశలా చాటారు. పీవీ 1977 ఎన్నికల్లో ఎన్నికై మొదటి సారి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు. కాంగ్రెస్ పక్షాన పోటీ చేసిన ఆయన బీఎల్‌డీ అభ్యర్థి పి జనార్దన్‌రెడ్డిపై 77,683 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఆ తర్వాత ఇదే నియోజకవర్గం నుంచి 1980లో మరో సారి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ యూ నుంచి బరిలో నిలిచిన ఇదే ప్రత్యర్థి పి జనార్దన్ రెడ్డిపై రెండింతలకుపైనా అంటే 1,62,949 ఓట్ల మెజారిటీతో మరో సారి విజయం సాధించారు. 1977లో హనుమకొండ నుంచి ఎంపీగా గెలిచినపీవీ పార్లమెంట్ పబ్లిక్ ఎకౌంట్స్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించారు. 1980 ఎన్నికల్లో ఇదే నియోజకవర్గం నుంచి రెండోసారి గెలిచిన తర్వాత విదేశాంగా మంత్రిగా, కేంద్ర హోంశాఖ మంత్రిగా పదవులు నిర్వహించారు. అయితే 1984 ఎన్నికల్లో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. దేశమంతా కాంగ్రెస్ గెలిచినా ఇక్కడ మాత్రం బీజేపీ అభ్యర్థి సి జంగారెడ్డి చేతిలో ఆయన పరాజయం చవిచూడాల్సి వచ్చింది. ఈ ఓటమితో రాజకీయంగా పీవీ వరంగల్‌కు దూరమయ్యారు. మళ్లీ ఆ తర్వాత ఎప్పుడు ఆయన ఇక్కడి నుంచి పోటీ చేయలేదు. 1984 ఎన్నికల్లో మహారాష్ట్రలోని రామ్‌టెక్ నుంచి కూడా పోటీ చేసిన పీవీ అక్కడ విజయం సాధించారు. కేంద్రంలో రక్షణశాఖ మంత్రిగా, కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రిగా, కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిగా, విదేశాంగ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1989 ఎన్నికల్లో ఇదే రామ్‌టెక్ నుంచి మరో సారి గెలిచారు. విదేశీ వ్యవహారాలు, పార్లమెంట్ సంప్రదింపుల కమిటీసభ్యులుగా, ఆ తర్వాత అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా పని చేశారు. 1991 జూన్ 21న అనూహ్యంగా ఆయన ప్రధాన మంత్రి పీఠాన్ని అధిష్ఠించారు.

కమలొద్దీన్ అహ్మద్ :

వరంగల్ నుంచి పార్లమెంట్‌లో రాణించిన మరో నేత కమాలొద్దీన్ అహ్మద్. హనుమకొండ లోకసభ స్థానం నుంచి వరుసగా మూడు సార్లు గెలిచి రికార్డు సృష్టించారు. కమలొద్దీన్ ఆహ్మద్ 1980 ఎన్నికల్లో వరంగల్ లోకసభ నియోజకవర్గం నుంచి మొదటి సారి ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1989, 1991, 1996 ఎన్నికల్లో హనుమకొండ లోకసభ స్థానం నుంచి వరుసగా గెలుపొందిన ఆయన 1991 నుంచి 1994 వరకు కేంద్ర పౌరసరఫరాల సహాయ మంత్రిగా, కేంద్ర వాణిజ్య శాఖ మంత్రిగా పని చేశారు. ఆ తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీని వదిలి బీజేపీలో చేరాడు. 2003 నుంచి 2004 వరకు ఏడాది పాటు సౌది అరేబియా భారత రాయబారిగా పని చేశారు.

బలరాం నాయక్

2009లో పునరుద్ధరించిన మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచిన పోరిక బలరాం నాయక్ కూడా కేంద్ర మంత్రిగా పని చేశారు. 2012 అక్టోబర్‌లో మన్‌మోహన్ సింగ్ మంత్రి వర్గంలో కేంద్ర సహాయ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

■ మీకు తెలుసా..?

ఆరోవంతు వస్తేనే డిపాజిట్

ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత ఫలానా అభ్యర్థికి డిపాజిట్ కూడా దగ్గలేదట.. డిపాజిట్ గల్లంతైన అభ్యర్థులు.. అనే మాటలు తరుచూ వినిపిస్తాయి. డిపాజిట్ అంటే ఏమిటీ? ఎప్పుడు గల్లంతవుతుంది? అనేది తెలుసుకుందాం.. నామినేషన్లు వేసినప్పుడు అభ్యర్థులు కొంత నగదును చెల్లించాల్సిన అవసరం ఉంటుంది. ఆ డబ్బును ఎన్నికల ఫలితాలు విడుదలైన అభ్యర్థులకు తమ ధరావతు (డిపాజిట్) తిరిగి వస్తే అది గౌరవప్రదమైన ఓటమిగా లెక్కిస్తారు. అదే డబ్బులు తిరిగి రాకపోతే అభ్యర్థి డిపాజిట్ గల్లంతైందని అర్థం. ఆయా ఎన్నికలకు ఎన్నికల సంఘం డిపాజిట్ ఇంతా అని నిర్ణయిస్తుంది. ఈ మొత్తాన్ని ఆర్‌ఓ ఖజానాశాఖలో తెరిచిన ఖాతాలో జమ చేస్తారు. నియోజకవర్గం నుంచి పోటీ చేసిన అభ్యర్థి మొత్తం పోలైన ఓట్లలో ఆరో వంతు (16 శాతం) ఓట్లను పొందాల్సిన అవసరం ఉంటుంది. ఉదాహరణకు ఒక నియోజకవర్గంలో వెయ్యి ఓట్లే వేశారనుకుంటే ఇందులో 160 ఓట్ల కన్నా ఎక్కువ సాధించాల్సి ఉంటుంది. 16శాతం కన్నా ఎక్కువ ఓట్లు వస్తే డిపాజిట్‌గా చెల్లించిన డబ్బులను తిరిగి ఇస్తారు. లేనట్లయితే ఎన్నికల సంఘం స్వాధీనం చేసుకుంటుంది. స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువగా డిపాజిట్లు కోల్పోవడం సర్వసాధారణం

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

నిబంధనలు విస్మరిస్తే కేసులు నమోదు
అనుమతులు లేకుండా సభలు, సమావేశాలు నిర్వహించరాదు
తనిఖీల్లో రూ.2 కోట్లు సీజ్ చేశాం : సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, ఏప్రిల్ 26 : ఎన్నికల కమిషన్ నిబంధనలు విస్మరిస్తే కేసులు నమోదు చేస్తామని, అనుమతులు లేకుండా ఎవరు కూడా సభలు, సమావేశాలు నిర్వహించరాదని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న చర్యలపై విలేకర్లు అడిగిన ప్రశ్నలకు అంబర్ కిషోర్ ఝా వివరించారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా కమిషనరేట్ పరిధిలో పలుచోట్ల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తనిఖీల్లో రూ.2 కోట్ల నగదు, లిక్కర్ సీజ్ చేసినట్లు ఆయన తెలిపారు. ఎన్నికల సమయంలో రూ.50వేలకు మించి నగదు ఉంటే సీజ్ చేయడం జరుగుతుందన్నారు. దీనికి సరైన ఆధారాలు చూపిస్తే తిరిగి ఇవ్వడం జరుగుతుందని అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరు చట్టానికి లోబడి నడుచుకోవాలన్నారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టినట్లు ఆయన తెలిపారు. ప్రధానంగా బైక్ రేసుల విషయంలో సీరియస్‌గా తీసుకున్నామని ఆయన అన్నారు. కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు, ప్రజలు సహకరించాలని అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు.

వరంగల్ అభివృద్ధికి బీజేపీని గెలిపించాలి

- పెండింగ్ సమస్యల పరిష్కారానికి నా వంతు కృషి చేస్తా
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ
- కడియంతో రాజీనామా చేయించి రేవంత్ వెంటతిప్పుకోవాలని వ్యాఖ్య


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంద కృష్ణ మాదిగ

కాళోజీ జంక్షన్, ఏప్రిల్ 26 :వరంగల్ అభివృద్ధికి కేంద్రం నిధులు పొందాలంటే ఎంపీగా బీజేపీ అభ్యర్థి అరూరి రమేష్‌ను గెలిపించాలని, ఆయనతో పాటు కేంద్ర పెద్దలతో తనకున్న సత్సంబంధాలతో ఉమ్మడి జిల్లాలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హామీ ఇచ్చారు. శుక్రవారం హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్లు ఇతర పార్టీల వారిచ్చిన డబ్బులను తీసుకుని బీజేపీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లకు ఢోకా ఏమీ ఉండదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజాభిమానంతో కానీ ఉద్యమం చేసి కానీ ముఖ్యమంత్రి పదవిని చేపట్టలేదని దుయ్యబట్టారు. కడియం శ్రీహరిని తానే కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించానని చెప్పుకొంటున్న రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని శ్రీహరిని ఎందుకు అడుగలేదని ప్రశ్నించారు. ఎవరైనా ఏదేని పార్టీలో గెలిచి మరో పార్టీలోకి చేరితే పిచ్చికుక్కను కొట్టినట్లు రాళ్లతో కొట్టండని గతంలో ప్రగల్భాలు పలికిన రేవంత్‌రెడ్డి శ్రీహరి విషయంలో ఎందుకు మరిచిపోయారని ప్రశ్నించారు. తొలుత కడియంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించి తన వెంట తిప్పుకోవాలని, లేదంటే ఎవరైనా సీఎంపైన పక్కనున్న శ్రీహరిపైన రాయి విసిరితే ఆయనే బాధ్యత వహించాల్సి ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరించారు. తాను టీడీపీలో ఉన్నప్పుడు శ్రీహరి ఎస్సీ కాదని, దీనిపై నిజనిర్ధారణ కమిటీ వేసి ఆయన కులాన్ని నిర్ధారించాలన్న రేవంత్‌రెడ్డి, ప్రస్తుతం ఆయన కూతురు కావ్యకు ఎస్సీగా ఎందుకు టికెట్ ఇచ్చారని ప్రశ్నించారు. ఈ విలేకరుల సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మంద కుమార్ మాదిగ, వేల్పుల సూరన్న కాపు, మంద రాజు, జన్ను దినేష్, బండారు సురేశ్, గద్దల సుకుమార్, బొక్కల నారాయణ, తిప్పన్న పాల్గొన్నారు.

'రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి'


సమావేశంలో మాట్లాడుతున్న వరంగల్ ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 26: పోలింగ్ సిబ్బందికి రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్‌లో సాధారణ ఎన్నికల పరిశీలకులు బండారి స్వాగత్ రణ్వీర్‌చంద్ సమక్షంలో వరంగల్, హనుమకొండ, జనగామ, భూపాలపల్లి జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు ప్రావీణ్య, సిక్తాపట్నాయక్, షేక్ రిజ్వాన్ బాషా, భవేశ్ మిశ్రాలు ఏడు అసెంబ్లీ సెగ్మెంట్‌కు పోలింగ్ సిబ్బంది రెండో విడత ర్యాండమైజేషన్ సాఫ్ట్‌వేర్‌ను ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ వరంగల్ రెవెన్యూ జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు జిల్లాలో పాక్షికంగా ఉన్న పాలకుర్తి, పరకాల, వరంగల్ పశ్చిమ నియోజకవర్గాలకు సంబంధించిన 809 పోలింగ్ కేంద్రాలకు 3,964 మందిని ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు తెలిపారు. అందులో 988 మంది ప్రిసైడింగ్ అధికారులు, మరో 988 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 1988 మంది ఇతర పోలింగ్ అధికారులున్నట్లు వివరించారు. ర్యాండమైజేషన్ ద్వారా నియమించిన వారికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియలో పోలింగ్ సిబ్బందిని పోలింగ్ బూత్‌ల వారీగా కేటాయిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఏఆర్‌ఓలు అశ్విని తానాజీ వాకడే, కె.శ్రీనివాస్, డిఎస్.వెంకన్న, రోహిత్‌సింగ్, సంధ్యారాణి, రాధికగుప్తా, వైవి.గణేష్, శ్రీనివాస్, నారాయణ, వెంకటయ్య, మంగీలాల్, సిద్దం దత్తు పాల్గొన్నారు.

మహబూబాబాద్ జిల్లాలో
రూ.23.02 లక్షల పట్టివేత


జిల్లా కేసముద్రం మండలం కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు వద్ద రూ.18లక్షల నగదును సీజ్ చేసిన పోలీసులు

మహబూబాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మహబూబాబాద్ జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన పోలీసు చెక్‌పోస్టుల వద్ద భారీగా నగదు పట్టుబడుతున్నాయి. తనిఖీలు ముమ్మరం కావడంతో ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తున్న నగదును స్వాధీనం చేసుకుంటున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం మహబూబాబాద్ జిల్లా సరిహద్దుల్లోని నాలుగు చెక్‌పోస్టుల వద్ద రూ.23.02లక్షల నగదును పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలోని కేసముద్రం మండలం కోరుకొండపల్లి క్రాస్‌రోడ్డు చెక్‌పోస్టు వద్ద రూ.18 లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్సై వంశీధర్ తెలిపారు. కేసముద్రం నుంచి నెక్కొండ వైపు వెళ్తున్న కారులో గుమస్తాగా పనిచేస్తున్న కేసముద్రానికి చెందిన హరి అనేవ్యక్తి బ్యాగులో నగదును తరలిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. కురవి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద ద్విచక్రవాహనంపై వెళ్తున్న నేరడ బాల్యతండాకు చెందిన రైతు భూక్య కొండయ్య వద్ద రూ.3.50 లక్షలు లభించాయని ఎస్సై గోపి తెలిపారు. ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును సీజ్‌చేసి, ఫ్లయింగ్ స్క్వాడ్‌కు అప్పగించామన్నారు. అయితే తాను విర్పి అమ్మగా వచ్చిన నగదును ఇంటికి తీసుకువెళ్తుండగా పట్టుకున్నట్లు బాధిత రైతు కొండయ్య ఆవేదనే వ్యక్తం చేశాడు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలోని జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టీ చెక్‌పోస్టు వద్ద వాహనాల్లో తనిఖీల్లో ఎలాంటి ఆధారాలు లేని రూ.లక్ష నగదును పట్టుకున్నట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం మంచుకొండకు చెందిన వినోద్ సాహిని మినీ ట్రాలీతో ఖమ్మం వైపు వెళ్తుండగా చెక్‌పోస్టు వద్ద తనిఖీ చేయగా ఎలాంటి ఆధారాలులేని రూ.లక్ష నగదు పట్టుబడింది. అలాగే మండలంలోని ముల్కలపల్లి వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టు వద్ద ఓ వ్యక్తి నుంచి రూ.52 వేల నగదును పట్టుకున్నట్లు సీఐ ఉపేందర్‌రావు తెలిపారు. ముల్కలపల్లికి చెందిన బోడ సాయికుమార్ అనే వ్యక్తి నుంచి ఎలాంటి పత్రాలు లేని రూ.52 వేల నగదును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు.

బయ్యారంలో...

బయ్యారం, ఏప్రిల్ 26 : ఎలాంటి అధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.లక్షా 70 వేలు నగదును స్వాధీన పరుచుకున్నట్లు బయ్యారం సీఐ రవి కుమార్ తెలిపారు. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం. శుక్రవారం రాత్రి బయ్యారం, గార్ల మండలాల సరిహద్దు సత్యనారాయణపురం క్రాస్‌రోడ్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఇరువురు వ్యక్తులు అనుమానాస్పదంగా తారసపడటంతో తనిఖీ చేయగా.. ఓవ్యక్తి వద్ద రూ.లక్ష నగదు మరోవ్యక్తి దగ్గర రూ.70 వేలు నగదు లభ్యమైనట్లు వెల్లడించారు. నగదు లభ్యమైన వ్యక్తులు అందుకు సంబంధించి ఆధారాలు చూపించకపోవడంతో నగదును స్వాధీనపరుచుకొని, సీజ్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐపీఎస్, ట్రైనీ ఎస్సై చేతన్‌నితిన్, బయ్యారం ఎస్సై మౌలానా, గార్ల ఎస్సై జీనత్‌తో పాటు సిబ్బంది ఉన్నారు.

ఒక్క ఓటు తేడాతో...
చేజారిన పీఠాలెన్నో..!
మలుపు తిరిగిన చరిత్రకు ఒక్క ఓటే కీలకం



లింగాలఘణపురం, ఏప్రిల్ 26: అందరూ ఎదురు చూస్తున్న లోక్‌సభ ఎన్నికలు శరవేగంగా దూసుకువస్తున్నాయి.. బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రచార పర్వంలో ముందుకు సాగుతున్నారు. ప్రజల ఓట్లను గంపగుత్తగా తమ బుట్టలో వేసుకునేందుకు రాజకీయ నాయకులు ఎత్తుకుపైఎత్తులు రచిస్తూనే ఉన్నారు. అయితే ఎవరు ఎటు పోతే నాకేంటి అనుకుంటూ సాధారణ ప్రజలు మాత్రం ఎవరి పనుల్లో వారు నిమగ్నమై ఓటు ప్రాధాన్యతను విస్మరిస్తూ చాలా మంది పోలింగ్‌కు దూరంగా ఉంటున్నారు. కానీ ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటే వజ్రాయుధమని తెలుసుకోలేకపోతున్నారు. పేద, ధనిక, పెద్ద, చిన్న లాంటి తారతమ్యాలు లేని ఓటును తమ బ్రహ్మాస్త్రంగా మలుచుకోలేకపోతున్నారు. మనం కావాలనుకున్న నాయకుడిని పీఠం ఎక్కించాలన్నా.. వద్దనుకున్న లీడర్‌ను గద్దె దించాలన్నా ఒక్క ఓటు చాలు. మన ఒక్క ఓటు సమాజంలో ఏం మార్పు తీసుకొస్తుందని నిరుత్సాహ పడొద్దు.. మనం వేసిన ఒక్క ఓటే చరిత్ర గతిని మార్చి సంచలనం సృష్టించవచ్చు కూడా.. ఒకే ఒక్క ఓటు చరిత్రను మలుపుతిప్పిన సందర్భాలు మచ్చుకు కొన్ని ఇలా..

- 1999లో కేంద్రంలో వాజ్‌పేయి ప్రభుత్వం ఒక్క ఓటు తేడాతోనే కూలిపోవాల్సి వచ్చింది- - 2004 కర్ణాటక ఎన్నికల్లో సంతెమరహళ్లి నియోజకవర్గం నుంచి జేడీఎస్ అభ్యర్థిగా పోటీచేసిన ఏఆర్ కృష్ణ మూర్తి ఒక్క ఓటు తేడాతోనే ఓటమి పాలయ్యాడు.
- 2008 రాజాస్థాన్ ఎన్నికల్లో సీఎం అభ్యర్థి సీపీ జోషి ఒకే ఒక్క ఓటు తేడాతో ప్రత్యర్థి చేతిలో పరాజయం పాలయ్యాడు. సీపీ జోషికి 62,215 ఓట్లు రాగా ప్రత్యర్థికల్యాణ్ సింగ్ చౌహాన్‌కు 62,216 ఓట్లు వచ్చాయి. దీంతో ఒక్క ఓటు తేడాతో ఓటమి చవిచూడాల్సి వచ్చింది. అంతే కాదు ఈ ఎన్నికల్లో సీపీ జోషి తల్లి, భార్య, తన కారు డ్రైవర్ ఓటు హక్కును వినియోగించుకోలేదు. అందులోనూ కారు డ్రైవర్ ఓటేసేందుకు వెళ్లే క్రమంలో సీపీ జోషి ఏదో పనికోసం ఆపాడట. చివరకు వాళ్ల ఓట్లు పడకపోవడంతో ఓటమి పాలయ్యాడు.
- ఒక్క ఓటు తేడాతో ఇంగ్లీష్‌పై హిందీ విజయం సాధించి భారత దేశం అధికారిక భాషగా గుర్తింపు పొందింది.
- 1714లో ఒకే ఒక్క ఓటు తేడాతో కింగ్‌జార్జ్-1 ఇంగ్లాండ్ పీఠమెక్కాడు.
- 1776లో అమెరికాలో ఒకే ఒక్క ఓటు తేడాతో జర్మన్‌కు బదులుగా ఇంగ్లీష్ అధికారిక భాషగా మారింది
- 1800లో థామస్ జెఫర్సన్, 1824లో జాన్ క్విన్సీ ఆడమ్స్, 1876 రూథర్‌ఫర్డ్ హెస్‌లు ఎలక్టోరల్ కాలేజీలో ఒకే ఒక్క ఓటు తేడాతో అధ్యక్ష పదవులను అధిష్ఠించారు.
- 1923 నవంబరు 8న జర్మనీలో నాజీ పార్టీ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఒకే ఒక్క ఓటు తేడాతో అడాల్ఫ్ హిట్లర్ ప్రత్యర్థి ఓడిపోయారు.



పీఎం బహిరంగ సభాస్థలి పరిశీలన

మడికొండ, ఏప్రిల్ 26: మే 3న జరగనున్న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ బహిరంగ సభా స్థలాన్ని శుక్రవారం బీజేపీ నేతలు క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. కాజీపేట మండలం మడికొండలోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న స్థలాన్ని వరంగల్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్, క్లస్టర్ ఇన్‌చార్జి రాష్ట్ర క్రమశిక్షణ సంఘం అధ్యక్షులు మార్తినేని ధర్మారావు, హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంట రవి, మురళీగౌడ్, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్, పార్టీ నేతలు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, కీర్తి రెడ్డి, కేశవరెడ్డి, కుమారస్వామి పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు పొనగోటి వెంకట్రావు, ఎస్సీమోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం మహేందర్, నాయకులు బొల్లికొండ వినోద్, మునిగాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.



సభా స్థలాన్ని పరిశీలిస్తున్న బీజేపీ నేతలు

జడ్పీ సర్వసభ్య సమావేశం వాయిదా

హనుమకొండ సిటీ, ఏప్రిల్ 26: హనుమకొండ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. శుక్రవారం హనుమకొండ అదాలత్‌లోని జడ్పీ కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో 11 గంటలకు సమావేశం ఆరంభమైంది. అయితే సభ్యుల కోరం లేకపోవడంతో నిబంధనల మేరకు వాయిదా వేస్తున్నట్లు జడ్పీ సీఈవో విద్యాలత ప్రకటించారు.

లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు



తనిఖీలు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 26: పుట్టబోయే బిడ్డ ఆడ, మగ అని చెప్పేవారితో పాటు అడిగిన వారు కూడా పీఎన్‌డీటీ చట్ట ప్రకారం శిక్షార్హులని, ప్రతీ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు పీఎన్‌డీటీ చట్టంకు అనుగుణంగా పని చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఎండి. యాకూబ్‌పాష తెలిపారు. శుక్రవారం కాజీపేట, హనుమకొండ ప్రాంతాల్లోని పలు స్కానింగ్ సెంటర్లను ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. స్కానింగ్ సెంటర్‌కు వచ్చిన వారి వివరాల నమోదుతోపాటు ఫాం ఎఫ్ రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. లింగ నిర్ధారణ చట్టరీత్యా నిషేధమనే బోర్డులు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. లింగ నిర్ధారణ జరిపే సెంటర్లు, అబార్షన్లు నిర్వహించే వారి గురించి 104, 1098కు గానీ డయల్ 100కు గానీ తెలియజేయాలన్నారు. డీఎంహెచ్‌వో అనుమతి లేకుండా ఎలాంటి స్కానింగ్ మిషన్లు కొనడం అమ్మడం నిషేధమని అన్నారు. ఈ తనిఖీల్లో డెమో వి.అశోక్‌రెడ్డి, సీహెచ్‌వో టి.మాధవరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న విద్యాసంస్థలు

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 26: వరంగల్ నగరంలో కొన్ని విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘించి సమ్మర్ క్లాసులు నడుపుతున్నారని, ప్రైవేటు కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని సీపీఎం కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడారు. నిబంధనలు పాటించని కళాశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రభుత్వం విద్యార్థులకు సెలవులు ప్రకటించినప్పటికీ కొన్ని విద్యాసంస్థలు వివిధ కోచింగ్‌ల పేరుతో తరగతులు నడిపిస్తున్నారని అన్నారు. సమ్మర్ క్లాసుల పేరుతో అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న విద్యాసంస్థలను గుర్తించి చర్యలు తీసుకోవాలని లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు పరిమళ, పురుషోత్తం, సాయికిరణ్, పృథ్వీరాజ్, సృజన్, జగదీశ్, సాయికుమార్‌లు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం

▸▸ నేతలకు అడుగడుగునా మంగళ హారతులతో స్వాగతం



బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌తో కలిసి వినయ్, సారయ్య ప్రచారం

రాంనగర్, ఏప్రిల్ 26 : భారత రాష్ట్ర సమితి పార్లమెంట్ అభ్యర్థి సుధీర్‌కుమార్ హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, ఎమ్మెల్సీ సారయ్యతో కలిసి శుక్రవారం కాజీపేటలోని పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి సుధీర్‌కుమార్ మాట్లాడుతూ ఈ ఎన్నికలు మంచికి, ద్రోహానికి మధ్య జరుగుతున్న ఎన్నికలన్నారు. అవకాశాల కోసం బీఆర్ఎస్‌కు ద్రోహం చేసిన వారే కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులని వారికి ఓటమి తప్పదన్నారు. హనుమకొండ జిల్లా పార్టీ అధ్యక్షుడు వినయభాస్కర్ మాట్లాడుతూ సుధీర్‌కుమార్ మచ్చలేని నాయకుడని, గెలిపించాలని కోరారు. ప్రజలు కాంగ్రెస్ మోసాన్ని గుర్తించారని ఆ పార్టీకి ఓటమి తప్పదన్నారు. ప్రస్తుతం అన్ని వర్గాలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని తెలి పారు. బీజేపీ రాష్ట్రానికి చేసింది ఏమి లేదన్నారు. దేవుళ్లను అడ్డుపెట్టుకుని ఆ పార్టీ రాజకీయం చేస్తుందన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపిస్తే విభజన హామీల అమలుకు కృషి చేయడం జరుగుతుందని వినయభాస్కర్ తెలిపారు. ప్రచారంలో అడుగడుగున మహిళలు హారతులతో స్వాగతం పలికారు.

హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ విజేత కాటారం జట్టు

▸▸ ద్వితీయ, తృతీయ స్థానాల్లో కొత్తగూడ, కేవీ పికెట్

▸▸ ముగిసిన రాష్ట్ర స్థాయి పోటీలు



ప్రథమ స్థానం కాటారం జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 26: తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 3 రోజులుగా హనుమకొండ జేఎన్ఎస్ హ్యాండ్‌బాల్ కోర్టులో నిర్వహిస్తున్న 6వ తెలంగాణ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ పోటీల్లో భూపాలపల్లి జిల్లా కాటారంకు చెందిన జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. ద్వితీయ, తృతీయ స్థానాల్లో వరంగల్ జిల్లా కొత్తగూడ, కేవీ పికెట్ సికింద్రాబాద్ జట్టు సభ్యులు సత్తా చాటారు. శుక్రవారం జేఎన్ఎస్‌లోని హ్యాండ్‌బాల్ కోర్టులో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి డీవైఎస్‌వో అశోక్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని నేటి ఓటమి రేపటి గెలుపు కోసం నాంది పలుకుతుందన్నారు. హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్యామల పవన్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో తొలి సారిగా హనుమకొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్-15 బాలుర హ్యాండ్‌బాల్ టాలెంట్ హంట్ పోటీల్లో ఉమ్మడి 10 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొనడం జరిగిందన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన 40 మంది క్రీడాకారులను స్పోర్ట్స్ ఎక్సలెన్సీకి ఎంపిక చేసి ప్రత్యేక శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. క్రీడాకారుల మధ్య హోరా హోరీగా జరిగిన పోరులో కాటారం జట్టు ప్రథమ స్థానంలో నిలువగా ద్వితీయ స్థానంలో కొత్తగూడ, తృతీయ స్థానంలో కేంద్రీయ విద్యాలయం పికెట్ సికింద్రాబాద్, నాలుగవ స్థానంలో వరంగల్ జిల్లా పైడిపల్లికి చెందిన జడ్పీహెచ్ఎస్ జట్లు తమ సత్తా చాటాయన్నారు. ఈ కార్యక్రమంలో ఒలంపిక్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరబోయిన కైలాస్ యాదవ్, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్. సాంబశివ రావు, అసోసియేషన్ సభ్యులు ఇంద్రసేనారెడ్డి, పూర్ణచంద్రర్, లక్ష్మణ్ కుమార్, ప్రవీణ్‌కుమార్, పుల్లయ్య, జయంత్‌లతో పాటు టెక్నికల్ అఫీషియల్స్, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌కు ఎంతకాలం ఊడిగం చేస్తారు..

కాజీపేట్ జంక్షన్, ఏప్రిల్ 26: తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకొని అప్పుల పాలు చేసి ప్రజల ఆగ్రహానికి గురై అధికారం కోల్పోయిన కేసీఆర్‌తో బడుగు, బలహీన వర్గాల నాయకులు ఇంకా ఆ పార్టీతో ఎందుకు అంటిపెట్టుకుని ఉంటున్నారని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కూరపాటి వెంకటనారాయణ ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా బస్వరాజు సారయ్య, డాక్టర్ బండా ప్రకాశ్ ఎమ్మెల్సీలు ఇద్దరు ఆ పార్టీకి రాజీనామా చేసి ప్రజలతో మమేకం కావాలని పలువురు కోరుకుంటున్నారని అన్నారు.

ముగ్గురు ఇన్విజిలేటర్ల తొలగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 : ఓపెన్ స్కూల్ పరీక్షల విధుల నుంచి ముగ్గురు ఇన్విజిలేటర్లను తొలగించినట్లు హనుమకొండ డీఈవో డాక్టర్ ఎండి.అబ్దుల్ హై తెలిపారు. వీరితో పాటు కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఒక విద్యార్థిని డిబార్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. శుక్రవారం పరీక్షలు నిర్వహించగా తనిఖీల్లో భాగంగా పరకాల ప్రభుత్వ పాఠశాల పరీక్ష కేంద్రంలో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన విద్యార్థిని డిబార్ చేసినట్లు తెలిపారు. అదే కేంద్రంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇన్విజిలేటర్‌ను విధుల నుంచి తొలగించగా, పరకాల టీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఏ కేంద్రంలో మరో ఇద్దరు ఇన్విజిలేటర్లను విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న కారణంతో విధుల నుంచి తొలగించినట్లు డీఈవో పేర్కొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించండి

▸▸ సీఐటీయూ రాష్ట్ర నాయకుడు తిరుపతయ్య

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 26 : బీజేపీ ప్రభుత్వం దేశంలోని కార్మిక వర్గంపై వ్యతిరేక యుద్ధం చేస్తుందని కొద్ది రోజుల్లో జరుగనున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకుడు జి.తిరుపతయ్య ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో పార్లమెంట్ 'ఎన్నికలు కార్మిక వర్గ కర్తవ్యం' అనే అంశంపై సమావేశం ఏర్పాటు చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొట్ల చక్రపాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తిరుపతయ్య మాట్లాడారు. దేశంలో బీజేపీ కార్మిక వ్యతిరేక విధానాలతో పాటు మత ఘర్షణలకు తెర లేపుతుందని అన్నారు. ఐతే వామపక్ష, లౌకిక శక్తులను బలపర్చాలని, ఇండియా కూటమి అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ మాట్లాడుతూ.. బీజేపీకి ఓట్లు పెరిగినా.. సీట్లు పెరిగినా రాజ్యాంగానికి చాలా ప్రమాదం అన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకులు పుల్ల అశోక్, యాకయ్య, ఎల్లయ్య, ప్రభాకర్, విజేందర్, చిరంజీవి. రాంచందర్, సారయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

నకిలీ వైద్యులపై కేసుల నమోదుకు రంగం సిద్ధం

▸▸ తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ సభ్యుల తనిఖీలు

వరంగల్ మెడికల్, ఏప్రిల్ 26 : తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు నకిలీ వైద్యులపై తనిఖీలు నిర్వహించారు. శుక్రవారంఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ తనిఖీలను నిర్వహించారు. తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ మహేశ్ ఆదేశానుసారం తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ శేషుమాధవ్, డాక్టర్ రవికుమార్, డాక్టర్ నరేశ్ కుమార్, హనుమకొండ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మదన్‌మోహన్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అన్వర్‌మియా, ఉపాధ్యక్షులు డాక్టర్ వెంకటస్వామి, డాక్టర్ అజిత్‌పాషాల సంయుక్త ఆధ్వర్యంలో ఫస్ట్ ఎయిడ్ సెంటర్లు, నకిలీ వైద్యులపై, అనుమతి లేని క్లినిక్‌లపై తనిఖీలు నిర్వహించారు. ఊరుగొండ గ్రామంలోని గాయత్రి ఆస్పత్రిలో నకిలీ వైద్యులు వెంకటాములు, హనుమకొండ రెడ్డికాలనీలోని శ్రీశ్రీ ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నకిలీ వైద్యుడు సీహెచ్.భాస్కర్, శ్రీ వెంకటేశ్వర క్లినిక్‌లో ఫార్మ్ డీ చదివి నకిలీ వైద్యుడి అవతారం ఎత్తిన ఎం.శ్రీనివాస్, ఎ.రాజరాజేశ్వరి క్లినిక్ నకిలీ వైద్యుడు బత్తుల రాజ్‌కుమార్, అంబేద్కర్ సర్కిల్ దగ్గరలోని గాయత్రి క్లినిక్‌లో నకిలీ వైద్యుడు ఏ.లక్షపతి, రాయపురలోని శ్రీ లక్ష్మీ క్లినిక్ వైద్యుడు టి.శ్రీనివాస్, శ్రీ బాలాజీ క్లినిక్ వైద్యుడు ఆర్.శ్రీకాంత్, శ్రీ లక్ష్మీనర్సింహా ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో ప్రవీణ్‌పై ఎన్ఎంసీ చట్ట ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా హనుమకొండ నక్కలగుట్టలోని హెయిర్ క్రియేషన్స్ సెంటర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అనుమతి లేకుండానే అర్హత లేని వారిని డాక్టర్లుగా చూపి స్కూ హెయిర్ ట్రాన్స్ ప్లాంటేషన్, లేసర్ ప్రొసీడర్స్, పీఆర్‌పీ తెరపి చేస్తున్నట్టు గుర్తించామని వీరికి డీఎంహెచ్‌వో ద్వారా నోటీసులు ఇవ్వనున్నట్లు తెలిపారు.



హనుమకొండ ఇందిరానగర్‌లో ఓ క్లినిక్‌లో తనిఖీ చేస్తున్న దృశ్యం

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

▸▸ జనరల్ అబ్జర్వర్ స్వాగత్ రణ్వీర్ చంద్



సమావేశంలో మాట్లాడుతున్న జనరల్ అబ్జర్వర్ స్వాగత్ రణ్వీర్ చంద్

వరంగల్ కలెక్టరేట్, ఏప్రిల్ 26: లోక్‌సభ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ జనరల్ అబ్జర్వర్ బండారి స్వాగత రణ్వీర్ చంద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కలెక్టర్లు, ఎస్పీలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేసి, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట ఏర్పాట్లు చేస్తూ, ఎక్కడా పొరపాట్లు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

వరంగల్ పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి ప్రావీణ్య మాట్లాడుతూ వరంగల్ పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో సిద్ధం చేసిన పటిష్ట ప్రణాళికను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. పాలకుర్తి, స్టేషన్ ఘనపూర్, వరంగల్ పశ్చిమ, పరకాల, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, భూపాలపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లలోని 1908 పోలింగ్ కేంద్రాల సిబ్బంది, ఈవీఎంల మొదటి దశ ర్యాండమైజేషన్, రెవెన్యూ జిల్లాల వారీగా పోలింగ్ సిబ్బందికి రెండవ విడత ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు వివరించారు. గుర్తించిన 247 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో లైవ్‌కాస్టింగ్‌తో పాటు అధిక పోలీసు బలగాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటు నమోదు శాతం పెంచేలా, ఓటు హక్కు వినియోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మే 3వ తేదీ నుంచి హోమ్ ఓటింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ సమన్వయంతో ఎన్నికలకను నిర్వహించేందుకు కృషి చేస్తామన్నారు. పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించడంతోపాటు సమస్యాత్మక ప్రాంతాల్లో చేపడుతున్న చర్యలు, ఎన్‌ఫోర్స్‌మెంట్ వర్క్, జిల్లా భౌగోళిక పరిస్థితులను వివరించారు. సమావేశంలో ఎన్నికల పోలీస్ అబ్జర్వర్ నవీన్ సైనీ, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వ్యయ పరిశీలకులు దిలీబన్, ధీరజ్ సింఘా, భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే, ఏఆర్‌ఓలు అశ్విని తానాజీ వాకడే, కె.శ్రీనివాస్, డి.ఎస్.వెంకన్న, రోహిత్ సింగ్, వెంకటయ్య మంగీలాల్, సిదందత్తు, సంధ్యారాణి, రాధిక గుప్తా, వైవి.గణేష్, డీసీపీలు ఎంఏ.బారి, రవీందర్, సీతారాం, ఏసీపీలు, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో శివాని విద్యార్థుల ప్రభంజనం



కె.పృథ్వీరాజ్ | ఎం.మనోజ్ | జి.హర్విన్ | డి.అఖిల్ | బి.బన్ని

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 : జేఈఈ మెయిన్ 2024 ఫలితాల్లో శివాని విద్యార్థులు మరో సారి విజయదుందుభి మోగించారని కళాశాల కరస్పాండెంట్ టి.స్వామి, ప్రిన్సిపాల్స్ జి.సురేందర్‌రెడ్డి, వి.చంద్రమోహన్ తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు ధీటుగా ఫలితాలు సాధించడం శివాని విద్యార్థులకే సాధ్యమన్నారు. కె.పృథ్వీరాజ్ 316వ ర్యాంక్, ఎం.మనోజ్ 756, డి.అఖిల్ 1719, బి.బన్ని 2570, జి.హర్విన్ 3084, బి.ప్రవీణ్ 3912, సిహెచ్.అభిషేక్ నాయక్ 7122, జే.యాకేష్ 7238, బి.రాజు 7672 ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. వీరితోపాటు అనేక మంది విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి మరోమారు కళాశాల పేరు ప్రఖ్యాతలు చాటినట్లు పేర్కొన్నారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను డైరెక్టర్లు టి.రాజు, ఎన్.రమేశ్, ఏ.మురళీధర్, వి.సురేశ్, ఎస్.సంతోష్‌రెడ్డి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో పారిశుధ్య కార్మికుడి మృతి

▸▸ ఢీకొట్టి వెళ్లిన గుర్తు తెలియని వాహనం



దేవయ్య మృతదేహం

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 26 : రోడ్డు ప్రమాదంలో ఓ పారిశుధ్య కార్మికుడు మృతి చెందిన సంఘటన కాజీపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న కొమ్ము దేవయ్య(60)ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, కాజీపేట పోలీసులు తెలిపిన ప్రకారం.. సిర్పూర్ కాగజ్‌నగర్‌కు చెందిన కొమ్ము దేవయ్య 30 ఏళ్ల క్రితం కాజీపేటకు చెందిన మహిళను వివాహం చేసుకుని రహమత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. 20 ఏళ్లుగా వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్‌లో శానిటేషన్ వర్కర్‌గా పనిచేస్తున్నాడు. పదేళ్లుగా కాజీపేట మెయిన్ రోడ్డుకు జవాన్ హోదాలో విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా, రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం సుమారు 5 గంటలకు విధులకు హాజరై సిబ్బంది నుంచి హాజరు తీసుకుని పనులకు పురమాయించారు. సుమారు 5.30 గంటలకు కాజీపేట పోలీసు స్టేషన్ వెనక మెయిన్‌రోడ్డుపై సిబ్బందితో చెత్తను శుభ్రం చేసే పనిలో నిమగ్నమయ్యాడు. రోడ్డు పక్కనే నిలబడి పనులు చేయిస్తున్నాడు. ఈ క్రమంలో హైదరాబాద్ నుంచి హనుమకొండకు వస్తున్న గుర్తు తెలియని కారు రోడ్డు పక్కన నిలబడి ఉన్న దేవయ్యను వెనుక నుంచి బలంగా ఢీకొట్టి వెళ్లిపోయింది. దీంతో కింద పడిపోవడంతో తలకు బలమైన దెబ్బ తగిలింది. అక్కడికక్కడే మృతిచెందాడు. పారిశుధ్య సిబ్బంది గమనించి అక్కడికి చేరుకుని 108కు సమాచారం అందించగా దేవయ్యను చూసిన సిబ్బంది మృతి చెందినట్టు నిర్ధారించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ఎంజీఎంకు తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా, ప్రమాద ఘటనపై మృతుడి కుమారుడు అనుదీప్ కాజీపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు ఢీకొట్టిన కారు కోసం సీసీ కెమెరాల్లో వెతుకుతున్నట్టు వెల్లడించారు.

మృతుడి కుటుంబాన్ని కలిసిన సీఎంహెచ్‌వో

జవాన్ మృతి వార్త తెలుసుకున్న గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్ మున్సిపల్ సిబ్బందితో పాటు కార్మిక సంఘాలతో కలిసి ఎంజీఎం పోస్టుమార్టం వద్దకు చేరుకున్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని బెనిఫిట్స్ త్వరగా వచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు. దహన సంస్కారాల కోసం ముందస్తుగా మృతుడి కుటుంబ సభ్యులకు రూ.20వేల ఆర్థిక సహాయం అందించారు. కాగా, పారిశుధ్య కార్మికులు ప్రమాదాల్లో, సహజంగా మృతి చెందితే పట్టించుకునే వారే లేరని కార్మిక సంఘాలు ఎంజీఎం వద్ద నిరసనకు దిగారు. అంతే కాకుండా విధుల్లో ఉండి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దేవయ్య కుటుంబానికి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని మునిసిపల్ కమిషనర్‌ను కార్మిక, కుల సంఘాలు కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ అమలులో ఉందని గతంలో ఎలా ఉందో అదే పద్ధతిని ప్రస్తుతం పాటించడం జరుగుతుందని చెప్పారు. ఎన్నికలు ముగిసిన తర్వాత కౌన్సిల్ తీర్మానంలో పారిశుధ్య కార్మికులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తానని చెప్పడంలో సంఘాల నాయకులు వెనుదిరిగారు.

కాంగ్రెస్‌లో చేరిన కేయూ విద్యార్థి జేఏసీ నేతలు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 26 : కాకతీయ యూనివర్సిటీ విద్యార్థి జేఏసీ నేతలు రాష్ట్ర కాంగ్రెస్ చేరిక కమిటీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తూర్పు జయప్రకాశ్‌రెడ్డి సమక్షంలో హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. జయప్రకాశ్‌రెడ్డి కేయూ జేఏసీ నేతలకు పార్టీ కండువా కప్పి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కేయూ విద్యార్థి నేతలు వినోద్‌లోక్ నాయక్, డాక్టర్ దేవోజీ నాయక్, కేయూ జేఏసీ వైస్ చైర్మన్ డాక్టర్ మేడారపు సుధాకర్, కేయూ విద్యార్థి నేతలు తాళ్లపల్లి నరేశ్‌గౌడ్, భూక్య రమేశ్, మాలోతు వెంకన్న, గిరిజన రాష్ట్ర నేతలు అజ్మీరా వెంకట్, బానోత్ సునిల్, తిరుపతి, భూక్య రవి రాథోడ్ తదితరులు ఉన్నారు.

హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్ చాంపియన్స్‌గా కాకతీయాస్ జట్టు

వరంగల్ స్పోర్ట్స్, ఏప్రిల్ 26 : తెలంగాణ హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన 1వ తెలంగాణ రాష్ట్ర స్థాయి ఓపెన్ టూ ఆల్ హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్-2024 పోటీలలో వరంగల్ జిల్లాకు చెందిన కాకతీయస్ జట్టు చాంపియన్‌షిప్ సాధించింది. గత 3 రోజులుగా మంచిర్యాల జిల్లా నస్పూర్ కాలనీలోని సాధన ఎక్సలెన్సియో పాఠశాలలో నిర్వహించిన హ్యాండ్‌బాల్ ప్రీమియర్ లీగ్ పోటీలలో జిల్లాకు చెందిన కాకతీయస్ జట్టు పాల్గొని అత్యుత్తమ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నట్లు హ్యాండ్‌బాల్ టోర్నమెంట్ కన్వీనర్, కోచ్ విష్ణు తెలిపారు. ఈ మేరకు చాంపియన్‌షిప్ సాధించిన కాకతీయస్ జట్టు సభ్యులను అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థినులను సత్కరించిన కడియం



విద్యార్థినులను సత్కరిస్తున్న కడియం శ్రీహరి, కావ్య

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 : ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే కడియం శ్రీహరి సత్కరించారు. శుక్రవారం హనుమకొండలోని ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసిన ధర్మసాగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థినులు గొల్ల రిషిక, పుల్ల సాత్విక, మనోజ్ఞ, అరూరి సౌమ్య తదితరులను అయనతో పాటు కడియం కావ్య శాలువాతో సత్కరించి మంచి ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని చదువాలని ఆశీర్వదించారు. కాగా, గొల్ల రిషిక ఎంపీసీ ఫస్టియర్‌లో 466 మార్కులు సాధించగా, మనోజ్ఞ 461, బైపీసీలో పుల్ల సాత్విక 437, అరూరి సౌమ్య 423 మార్కులు సాధించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

▸▸ కెనరా బ్యాంకు డిప్యూటీ మేనేజర్ అభినవ్ గుప్తా

నయీంనగర్, ఏప్రిల్ 26: ఎంబీఏ విద్యార్థులు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కెనరా బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ అభినవ్ గుప్తా అన్నారు. హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో మంత్ర-2కే24 పేరిట జాతీయస్థాయి ఎంబీఏ విద్యార్థుల సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కెనరా బ్యాంక్ డిప్యూటీ మేనేజర్ అభినవ్ గుప్తా హాజరై మాట్లాడారు. ఎంబీఏ చదివిన విద్యార్థులంతా దేశ అభివృద్ధికి దోహదపడాలని ఆయన కోరారు. వాగ్దేవి కళాశాలల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ సీ.హెచ్.దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఈ జాతీయ స్థాయి సదస్సుకు తెలంగాణతోపాటు, ఇతర రాష్ట్రాలలోని వివిధ ఎంబీఏ కళాశాలల నుంచి 300 మందికి పైగా విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. సదస్సులో వివిధ మేనేజ్‌మెంట్ రంగాలైన యంగ్ మేనేజర్ అవార్డు, ఫైనాన్స్, హెచ్ఆర్, మార్కెటింగ్, మేనేజ్‌మెంట్ క్విజ్, ట్రెజర్ హంట్ వంటి వాటిల్లో విద్యార్థులు పోటీ పడినట్లు ఆయన తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను, అవార్డులను అందజేశారు. అనంతరం అభినవ్‌గుప్తాను వాగ్దేవి కళాశాలల యాజమాన్యం సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాగ్దేవి కళాశాలల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సీ.హెచ్.వాహినీదేవి, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.శేషాచలం, మంత్ర-2కే24 కన్వీనర్ డాక్టర్ పీ.సుగుణాకర్‌రెడ్డి, అధ్యాపకులు, వివిధ కళాశాలల ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు.

శిక్షణ కాలంలో అంకితభావంతో పనిచేసిన శ్రద్ధా శుక్లా

▸▸ కలెక్టర్ సిక్తా పట్నాయక్




ట్రైనీ కలెక్టర్ శ్రద్ధా శుక్లాను శాలువాతో సన్మానిస్తున్న కలెక్టర్, అదనపు కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, ఏప్రిల్ 26 ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా భవిష్యత్‌లో మంచి అధికారిగా గుర్తింపుపొందాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. హనుమకొండ జిల్లా ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా శిక్షణకాలం పూర్తి కావడంతో కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో శ్రద్ధా శుక్లాకు శుక్రవారం రాత్రి వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సిక్తా పట్నాయక్, అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ఇతర అధికారులు శ్రద్ధా శుక్లాకు బొకేలు, జ్ఞాపికలు అందించి శాలువా కప్పి సన్మానించారు. అనంతరం కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ ట్రెయినీ కలెక్టర్‌గా శ్రద్ధా శుక్లా తన శిక్షణకాలంలో అంతకితభావంతో పని చేశారన్నారు. అన్ని శాఖల అధికారులతో కలిసి మెలిసి పనిచేసి వారి నుంచి అయా శాఖల వివరాలను క్షుణ్ణంగా తెలుసుకున్నారన్నారు. తనకు అప్పగించిన ప్రతీ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించారన్నారు. ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ తన శిక్షణ కాలంలో జిల్లా కలెక్టర్‌తోపాటు అన్ని శాఖల అధికారుల సహకారం మరువలేనిదన్నారు. శిక్షణలో తెలుసుకున్న అంశాలు తనకెంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్ రెడ్డి, డీఆర్‌వో వైవీ గణేష్ పాల్గొన్నారు.

భవిత శ్రీ చిట్‌ఫండ్‌పై కేసు

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 26 : భవిత శ్రీ చిట్‌ఫండ్‌పై హనుమకొండ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.... పరకాలకు చెందిన వి.మాధవి తన ఇద్దరు కుమార్తెల పెళ్లిల కోసం 2018లో రూ.50 లక్షల చిట్టి వేసింది. పూర్తి డబ్బులు చెల్లించడంతో పాటు 2021లో చిట్టి పూర్తైంది. ఐనప్పటికీ డబ్బులు ఇవ్వకపోవడమే కాకుండా డబ్బులు అడిగితే బెదిరిస్తున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా చిట్‌ఫండ్ మేనేజ్‌మెంట్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

బోడ గుట్టపై రామాలయం నిర్మాణానికి భూమి పూజ



ఒంటిమామిడిపల్లిలో ఆలయ భూమి పూజలో పాల్గొన్న గ్రామ పురప్రముఖులు

ఐనవోలు, ఏప్రిల్ 26 : మండలంలోని ఒంటిమామిడిపల్లి శివారు బొడగుట్టపై సీతారామాలయం నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామస్థులు, దాతల భాగస్వామ్యంతో సుమారు రూ.1.50 కోట్లతో ఆలయ నిర్మాణం పూర్తిచేయనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. గ్రామ పురప్రముఖులు పాల్గొన్నారు.

వెంకటాపురంలో..

వెంకటాపురం గ్రామ శివారులో నూతనంగా నిర్మించనున్న సీతారామాలయం నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామస్థులు, దాతల సహకారంతో సుమారు రూ.50 లక్షల అంచనతో ఆలయ నిర్మాణం చేపట్టనున్నట్లు ఆలయ నిర్మాణ కమిటీ అధ్యక్షుడు దామెరగిద్దె నేతాజీ తెలిపారు. గ్రామ పురప్రముఖులు పాల్గొన్నారు.

ఘోలకం అనే మసాలా పెరుగు

మస్తునారహితం గాల్యం దధి శుభ్రతరే పటే!
జీర సైంధవం సమ్మిశ్రం ఘోలం ఘనతరం స్మృతమ్!

క్షేమశర్మ తన 'క్షేమకుతూహలం'లో మసాలాలు కలిపిన పెరుగు గురించి చక్కని వివరణ ఇచ్చాడు. చాలా పాల ఫ్యాక్టరీలవాళ్లు మసాలా మజ్జిగ ప్యాకెట్లు తయారు చేసి అమ్ముతుంటారు. ప్లాస్టిక్ కవర్లలో నిల్వ ఉంచి, ఫ్రిజ్‌లో పెట్టిన ఈ మజ్జిగని మనం దాహార్తి తీరటం కోసం వాడుకోక తప్పడంలేదు. అయితే ఇంట్లో ఆరోగ్యదాయకంగా మసాలా పెరుగు తయారు చేసుకుని తగిన రీతిలో వాడుకోవటం అన్నిటికంటే ఉత్తమ మార్గం. ప్లాస్టిక్ కంటైనర్లలోని ఆహార పదార్థాలు తినడంవల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని వైద్యులు చెబుతున్నారు. కానీ రక్తం నుంచి దగ్గు మందుల దాకా దాదాపు అన్నిటినీ ప్లాస్టిక్ కంటైనర్లలోనే నిల్వ చేస్తున్నారు. ఇక పాలు, పెరుగుల గురించి పట్టించుకొనేదెవరు? కనుక ఉన్నంతలో మనమే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవాలి. ప్యాకెట్లలో నిల్వ ఉంచే పెరుగుకు బదులుగా ఇంట్లో కుండలోనో, గిన్నెలోనో పెరుగు తోడుపెట్టుకుని వాడుకోవటం ఉత్తమం.



'వస్త్రే దృఢతరం బద్ధం దధి దుగ్ధేన గాలితమ్!
హింగునా ధూపితే పాత్రే స్థాపితే సైంధవాన్వితమ్'...
ఈ సూత్రంలో ఘోలకాన్ని తయారుచేసుకొనే మరో పద్ధతి చెబున్నాడు క్షేమశర్మ. పైన చెప్పినట్టు పెరుగును వస్త్రగాయితం పట్టి, అందులో సమానంగా పాలు కలిపి, బాగా చిలకండి. ఓ చిన్న ప్రమిదలో మండుతున్న బొగ్గు తీసుకుని, దాని మీద ఇంగువ పొడి చల్లి, మంచి కుండను ఆ నిప్పు మీద బోర్లించండి. కుండ లోపలంతా ఇంగువ పొగపట్టుకుంటుంది. ఆ కుండలో ఉంచిన పెరుగుకు ఇంగువ పరిమళం బాగా అంటుకుంటుంది. బొగ్గు దొరకకపోతే మరో ఉపాయం ఉంది. రెండు లేదా మూడు చెంచాల నెయ్యి ఆ కుండలోకి తీసుకుని, పొయ్యి మీద పెట్టి, అందులో ఇంగువ వేసి, పొంగించి ఆ నేతిని కుండ లోపలంతా పట్టించండి. ఇప్పుడు అందులో పెరుగు, పాల మిశ్రమాన్ని వేసి, చిలికి అందులో తగినంత సైంధవ లవణం కలపండి. ఇది అప్పటికప్పుడు తాగటానికి అనుకూలంగా ఉంటుంది. ఇంగువ పరిమళం ఇష్టపడేవారే ఇలా చేయండి. వద్దనుకునేవారు ఇంగువ గురించిన అంశాన్ని వదిలేసి, ఘోలకం తయారు చేసుకోండి. వాతాన్ని హరించటానికీ పాలు, పెరుగు విశ్రమం బాగా తోడ్పడుతుంది. బలాన్నిస్తుంది. వేడిని తగ్గిస్తుంది. రక్తస్రావం అవుతున్నవారికి, బీపీ వ్యాధితో బాధపడేవారికి ఇది అనుకూలం. అల్సర్లను తగ్గిస్తుంది. పేగు పూతవల్ల కలిగే నొప్పిని హరిస్తుంది.

పాలను రెండుమూడు పొంగులు వచ్చేంతగా మరిగించి తోడుపెడితే గట్టిగా తోడుకొంటుంది. ఈ పెరుగు మీద మీగడ తీసేయండి. దాన్ని ఒక తెల్లని వస్త్రంలో వేసి మూటగట్టి లోపల ఉండే నీరు మొత్తం వడగట్టేయండి. ఇందులో జీలకర్రపొడి, సైంధవ లవణం తగినంత కలిపితే 'ఘోలకం' అంటారు ఈ పెరుగుని. దీన్ని ఓ కప్పులో వేసుకుని చెంచాతో తింటే కమ్మగా ఉంటుంది. ఇందులో కొద్దిగా అన్నం కలిపి తింటే ఉదయంపూట మంచి ఉపాహారం. టిఫిన్లు మానేయాలనుకునే వారికి ఇది మంచి ప్రత్యామ్నాయం. రాగి ముద్దతో గానీ, జొన్నరవ్వ ఉప్మాతో గానీ దీన్ని కలిపి తీసుకుంటే ఎంతో రుచిగా ఉంటుంది. షుగరు రోగులకు మంచిది. ఇది వాతాన్ని నాశనం చేస్తుందని, విరేచనాలను ఆపుతుందని, జఠరాగ్ని పెంచి, జీర్ణశక్తిని బలపరుస్తుందని, సంపూర్ణాహారంగా తోడ్పడుతుందని, జీర్ణాశయ వ్యవస్థని బలసంపన్నం చేస్తుందనీ క్షేమశర్మ పేర్కొన్నాడు.

ఘోలకం తయారీకి 'ఆవు పాలకన్నా గేదె పాలే ఉత్తమం' అన్నాడు క్షేమశర్మ. చిక్కదనానికి గేదెపాలు పెట్టింది పేరు కదా! ఒక గ్లాసుడు గట్టి పెరుగును ఓ కుండలోకి తీసుకుని, నాలుగు గ్లాసుల నీళ్లు కలపండి. అందులో తగినంత ఇంగువ పొడి, జీలకర్ర పొడి, ఉప్పు, నల్ల ఆవాల పొడి తగినంత కలిపి, బాగా చిలికిన మజ్జిగ చాలా రుచిగా ఉంటుంది. 'ఇలాంటి మజ్జిగను ఇష్టపడని వారెవరుంటారో చెప్పండి'... అంటాడు క్షేమశర్మ.

పేగుల్ని అన్ని విధాలా కాపాడటమే ఈ మజ్జిగ లక్ష్యం. జీర్ణశక్తిని పెంచుతుంది. గ్యాసు, అల్సర్లు, అమీబియాసిస్ వ్యాధుల్లో ఇది దివ్యౌషధం. ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్ ఉన్నవాళ్లు రాత్రే దీన్ని తయారు చేసుకుని మూత పెట్టి, బయటే ఉంచి ఉదయాన్నే తాగితే గొప్పగా పని చేస్తుంది. కాల విరేచనం అవుతుంది.

మసాలాలంటే అల్లం వెల్లుల్లి మాత్రమేననే దురభిప్రాయం చాలామందిలో ఉంది. మితిమీరిన అల్లం, వెల్లుల్లి తెలుగువారికి శాపంలాంటి ఒక చెడ్డ అలవాటు. అల్లం వెల్లుల్లి గురించి హెచ్చరించబోతే, అల్లం ఉపయోగాన్ని, వెల్లుల్లి గొప్పదనాన్ని కొందరు ఉపన్యసిస్తూ ఉంటారు. నిజమే ఆ రెండూ గొప్ప ఔషధ ద్రవ్యాలే! కానీ, ఏ ఔషధానికైనా ఒక మోతాదు ఉంటుంది. బలం ఇస్తుంది కదా అని డజన్ మాత్రలు ఒకేసారి మింగేస్తే వికటిస్తుంది కదా. అల్లం, వెల్లుల్లి అతివాడకం కూడా అలాగే వికటిస్తుందని మనం గమనించాలి.

అల్సర్లున్నవారైనా వాడదగిన మసాలా ద్రవ్యాలు జీలకర్ర, ధనియాలు, యాలకులు, గసగసాలు, మెంతులు, ఆవాలు... ఇలాంటివి. జాజికాయ జాపత్రి, పచ్చకర్పూరం లాంటివి ఎంతో మేలు చేసే ద్రవ్యాలు. వీటిని సద్వినియోగపరచుకోవటం మీద దృష్టి పెట్టాలి.

బ్లాక్ సాల్ట్ పేరుతో ఒక విధమైన వాసన ఉన్న ఉప్పు దొరుకుతుంది. గ్లాసుడు ఘోలకం మజ్జిగలో చిటికెడంత నల్ల ఉప్పు కలిపితే... ఈ మసాలా మజ్జిగ రుచే వేరు! వేసవి కాలం ఇలాంటి ఉపాయాలు పాటిస్తే సత్ఫలితాలు ఉంటాయి.

• గంగరాజు అరుణాదేవి



వెజ్‌లో పనీర్‌కు ఉండే గిరాకీనే వేరు. మెత్తని పనీర్ ముక్కలతో చేసిన డిష్‌లను తినటానికి నాన్‌వెజ్ ప్రియులూ ఇష్టపడతారు. పనీర్ కట్‌లెట్, పనీర్ మెజిస్టిక్, పనీర్ టిక్కా లాంటి వంటలను సులువుగా చేసుకోండిలా...



పనీర్‌తో పసందుగా

పనీర్ టిక్కా

కావాల్సిన పదార్థాలు

పనీర్ క్యూబ్స్- 6, పెరుగు- అరకప్పు, పసుపు- అరటీస్పూన్, కారం పొడి- 1 టీస్పూన్, ధనియాల పొడి- అర టీస్పూన్, జీలకర్ర పొడి- పావు టీస్పూన్, గరం మసాలా- అర టీస్పూన్, కసూరీ మేతీ- అర టీస్పూన్, చాట్ మసాలా- అర టీస్పూన్, జింజర్, గార్లిక్ పేస్ట్- టీస్పూన్, శనగపిండి- 2 టీస్పూన్లు, నిమ్మకాయ రసం- టేబుల్ స్పూన్, చతురస్రాకార ఆనియన్ పెటల్స్- 8, రెడ్ క్యాప్సికమ్ క్యూబ్స్- 8, గ్రీన్ క్యాప్సికమ్ క్యూబ్స్- 8, నూనె- టీస్పూన్

తయారీ విధానం



బౌల్‌లో పెరుగుతో పాటు పసుపు, కారం పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి, గరం మసాలా, కసూరీ మేతీ, చాట్ మసాలా, జింజర్-గార్లిక్ పేస్ట్, శనగపిండి వేశాక నిమ్మకాయ రసం కలపాలి. చివరలో తగినంత ఉప్పువేసి స్పూన్‌తో మిశ్రమాన్నంతా బాగా కలపాలి. ఎర్రటి పేస్ట్‌లా వస్తుంది. ఇందులోకి పనీర్, ఆనియన్ పెటల్స్ క్యాప్సికమ్ క్యూబ్స్ వేశాక నూనె కలపాలి. స్పూన్‌తో మిశ్రమాన్ని కలపాలి. దీని వల్ల పనీర్ ముక్కలకు బాగా పడుతుంది. దీన్ని ముప్పావు గంట మారినేట్ చేసుకోవాలి. ఆ తర్వాత టిక్కా స్టిక్స్ తీసుకుని ఆనియన్, రెడ్ క్యాప్సికమ్, గ్రీన్ క్యాప్సికమ్ క్యూబ్స్ తర్వాత పనీర్ క్యూబ్ గుచ్చాలి. ఆ తర్వాత మళ్లీ అదే వరుసలో స్టిక్‌కు గుచ్చాలి.

టిక్కా ప్యాన్‌మీద బ్రష్‌తో నూనె పూసి ఈ స్టిక్స్‌ను ఉంచి గ్రిల్ చేసుకోవాలి. అన్నివైపులా కాల్చుకోవాలి. పనీర్ టిక్కా రెడీ. పుదీనా లేదా కొత్తిమీర చట్నీతో తింటే రుచిగా ఉంటాయి.

పనీర్ మెజిస్టిక్

కావాల్సిన పదార్థాలు : పొడవుగా కట్ చేసిన పనీర్ ముక్కలు- పావు కేజీ, కార్న్‌ఫ్లోర్- రెండున్నర టేబుల్ స్పూన్లు, మైదా- రెండున్నర టేబుల్ స్పూన్లు, ఉప్పు- తగినంత, అల్లం, వెల్లుల్లిపేస్ట్- ఒకటిన్నర టేబుల్ స్పూన్, పసుపు- తగినంత, నూనె- మూడున్నర టేబుల్ స్పూన్లు, జీలకర్ర- ముప్పావు టీస్పూన్, సన్నగా తరిగిన వెల్లుల్లి మిశ్రమం- ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, జీడిపప్పు- 15, ఎండు మిరపకాయలు- 2, తరిగిన ఉల్లిపాయ ముక్కలు- రెండున్నర టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి- 3 (సన్నగా తరగాలి), క్యాప్సికమ్- 1 (సన్నగా పొడవుగా కట్ చేసుకోవాలి), కారం పొడి- తగినంత, గరం మసాలా- ముప్పావు టీస్పూన్, ధనియాల పొడి- ముప్పావు టీస్పూన్, జీలకర్ర పొడి- ముప్పావు టీస్పూన్, కరివేపాకులు- 10, పెరుగు- ముప్పావు కప్పు, పుదీనా- టేబుల్ స్పూన్

తయారీ విధానం : బౌల్‌లో కార్న్‌ఫ్లోర్, మైదా, ఉప్పు, అల్లం- వెల్లుల్లి పేస్ట్, పసుపు వేసి తగినన్ని నీళ్లు పోసి మెత్తటి పేస్ట్‌లా చేసుకోవాలి. మరీ గట్టిగా కాకుండా మరీ జావగా కాకుండా మిర్చిబజ్జీలకోసం శనగపిండి కలిపినట్లు కలపాలి. ఈ కార్న్‌ఫ్లోర్ మిశ్రమంలో పనీర్ ముక్కలను ముంచి నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి.

మరో ప్యాన్‌లో మూడు స్పూన్ల నూనె వేసి అందులో జీలకర్ర, జీడిపప్పు, ఎండిన మిరపకాయలు, తరిగిన ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు వేసి ఉల్లిపాయల రంగు మారేంత వరకూ గరిటెతో కదుపుతూ వేయించాలి. ఆ తర్వాత కారంపొడి, గరం మసాలా, తగినంత ఉప్పుతో పాటు పసుపు, ధనియాల పొడి, జీలకర్ర పొడి వేసి బాగా కలపాలి. ఆ తర్వాత కరివేపాకు, పెరుగు వేసి మూడు నిముషాల పాటు కలపాలి. పుదీనా వేసి రెండు నిముషాలు కలిపిన తర్వాత వేయించి పక్కనబెట్టుకున్న పనీర్ ముక్కలు వేసి.. వీటికి మిశ్రమం పట్టేట్లు బాగా కలపాలి. పనీర్ మెజిస్టిక్ రెడీ.



పనీర్ కట్‌లెట్

కావాల్సిన పదార్థాలు: తురిమిన పనీర్ మిశ్రమం- 2 కప్పులు, ఉడికించిన బంగాళాదుంపలు- 2, ఉల్లిపాయ ముక్కలు- 2 టేబుల్ స్పూన్లు, తురివిన క్యారెట్- అర కప్పు, కొత్తిమీర- 2 టేబుల్ స్పూన్లు, పచ్చిమిర్చి-1 (సన్నగా తరగాలి), అల్లం పేస్ట్- అర టీస్పూన్, కారం పొడి- అర టీస్పూన్, ఆమ్‌చూర్- అర టీస్పూన్, గరం మసాలా- అరటీస్పూన్, ఉప్పు- తగినంత, కార్న్‌ఫ్లోర్- ముప్పావు కప్పు, మైదా- 2 టేబుల్ స్పూన్లు, పెప్పర్- పావు టీస్పూన్, ఎండిన బ్రెడ్ ముక్కలు- 2, నూనె- ఫ్రైకి తగినంత



తయారీ విధానం : బౌల్‌లో పనీర్‌తో పాటు తొక్కతీసి పెట్టుకున్న బంగాళ దుంపలను మెత్తగా పిసికి వేయాలి. ఇందులోనే ఉల్లిపాయ ముక్కలు, క్యారెట్, కొత్తమీర, పచ్చిమిర్చి, అల్లం పేస్ట్, కారం పొడి, ఆమ్‌చూర్, గరం మసాలా, రెండు టేబుల్ స్పూన్ల కార్న్‌ఫ్లోర్‌తో పాటు తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. చపాతీ ముద్దలా మెత్తగా చేసుకోవాలి.

మరొక బౌల్‌లో మిగిలిన కార్న్‌ఫ్లోర్, మైదా వేశాక పెప్పర్‌ను నలగ్గొట్టి వేసి కొద్దిగా ఉప్పువేసి అరకప్పు నీళ్లు వేసి స్పూన్‌తో బాగా మిక్స్ చేయాలి. ఉండలు లేకుండా చూసుకోవాలి. ఆ తర్వాత మరో బౌల్‌లో బ్రెడ్ ముక్కలను చేత్తో పిసికి పొడిలా చేసుకోవాలి. ఆ తర్వాత పనీర్ ముద్దను చిన్న ఉండలుగా తీసుకుని పెద్ద బిస్కెట్ అంత సైజులో గుండ్రంగా చేసుకోవాలి. దీన్ని మైదా పిండిలో బాగా ముంచి బ్రెడ్ ముక్కల్లో వేయాలి. బ్రెడ్ ముక్కలు దీనికి అంటుకుంటాయి. ఈ పనీర్ కట్‌లెట్స్‌ను రెండు వైపులా రంగు మారేంత వరకూ కాల్చుకోవాలి. ఈ పనీర్ కట్‌లెట్స్‌ను వేడివేడిగా పుదీనా చట్నీతో లేదా టమోటా కెచప్‌తో తింటే రుచిగా ఉంటాయి.

జిడ్డు చర్మం అయితేనేం?



పెద్ద చర్మ రంధ్రాలు, మెరుస్తూ ఉండే టి జోన్, జిడ్డు కారే ముఖం. ఇవి మీ సమస్యలా? అయితే జిడ్డు చర్మానికి తగిన మేకప్ వేసుకుని, అందాల బొమ్మలా వెలిగిపోండి. ఆయిల్ ఫ్రీ మేకప్ ఎలా వేసుకోవాలంటే...

మాయిశ్చరైజర్: లైట్ వెయిట్ మాయిశ్చరైజర్ ఎంచుకోవాలి. చర్మం మీదున్న జిడ్డును తగ్గించి, అప్లై చేసిన తర్వాత చర్మంలో చక్కగా ఇంకిపోయి, చర్మాన్ని మృదువుగా మార్చేసే లైట్ వెయిట్ మాయిశ్చరైజర్‌ను మాత్రమే వాడుకోవాలి. దీంతో తర్వాత అప్లై చేసే మేకప్ ఉత్పత్తులన్నీ చర్మం మీద ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా నిలిచి ఉంటాయి.

ప్రైమర్: ఎత్తుపల్లాలు లేకుండా బేస్‌ను సమంగా మలిచి, మేకప్‌కు అనువుగా మార్చే సాధనం ప్రైమర్. ప్రైమర్‌లోని ఆయిల్ ఫ్రీ ఫార్ములా చర్మ రంధ్రాలు, మచ్చలు, డాగులు కనిపించకుండా చేస్తుంది.

మ్యాట్ ఫార్ములా: ముఖం మీది జిడ్డుతో కలిసిపోయి మరింత జిడ్డుగా మారే ఫౌండేషన్‌కు బదులుగా మ్యాట్ ఫార్ములా కలిగి ఉండే ఫౌండేషన్‌ను ఎంచుకోవాలి. దీంతో ప్రైమర్ వేసినా కనిపిస్తూ ఉండే మచ్చలు, డాగులు మటుమాయమవుతాయి.

మేకప్ పలుచగా: ఫౌండేషన్, కన్‌సీలర్లతో మందపాటి మేకప్‌కు బదులుగా వీలైనంత పలుచగా మేకప్ అద్దుకోవాలి. అవసరమైతేనే రీఅప్లై చేయాలి. వెట్ బ్యూటీ స్పాంజ్‌తో మేకప్‌ను బ్లెండ్ చేసుకోవాలి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో
ఆసక్తికర కథనాల కోసం...
ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్
https://ejyothy.com/ryFJQHQలో
చదవండి.

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్‌ఎల్
https://ejyothy.com/OLrr4Wrలో
చదవండి.

నవ్య | చిత్రజ్యోతి

వినోదాన్ని పంచే పరదా



'సినిమా బండి' చిత్రంతో దర్శకుడిగా ప్రశంసలు అందుకున్నారు ప్రవీణ్ కాండ్రేగుల. ఆయన దర్శకత్వంలో అనుపమా పరమేశ్వరన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'పరదా'. విజయ్ డొంకాడ, శ్రీనివాసులు పీవీ, శ్రీధర్ మక్కువ నిర్మాతలు. శనివారం ఫస్ట్‌లుక్, కాన్సెప్ట్ వీడియోను సమంత, దర్శక ద్వయం రాజ్ అండ్ డీకే చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ లుక్‌లో ముఖంపై పరదాతో ఉన్న మహిళల మధ్యన అనుపమ నిరాసక్తంగా చూస్తూ కనిపించారు. దర్శకుడు మాట్లాడుతూ 'ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌లో చిత్రీకరణ జరిగింది. వచ్చే నెల్లో హైదరాబాద్ షెడ్యూల్‌తో చిత్రీకరణ పూర్తవుతుంది. 'పరదా'తో ప్రేక్షకులకు వినోదాన్ని పంచడంతో పాటు మంచి సందేశం అందిస్తాం' అని చెప్పారు. ఇదొక కథ మాత్రమే కాదు ప్రేక్షకులను మరో ప్రపంచంలోకి తీసుకెళ్లే ప్రయాణం కూడా అని నిర్మాతలు అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: గోపీ సుందర్. సినిమాటోగ్రఫీ: మృదుల్ సుజిత్ సేన్

ఆటకట్టించే ఐపీఎస్



ఆర్కే సాగర్ కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'ది 100'. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వంలో రమేశ్ కరుటూరి, వెంకీ పూశడపు, జే తారక్‌రామ్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ చిత్రం టీజర్‌ను మెగా మదర్ కొణిదెల అంజనాదేవి చేతుల మీదుగా విడుదల చేశారు. నేరస్తుల ఆటకట్టించే ఐపీఎస్ అధికారి విక్రాంత్‌గా టీజర్‌లో ఆర్కే సాగర్ ఆకట్టుకున్నారు. ఈ చిత్రంలో మిషా నారంగ్ కథానాయిక. ధన్య బాలకృష్ణ కీలకపాత్ర పోషిస్తున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శ్యామ్ కే నాయుడు.

కల్కి సినిమాతో ప్రారంభం



హైదరాబాద్‌లో తొలి స్టూడియోగా సారథి స్టూడియోకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. కాలానికి తగినట్లుగా మారుతూ ఆధునాతన టెక్నాలజీతో, అన్ని రకాల హంగులతో ఈ స్టూడియోను తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల్లోనే అధునాతమైన డాల్బీ విక్సింగ్ స్టూడియోను ప్రముఖ సంగీత దర్శకుడు కీరవాణి, సౌండ్ డిజైన్ స్టూడియోను మరో సంగీత దర్శకుడు శేఖర్‌చంద్ర శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టూడియో ఛైర్మన్ ఎం.ఎస్.ఆర్.వి. ప్రసాద్ మాట్లాడుతూ 'మొదట ఈ స్టూడియోను మల్టీప్లెక్స్ థియేటర్స్‌గా మార్చాలని ఆలోచించాం. కానీ తర్వాత ఆ ఆలోచన విరమించుకుని నేటి కాలంతో పోటీ పడే విధంగా పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌కు కావాల్సిన అధునాతన టెక్నాలజీని అందుబాటులోకి తెచ్చాం. ప్రభాస్‌గారు నటించిన 'కల్కి' సినిమాతో మా డాల్బీ మిక్సింగ్ థియేటర్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉంది' అన్నారు. 'మా స్టూడియోలో షూటింగ్ ప్రారంభిస్తే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌తో సహా తొలి కాపీని సిద్ధం చేసే సదుపాయాలన్నీ ఉన్నాయి' అని స్టూడియో డైరెక్టర్ కె.వి.రావు చెప్పారు. ఈ కార్యక్రమంలో నిర్మాతలు కె.ఎస్.రామారావు, కె.ఎల్.నారాయణ, రచయిత విజయేంద్రప్రసాద్, తెలుగు నిర్మాతలమండలి అధ్యక్షుడు దామోదర ప్రసాద్, సంగీత దర్శకుడు భీమ్స్, ఏబీఎన్ ఆంధ్రజ్యోతి డైరెక్టర్ భాను తదితరులు పాల్గొన్నారు.

కొత్త తేదీన కృష్ణమ్మ



సత్యదేవ్ కథానాయకుడిగా నటించిన 'కృష్ణమ్మ' చిత్రానికి కొత్త రిలీజ్ డేట్ ఖరారైంది. మే 10న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు చిత్ర బృందం శుక్రవారం ప్రకటించింది. యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కిన ఈ చిత్రానికి వీవీ గోపాలకృష్ణ దర్శకుడు. దర్శకుడు కొరటాల శివ సమర్పణలో కృష్ణ కొమ్మలపాటి నిర్మించారు. అతీరారాజ్ కథానాయిక. సంగీతం: కాలభైరవ. సినిమాటోగ్రఫీ: సన్నీ కూరపాటి

మహిళ విజయం వెనుక మగాడు



కిరణ్‌కుమార్, భవ్యశ్రీ జంటగా నటించే 'దీక్ష' చిత్రం షూటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. తెలంగాణ ఫిల్మ్ ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్ స్వీయ దర్శకత్వంలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు.. హీరోహీరోయిన్లపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు తూముకుంట నర్సారెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేయగా, ఆర్.కె. గౌడ్ తొలి క్లాప్ ఇచ్చారు. యోగానంద కృష్ణమాచార్య తొలి షాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'దీక్ష, పట్టుదల ఉంటే ఏ పని చేసినా తప్పకుండా విజయం సాధిస్తాం అనే పాయింట్‌తో ఈ సినిమా తీస్తున్నాం. ప్రతి మగవాడి విజయం వెనుక ఒక ఆడది ఉంటుందని అంటారు. అలాగే ఒక మహిళ విజయం వెనుక కూడా మగాడు ఉంటాడు. ఈ అంశం కూడా చిత్రకథలో ఉంది. మంచి కథాబలం ఉన్న సినిమా కనుక అవార్డులు కూడా వస్తాయని అనుకుంటున్నాం. మే ఒకటి నుంచి రెగ్యులర్ షూటింగ్ ఉంటుంది. హైదరాబాద్‌లో ఒక షెడ్యూల్, దుబాయ్‌లో ఒక షెడ్యూల్ చేస్తున్నాం. పాటల రికార్డింగ్ పూర్తయింది. దీని తర్వాత స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఒక సినిమా చేస్తున్నాం. ఇక పై మా బేనరుపై వరుసగా సినిమాలు తీస్తాం' అని చెప్పారు.

టీనేజ్ లవ్‌స్టోరీ



ఎస్.కె.ఎస్. ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించే చిత్రం షూటింగ్ శుక్రవారం ప్రారంభమైంది. మురళీ అలకపల్లి దర్శకత్వంలో రాహుల్ శ్రీవాత్సవ్ నిర్మిస్తున్నారు. దేవుని ఫొటోలపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు జర్నలిస్టు పర్వతనేని రాంబాబు కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్టు ప్రభు క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా నిర్మాత మాట్లాడుతూ 'మా సంస్థ నుంచి వస్తున్న మూడో సినిమా ఇది. రెండో చిత్రం షూటింగ్ జరుగుతోంది. దర్శకుడు మురళి చెప్పిన కథ నచ్చి మూడో చిత్రం ప్రారంభించాం. మూడు పాత్రల చుట్టూ జరిగే టీనేజ్ లవ్‌స్టోరీ ఇది. పేరున్న నటీనటులు నటిస్తారు. వారు ఎవరనేది ప్రస్తుతానికి సస్పెన్స్. మే రెండో వారం నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో విడుదల చేయాలనుకుంటున్నాం' అని చెప్పారు. గ్రామీణ నేపథ్యంగా సాగే ప్రేమ కథాచిత్రమిది. ముగ్గురు వ్యక్తుల మధ్య జరుగుతుంది. మంచి టీమ్‌తో త్వరలోనే మీ ముందుకు వస్తాం' అని చెప్పారు దర్శకుడు. ఈ చిత్రానికి ఆంజనేయులు జక్క ఎగ్జిక్యూటివ్ నిర్మాత.

చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నా: పోలవరం పోయిందిరా!
చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నా: అమరావతి ఆగిందిరా!
చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నా: రోడ్లన్నీ గుంతలేరా!
చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నా: పరిశ్రమలు పోయాయి రా!



చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నా: స్టేటు అప్పు 10 లక్షల కోట్లకు చేరిందిరా!
చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నా: భూములూ నొక్కేశారురా!
చింటూ: బటన్ నొక్కాడు కదరా!
చిన్నా: అన్నీ పాత పథకాలేరా స్వామీ! ఇంకో మాట ఏదైనా చెప్పు!
చింటూ: చెప్పుకోడానికి అదొక్కటే ఉందిరా నాయనా! అర్థం చేసుకోవూ...!





వైసీపీకి డొక్కా గుడ్‌బై

బాబు సమక్షంలో టీడీపీలో చేరిక

గుంటూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఊహించిన విధంగానే మాజీ మంత్రి, వైసీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆ పార్టీకి రాజీనామా చేశారు. శుక్రవారం ఉదయం పార్టీ నుంచి వైదొలగిన ఆయన.. సాయంత్రం హైదరాబాద్‌లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ముఖ్యమంత్రి జగన్ తీరుకు నిరసనగా ఆయన కొంత కాలంగా పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఎస్సీలకు మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు (తాడికొండ, ప్రత్తిపాడు, వేమూరు), ఒక లోక్‌సభ నియోజకవర్గం (బాపట్ల) ఉండగా.. వాటిలో ఎందులోనూ తనకు టికెట్ ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురయ్యారు.

గాలి జనార్దనరెడ్డి నుంచి నా ప్రాణాలకు ముప్పు!

- సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ



విశాఖపట్నం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తన ప్రాణాలకు ముప్పు ఉందని సీబీఐ మాజీ జేడీ, జై భారత్ నేషనల్ పార్టీ వ్యవస్థాపకుడు, విశాఖ-ఉత్తర నియోజకవర్గ అభ్యర్థి వీవీ లక్ష్మీనారాయణ సంచలన ఆరోపణ చేశారు. గతంలో సీబీఐ జాయింట్ డైరెక్టర్‌గా పనిచేసినపుడు అక్రమ మైనింగ్‌కు సంబంధించి పెద్ద కేసులను దర్యాప్తు చేశానని, అందులో ప్రధాన నిందితుడు గాలి జనార్దన్‌రెడ్డికి అనుచరుడైన నంబాల రాజేశ్‌కుమార్ ప్రస్తుతం విశాఖపట్నంలో ఉన్నారని, ఆయన వల్ల తనకు ప్రాణహాని ఉందని తెలిపారు. ఈ మేరకు విశాఖ పోలీస్ కమిషనర్‌కు శుక్రవారం రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. తనకు తగిన భద్రత కల్పించాలని కోరారు. రాజేశ్‌కుమార్ విశాఖ ఉత్తర నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి కేకే రాజు వెంట తిరుగుతున్నారని, ఇటీవల ఆ పార్టీ కార్యకర్తల సమావేశంలో రాజేశ్‌కుమార్ మాట్లాడుతూ, 'బాస్' (గాలి జనార్దన రెడ్డి)ని ఇబ్బంది పెట్టిన లక్ష్మీనారాయణపై ప్రతీకారం తీర్చుకొని గిఫ్ట్ ఇస్తానని చెప్పినట్టు తనకు విశ్వసనీయంగా తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజేశ్ కుమార్‌కు కేకే రాజు అన్ని విధాలుగా రక్షణ కల్పిస్తున్నారని ఆరోపించారు.

ఏపీలో కూటమిదే ఘనవిజయం!

ఆంధ్రలో 160 అసెంబ్లీ స్థానాలు మావే.. 24 లోక్‌సభ సీట్లు కూడా..: చంద్రబాబు

- జగన్‌కు మానసిక సంతులనం దెబ్బతింది
- సంక్షేమాన్ని పణంగా పెట్టి రాజకీయాలు
- వేధింపులు, వినాశనమే ఆయన ధ్యేయం
- జమిలి ఎన్నికలను 2017లోనే సమర్థించా: చంద్రబాబు
- రిపబ్లిక్ సీనియర్ జర్నలిస్టు అర్ణవ్ గోస్వామికి ప్రత్యేక ఇంటర్వ్యూ



- నేను ఎందరో ముఖ్యమంత్రులను చూశాను. కానీ జగన్‌లా జనాన్ని వేధించి అందరినీ నాశనం చేసే, మానసిక సంతులనం లేని సీఎంను ఎప్పుడూ చూడలేదు.
- నాకు, మోదీకి మధ్య సుహృద్భావ, సన్నిహిత సంబంధాలున్నాయి. ఆయన గుంటూరు వచ్చినప్పుడు మాట్లాడుకున్నాం. అమిత్ షా, నడ్డాతో కూడా చర్చిస్తున్నాను.

- చంద్రబాబు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే ఘనవిజయం సాధిస్తుందని తమకు నూటికి నూరు పాళ్లు విశ్వాసం ఉందని టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు అన్నారు. 160 అసెంబ్లీ, 24 లోక్‌సభ స్థానాల్లో గెలుస్తామని స్పష్టం చేశారు. కేంద్రంలో మోదీ నేతృత్వంలో ఎన్డీయే అధికారంలోకి వస్తుందనే నమ్మకం తమకుందని.. 400కి పైగా ఎంపీ సీట్లు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుందని.. రాష్ట్రం నుంచి అదనంగా 20 లోక్‌సభ స్థానాలిస్తామని చెప్పారు. మోదీ నాయకత్వంలో భారతదేశం గ్లోబల్ పవర్‌గా మారుతోందన్నారు. 'ది రిపబ్లిక్' టీవీ నిర్వహించిన 'దేశం తెలుసుకోవాలనుకుంటోంది (నేషన్ వాంట్స్ టు నో)' కార్యక్రమంలో భాగంగా సీనియర్ జర్నలిస్టు అర్ణవ్ గోస్వామికి శుక్రవారం ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో చంద్రబాబు పలు ప్రశ్నలకు సమాధానాలిచ్చారు. తనకు ఒక్క అవకాశం ఇవ్వాలని జగన్ అడిగితే ప్రజలు ఇచ్చారని.. కానీ ఆయన దుష్పరిపాలన చూసిన తర్వాత మరో అవకాశం ఇవ్వకూడదని నిర్ణయించుకున్నారని చెప్పారు. మోదీ పరిపాలనను జనం చూశారని, అదే విధంగా తన పాలనతో జగన్ పాలనను సరిపోల్చుకుంటున్నారని.. ఫలితంగా తమ వైపు మొగ్గుతున్నారని తెలిపారు. 2017లోనే తాను జమిలి ఎన్నికలను సమర్థించానని, ఐదేళ్లకోసారి ఎన్నికలు జరిగితే అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి సారించవచ్చని చెప్పారు. 2047కల్లా వికసిత్ భారత్ కావాలన్న మోదీ లక్ష్యానికి అనుగుణంగా పనిచేస్తామన్నారు.

అప్పటికీ, ఇప్పటికి ఏం తేడా?

2019లో చంద్రబాబు బీజేపీని వ్యతిరేకించిన విషయం గుర్తు చేస్తూ అప్పటికీ ఇప్పటికీ తేడా ఏముందని అర్ణవ్ అడిగారు. విభజన తర్వాత ఏపీ చాలా నష్టపోయిందని, 2019లో ప్రత్యేక హోదా అడిగామని చంద్రబాబు చెప్పారు. జగన్ హయాంలో రాష్ట్రం తీవ్రంగా నష్టపోయిందని, అక్కడ ప్రజాస్వామ్యమే లేదని.. ఏపీని, తెలుగు ప్రజలను కాపాడేందుకు ఎన్డీయేతో కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నానని చెప్పారు. అదే సమయంలో గత పదేళ్ల మోదీ పాలనలో దేశం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. జగన్ ప్రభుత్వం పట్ల ప్రతి ఒక్కరిలో నిరాశా నిస్పృహలు నెలకొన్నాయని, ప్రతి ఒక్కరూ బాధితుడేనన్నారు.

బీజేపీతో పొత్తు ఎందుకు?

బీజేపీ నుంచి మీరేం ప్రయోజనాలు కోరుతున్నారు.. గత ఎన్నికల్లో నోటా కంటే తక్కువ ఓట్లు సాధించిన ఆ పార్టీతో ఎందుకు పొత్తు పెట్టుకున్నారని అర్ణవ్ అడిగారు. చంద్రబాబు స్పందిస్తూ ఎన్డీయేలో తానెప్పుడూ ఏ హోదానూ ఆకాంక్షించ లేదని, మంత్రి పదవులూ కోరుకోలేదన్నారు. ఈ మహోన్నత దేశానికి తన వంతు సేవ చేయడమే ఏకైక లక్ష్యమని చెప్పారు. జాతి నిర్మాణంలో ఎన్డీయేకి సహకరిస్తామన్నారు. దేశం అభివృద్ధి చెందితే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందనే తన అభిప్రాయమని.. మోదీ ప్రభుత్వంపై జాతీయ స్థాయిలో సదభిప్రాయం నెలకొని ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ లో 1999లో 2020 కోసం తాను విజన్ రూపొందించానని, అది ఇప్పుడు వాస్తవంగా మారిందని చెప్పారు.

నాపై అవినీతి ఆరోపణల్లేవ్..

జగన్మోహన్‌రెడ్డితో సంబంధాలు ఎందుకు దెబ్బతిన్నాయని అర్ణవ్ అడుగగా.. ఆయన తండ్రి, తాను 80వ దశకంలో మిత్రులమని, సన్నిహితంగా ఉండేవాళ్లమని చంద్రబాబు తెలిపారు. తర్వాత తమ మార్గాలు వేరయ్యాయని, తాను తెలుగుదేశంలోనూ, ఆయన కాంగ్రెస్‌లోనూ ఉండిపోయారని చెప్పారు. తనపై ఏనాడూ అవినీతి ఆరోపణలు లేవని, ఎప్పుడూ స్వచ్ఛమైన, నిజాయితీతో కూడిన సుపరిపాలనను ప్రజలకు ఇవ్వాలని భావించాలని.. కానీ 2019లో జగన్ ముఖ్యమంత్రి కాగానే మొత్తం నాశనం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదన్నారు. పదేళ్ల తర్వాత కూడా రాష్ట్రానికి రాజధాని లేదని, అమరావతి ఏమి పాపం చేసిందని ప్రశ్నించారు. మూడు రాజధానుల ప్రతిపాదనను వ్యతిరేకిస్తే తమను శత్రువులా చూశారని తెలిపారు. పోలవరం ప్రాజెక్టును కూడా నాశనం చేశారని.. తనతో ఎవరు విభేదించినా ఆయన వారిపై యుద్ధం ప్రకటిస్తారని చెప్పారు. గత ఐదేళ్లుగా జగన్ చర్యలను చూస్తే ఎవరైనా ఆయన మానసికంగా దెబ్బతిన్నారని అంటారని తెలిపారు. సుబ్బారావు అనే వ్యక్తి భూమి రికార్డులను ఆన్‌లైన్‌లో మార్చారని, ఆయన, ఆయన కూతురు ఆత్మహత్య చేసుకోవాల్సి వచ్చిందని తెలిపారు. లక్ష్మి అనే మహిళ నిరసన తెలిపేందుకు వేలు కోసుకుందని చెప్పారు.

దక్షిణాదిన వేళ్లూనుకుంటోంది..

మోదీకి దక్షిణాది వ్యతిరేకంగా ఉందా అని అర్ణవ్ అడుగగా.. దక్షిణాదిన సాంప్రదాయికంగా ప్రాంతీయ పార్టీల ఆధిపత్యం రాజకీయాల్లో సాగిందని, అయితే బీజేపీ కూడా దక్షిణాదిన వేళ్లూనుకుంటోందని చంద్రబాబు చెప్పారు. కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బీజేపీకి మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. గత నాలుగు దశాబ్దాల్లో టీడీపీ, బీజేపీ అనేకసార్లు కలిసి పనిచేశాయని, తాము సహజ భాగస్వాములమని తెలిపారు. ఇద్దరం కలిసి రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం పనిచేశామని చెప్పారు. ఇప్పుడు మిత్రపక్షంగా తమకు మరింత బాధ్యత ఉంటుందని చెప్పారు. జగన్ తనను జైలుకు పంపినందుకు ఎలాంటి విద్వేష భావం లేదని, తాను తప్పు చేయలేదని తనకు తెలుసని, మొత్తం దేశానికీ తెలుసని చెప్పారు. ప్రతి ఒక్కరూ తనకే మద్దతిచ్చారని తెలిపారు.

ఆస్తులు దాచిన బుగ్గన

- అఫిడవిట్‌పై టీడీపీ ఫిర్యాదు.. హైడ్రామా మధ్య అనుమతి..
- బీఫాం ఇవ్వని అంబటి.. భార్య, కుమార్తె ఆస్తుల దాపరికం
- అయినా ఆమోదించిన రిటర్నింగ్ అధికారి

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

ఏపీలో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల నామినేషన్ల పరిశీలన పర్వం శుక్రవారం ముగిసింది. ఇండిపెండెంట్లు సహా కొన్ని చిన్న పార్టీల అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లను అధికారులు పలు కారణాలతో తిరస్కరించారు. ఇక, అభ్యర్థులు స్వయంగా తమ నామినేషన్లను వెనక్కి తీసుకునేందుకు ఈ నెల 29 వరకు అవకాశం ఉంది. అయితే పలు నియోజకవర్గాల్లో నామినేషన్ల పరిశీలన, అనుమతి విషయంలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. వైసీపీ అభ్యర్థుల నామినేషన్ల విషయంలో హైడ్రామా చోటు చేసుకుంది. ఆయా అభ్యర్థులు దాఖలు చేసిన అఫిడవిట్లలో లోపాలను టీడీపీ అభ్యర్థులు ప్రస్తావించి ఎన్నికల రిటర్నింగ్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు అధికారులు చర్యల పేరుతో వాటిని పెండింగులో పెట్టినా.. కొన్ని గంటలు గడిచేసరికి వాటిని ఆమోదించేశారు. ఈ పరిణామం వెనుక పైస్థాయిలో ఒత్తిళ్లు ఉన్నాయని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

డోన్‌లో డ్రామా!

నంద్యాల జిల్లా డోన్ నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి, మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి నామినేషన్‌ను సంబంధిత అధికారి నాటకీయ పరిణామాల మధ్య ఆమోదించారు. బుగ్గన సమర్పించిన అఫిడవిట్‌లో ఆయన తన ఆస్తులను వెల్లడించలేదని టీడీపీ అభ్యర్థి కోట్ల సూర్యప్రకాశ్ రెడ్డి తరఫున ఆయన న్యాయవాదులు శ్రీనివాసభట్, భాస్కర్ రెడ్డిలు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో రిటర్నింగ్ అధికారి మహేశ్వరరెడ్డి తొలుత ఈ నామినేషన్‌ను ఆరు గంటలపాటు పెండింగ్‌లో ఉంచారు. తర్వాత ఏం జరిగిందో ఏమో చివరకు ఆమోదం తెలిపారు.

పొన్నూరు పేచీ..

గుంటూరు జిల్లా పొన్నూరు వైసీసీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఆస్తుల వివరాలు వెల్లడించ లేదని టీడీపీ అభ్యర్థి ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఫిర్యాదు చేశారు. అంబటి తన అఫిడవిట్‌లో భార్య, కుమార్తెల ఆస్తుల వివరాలు పేర్కొనలేదన్నారు. అలాగే డ్వాక్రా మహిళా సంఘాలు దాచుకున్న దాదాపు రూ.2.50 కోట్ల సొమ్ములను మురళి తన సొంత ఖాతాలకు మళ్లించుకున్నారని తెలిపారు. అయితే ఈ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండానే అంబటి నామినేషన్‌ను ఆమోదిస్తున్నట్లు ఆర్వో తెలిపారు.

'ఆమంచి'కి బకాయి బెడద

బాపట్ల జిల్లా చీరాల అసెంబ్లీ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఆమంచి కృష్ణమోహన్ నామినేషన్‌ను పెండింగ్‌లో ఉంచినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. దీనిపై శనివారం నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆమంచి విద్యుత్ బిల్లుల బకాయిలు ఉన్నట్లు ఓ పార్టీకి చెందిన ఏజెంట్ తెలిపారని, దీంతో నామినేషన్‌ను పెండింగ్‌లో ఉంచామని పేర్కొన్నారు.

కొడాలిపై ఫిర్యాదా? నో!

కృష్ణాజిల్లా గుడివాడ వైసీపీ అభ్యర్థి కొడాలి నాని నామినేషన్‌ను తిరస్కరించి, అనర్హుడిగా ప్రకటించాలని కోరుతూ.. టీడీపీ నేత తులసీబాబు ఆర్వోకు ఫిర్యాదు చేశారు. గుడివాడ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్సులో కొడాలి తన క్యాంప్ ఆఫీసు నిర్వహించారని, కోడ్ అమల్లోకి వచ్చాక మున్సిపల్ కమిషనర్ నోటీసు ఇవ్వడంతో ఆయన ఖాళీ చేశారని తెలిపారు. కానీ నామినేషన్ పత్రంలో మాత్రం తాను కాంప్లెక్స్‌ను ఉపయోగించుకోలేదని తెలిపారని పేర్కొన్నారు. కాగా, ఈ ఫిర్యాదును తీసుకునేందుకు రిటర్నింగ్ అధికారి పి. పద్మావతి అంగీకరించలేదు.

ఐఎన్‌సీ అంటే ఇటలీ నేషనల్ కాంగ్రెస్

- బ్రిటిషర్ స్థాపించిన పార్టీ అది
- బీజేపీ అంటే భారతీయుల ఆత్మ
- అంబేడ్కర్‌కు కాంగ్రెస్, బీఆర్ఎస్ అవమానం
- బీజేపీతోనే దళితుల ఉన్నతి: బండి సంజయ్




కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో మాట్లాడుతున్న బండి సంజయ్

మానకొండూర్, ఏప్రిల్ 26: ఐఎన్‌సీ అంటే ఇటలీ నేషనల్ కాంగ్రెస్ పార్టీ అని.. దానిని స్థాపించింది ఏవో హ్యూమ్ అనే బ్రిటిషర్ అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. బీజేపీ అంటే భారతీయుల ఆత్మ అని, తమ పార్టీ పేరులోనే భారతీయత ఉందని చెప్పారు. కాంగ్రెస్‌లో భారతీయత ఎక్కడుందని ప్రశ్నించారు. బీజేపీ మూలాలన్నీ భారత్‌లోనే ఉన్నాయని, మరి బ్రిటీష్ జనతా పార్టీ ఎలా అవుతుందని నిలదీశారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లో శుక్రవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన దళిత సమ్మేళనంలో సంజయ్ మాట్లాడారు. దళితుల అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్నది మోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వమని తెలిపారు. అంబేడ్కర్‌ను కాంగ్రెస్, బీఆర్ఎస్ అవమానించాయని, అలాంటి పార్టీలకు దళితులు గుణపాఠం చెప్పాలని అన్నారు. కాంగ్రెస్‌ను ఏలుతున్న గాంధీ కుటుంబం డూప్ అని, మహాత్మాగాంధీ అసలు సిసలైన గాంధీ అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పొరపాటున అధికారంలోకి వస్తే పేదలు సహా ఎవరు చనిపోయినా వారి ఆస్తిలో 55 శాతం గుంజుకుంటుందని హెచ్చరించారు. ఇదే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ విదేశాంగ విభాగం ఇన్‌చార్జి శ్యామ్ పిట్రోడ స్పష్టం చేశారని తెలిపారు. 57 ఏళ్ల దేశాన్ని పాలించిన కాంగ్రెస్ ఏనాడూ దళితుల అభ్యున్నతికి పనిచేయలేదని అన్నారు. తెలంగాణలో మొదటి సీఎం దళితుడేనని.. దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి చెప్పి కేసీఆర్ మోసం చేశారని విమర్శించారు. చివరకు అభివృద్ధి పేరుతో దళితుల భూములను గుంజుకున్న చోర్ అని మండిపడ్డారు. అంబేడ్కర్ జయంతి, వర్ధంతి ఉత్సవాలకు కూడా రాని అహంకారి కేసీఆర్ అని అన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తానని ఎవరన్నా సహించేది లేదన్నారు. "కరీంనగర్ నుండి పోటీ చేస్తున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఏనాడైనా మీ వద్దకు వచ్చారా? మీ కోసం ఏనాడైనా పోరాడారా..?" అని ప్రశ్నించారు. తాను ప్రజల కోసం చేసిన పోరాటాలేమిటో.. వాళ్లు చేసిన పోరాటాలేమిటో బేరీజు వేసుకుని ఓటు వేయాలని సంజయ్ కోరారు.

కమలం ఆశల రేకులు

హ్యాట్రిక్ కొట్టి రికార్డు సాధించడంపై బీజేపీ గురి.. మోదీ ఆకర్షణే బలం.. చేసిన పనులపైన ప్రచారం

- కొత్త సీఎంలున్న చోట ఎలాంటి ఫలితం వస్తుందో?
- బలమైన దక్షిణాది నేతలను ఎలా ఎదుర్కొంటుందో?
- ఏపీలో చంద్రబాబుతో జట్టు.. కాషాయానికి పట్టు
- గత 2 సార్లకంటే సానుకూల అంశాలతో ప్రజల్లోకి
- 'బాండ్'లు బ్యాడ్ చేస్తాయా? ధరలు దెబ్బేస్తాయా?
- విపక్షాలపై మితిమీరి కక్షసాధింపు చేటు చేస్తుందా?



(సెంట్రల్ డెస్క్)

వరుసగా మూడు ఎన్నికల్లో గెలుపు..! అప్పుడెప్పుడో నెహ్రూ హయాంలో కాంగ్రెస్‌కు తప్ప మరే పార్టీకీ సాధ్యం కాని ఘనమైన రికార్డు ఇది. ఉత్తమ ప్రధానులుగా పేరు తెచ్చుకున్న వాజ్‌పేయీ, మన్మోహన్ సింగ్‌లకూ అందని ఘనత ఇది..! కానీ, ఈసారి బీజేపీ మాత్రం హ్యాట్రిక్ కొట్టేస్తాం అంటోంది..! మోదీ సారథ్యంలో పోయినసారి సాధించిన 303 స్థానాలను ఇప్పుడు 370 దాటిస్తామంటోంది. తమ కూటమి ఎన్డీఏకు అయితే 400 దాటడం ఖాయమంటోంది..! ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెడుతూ.. ప్రతిపక్ష పార్టీలను ఆత్మరక్షణలోకి నెడుతూ.. తనదైన శైలిలో దూకుడుగా ముందుకెళ్తోంది. అయితే, కమల దళం లక్ష్యం నెరవేరుతుందా..? 2019లో దేశ పశ్చిమ ప్రాంతం, హిందీ బెల్ట్‌ను దాదాపు స్వీప్ చేసిన ఆ పార్టీకి ప్రస్తుతం అక్కడ పరిస్థితి ఎలా ఉంది? బెంగాల్, దక్షిణాది రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి పుంజుకుంటుందా? వ్యవస్థాగత బలం.. మోదీ ఆకర్షణ మంత్రంతో అనుకున్నది సాధిస్తుందా..? దానిముందున్న బలాలు, బలహీనతలు, అవకాశాలు, అడ్డంకులు ఇవీ..

మోదీ మేనియా..

బీజేపీ 'బలం' అంతా మోదీనే. ప్రజలను సమ్మోహితులను చేసే శక్తితో ఏ ప్రతిపక్ష నేతకూ అందనంత ఎత్తులో ఉన్నారాయన. గట్టి ప్రతిపక్షాలున్న రాష్ట్రాలు, పార్టీకి సంస్థాగత బలం లేని రాష్ట్రాల్లోనూ మోదీ ఆకర్షణే కమలానికి కొండంత బలం. 2014లో ఇదే బీజేపీకి భారీగా సీట్లు వచ్చేలా చేసింది. 2019లో తెలంగాణ, ఒడిసాలోనూ ఆ పార్టీ సత్తా చాటేందుకు కారణమైంది. జాతీయ నాయకత్వం ప్రత్యేక దృష్టితో చాలా రాష్ట్రాల్లో బీజేపీ సంస్థాగతంగా బాగా బలపడింది. ఇది ప్రజల్లోకి చొచ్చుకెళ్లేందుకు ఉపయోగపడనుంది. రామ మందిరాన్ని సాకారం చేశామంటూ హిందీ బెల్ట్‌లోని ఓటర్లను ఆకట్టుకుంటోంది. జాతీయవాదంతో ఇప్పటికే ఓ వర్గం ప్రజలను తనవైపు తిప్పుకొన్న బీజేపీ.. సంక్షేమ మంత్రంతో మిగతా వర్గాలనూ కలుపుకొనిపోతోంది.

యువ నాయకత్వంపై భారం.. రాజ్‌పుత్‌ల రెబల్

గత ఏడాది చివర్లో కాకలు తీరిన సీనియర్లను పక్కనపెట్టి, ఉత్తరాదిన బలమైన సామాజిక వర్గాలను దృష్టిలో పెట్టుకుని భజన్‌లాల్ శర్మ (రాజస్థాన్), మోహన్ యాదవ్ (మధ్యప్రదేశ్), విష్ణుదేశ్ సాయి (ఛత్తీస్‌గఢ్)లను ముఖ్యమంత్రులను చేసింది బీజేపీ. ఇటీవల ఖట్టర్‌ను అనూహ్యంగా మార్చేసి.. హిమాచల్ సీఎంగా నాయబ్ సైనీకి బాధ్యతలు అప్పగించింది. ఇది 'బలహీనత' కానుందా? అనే అభిప్రాయమూ వినిపిస్తోంది. నాయబ్‌తో పాటు కొత్త సీఎంలదరూ ఎన్నికల్లో ఏం చేస్తారో చూడాలి. బలమైన ప్రతిపక్ష నేతలు లేనందున.. జాతీయవాదం, హిందూత్వం, సంక్షేమ పథకాలు ఉత్తరాదిన బీజేపీకి చాలావరకు ప్రయోజనం చేకూర్చినా.. ఇవే అంశాలు దక్షిణాది, తూర్పున పనిచేయడం కష్టమే. ఎందుకంటే బెంగాల్‌లో మమతా బెనర్జీ మొదలు తమిళనాడులో స్టాలిన్, తెలంగాణలో రేవంత్‌రెడ్డి, కర్ణాటకలో సిద్దరామయ్య వంటి నాయకులు ప్రతిపక్షాలకు ఉన్నారు. కాగా, ఈ ఎన్నికల్లో బీజేపీకి ప్రధాన బెంగ రాజ్‌పుత్‌లు. బ్రిటిష్ వారితో రోటీ-బేటీ సంబంధాలు ఏర్పర్చుకుని రాజ్‌పుత్‌లు మనుగడకు ఇబ్బంది రాకుండా చూసుకున్నారని కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాలా చేసిన వ్యాఖ్యలు పెద్ద దుమారమే రేపాయి. కేంద్ర మంత్రి వీకే సింగ్‌కు ఘాజియాబాద్ టికెట్ నిరాకరించడంతో పశ్చిమ యూపీలో 10 శాతం ఉన్న రాజ్‌పుత్‌లు బీజేపీపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రాజస్థాన్, హరియాణ, గుజరాత్, మధ్యప్రదేశ్‌లోనూ కాషాయ పార్టీ పట్ల ఇదే వైఖరి వ్యక్తమవుతోంది.

ఏపీలో బాబు బలం.. గతం కంటే సానుకూలం

ఆర్టికల్ 370 రద్దు, రామమందిర నిర్మాణం పూర్తి, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల సాకారం, ఉమ్మడి పౌరస్మృతి అమలుకు ముందడుగు, రేషన్ పొడిగింపు తదితర అంశాలతో.. ఈసారి ఎన్నికలను బీజేపీ చాలా సానుకూలంగా ప్రారంభించింది. 2014, 2019లో ఆ పార్టీకి చెప్పుకొనేందుకు ఇన్ని 'అవకాశాలు' లేవు. ఇక 'ఇండియా' కూటమి మూలస్తంభమైన నీతీశ్ కుమార్‌నే బీజేపీ తమవైపు లాగేసుకుంది. కాంగ్రెస్‌కు సీట్ల పంపకాన్ని మమతా బెనర్జీ పట్టించుకోకపోవడం, కేజ్రీవాల్ ఢిల్లీ మద్యం కేసులో అరెస్టవడం, ఏపీలో చంద్రబాబు సారథ్యంలోని టీడీపీతో పొత్తు కాషాయ పార్టీకి కలిసొచ్చేదిగా మారిందనే అభిప్రాయం వినిపిస్తోంది. తెలంగాణలో బీఆర్ఎస్, తమిళనాడులో ఏఐఏడీఎంకే బలహీనపడడం కూడా అందివచ్చిన అవకాశాలే. ప్రధాని మోదీ దక్షిణాదిన ఉధృత ప్రచారం మరో సానుకూలాంశం.

'బాండ్'లు.. బ్యాడ్ చేస్తాయేమో?

మోదీ పదేళ్ల పాలనలో ధరలు, నిరుద్యోగం పెరుగుదలను ప్రతిపక్షాలు గట్టిగా లేవనెత్తుతున్నాయి. సరిగ్గా ఎన్నికల ముందు.. ఎన్నికల బాండ్ల వివరాల్లో అతి పెద్ద లబ్ధిదారు బీజేపీనే అని తేలడమూ ఆ పార్టీ దూకుడుకు 'అడ్డంకి'గా మారే ప్రమాదం ఉందనే వాదన వినిపిస్తోంది. అసలే దర్యాప్తు సంస్థలను తమపైకి ఉసిగొల్పుతోందంటూ బీజేపీపై విపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో ఎన్నికల బాండ్లు వాటికి అందివచ్చిన అస్త్రంగా మారాయి. గత ఎన్నికల్లో దేశ తూర్పున ఉన్న బిహార్, జార్ఖండ్, బెంగాల్‌లో బీజేపీ వరుసగా 17, 11, 18 సీట్లు నెగ్గింది. ఇటీవలి పరిణామాల్లో ఈ మూడు రాష్ట్రాల్లో బీజేపీ తీరు వివాదాస్పదమైంది. ఒడిసాలో గతంలోని 8 సీట్లను నిలుపుకొంటుందా? అనేది కూడా చూడాలి. కాగా, 2019లో కమలం కర్ణాటకలో 25 సీట్లను గెలిచింది. మహారాష్ట్రలో పోటీ చేసిన 25 స్థానాల్లో 23 నెగ్గింది. ఇప్పుడు అక్కడ అంత సులువు కాదనేలా పరిస్థితులు ఉన్నాయి. యూపీలో అఖిలేశ్‌యాదవ్ ఆధ్వర్యంలోని సమాజ్‌వాదీ పార్టీ, బిహార్‌లో తేజస్వీ యాదవ్ సారథ్యంలోని రాష్ట్రీయ జనతాదళ్‌లు దళిత, మైనార్టీ, బీసీ ఓటు బ్యాంక్‌తో బీజేపీని దెబ్బకొట్టాలని చూస్తున్నాయి.



షరియా ఆధారంగా దేశం నడవాలా: అమిత్ షా

గుణ, బేమెతర, ఏప్రిల్ 26: దేశంలో ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) అమలు చేసి తీరుతామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఈ ఎన్నికల్లో ఇది మోదీ ఇచ్చే గ్యారెంటీ అని ప్రకటించారు. శుక్రవారం మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో ఎన్నికల ప్రచార సభల్లో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని ఉద్దేశించి మాట్లాడుతూ.. మైనార్టీల కోసం ప్రత్యేక చట్టం తీసుకొస్తామని కాంగ్రెస్ చెబుతోందని, అంటే షరియా ప్రకారం దేశం నడవాలా అని ప్రశ్నించారు. అయోధ్యలో రామ మందిర నిర్మాణాన్ని వ్యతిరేకించిన వారికి దేశాన్ని పాలించే హక్కు లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలీగ్ అజెండాను అమలు చేస్తోందని విమర్శించారు.

ప్రతిపక్షాలకు చెంపదెబ్బ!

ఈవీఎంలపై అనవసర రాద్ధాంతం చేశారు: మోదీ


బిహార్‌లో ఎన్నికల ప్రచారంలో నితీశ్‌తో మోదీ

అరారియా/ముంగేర్ (బిహార్), ఏప్రిల్ 26: ఈవీఎంలపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రతిపక్షాలకు గట్టి చెంపదెబ్బ అని ప్రధాని మోదీ అన్నారు. తీర్పును స్వాగతించారు. ఈవీఎంలను అనుమానించిన ప్రతిపక్ష నేతలు దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు. బిహార్‌లోని అరారియా, ముంగేర్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మోదీ మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన సుప్రీం తీర్పుపై స్పందిస్తూ.. "ఇది ప్రజాస్వామ్యానికి దక్కిన విజయం" అని వ్యాఖ్యానించారు. ఇక ప్రతిపక్ష పార్టీలు తమకు ఎంతో ఇష్టమైన ముస్లిం ఓటు బ్యాంకు కోసం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లను తస్కరించేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను ఓటు బ్యాంకు రాజకీయాలకు మళ్లించడాన్ని తాను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోనని.. ఇది మోదీ గ్యారెంటీ అని హామీ ఇచ్చారు. దేశ వనరులపై తొలి హక్కు పేదలకే ఉంటుందని స్పష్టం చేశారు. బిహార్‌లో కాంగ్రెస్, ఆర్జేడీ, ఇతర ఇండియా కూటమి పార్టీలు అధికారంలో ఉన్న సమయంలో పోలింగ్ బూత్‌లను ఆక్రమించుకొని.. పేదలు, వెనకబడిన వర్గాలు, దళితుల ఓటు హక్కును హరించేవారని ఆరోపించారు. ఈవీఎంలు వచ్చిన తర్వాత వారి ఆటలు సాగడం లేదన్నారు. అందుకే ప్రతిపక్ష నేతలు ఈవీఎంలపై ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. ముస్లింలకు కాంగ్రెస్ ఇస్తున్న ప్రాధాన్యాన్ని, ఇండీ కూటమి తీరును తేటతెల్లం చేయడంతో వారంతా ఆగ్రహంగా ఉన్నారని మోదీ చెప్పారు. తనను భయపెట్టాలని చూడొద్దని హెచ్చరించారు. '25 ఏళ్లుగా నన్ను భయపెట్టాలని చూస్తూనే ఉన్నారు. కానీ, విఫలమయ్యారు' అని చెప్పారు.

గూగుల్ యాడ్స్‌లో బీజేపీ టాప్!

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: గూగుల్, యూట్యూబ్‌లలో ప్రచారానికి భారీగా ఖర్చుపెట్టిన పార్టీల్లో పాలక బీజేపీ ముందుంది. రూ.100 కోట్లను దాటేసిన భారతీయ పార్టీగా గుర్తింపు పొందింది. 2018 మే 31 నుంచి 2024 ఏప్రిల్ 25 నడుమ ఆయా పార్టీలు రాజకీయ ప్రకటనలపై పెట్టిన ఖర్చు వివరాలను 'ఇండియాటుడే' చానల్ తెలియజేసింది. గత ఆరేళ్లలో 'రాజకీయ' ప్రకటనల రూపంలో గూగుల్‌కు రూ.390 కోట్ల ఆదాయం లభించింది. ఈ మొత్తంలో బీజేపీ వాటా 26%. ఆ పార్టీ రూ.101 కోట్లు ఖర్చు చేసింది. గూగుల్ యాడ్స్, గూగుల్ డిస్‌ప్లే-వీడియోపై రూ.45 కోట్ల ఖర్చుతో కాంగ్రెస్ ద్వితీయ స్థానంలో నిలిచింది. తమిళనాడు పాలక పార్టీ డీఎంకే గూగుల్ యాడ్స్ వ్యయంలో రూ.42 కోట్లతో మూడో స్థానంలో నిలిచింది. ఇందులో ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి రూ.16.6 కోట్లు ఖర్చుచేయడం గమనార్హం. ఇక బీఆర్ఎస్ నిరుడు నవంబరులో జరిగిన అసెంబ్లీ ఎన్నికల వరకే గూగుల్‌లో ప్రకటనలపై వ్యయం చేసింది. రూ.12 కోట్లకుపైగా ఖర్చుచేసినా ఎన్నికల్లో ఓడిపోయింది. అక్కడ కాంగ్రెస్ గెలిచింది. ఇక ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్‌కిశోర్ స్థాపించిన ఐ-ప్యాక్.. ఆంధ్రలో వైసీపీ తరఫున గూగుల్ యాడ్లకు ఈ ఆరేళ్లలో రూ.6.4 కోట్లు, బెంగాల్లో టీఎంసీ కోసం రూ.4.8 కోట్లు ఖర్చుచేసినట్లు డేటా చెబుతోంది.

ఈవీఎంలే సరైనవి

బ్యాలెట్ పేపర్లకు కాలం చెల్లింది

గుడ్డిగా దేన్నీ అనుమానించవద్దు

ఈవీఎంల కేసులో సుప్రీం తీర్పు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో నమోదైన ఓట్లన్నింటినీ వీవీప్యాట్ స్లిప్పులతో నూరు శాతం సరిపోల్చి చూడాలంటూ దాఖలైన పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆ స్లిప్‌లను వేరేగా డిపాజిట్ చేయాలని వచ్చిన అభ్యర్థనలను కూడా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తోసిపుచ్చింది. ఈవీఎంల బదులుగా మళ్లీ పాత కాలం బ్యాలట్ పద్ధతిని ప్రవేశపెట్టాలనడం సరైంది కాదని ఇద్దరు న్యాయమూర్తులూ ఒకే అభిప్రాయంతో వెలువరించిన వేర్వేరు తీర్పుల్లో స్పష్టం చేశారు. 97 కోట్ల మంది ఓటర్లు, పెద్ద సంఖ్యలో ఉన్న అభ్యర్థులు, లక్షలాది పోలింగ్ బూత్‌లు ఉన్న ఈ దేశం బ్యాలట్ పేపర్ల వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నదని సుప్రీంకోర్టు గుర్తు చేసింది. మళ్లీ అదే పద్ధతికి వెళితే ఎన్నో సంవత్సరాల కృషి తర్వాత జరిగిన ఎన్నికల సంస్కరణలు వృథా అయిపోతాయని న్యాయమూర్తులు పేర్కొన్నారు. ఈవీఎంలపై అనుమానాలు సహేతుకం కాదని వ్యాఖ్యానించారు. సాంకేతిక అంశాలను, ఇప్పటి వరకూ నమోదైన డేటాను పరిశీలించిన తర్వాత.. ఈవీఎంల ద్వారానే ఎన్నికలు జరిపించడం సరైందని నిర్ణయించామని వారు తెలిపారు. అలాగే.. వీవీప్యాట్ స్లిప్పులను ఓటర్లే డ్రాప్‌బాక్సుల్లో వేసే అవకాశం కల్పించాలన్న విజ్ఞప్తినీ న్యాయమూర్తులు తోసిపుచ్చారు. అలా ఇవ్వడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతాయని.. వాటిని దుర్వినియోగపరిచే అవకాశం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఇప్పటి వరకూ 4 కోట్ల వీవీప్యాట్ స్లిప్పులను కంట్రోల్ యూనిట్ల ఫలితాలతో సరిపోల్చారని, ఒక్కసారి కూడా లోపాలు కనపడలేదని గుర్తుచేశారు. గుడ్డిగా ఒక వ్యవస్థను అనుమానించడం, వ్యతిరేకించడం సరైంది కాదని పేర్కొన్నారు. పరస్పర విశ్వాసం ఏర్పడినప్పుడే ప్రజాస్వామ్యం పటిష్ఠమవుతుందని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. మళ్లీ బ్యాలట్ పేపర్లకు వెళ్లే బదులు.. ఉన్న ఈవీఎంల వ్యవస్థనే మరింత మెరుగుపరచుకోవాలని జస్టిస్ దీపాంకర్ దత్తా తన తీర్పులో పేర్కొన్నారు. కొన్ని స్వార్థపరశక్తులు ఈ దేశం సాధించిన విజయాలను తక్కువ చేయాలని చూస్తున్నాయని జస్టిస్ దత్తా వ్యాఖ్యానించారు.

రెండు ఆదేశాలు..

ఈవీఎంలపై మరింత నమ్మకం పెరిగేందుకు ఎన్నికల కమిషన్‌కు సుప్రీం ధర్మాసనం రెండు ఆదేశాలు జారీ చేసింది.

1) మే 1వ తేదీ తర్వాత.. వీవీప్యాట్ యూనిట్లలోకి అభ్యర్థుల పేర్లు, గుర్తులు, సీరియల్ నంబర్లను లోడ్ చేసిన తర్వాత సింబల్ లోడింగ్ యూనిట్లను (ఎస్ఎల్‌యూలు) సీల్ చేసి, కంటెయినర్లలో భద్రపరచాలి. ఆ ప్రక్రియ సవ్యంగా జరిగినట్టు ధ్రువీకరిస్తూ అభ్యర్థులు లేదా వారి ప్రతినిధులు ఆ సీల్‌పై సంతకం చేయాలి. ఆ సీల్డ్ కంటెయినర్లను.. ఎన్నికల ఫలితాలను ప్రకటించిన తర్వాత 45 రోజులపాటు ఈవీఎంలతో కలిపి స్ట్రాంగ్ రూముల్లో భద్రపరచాలి. ఒకవేళ ఈవీఎంలలో ఓట్లను మళ్లీ లెక్కించాల్సిన పరిస్థితి వస్తే.. అప్పుడు ఈ ఎస్ఎల్‌యూలను కూడా తెరిచి, పరీక్షించాలి.

2) ఫలితాలు వెల్లడైన 7 రోజుల్లోపు.. గెలిచిన అభ్యర్థి తర్వాతి రెండు స్థానాల్లో (అంటే రెండో స్థానంలో లేదా మూడో స్థానంలో) నిలిచిన అభ్యర్థుల్లో ఎవరైనా ఫలితంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే, వారు చెప్పిన నియోజకవర్గంలోని పోలింగ్ స్టేషన్‌లో.. వారు సూచించిన సీరియల్ నంబర్ కలిగిన 5% ఈవీఎంల మైక్రోకంట్రోలర్ల మెమొరీని.. వాటిని తయారుచేసిన ఇంజనీర్ల బృందం తనిఖీ చేయాలి. ఈ రెండు ఆదేశాలు ఇవ్వడంతోపాటు.. కౌంటింగ్ సమయంలో పేపర్ స్లిప్‌లను లెక్కించేందుకు ఎలక్ట్రానిక్ యంత్రాలను ఉపయోగించాలన్న పిటిషనర్ల సూచనను కూడా పరిశీలించాలని ధర్మాసనం ఈసీకి సూచించింది. సుప్రీం తీర్పుపై పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటిదాకా కనీసం 40సార్లు.. ఈవీఎంల విశ్వసనీయతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లను కోర్టులు కొట్టేశాయని ఈసీ గుర్తుచేసింది.

ఏమిటీ సింబల్ లోడింగ్ యూనిట్లు?

సింబల్ లోడింగ్ యూనిట్ అంటే.. వీవీప్యాట్ మెషీన్లలోకి అభ్యర్థుల పేర్లు, గుర్తులు, సీరియల్ నంబర్లను ఎక్కించే యంత్రం. ఒక నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులందరి గుర్తులనూ తొలుత కంప్యూటర్ ద్వారా ఈ సింబల్ లోడింగ్ యూనిట్‌లోకి ఎక్కిస్తారు (అభ్యర్థులు ఎక్కువ మంది ఉంటే రెండు యూనిట్లను ఉపయోగిస్తారు). తర్వాత వాటిని వీవీప్యాట్లకు అనుసంధానం చేసి.. వాటిలోకి ఆయా గుర్తులను అప్‌లోడ్ చేస్తారు. ఇదంతా నామినేషన్ల దశ పూర్తయి, అభ్యర్థులు ఖరారయ్యాక.. ఎన్నికల కార్యాలయంలో, వివిధ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారుల సమక్షంలో జరిగే ప్రక్రియ. సింబల్ లోడింగ్ యూనిట్లను మనదేశంలో ప్రస్తుతం రెండు సంస్థలే తయారుచేస్తున్నాయి. అవి.. ఈసీఐఎల్, బీఈఎల్. ఈ రెండు సంస్థల ఇంజనీర్లు ఎన్నికల కార్యాలయాలకు వెళ్లి.. గుర్తింపు పొందిన జాతీయ, ప్రాంతీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈ యూనిట్ల ద్వారా వీవీప్యాట్ యంత్రాలలోకి అభ్యర్థుల పేర్లు, వారి పార్టీ గుర్తు, సీరియల్ నంబర్ వంటివాటిని లోడ్ చేసి పరీక్షిస్తారు. అంతా సరిగ్గా ఉందని నిర్ధారించుకున్నాక ఈవీఎంలను స్ట్రాంగ్‌రూముల్లో భద్రపరుస్తారు. సింబల్ లోడింగ్ యూనిట్లను జిల్లా ఎన్నికల అధికారి కస్టడీలో ఉంచుతారు. ఎన్నికలు అయిన ఒకరోజు తర్వాత.. ఆ యూనిట్లను సంబంధిత సంస్థల ఇంజనీర్లకు అప్పగిస్తారు. అప్పుడా ఇంజనీర్లు వాటిని తదుపరి దశ ఎన్నికలు జరిగే నియోజకవర్గాల్లో ఉపయోగించడానికి తీసుకెళ్తారు. ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం.. ఓడిన అభ్యర్థులకు ఓట్ల లెక్కింపుపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఎన్నికల ఫలితాలు వచ్చిన తేదీ నుంచి 45 రోజుల్లోగా పిటిషన్ దాఖలు చేయొచ్చు.

నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే ఏం చేయాలో చెప్పండి

▸ ఈసీకి సుప్రీంకోర్టు నోటీసులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): నోటాకు ఎక్కువ ఓట్లు వస్తే ఏమి చేయాలో చెప్పాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి శుక్రవారం సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఎన్నికల్లో నోటాకు ఎక్కువ ఓట్లు పోలైతే ఆ ఎన్నికను రద్దుచేసి, మళ్లీ నిర్వహించాలని కోరుతూ వక్త, రచయిత శివ్ ఖేరా దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నోటీసులు ఇచ్చింది. నోటా కంటే తక్కువ ఓట్లు పొందిన అభ్యర్థులు మళ్లీ అదే నియోజకవర్గంలో ఐదేళ్ల వరకూ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆదేశించాలని పిటిషనర్ కోరారు. ఈ పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణ వాదనలు వినిపించారు. ఇటీవల సూరత్‌లో బీజేపీ అభ్యర్థి పోటీ లేకుండా ఎన్నికైన అంశాన్ని గుర్తు చేశారు. "ఇది సరైన పద్ధతి కాదు. పోటీలో ఒకే అభ్యర్థి ఉన్నప్పటికీ ఎన్నిక నిర్వహించాలి. బీజేపీ అభ్యర్థిని తమ నాయకుడిగా ఎన్నుకోవడం ఇష్టంలేని వారు రాజ్యాంగం తమకు కల్పించిన హక్కులో భాగంగా నోటాకు ఓటేసేవారేమో! సూరత్‌లో నోటాను చెల్లుబాటు అయ్యే అభ్యర్థిగా పరిగణించడంలో కేంద్ర ఎన్నికల సంఘం విఫలమైంది" అని వాదించారు. ఇది ఎన్నికల ప్రక్రియ కాబట్టి కేంద్ర ఎన్నికల సంఘం ఏం చెబుతుందో వినాల్సిన అవసరం ఉందంటూ ఎన్నికల సంఘానికి నోటీసులు జారీ చేశారు.

నటుడు రవికిషన్‌కు ఉపశమనం

ముంబై, ఏప్రిల్ 26: ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీ గోరఖ్‌పూర్ లోక్‌సభ స్థానం అభ్యర్థి, నటుడు రవికిషన్‌ని తన తండ్రిగా పేర్కొంటూ ఆయనకు డీఎన్ఏ టెస్ట్ నిర్వహించాలని షినోవా(25) అనే యువతి వేసిన పిటిషన్‌ను ముంబై కోర్టు శుక్రవారం తిరస్కరించింది. ముంబైలో దిండోషి సెషన్స్ కోర్టు ఈ పిటిషన్‌పై వాదనలు విన్న తర్వాత ఆమె తల్లి అపర్ణ సోనికి రవికిషన్‌కు మధ్య అనుబంధం ఉన్నట్లు ఎలాంటి ప్రాథమిక ఆధారాలు లేవని పేర్కొంది. కాగా ఏప్రిల్ 16న లక్నవూలో నిర్వహించిన ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అపర్ణ సోని మాట్లాడుతూ.. రవికిషనే షినోవా తండ్రి అని, ఆయన కుమార్తెగా ఆమెకున్న హక్కులను నిరాకరిస్తున్నారని ఆరోపించారు. మరోవైపు రవికిషన్ భార్య ప్రీతి శుక్లా.. అపర్ణ, షినోవా, మరికొందరిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. అపర్ణ తనకు అండర్ వరల్డ్‌తో సంబంధాలు ఉన్నాయని తనను బెదిరించారని ఆరోపించారు. దీంతో పోలీసులు అపర్ణ సోని, ఆమె భర్త రాజేష్ సోని, కుమార్తె షినోవా, కుమారుడు సౌనక్ సోని, సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు వివేక్ కుమార్ పాండే, ఖుర్షీద్ ఖాన్ అనే యూట్యూబ్ ఛానల్ జర్నలిస్టుపై కేసు నమోదు చేశారు.

మోదీ వణుకుతున్నారు!

స్టేజీపైనే కన్నీళ్లు కూడా పెడతారేమో.. ప్రధానిపై రాహుల్ సంచలన వ్యాఖ్యలు


బళ్లారిలో ఎన్నికల ప్రచారంలో ఖాళీ చెంబును చూపిస్తున్న రాహుల్

బెంగళూరు/బళ్లారి, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీపై ప్రధాని నరేంద్ర మోదీ చేసిన విమర్శలపై ఆ పార్టీ నాయకుడు రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఇటీవల మోదీ ప్రసంగాలను గమనిస్తే ఆయన భయంతో వణుకుతున్నట్లుందని, రాబోయే రోజుల్లో ఆయన స్టేజీపైనే కన్నీళ్లు కూడా పెడతారేమోనంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. శుక్రవారం కర్ణాటక రాష్ట్రంలోని విజయపురలో జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. ప్రస్తుతం దేశంలో పేదరికం, నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి ప్రధాన సమస్యలు ఉన్నాయని చెప్పారు. మోదీ తన మాటలతో వాటినుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తున్నారని ఆరోపించారు. 'కొన్నిసార్లు చైనా, పాకిస్థాన్ అంటారు. కొన్నిసార్లు పళ్లేలు కొట్టి శబ్దం చేయమంటారు. ఇంకోసారి మీ మొబైల్ ఫోన్లలో టార్చ్‌లైట్ ఆన్ చేయమని అడుగుతారు' అని రాహుల్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ మాత్రమే నిరుద్యోగాన్ని రూపుమాపగలదని, ధరల పెరుగుదలను అరికట్టగలదని, ప్రజలకు తమ వంతు వాటా ఇవ్వగలదని ఆయన స్పష్టం చేశారు. మోదీ హయాంలో నిరుద్యోగం కొవిడ్ వ్యాపించినట్లు పెరిగిపోయిందన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని యువతకు రాహుల్ హామీ ఇచ్చారు. దేశ చరిత్రలో మొదటిసారిగా ఒక పార్టీ, ఒక వ్యక్తి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయాలని చూస్తున్నారని రాహుల్ ఆరోపించారు.

శ్రీమంతుల సొమ్మును రైతులకు పంచుతాం

ప్రధాని మోదీ శ్రీమంతులకు ఇచ్చిన సొమ్మును రైతులకు పంచడమే తమ పథకమని రాహుల్ అన్నారు. గడిచిన పదేళ్లలో బిలియనీర్లకు మాత్రమే మోదీ మద్దతు ఇచ్చి పోషించారని విమర్శించారు. అదానీకి పెద్ద ప్రాజెక్టులు కట్టబెట్టారని, పేదలకు ఏమిచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కర్ణాటకలో ఇచ్చిన ఐదు గ్యారంటీలతో పేదలకు ఎంతో ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు.

బీజేపీ చెంబు పార్టీ: రాహుల్

బీజేపీ అంటే భారతీయ చెంబు పార్టీ అని, కరువు సాయంగా కర్ణాటకకు రూ.18వేల కోట్లు రావాల్సి ఉండగా, ఆ రాష్ట్రానికి ఖాళీ చెంబు మాత్రమే దక్కిందని రాహుల్ గాంధీ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన బళ్లారి మున్సిపల్ కాలేజీ మైదానంలో శుక్రవారం జరిగిన బహిరంగ సభలో ప్రసంగించారు. 'దేశ సంపదను తమకు అనుకూలమైన 22మంది సంపన్నులకు బీజేపీ పంచింది. పూర్వం రాజులు వారి సామ్రాజ్యాన్ని ఇష్టారాజ్యంగా పరిపాలించారు. అలాంటి వారి నుంచి దేశాన్ని రక్షించుకునేందుకు కాంగ్రెస్ పోరాడుతోంది" అని ఆయన పేర్కొన్నారు. తాము అధికారంలోకి రాగానే దేశంలో పేదల జాబితాను తయారు చేసి, ప్రతి ఒక్కరి ఖాతాలో ఏడాదికి రూ.లక్ష వేస్తామని, రైతుల రుణాలను మాఫీ చేస్తామని చెప్పారు.

ముగిసిన రెండో దశ

13 రాష్ట్రాల్లోని 88 స్థానాలకు పోలింగ్.. 63.5 శాతం నమోదు

▸ కేరళలో ఈ దశలోనే ఎన్నికలు పూర్తి


అసోంలోని దర్రాంగ్‌లో మండే ఎండలో ఓటర్ల క్యూ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల రెండోదశ పోలింగ్ శుక్రవారం ముగిసింది. భానుడు నిప్పులు కురిపిస్తున్నప్పటికీ దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లోని 88 స్థానాల్లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. రాత్రి 8 గంటల వరకు 63.5 శాతం పోలింగ్ నమోదైందని, పూర్తి వివరాలు లభించిన అనంతరం పోలింగ్ శాతం పెరగవచ్చని ఎన్నికల సంఘం (ఈసీ) ప్రకటించింది. రెండో దశలో కేరళలోని మొత్తం స్థానాలు (20), కర్ణాటక (14), రాజస్థాన్ (13), యూపీ (8), మహారాష్ట్ర (8), మధ్యప్రదేశ్ (6), అస్సాం (5), బిహార్ (5), ఛత్తీస్‌గఢ్ (3), పశ్చిమబెంగాల్ (3)లతోపాటు జమ్మూకశ్మీర్, మణిపూర్, త్రిపురలోని ఒక్కో స్థానానికి పోలింగ్ జరిగింది. అత్యధికంగా త్రిపురలో 79.46 శాతం పోలింగ్ నమోదు కాగా, అత్యల్పంగా బిహార్‌లో 55.08 శాతం నమోదైంది. కాగా, రెండో దశలో 89 నియోజకవర్గాల్లో పోలింగ్ జరగాల్సి ఉండగా 88 స్థానాలలోనే జరిగింది. మధ్యప్రదేశ్‌లోని బేతుల్‌లో బరిలో ఉన్న బీఎస్పీ అభ్యర్థి మరణించడంతో ఆ స్థానానికి పోలింగ్‌ను మే 7న జరిగే మూడోదశ ఎన్నికలతో కలిపి నిర్వహించనున్నారు. కేరళలో మొత్తం 20 సీట్లకు ఎన్నికలు జరిగాయి. దేశవ్యాప్తంగా చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగిందని ఈసీ తెలిపింది. మధ్యప్రదేశ్‌లో ఓ ప్రభుత్వ పాఠశాలలో ఎన్నికల విధుల్లో ఉన్న జవాన్ తన సర్వీస్ రైఫిల్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తీవ్ర ఉద్రిక్తతలు చెలరేగిన మణిపూర్‌లో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఆ రాష్ట్రంలో 77.32 శాతం పోలింగ్ నమోదు కావటం గమనార్హం. శుక్రవారం పలు రాష్ట్రాల్లో ఎండలు మండిపోయాయి. తీవ్రమైన ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బిహార్‌లోని ఖగారియా, ముంగేర్ నియోజకవర్గాలలో ఎండ తీవ్రత కారణంగా ఓటర్లకు అధికారులు షామియానాలు ఏర్పాటు చేసి, తాగునీరు, మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచారు. ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్, కాంకేర్ పార్లమెంటు స్థానాల పరిధిలోని 46 గ్రామాల ప్రజలు లోక్‌సభకు ఎన్నికలకు సంబంధించి తొలిసారిగా తమ గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్లలో ఓటుహక్కు వినియోగించుకున్నారు. పోలింగ్ పూర్తయిన అనంతరం ప్రధాని మోదీ ఎక్స్‌లో ట్వీట్ చేస్తూ.. 'రెండోదశ చాలా బాగా పూర్తయ్యింది. ఎన్‌డీఏకు అద్భుతంగా లభించిన స్పందన ప్రతిపక్షాలను మరింత నిరాశపరుస్తుంది' అన్నారు.

బరిలో ఉన్న ప్రముఖులు

రెండో దశ ఎన్నికల బరిలో పలువురు ప్రముఖులు పోటీ పడ్డారు. వీరిలో రాహుల్‌గాంధీ, శశిథరూర్, కేసీ వేణుగోపాల్, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ సోదరుడు డీకే సురేష్, లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, కేంద్రమంత్రులు రాజీవ్ చంద్రశేఖర్, గజేంద్రసింగ్ షెకావత్, సినీ నటి హేమమాలిని, తేజస్వీ సూర్య, కర్ణాటక మాజీ సీఎం కుమారస్వామి ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల తొలిదశ పోలింగ్ ఈ నెల 19న 102 స్థానాలకు జరిగింది. ఇప్పటి వరకూ మొత్తం 190 నియోజకవర్గాలకు పోలింగ్ పూర్తయ్యింది.

ఐదో దశ నోటిఫికేషన్ విడుదల

లోక్‌సభ ఎన్నికల ఐదో దశ నోటిఫికేషన్ శుక్రవారం విడుదలైంది. 8 రాష్ట్రాలలోని 49 నియోజవర్గాలలో ఎన్నికలకు ఈసీ నోటిఫికేషన్ విడుదల చేసింది. మే 20న పోలింగ్ జరుగనుంది. ఈ దశలో యూపీలోని అమేథీ, రాయబరేలీ తదితర స్థానాలున్నాయి. శుక్రవారం నుంచే నామినేషన్ల స్వీకరణ మొదలు కాగా మే 3 నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ. మే 4న నామినేషన్ల పరిశీలన జరుగుతుంది.

కర్ణాటకలో తొలి విడత పూర్తి

బెంగళూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో మొదటి విడతలో బెంగళూరు దక్షిణ, బెంగళూరు ఉత్తర, బెంగళూరు సెంట్రల్, బెంగళూరు గ్రామీణ, తుమకూరు, కోలారు, చిత్రదుర్గ, చిక్కబళ్లాపుర, మండ్య, మైసూరు, చామరాజనగర, హాసన్, ఉడుపి-చిక్కమగళూరు, దక్షిణ కన్నడ లోక్‌సభ నియోజకవర్గాల్లో శుక్రవారం పోలింగ్ జరిగింది. పోలింగ్ ప్రశాంతంగా ముగిసినప్పటికీ కొన్నిచోట్ల ప్రజలు తమ సమస్యలపై నిరసన వ్యక్తం చేశారు. చామరాజనగర జిల్లా హనూరు తాలూకా మహదేశ్వరగుట్ట పరిధిలో స్థానిక సమస్యలపై ఓటర్లు పోలింగ్‌ను బహిష్కరించారు. నచ్చచెప్పేందుకు వచ్చిన అధికారులపైన తిరగబడ్డారు. పోలింగ్ కేంద్రాన్ని ధ్వంసం చేసి ఈవీఎంలను తగలబెట్టారు. మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టే విధంగా ఓ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఆరోపణలపై బీజేపీ అభ్యర్థి తేజస్వీసూర్య, ఆ పార్టీ నేత సీటీ రవిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

స్త్రీ ధనంపై భర్తకు అధికారం లేదు

▸ అదేమీ ఉమ్మడి ఆస్తి కాదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: భార్యకు చెందిన స్త్రీ ధనంపై భర్తకు ఎలాంటి నియంత్రణ ఉండదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఒకవేళ ఇబ్బందుల్లో ఉన్నప్పుడు దానిని తీసుకున్నా దానిని తిరిగి ఆమెకు చెల్లించాల్సిన నైతిక బాధ్యత ఆయనపై ఉందని తెలిపింది. భార్య తీసుకొచ్చిన నగలను అమ్మేసినందుకు ఆమెకు రూ.25 లక్షలు చెల్లించాలని కేరళకు చెందిన ఓ వ్యక్తిని ఆదేశించింది. ఆ మహిళ 2009లో ఆ వ్యక్తిని రెండో వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో 89 సవర్ల బంగారు నగలను తీసుకెళ్లింది. భర్త నగలను తీసుకున్నాడు. అమ్మేసి అప్పు కట్టాడు. అనంతరం గొడవలు రావడంతో భార్య ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించింది. భర్త, అత్త కలిసి తన నగలు అమ్మేశారని, వాటిని ఇప్పించాలని కోరింది. ఆమెకు అనుకూలంగా 2011లో ఫ్యామిలీ కోర్టు తీర్పు ఇచ్చింది. దీనిపై అతడు హైకోర్టులో అప్పీలు చేశాడు. బంగారాన్ని అమ్మేసినట్టు ఆమె నిరూపించలేకపోవడంతో దాన్ని ఇవ్వాల్సిన పనిలేదని తెలిపింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ మళ్లీ సదరు భార్య సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. స్త్రీ ధనం భార్యాభర్తల ఉమ్మడి ఆస్తి కాదని, దీనిపై భర్తకు హక్కు ఉండదని స్పష్టం చేసింది.

సందేశాల ఎన్‌క్రిప్షన్‌ను తొలగించం

▸ బలవంతం చేస్తే భారత్ నుంచి వెళ్లిపోతాం

▸ ఢిల్లీ హైకోర్టుకు వాట్సాప్ వెల్లడి



న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: తమ వినియోగదారుల సందేశాలకు సంబంధించి ఎన్‌క్రిప్షన్ విధానాన్ని తొలగించాలని బలవంతం చేస్తే నిరభ్యంతరంగా భారత్ నుంచి వైదొలుగుతామని ఢిల్లీ హైకోర్టుకు వాట్సాప్ స్పష్టం చేసింది. 'కొత్త ఐటీ నిబంధనలు-2021'లోని పలు సెక్షన్లను సవాల్ చేస్తూ వాట్సాప్, ఫేస్‌బుక్ (ఇప్పుడు మెటా) సంస్థలు గతంలో దాఖలు చేసిన పిటిషన్‌పై తాజాగా కోర్టు విచారణ జరిపింది. తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మన్మీత్ ప్రీతం సింగ్ అరోరాల ధర్మాసనం ముందు వాట్సాప్ తరఫున సీనియర్ న్యాయవాది తేజస్ కరియా వాదనలు వినిపించారు. 'వాట్సా‌ప్‌లో సందేశాల భద్రత కోసం ఎండ్ టు ఎండ్ ఎన్‌క్రిప్షన్ విధానాన్ని అవలంబిస్తున్నాం. సందేశాన్ని పంపిన వారు.. గ్రహీత మాత్రమే దాన్ని చదవగలరు. కొత్త నిబంధనల మేరకు ఇప్పుడు ఆ ఎన్‌క్రిప్షన్ విధానాన్ని బ్రేక్ చేయాల్సి ఉంటుంది. అలా మీరు చేయాలని చెబితే భారత్ నుంచి వైదొలుగుతాం' అని తేల్చి చెప్పారు. ఐటీ నిబంధనల్లోని 4 (2) సెక్షన్ మేరకు చాట్‌లను ట్రేస్ చేయడం, మూలాలను గుర్తించడం లాంటివి చేయాల్సి ఉంటుందన్నారు. ఇది భావ ప్రకటన స్వేచ్ఛకు, వినియోగదారుల గోప్యత హక్కుకు భంగం కలిగిస్తుందని.. రాజ్యాంగ విరుద్ధమని వాదించారు. సామాజిక మాధ్యమ సంస్థలతో ఎటువంటి సంప్రదింపులు జరపకుండానే కొత్త నిబంధనలు తెచ్చారని ఆక్షేపించారు. దీంతో కోర్టు కలుగజేసుకొని ఇతర దేశాల్లో ఇటువంటి చట్టాలు లేవా అని ప్రశ్నించింది. దీనికి కరియా బదులిస్తూ.. 'ఏ దేశంలోనూ ఇటువంటి నిబంధనలు లేవు' అని తెలిపారు. వాదనల అనంతరం కోర్టు.. విచారణను ఆగస్టు 14వ తేదీకి వాయిదా వేసింది.

మీకు ప్రజల కంటే రాజకీయ ప్రయోజనాలే ఎక్కువయ్యాయి

▸ కేజ్రీవాల్‌పై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26: దేశ రాజధాని పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాసంవత్సరం ప్రారంభమైనప్పటికీ.. విద్యార్థులకు ఇంకా పుస్తకాలు పంపిణీ కాలేదన్న పిటిషన్‌పై ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఢిల్లీ హైకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. జైలులో ఉన్నప్పటికీ సీఎం పదవికి కేజ్రీవాల్ రాజీనామా చేయకపోవటం వల్ల, మరొకరు ఆ బాధ్యతలు స్వీకరించకపోవటం వల్ల ఢిల్లీలో పాలన స్తంభించిపోతోందన్న అర్థం వచ్చేలా వ్యాఖ్యలు చేసింది. ఓ స్వచ్ఛందసంస్థ దాఖలు చేసిన పిల్‌పై కోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. పుస్తకాల పంపిణీకి సీఎం ఆమోదం అవసరమని, కానీ, ఆయన జైలులో ఉన్నారని ఢిల్లీ ప్రభుత్వ న్యాయవాది చెప్పటంతో ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. విద్యార్థుల, ప్రజల ప్రయోజనాల కన్నా తన వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలకే కేజ్రీవాల్ ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని మండిపడింది. దేశ ప్రయోజనాలే అత్యంత ముఖ్యమైనవని ఇప్పటివరకూ తాము సంయమనంతో చెబుతూ వచ్చామని, కానీ ఇది తప్పని రుజువవుతోందని.. సోమవారం దీనిపై ఆదేశాలు జారీ చేస్తామని తెలిపింది.

లోకం తీరు





అబ్ కీ బార్?

నేను చచ్చే దాకా కాంగ్రెస్‌లోనే ఉంటా : వీహెచ్



నేను చచ్చేదాకా కాంగ్రెస్ పార్టీలోనే ఉంటాను. రాహుల్‌గాంధీ ప్రధాని అయితేనే బడుగు బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుంది. ఉద్యోగాలు రావాలన్నా, పదోన్నతులు పొందాలన్నా రాహుల్ గాంధీ ప్రధాని కావాలి. ప్రధాని మోదీ బీసీలకు ఎలాంటి న్యాయం చేయలేదు. ఆయనకు ఓటేస్తే అంబానీ, అదానీలకు ఓటేసినట్లే. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటేయించే బాధ్యతను బీసీలు తీసుకోవాలి.

- కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హన్మంతరావు



నేను రాజీనామాతో వచ్చా.. రేవంత్ ఎక్కడ?

- మేధావుల చేతికి రాజీనామా లేఖ అందిస్తున్నా
- ఆగస్టు 15లోగా రుణ మాఫీతోపాటు 6 గ్యారెంటీలను ఈ సర్కారు అమలు చేస్తే..వాళ్లే స్పీకర్‌కు ఇవ్వొచ్చు: హరీశ్

హైదరాబాద్/అఫ్జల్‌గంజ్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): "నా రాజీనామా లేఖతో నేను గన్‌పార్క్‌కు వచ్చా.. సవాల్ విసిరిన సీఎం రేవంత్‌రెడ్డి ఎక్కడ? ప్రజలను మోసం చేసినందుకే ఆయన ఇక్కడకు రాలేదు" అని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. రుణమాఫీపై సవాళ్ల, ప్రతి సవాళ్ల నేపథ్యంలో రాజీనామా పత్రం జేబులో పెట్టుకొని సిద్ధంగా ఉండాలంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఈ మేరకు శుక్రవారం రాజీనామా లేఖతో గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్దకు వచ్చారు. ఈ సందర్భంగా అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత నెలకొంది. బీఆర్ఎస్ శ్రేణులు భారీగా గన్‌పార్కు వద్దకు చేరుకోగా.. అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకోవడంతో వాగ్వాదం జరిగింది. అనంతరం అమరువీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రేవంత్ సవాల్‌ను స్వీకరించి తన రాజీనామా లేఖతో అమరుల స్థూపం వద్దకు వచ్చానన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని భావిస్తే సీఎం కూడా గన్‌పార్క్ వద్దకు రావాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సాక్షిగా.. మేధావుల చేతిలో తన రాజీనామా లేఖను పెడుతున్నానని, సీఎం కూడా తన రాజీనామాను మేధావుల చేతిలో పెట్టాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15లోపు రుణమాఫీతోపాటు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తే తన రాజీనామా లేఖను వారే స్పీకర్‌కు ఇవ్వొచ్చని అన్నారు. అమలు చేయకపోతే రేవంత్‌రెడ్డి తన రాజీనామా లేఖను గవర్నర్, లేదా స్పీకర్‌కు ఇవ్వాలని సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు సోనియమ్మ మాట అంటూ హామీలిచ్చిన రేవంత్.. అధికారంలోకి వచ్చాక మోసం చేశారని దుయ్యబట్టారు. తాజాగా మరోసారి ఆగస్టు 15లోగా రుణమాఫీ అంటూ మాయ చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా బేషరతుగా ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అమరవీరుల స్థూపం వద్ద పసుపు నీరు చల్లి..

హరీశ్‌రావు వ్యాఖ్యలపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ నిరసన తెలిపారు. హరీశ్ రాకతో అమరవీరుల స్థూపం మలినమైందని పేర్కొంటూ పసుపు నీరు చల్లి శుద్ధి చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉద్యమ సమయంలో వందలాది మంది విద్యార్థుల మరణాలకు కారణమైన హరీశ్ అమరుల స్థూపం వద్దకు వచ్చి మలినం చేశారని దుయ్యబట్టారు. ఆగస్టు 15 లోగా 2 లక్షల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారని, దీనికి కట్టుబడి ఉంటారని స్పష్టం చేశారు. ఆ తర్వాత తానే బాధ్యత తీసుకుని హరీశ్ రాజీనామాను ఆమోదింపజేయిస్తానన్నారు.

రాజీనామా సిద్ధంగా ఉంచుకో!

(మొదటిపేజీ తరువాయి)

సోషల్ మీడియా వారియర్స్‌తో సీఎం రేవంత్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మోసం చేయాలనుకున్న ప్రతిసారీ హరీశ్‌రావుకు అమరవీరుల స్తూపమే గుర్తుకువస్తుందన్నారు. అమరవీరుల స్తూపాన్ని తన మోసానికి ముసుగులా హరీశ్‌రావు మార్చుకున్నారని విమర్శించారు. ఇన్నాళ్లుగా ఆయన ఎప్పుడైనా అమరవీరుల స్తూపం వద్దకు వెళ్లారా? అని ప్రశ్నించారు. "హరీశ్‌రావు అతితెలివి ప్రదర్శిస్తున్నడు. చాంతాడంత లేఖను రాసుకొచ్చి రాజీనామా లేఖ అంటున్నడు. తన మామ చెప్పిన సీస పద్యాన్నంతా లేఖలో రాసుకొచ్చిండు. రాజీనామా లేఖ అలా ఉండదు. స్పీకర్ ఫార్మాట్‌లో రాజీనామా లేఖ లేకపోతే ఆ రాజీనామా చెల్లదు. ఆయన తెలివి మోకాళ్ల నుంచి అరికాళ్లలోకి జారినట్టుంది" అని రేవంత్ వ్యాఖ్యానించారు.

ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు..

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు జరుగుతున్నాయని సీఎం రేవంత్ వ్యాఖ్యానించారు. "అధికారంలో ఎవరున్నా ఫర్వాలేదు.. ఈయన పోతే చాలు అన్నకాడికి బీఆర్ఎస్ వాళ్లు వచ్చిన్రు. కేసీఆర్, కేటీఆర్‌కు మనల్ని చూస్తేనే ఒంటిపైన పాములు, జెర్రులు పారినట్లు, పాయింట్ పచ్చిగైనట్లు ఉన్నది. అందుకని వారు ఎవరితోనైనా కలుస్తరు. లోక్‌సభ ఎన్నికల్లో 12 సీట్లు ఇస్తే.. ఏడాదిలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తదని కేటీఆర్ అంటున్నడు. ఎట్లొస్తది? ఇక్కడ మేమేమైనా అల్లాటప్పగ ఉన్నమా?" అంటూ రేవంత్ మండిపడ్డారు. సోషల్ మీడియా వారియర్లు అప్రమత్తంగా ఉండి ఈ కుట్రలను తిప్పికొట్టాలని సూచించారు. కేసీఆర్‌ను ఓడించడం సెమీ ఫైనల్ అయితే.. ఇప్పుడు మోదీని ఓడించడం ఫైనల్ అని వ్యాఖ్యానించారు.



మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో జరిగిన రోడ్‌షోలో పాల్గొన్న సీఎం రేవంత్

కాంగ్రెస్‌ను ఎలాగైనా ఓడించాలని చూస్తున్న మోదీ, అమిత్‌షా.. కిరాయి మనుషులను పెట్టుకుని తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంపై, రిజర్వేషన్లపై బీజేపీ దాడులు చేస్తోందని, దీనికి మతాన్ని, ఏజెన్సీలనూ ఉపయోగించుకుంటోందని ధ్వజమెత్తారు. తెలంగాణ ప్రజలకు బతుకమ్మ, బోనాల పండుగ నిర్వహించడం కల్వకుంట్ల కవిత నేర్పిందనట్లుగా వ్యవహరిస్తే.. శ్రీరామనవమి, హనుమాన్ జయంతి నిర్వహించడం బండి సంజయ్, అరవింద్ నేర్పినట్లు వ్యవహరిస్తున్నారని సీఎం రేవంత్ అన్నారు. భగవంతుడు గుడిలో ఉండాలి.. భక్తి గుండెల్లో ఉండాలని పునరుద్ఘాటించారు. "బీజేపీ భావజాలం ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన భావజాలం. రిజర్వేషన్లు రద్దు చేయాలన్నది ఆర్ఎస్ఎస్ విధానం. ఆర్ఎస్ఎస్ తరహాలోనే దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల రిజర్వేషన్లను రద్దు చేయాలన్నది బీజేపీ విధానం" అని రేవంత్ అన్నారు. మోదీ.. బ్రిటిష్ విధానంతో దేశాన్ని ఆక్రమించుకోవాలని చూస్తున్నారని, ఇవాళ తెలంగాణ రాష్ట్రంపై దాడి చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అంటే బ్రిటిష్ జనతా పార్టీ అని వ్యాఖ్యానించారు.

రిజర్వేషన్ల రద్దుకు కంకణం కట్టుకున్న బీజేపీ..

రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ కుట్ర చేస్తోందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. రిజర్వేషన్లు తీసేయాలంటే రాజ్యాంగ సవరణ జరగాల్సి ఉంటుందని, దానికి 2/3 మెజారిటీ ఉండాలని అన్నారు. అంటే దాదాపు 400 సీట్లు కావాలని, అందుకే బీజేపీ ఈసారి 400 సీట్లు అన్న నినాదాన్ని ఎత్తుకుందని పేర్కొన్నారు. రాజ్యాంగానికి సమూల మార్పులు తీసుకొచ్చి రిజర్వేషన్లను రద్దు చేయడానికి ఆ పార్టీ కంకణం కట్టుకుందని ఆరోపించారు. కార్పొరేట్ కంపెనీల కుట్రలో భాగంగానే ఇది జరుగుతోందన్నారు. రిజర్వేషన్లు రద్దు చేసి.. ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ అంబానీ, అదానీలకు పల్లీ బఠానీల కింద అమ్మేయాలన్న పెద్ద కుట్ర జరుగుతోందని ఆరోపించారు.

మోదీ కాలనాగు లాంటోడు

సంగారెడ్డి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ కాలనాగు లాంటివాడని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఆయన అనుకున్నది జరగకపోతే పగ పడతారని, పగ పెట్టుకుంటారని తెలిపారు. మోదీ, అమిత్‌షాకు.. అదానీ, అంబానీ తోడయ్యారని, ఈ నలుగురు కలిసి దేశ సంపదను దోచుకొనేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి జహీరాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో జరిగిన కాంగ్రెస్ జనజాతర సభలో రేవంత్ మాట్లాడారు. రిజర్వేషన్లు పోవాలనుకుంటేనే బీజేపీకి ఓటేయండని, రిజర్వేషన్లు కావాలి, రిజర్వేషన్లు పెంచాలి అనుకుంటే మాత్రం కాంగ్రెస్‌కు అండగా నిలవాలని కోరారు. గడిచిన పదేళ్లపాటు కేంద్రంలో మోదీ దుర్మార్గ పాలనను 140 కోట్ల మంది ప్రజలు చూశారని, రాష్ట్రంలో పదేళ్లపాటు నిరంకుశ పాలన చూశారని వ్యాఖ్యానించారు. వీరిద్దరు కలిసి వంద రోజుల్లో ఐదు గ్యారంటీలను అమలు చేసిన తమను ఓడించాలని ఎందుకు చూస్తున్నారో ప్రజలు గమనించాలన్నారు. రిజర్వేషన్లు పెంచాలంటే బీసీల కులగణన జరగాలని, అప్పుడే వారికి అన్ని రంగాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని రేవంత్ తెలిపారు. బీసీ జనాభా లెక్క కట్టేందుకు గత శాసనసభ సమావేశాల్లోనే ఆమోదం తెలిపామని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో బీఆర్ఎస్, బీజేపీ ఒక్కటేనని, కేసీఆర్ తన బిడ్డను జైలునుంచి విడిపించుకోవడం కోసం బీజేపీని గెలిపించేందుకు ప్రయత్నిస్తున్నారని రేవంత్ ఆరోపించారు. అందుకే జహీరాబాద్‌తో ఎటువంటి సంబంధం లేని గాలి అనిల్‌కుమార్‌ను అభ్యర్థిగా నిలబెట్టారని తెలిపారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రం ఆగమాగమైందని, అన్నమో రామచంద్రా అని అడుక్కునే పరిస్థితి ఏర్పడిందని రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఎంతో మంది ఆత్మ బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైతే.. నిరుద్యోగులెవరికీ కేసీఆర్ ఉద్యోగాలు ఇవ్వలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే 30 వేల మంది నిరుద్యోగులకు ఉద్యోగాలిచ్చామని తెలిపారు.



కోహెడలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం

అంబానీ, అదానీకి దోచిపెట్టిన సంపదను కక్కిస్తాం

- బీఆర్ఎస్ నిర్వాకం వల్లే సిరిసిల్ల నేతన్నల ఆత్మహత్యలు: పొన్నం

కోహెడ/హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీజేపీ పాలనలో దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెట్టారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఆ సంపదనంతా కక్కిస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ తెలిపారు. ప్రజాధనాన్ని తిరిగి ప్రజలకే అప్పగిస్తామని పేర్కొన్నారు. కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్.. ప్రజలను అరిగోస పెట్టాయని ఆరోపించారు. నిత్యావసరాల ధరలు చుక్కలనంటినా పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. సిద్దిపేట జిల్లా కోహెడలో శుక్రవారం నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొన్నారు. అనంతరం గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి పథకాలను విజయవంతంగా అమలు చేశామని గుర్తు చేశారు. ఆగస్టు 15లోపు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని, ఆ విషయాన్ని గల్లా ఎగరేసుకొని చెప్పాలని కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేవుడి పేరు చెప్పి ఓట్లు అడిగే మూర్ఖులను దరిదాపులకు కూడా రానివ్వొద్దని ఓటర్లను కోరారు. బీజేపీ గ్రాఫ్ పడిపోతుండడంతో ప్రజలను అయోమయానికి గురి చేసేలా మోదీ మాట్లాడుతున్నారని, ఆయన ప్రకటనలను దేశ ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. పదేళ్ల అధికారంలో కొనసాగి బకాయిలు చెల్లించకుండా సిరిసిల్ల నేతన్నలను అప్పుల ఊబిలో నెట్టేసిన బీఆర్ఎస్ నాయకులు.. ఇప్పుడు శవరాజకీయాలు చేస్తున్నారని పొన్నం ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత పాత బకాయిల కింద ఇప్పటికే రూ.50కోట్లు ప్రభుత్వం విడుదల చేశామని, త్వరలోనే మరో రూ.50కోట్లు ఇస్తామని తెలిపారు. ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికుల కుటుంబాలను ఆదుకుంటామని చెప్పారు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే చేనేత వస్త్రాలను స్కూల్ పిల్లల యూనిఫాం కోసం కొనుగోలు చేయాలని నిర్ణయించినట్టు పేర్కొన్నారు. నేతన్నలకు ఎలాంటి సమస్యలు ఉన్నా నేరుగా తన వద్దకు రావాలని సూచించారు.

సోనియా, రాహుల్ వల్లే మాకు పదవులు

రాజీవ్‌గాంధీ హంతకులనే క్షమించిన గుణం వారిది .. వారి నీడలోనే మేమంతా రాజకీయంగా బతుకుతున్నాం



- పార్టీలోకి ఎవరొచ్చినా చేర్చుకోవాలన్నది ఏఐసీసీ నిర్ణయం
- అందరం కట్టుబడి ఉండాలి
- సంగారెడ్డి ఎమ్మెల్యే వస్తానన్నా పార్టీలో చేర్చుకోవాలని చెప్పా: జగ్గారెడ్డి

హైదరాబాద్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): తమ పదవులు, రాజకీయ భవితవ్యం... సోనియా, రాహుల్‌గాంధీ కష్ట ఫలితమేనని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. రాజీవ్‌గాంధీని హత్య చేసిన వారినే క్షమించేసిన గుణం సోనియా, రాహుల్, ప్రియాంకది అని గుర్తు చేశారు. వారి నీడలోనే తామంతా రాజకీయంగా బతుకుతున్నామని పేర్కొన్నారు. ఏఐసీసీ సూచన మేరకు ఘర్ వాపసీ మొదలైందన్నారు. పార్టీలోకి ఎవరొచ్చినా చేర్చుకోవాలన్నది ఏఐసీసీ నిర్ణయమని, దానికి అందరం కట్టుబడి ఉండాల్సిందేనని అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. గత కొన్ని రోజులుగా ఘర్ వాపసీ కొనసాగుతోందని, కాంగ్రెస్ నుంచి ఇతర పార్టీల్లో చేరిన వారందరూ వెనక్కి వచ్చేస్తున్నారని చెప్పారు. మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ లాంటి వాళ్లూ వెనక్కు వచ్చారని గుర్తు చేశారు. ఎన్నికల సందర్భంగా పార్టీకి, నాయకులకు వ్యతిరేకంగా పని చేసిన వారినీ చేర్చుకోవాలని అధిష్ఠానం సూచించిందని తెలిపారు. గతంలో సంగారెడ్డి నియోజకవర్గంలోనూ ఓ ఐదారుగురు తనకు వ్యతిరేకంగా పని చేస్తే వారిని పార్టీ సస్పెండ్ చేసిందన్నారు. వారు మళ్లీ పార్టీలోకి వస్తానంటే రమ్మని చెప్పానన్నారు. ఈ విషయంలోఏఐసీసీ నిర్ణయం మేరకే నడుచుకుంటామని చెప్పారు. "సంగారెడ్డి ఎమ్మెల్యే.. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరతానంటే ఏం చేద్దామని మంత్రి దామోదర్ రాజనర్సింహ నా అభిప్రాయం అడిగిండు. వాళ్లు ఎవరైనా సరే అడిగితే చేర్చుకోండని చెప్పిన. వచ్చే ఎన్నికల్లో టికెట్ అడిగితే అన్న ప్రశ్నకూ.. ఇచ్చేయండనే చెప్పిన" అని వెల్లడించారు. మైనారిటీ రిజర్వేషన్లను ఎత్తేస్తామని అమిత్‌షా మాట్లాడుతున్నారని, మైనారిటీలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

మంత్రి సురేఖపై ఎన్నికల సంఘం ఆగ్రహం

- కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని సీరియస్
- స్టార్ కంపెయినర్‌గా బాధ్యతతో మెలగాలని హితవు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర దేవాదాయ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖపై శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం ఆగ్రహం వ్యక్తం చేసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావుపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సీరియస్ అయింది. కొండా సురేఖ ఈ నెల 1వ తేదీన వరంగల్‌లో మీడియా సమావేశంలో కేటీఆర్‌పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ ఈ నెల 6న మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, దాసోజు శ్రవణ్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ.. "కేసీఆర్‌గారు మీ కుమారుడు కేటీఆర్ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడి కొంతమంది అధికారులు ఉద్యోగాలు కోల్పోవడానికి కారణం అయ్యారు. చివరికి ఆ అధికారులు జైలు శిక్ష అనుభవించే పరిస్థితికి తెచ్చాడు. హీరోయిన్లను బ్లాక్ మెయిల్ చేశాడు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నాడు. ఇక సమయం ఆసన్నమైంది. కేటీఆర్ గారు కాస్త జాగ్రత్త. ఇప్పటికే మీ చెల్లెలు శ్రీకృష్ణ జన్మస్థలానికి వెళ్లింది. ఫోన్ ట్యాపింగ్ విషయంలో దర్యాప్తు సాగుతోంది. మీ కుట్రలు అన్నీ బయటికి వస్తాయి" అని అన్నారని బీఆర్ఎస్ నేతలు తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియో ఆధారాలను పరిశీలించిన కేంద్ర ఎన్నికల సంఘం.. కొండా సురేఖను మందలించింది. ప్రత్యర్థులపై ఆరోపణలు చేసే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని సూచించింది. కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయినర్‌గా, మంత్రిగా మరింత బాధ్యతతో ఉండాలని హితవు పలికింది.

జోరుగా కాంగ్రెస్ ఘర్ వాపసీ

- మాజీ మంత్రి సంభాని సహా పలువురు బీఆర్ఎస్ నేతల చేరిక

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో పార్టీని వీడిన నేతలను తిరిగి సొంతగూటికి తెచ్చుకునేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఘర్‌వాపసీ కార్యక్రమం జోరుగా సాగుతోంది. ఎన్నికల ముందు పార్టీపై అలిగి వెళ్లిపోయిన నేతలు ఒక్కొక్కరుగా తిరిగి కాంగ్రెస్‌లో చేరుతున్నారు. ఇందులో భాగంగా మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, సీనియర్ నేత ఎడవల్లి కృష్ణ, టీపీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్, కామేపల్లి జడ్పీటీసీ బానోతు ప్రవీణ్‌కుమార్ నాయక్, ఎంపీటీసీ శంకర్‌నాయక్ తదితరులు శుక్రవారం తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. చేరికల కమిటీ సభ్యులు తూర్పు జగ్గారెడ్డి, కోదండరెడ్డి వీళ్లని కాంగ్రెస్‌లోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో రేవంత్ రెడ్డికి మొదటి నుంచి సన్నిహితుడుగా ఉన్న టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి మానవతారాయ్.. సత్తుపల్లి టికెట్ దక్కకపోవడంతో ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో చేరారు. ఘర్ వాపసీలో భాగంగా గురువారం ఆయన తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. అదే సత్తుపల్లి టికెట్ ఆశించి భంగపడిన మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, కొత్తగూడెం టికెట్ దక్కకపోవడంతో ఎడవల్లి కృష్ణ, ముషీరాబాద్ టికెట్ దక్కలేదని సంగిశెట్టి జగదీష్ కూడా కాంగ్రెస్‌కు రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు. ఘర్‌వాపసీలో వీరంతా తిరిగి హస్తం గూటికి చేరారు. రానున్న రోజుల్లో ఘర్‌వాపసీ మరింత పుంజుకుంటుందని జగ్గారెడ్డి, కోదండరెడ్డి తెలిపారు.

మోదీని రక్షించేందుకు ఈసీ యత్నం: నిరంజన్

మత విద్వేశాలు రెచ్చగొట్టేలా ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదులను ఎన్నికల కమిషన్ పట్టించుకోలేదని, ఆయన్ను రక్షించే ప్రయత్నం చేస్తోందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. గాంధీభవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీకి నోటీసులు ఇవ్వకుండా బీజేపీ అధ్యక్షుడికి ఇచ్చిందని, విధులు సరిగా నిర్వర్తించని అధికారులపై చర్యలు తీసుకున్న ఈసీ.. మోదీపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. మోదీపైన చర్యలు తీసుకోనప్పుడు అధికారులపైనా తీసుకోవద్దన్నారు.

దానం నామినేషన్ తిరస్కరించండి

- ఈసీకి ఆన్‌లైన్‌లో బీఆర్ఎస్ ఫిర్యాదు

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరి.. సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్న ఎమ్మెల్యే దానం నాగేందర్ నామినేషన్‌ను తిరస్కరించాలని ఎన్నికల కమిషన్‌ను గులాబీ పార్టీ కోరింది. ఈ మేరకు శుక్రవారం ఈసీకి బీఆర్ఎస్ ప్రతినిధులు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. దానం వేసిన నామినేషన్‌ను తిరస్కరించడంతోపాటు ఆయన్ను ఎమ్మెల్యే పదవి నుంచీ సస్పెండ్ చేయాలని బీఆర్ఎస్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు.

హరీశ్‌రావు కాదు.. హౌలేశ్‌రావు

రాజకీయాల్లో ఆయనొక జోకర్.. ఉద్యమ సమయంలో 'అగ్గిపెట్టె' డ్రామా

- ఇప్పుడు డూప్లికేట్ రాజీనామా డ్రామా
- రుణమాఫీ చేసి రైతుల గుండెల్లో నిలుస్తాం: మంత్రి కోమటిరెడ్డి
- హరీశ్.. రాజీనామాకు సిద్ధంగా ఉండు: కొండా సురేఖ
- బీజేపీలో చేరేందుకే హరీశ్ రాజీనామా డ్రామా: రాజగోపాల్‌రెడ్డి



హరీశ్ రాజీనామాపత్రం ఇలా ఉండాలంటూ మీడియాకు చెబుతున్న మంత్రి కోమటిరెడ్డి



సిద్దిపేట జిల్లా దౌలాపూర్‌లో మాట్లాడుతున్న మంత్రి సురేఖ

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి)/జగదేవ్‌పూర్/భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 26: "రాష్ట్ర రాజకీయాల్లో హరీశ్‌రావు ఓ జోకర్‌గా మారారు. ఆయన పేరు హరీశ్‌రావు కాదు 'హౌలేశ్ రావు'. అధికారం పోయిన తరువాత మతిభ్రమించి అన్నీ హౌలే పనులు చేస్తున్నాడు. రాజకీయాల్లో ఆయనొక జోకర్" అని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆగస్టు 15 వరకు రైతుల రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటిస్తే.. ఆ ఒక్క హామీ నెరవేర్చడం కాదని, మొత్తం 13 హామీలను తీర్చాలని మాట మార్చారని విమర్శించారు. ఓ డూప్లికేట్ రాజీనామా పత్రాన్ని పట్టుకుని అమరుల స్తూపం దగ్గర డ్రామా చేస్తున్నాడని ధ్వజమెత్తారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డితో కలిసి విలేకరులతో ఆయన మాట్లాడారు. ఉద్యమ సమయంలో పెట్రోల్ పోసుకుని అగ్గిపెట్టె దొరకలేదని హరీశ్ డ్రామాలాడాడని, ఇపుడు రాజీనామా పేరుతో మరో డ్రామాకు దిగాడని.. అప్పటి నాటకానికి, ఇప్పటి నాటకానికి ఏం తేడా లేదని మండిపడ్డారు. రాజీనామా చేస్తే ఎవరైనా స్పీకర్ ఫార్మాట్‌లో ఒకే లైన్‌లో చేస్తారని.. హరీశ్ మాత్రం పేజీన్నర లేఖ రాసి రాజీనామా చేశానంటూ డ్రామాలాడుతున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ డ్రామాలు బంద్‌చేసి అక్రమంగా సంపాదించిన సొమ్ముతో దుబాయ్ లేదంటే ఇంకెక్కడికైనా వెళ్లి బతికితే మంచిదని సూచించారు. దళితులని సీఎం చేస్తానని మాట తప్పిన, పదేండ్లలో 100 రోజులు కూడా సచివాలయానికి రాని తన మామ(కేసీఆర్)ను.. ప్రశ్నించి ఉంటే బాగుండేదన్నారు. అధికారంలో ఉన్నప్పుడే 9 ఎంపీ సీట్లు గెలిచిన బీఆర్ఎస్ ఇప్పుడు 8 నుంచి 12 సీట్లు గెలుస్తుందంటూ కేసీఆర్ మాట్లాడుతున్నారని, ఆయన అలా అంటున్నారంటే.. ఈవీఎంలను రిగ్గింగ్ చేయిస్తారేమోననే అనుమానం కలుగుతోందన్నారు. జూన్ 3 తరువాత రాష్ట్రంలో బీఆర్ఎస్ పూర్తిగా మూతపడుతుందని జోస్యం చెప్పారు. ఇప్పటి వరకు తాము ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఐదింటిని అమలు చేశామని, మరో గ్యారెంటీని కూడా అమలుచేస్తామని స్పష్టం చేశారు. రైతు రుణమాఫీ చేసి రైతుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంటామని చెప్పారు. "రుణమాఫీ అనేది కాంగ్రెస్ బాండ్. కాంగ్రెస్ హయాంలో దేశంలో రూ.70వేల కోట్ల పైచిలుకు రుణమాఫీ చేశాం. రుణమాఫీ సమయంలో అప్పటికే చెల్లించిన వారికి రూ.5-10వేల వరకు ప్రోత్సాహాన్ని కూడా అందించాం" అని మంత్రి కోమటిరెడ్డి గుర్తు చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు ఇచ్చిన మాట ప్రకారం ఆగస్టు 15లోపు రూ.2 లక్షల రుణమాఫీ హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని, హరీశ్‌రావు రాజీనామాకు సిద్ధంగా ఉండాలని మంత్రి కొండా సురేఖ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా దౌలాపూర్‌లో మెదక్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి నీలం మధుతో కలిసి ఆమె మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో రైతు, ప్రజా సమస్యలు లేవనెత్తకుండా సమావేశాలు ముగిసే వరకు ఫామ్‌హౌజ్‌లో ఉన్న కేసీఆర్ దొడ్డిదారిన వెళ్లి రైతులను కలిసి అపోహలు సృష్టిస్తున్నారన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్‌లు ఎత్తివేయాలని చూస్తోందని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల అనంతరం బీఆర్ఎస్ దుకాణం బంద్ అవుతుందని, బీజేపీలో చేరేందుకే హరీశ్ రాజీనామా డ్రామా ఆడుతున్నారని ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఆరోపించారు. భువనగిరి జిల్లా భూదాన్‌పోచంపల్లిలో భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి మద్దతుగా నిర్వహించిన ర్యాలీ, కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గతంలో దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని కేసీఆర్ ప్రకటించారని, లేనిపక్షంలో తల నరుక్కుంటా అన్నారని, ఇప్పుడు హరీశ్ రావు మామ తల నరికి ప్రజల్లోకి రావాలన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని, అవినీతి బీఆర్ఎస్‌లను ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు.

రేవంత్ సర్కారును బీజేపీ కూల్చదు

(మొదటిపేజీ తరువాయి)

ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాదని, రాష్ట్రంలో బీజేపీ రెండంకెల సీట్లను సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీకి ప్రజల ఆదరణ పెరుగుతుంటే బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఓర్వలేకపోతున్నాయన్నారు. సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గంలో తాను ఎలాంటి అభివృద్ధి చేయలేదని నిందలుమోపుతున్నారని, ఇది వాస్తవం కాదని, అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పనిచేశానని తెలిపారు. 720 కోట్ల రూపాయలతో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ, 450 కోట్ల వ్యయంతో కాచిగూడ రైల్వే స్టేషన్, 350 కోట్ల రూపాయలతో నాంపల్లి రైల్వే స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని వివరించారు. ఎంఎంటీఎస్ రెండవ దశకు కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా నిధులు భరించి అభివృద్ధి చేస్తోందన్నారు. ఎంఎంటీఎస్‌ను యాదాద్రి వరకు పొడిగించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణ పనులు జీహెచ్ఎంసీ వల్లే ఆలస్యమవుతున్నాయని, వీటిని త్వరగా పూర్తి చేయాలని ఇప్పటికే జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆదేశించామని ఆయన తెలిపారు. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు ఉండవని కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని, మతిభ్రమించినవాళ్లే ఇలాంటి మాటలు మాట్లాడుతారని మండిపడ్డారు. కేంద్రంలో బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ముస్లిం రిజర్వేషన్‌లను బరాబర్ ఎత్తేస్తామని తేల్చిచెప్పారు. బీసీల్లోని పేదలకు అన్యాయం చేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో మతపరమైన రిజర్వేషన్‌లను అమల్లోకి తెచ్చిందని ఆరోపించారు. టీషర్టు వేసుకున్నంత మాత్రాన యువకులైపోరు.. అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ఉద్దేశించి ఎద్దేవా చేశారు. రాహుల్ మాటలను యువత ఏమాత్రం నమ్మదన్నారు. ఓట్లు పెట్టుకుంటే ఓట్లు పడవన్న సంగతిని సీఎం రేవంత్ గుర్తించాలన్నారు. తెలంగాణకు నష్టం చేసింది కేసీఆర్, ఆయన కుటుంబమే అని ఆరోపించారు. కేసీఆర్ ఇక ఫాంహౌజ్‌కు పరిమితం కావడమే మంచిదని కిషన్‌రెడ్డి సూచించారు.



అబ్ కీ బార్?

పాలమూరులో పోరు హోరు!

మహబూబ్‌నగర్‌లో ముక్కోణపు పోరు.. సొంత గడ్డ కావడంతో సీఎం రేవంత్‌కు ప్రతిష్ఠాత్మకం

అనుకూలతలతో అందలమెక్కాలని శ్రమిస్తున్న వంశీచంద్.. తాను చేసిన పనులే గెలిపిస్తాయంటున్న డీకే అరుణ

కేసీఆర్ అభివృద్ధిని చూసి ఓటేయాలంటున్న శ్రీనివాస్ రెడ్డి.. అందరి ప్రధాన అస్త్రం సాగునీటి ప్రాజెక్టులే



మూడుసార్లు వరుసగా గెలిచి బీఆర్ఎస్ ఇక్కడ హ్యాట్రిక్ కొట్టింది! కానీ, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో మాత్రం లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని అన్ని సెగ్మెంట్లలోనూ కాంగ్రెస్ విజయకేతనం ఎగరేసింది! పార్లమెంటు పరిధిలో బీఆర్ఎస్ కంటే లక్ష ఓట్లకుపైగా కాంగ్రెస్‌కే వచ్చాయి! ఇక, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గడ్డ కావడంతో ఆ పార్టీకి మరింత ప్రతిష్ఠాత్మకంగా మారింది! మరోవైపు, గత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన బీజేపీ.. ఇప్పుడు పాలమూరుపై మరోసారి కాషాయ జెండా ఎగరేయాలని పావులు కదుపుతోంది! ఈసారైనా పార్లమెంటులో అధ్యక్షా అనాలని ఫైర్ బ్రాండ్ డీకే అరుణ పట్టుదలగా ఉన్నారు. వెరసి, పాలమూరులో హోరాహోరీ పోరు నెలకొంది!

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో త్రిముఖ పోరు నెలకొంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ముగ్గురూ నువ్వా నేనా అన్నట్లు తలపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఏడు నియోజకవర్గాల్లోనూ గెలిచి మాంచి జోష్ మీద ఉన్న కాంగ్రెస్ పార్టీ.. పార్లమెంట్ ఎన్నికల్లోనూ జయకేతనం ఎగురవేయాలని భావిస్తోంది. చల్లా వంశీ చంద్ రెడ్డి ఈసారి పార్లమెంటులో అడుగు పెట్టి గత ఎన్నికల్లో ఓటమికి ప్రతీకారం తీర్చుకోవాలని పట్టుదలతో ఉన్నారు. గత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచిన డీకే అరుణ.. ఈసారి గెలిచి సత్తా చాటాలని సంకల్పించారు. అసెంబ్లీ ఎన్నికల్లో చతికిలపడినా.. ఓట్లపరంగా రెండో స్థానంలో నిలవడంతో వరుసగా నాలుగోసారీ గెలిచి పట్టు నిలుపుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. తద్వారా, జిల్లాలో పార్టీకి పూర్వ వైభవం తీసుకు రావాలని ఆ పార్టీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్ రెడ్డి అడుగులు వేస్తున్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌కు ప్రతిష్ఠాత్మకం

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత జిల్లా కావడంతో మహబూబ్‌నగర్‌లో గెలుపును ఆయన ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఇప్పటికే ఏడుసార్లు పార్లమెంట్ పరిధిలో పర్యటించారు. ఏడు దశాబ్దాల తర్వాత పాలమూరుకు సీఎం పదవి రావడం, గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వారి సొంత జిల్లాల్లో మెజారిటీ స్థానాలు అధికార పార్టీలే గెలుచుకోవడం తోపాటు పాలమూరు బిడ్డ సీఎం అయితే ఓర్వలేక బీజేపీ-బీఆర్ఎస్ కుట్రలతో దెబ్బతీయాలని చూస్తున్నాయంటూ రేవంత్ సెంటిమెంట్ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నారు. తన గెలుపునకు ఇప్పుడు పూర్తి అనుకూల పరిస్థితులు ఉన్నాయని, ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు అన్నట్లుగా వంశీచంద్ శ్రమిస్తున్నారు.

గెలిచి తీరాలని డీకే అరుణ


బీజేపీ అభ్యర్థిత్వాన్ని ప్రకటించడానికి ముందే డీకే అరుణ, ప్రచారం ప్రారంభించారు. నియోజకవర్గంలో కాలికి బలపం కట్టుకున్నట్లు సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. అయితే, ఇక్కడ పట్టున్న జితేందర్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం బీజేపీకి మైనస్సే. తాను పాలమూరు ఆడబిడ్డనని, మంత్రిగా, ఎమ్మెల్యేగా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టానని, కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పాలమూరు- రంగారెడ్డి వంటి సాగునీటి ప్రాజెక్టులు తన కృషితో వచ్చాయని అరుణ ప్రచారం చేసుకుంటున్నారు. సిటింగ్ ఎంపీ, బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి కొంత ఆలస్యంగా ప్రచారం ప్రారంభించినా.. నియోజకవర్గాల్లో సమావేశాలు నిర్వహిస్తూ ప్రధాన పోటీదారుగా నిలుస్తున్నారు. పాలమూరును ఎంతో అభివృద్ధి చేసిన కేసీఆర్‌ను చూసి ఓటేయాలని కోరుతున్నారు.


ప్రాజెక్టులే ప్రధాన ఎజెండా

పాలమూరు జిల్లాలో ఏ ఎన్నిక వచ్చినా ప్రాజెక్టులే ప్రధాన ఎజెండాగా మారడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఎన్నికల్లో కూడా పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం జాతీయ హోదాపై బీజేపీ, కాంగ్రెస్ మధ్య వాగ్యుద్ధం కొనసాగుతోంది. 2014 పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా పాలమూరులో పర్యటించిన ప్రధాని మోదీ.. పాలమూరుకు జాతీయ హోదా కల్పిస్తామంటూ హామీ ఇచ్చి మోసం చేశారని, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలి పదవి తెచ్చుకున్న అరుణ కూడా జాతీయ హోదా తేలేదని సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి వంశీచంద్ రెడ్డి విమర్శిస్తున్నారు. అయితే, 60 శాతం నిధులు ఇస్తామని కేంద్రం చెప్పినా కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం చేస్తోందని అరుణ మండిపడుతున్నారు. అలాగే, 1.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు రూ.4,000 కోట్లతో మక్తల్- నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టిన రేవంత్.. దానినే ప్రచార అస్త్రంగా మలుచుకుంటున్నారు. అరుణ బలంగా ఉంటుందని భావిస్తున్న నియోజకవర్గాల్లో ఈ పథకం ద్వారా నీరందనుండటంతో విస్తృత ప్రచారం చేస్తోంది. అదే సమయంలో, పదేళ్ల అధికారంలో ఉండి.. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్ సాగర్, పాలమూరు ఎత్తిపోతలను పూర్తి చేయలేదని, నారాయణపేట, మక్తల్, కొడంగల్ నియోజకవర్గాలకు నీరిచ్చే జీఓ 69ను తొక్కి పెట్టిందని బీఆర్ఎస్‌నూ కాంగ్రెస్ తప్పు పడుతోంది. అయితే, బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతే ఉమ్మడి పాలమూరు జిల్లాలో సాగునీటి లభ్యత పెరిగిందని, ఎత్తిపోతల పథకాలను ప్రారంభించి లక్షలాది ఎకరాలకు నీరిచ్చామని ఆ పార్టీ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి చెబుతున్నారు.

లోకల్-నాన్ లోకల్ పంచాయితీ

మూడు పార్టీల అభ్యర్థులు లోకల్, నాన్ లోకల్ పంచాయితీని తెరపైకి తెస్తున్నారు. అరుణ, వంశీచంద్ గద్వాల, కల్వకుర్తి నుంచి ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. ఇవి నాగర్ కర్నూలు పార్లమెంట్ పరిధిలో ఉన్నాయి. దీంతో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు ఈ ప్రాంతం వారు కాదని, తాను మాత్రమే లోకల్ అని బీఆర్ఎస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డి చెబుతున్నారు. అయితే, ఈ పార్లమెంట్ పరిధిలోనే తాను పుట్టిన ఊరు ఉందని అరుణ గుర్తుచేస్తున్నారు. గుజరాత్‌లో పుట్టిన మోదీ వారాణసిలో ఎలా పోటీ చేస్తున్నారని వంశీచంద్ ప్రశ్నిస్తున్నారు.





ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో ఏ సెగ్మెంట్ ఎవరికి!?

కాంగ్రెస్: మహబూబ్‌నగర్, షాద్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నారాయణపేట, మక్తల్, కొడంగల్

పురుషులు	8,32,080
మహిళలు	8,48,293
ఇతరులు	44
మొత్తం ఓటర్లు	16,80,417

పాత బస్తీలో కొత్త దోస్తీ!

పార్లమెంటు బరి నుంచి తప్పుకొన్న ఎంబీటీ

ఈ పరిణామంతో భారీగా లాభపడనున్న మజ్లిస్

ముస్లిం ఓట్లు చీలకుండా చేసే ఎత్తుగడగా ప్రచారం

బీజేపీ అభ్యర్థి మాధవీలత దెబ్బకు ఏకమైన శత్రువులు!?

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): బీజేపీ దెబ్బకు పాత బస్తీలో బద్ధ శత్రువులు ఏకమయ్యారా!? ఇక్కడ ఎంఐఎంకు ఎంబీటీ పరోక్ష మద్దతు ఇస్తోందా!? మజ్లిస్‌కు సహకరించడానికే పోటీ నుంచి తప్పుకుందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి తాజా పరిణామాలు. ఈసారి హైదరాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేయడం లేదని శుక్రవారం ఎంబీటీ ప్రకటించింది. మతతత్వ పార్టీలకు తాము సహకరించేది లేదని, అందుకే పోటీ నుంచి తప్పుకొంటున్నామని ఎంబీటీ నేత ఫర్హతుల్లా ప్రకటించారు. సెక్యులర్ పార్టీకి తాము మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. తప్పితే, ఏ పార్టీకి మద్దతు ఇస్తారనే విషయాన్ని స్పష్టం చేయలేదు. అలాగే, మతతత్వ పార్టీ అని ఆయన బీజేపీని ఉద్దేశించే అన్నారా!? లేక మజ్లిస్‌ను కూడా కలిపారా!? అన్న విషయంపైనా స్పష్టత లేదు. పోటీకి దూరంగా ఉంటామని ఎంబీటీ ప్రకటించానికి కారణాలు ఏవైనా.. పరోక్షంగా ఈ పరిణామం మజ్లిస్‌కే లబ్ధి చేకూర్చనుంది.

ముస్లిం ఓట్లు చీలకుండా..!

ఓటమి ఎరుగని నాయకునిగా, రెండు దశాబ్దాలుగా హైదరాబాద్ ఎంపీగా ఉన్న అసదుద్దీన్ ఒవైసీకి ఈసారి ఎన్నికలు కత్తి మీద సాముగా మారాయి. బరిలోకి దిగితే విజయం ఖాయమనే ధీమా ఇప్పటి వరకూ ఉండగా.. ఈసారి పరిస్థితులు మారుతున్నాయి. ఇందుకు కారణం బీజేపీ అభ్యర్థి మాధవీలత. ఎన్నికల నగారా మోగిన వెంటనే బీజేపీ తమ అభ్యర్థిగా మాధవీలతను ప్రకటించింది. తొలుత మజ్లిస్ వర్గాలు ఆమె పోటీని అంత సీరియస్‌గా తీసుకోలేదు. అదే సమయంలో రంజాన్ మాసం రావడంతో ప్రచారమూ ప్రారంభించలేదు. కానీ, మాధవీలత పాతబస్తీలో గల్లీ గల్లీ చుట్టేశారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఆమె వీడియోలే. హిందూ ఓటు బ్యాంకును ఏకం చేసే ప్రయత్నాలతోపాటు పాత నగరంలోనూ ప్రచార హోరు పెంచారు. మహిళ కావడం.. ఇంటింటికీ తిరగడం.. ఆమె ప్రచార తీరు కారణంగా కొంతమంది ముస్లిమ్ ఓటర్లు కూడా మాధవీలత వైపు మొగ్గు చూపుతున్నారన్న ప్రచారం జరిగింది. ఈ పరిణామమే మజ్లిస్ వర్గాల్లో ఆందోళనకూ కారణమైంది. ఇందుకు కారణం లేకపోలేదు. ఇటీవల ముగిసిన అసెంబ్లీ ఎన్నికల్లో హైదరాబాద్ పార్లమెంటు స్థానంలో గత ఎన్నికలతో పోలిస్తే మజ్లిస్‌కు దాదాపు లక్ష ఓట్లు తగ్గాయి. ముస్లిం ఓటర్లే మజ్లిస్‌కు దూరమవుతున్నారనే సంకేతాలు ఆ ఫలితాలు వెల్లడించాయి. ఇక, యాకత్‌పుర అసెంబ్లీ సెగ్మెంట్లో అయితే మజ్లిస్, ఎంబీటీ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. కేవలం 878 ఓట్ల తేడాతో ఎంబీటీ అభ్యర్థి అంజదుల్లాఖాన్ ఓడిపోయారు. యాకత్‌పుర పరిస్థితి పునరావృతమైతే.. మజ్లిస్‌కు చుక్కలు కనిపించడం ఖాయం. పార్లమెంటు ఎన్నికల బరిలో మజ్లిస్, బీజేపీతో పాటు ఎంబీటీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ కూడా ఉంటాయి. కాంగ్రెస్ ముస్లిం వర్గానికే టికెట్ ఇచ్చింది. ఇక, ఎంబీటీ కూడా బరిలో ఉంటే ముస్లిం ఓట్లలో చీలిక తథ్యం. అదే జరిగితే, మజ్లిస్ కంచుకోటకు బీటలు వారడాన్ని కొట్టివేయలేం. ఈ నేపథ్యంలోనే, కొందరు మత పెద్దలు రాయబారాలు నడిపారని, ఎంబీటీని పోటీ నుంచి తప్పుకునేలా చేశారనే ప్రచారం రాజకీయ వర్గాల్లో సాగుతోంది. పార్లమెంటు ఎన్నికల్లో త్యాగం చేస్తే.. అసెంబ్లీ ఎన్నికల సమయంలో యాకత్‌పురాలో సహకరిస్తామనే చర్చలు జరిగినట్లు ఊహాగానాలు వెలువడుతున్నాయి. వాటి ఫలితమే, బరి నుంచి ఎంబీటీ తప్పుకోవడమనే అభిప్రాయం వెలువడుతోంది. మజ్లిస్ ఓటమి కంటే కూడా పాత బస్తీలో బీజేపీ ఓటమి కోసమే ఎంబీటీ సీటును త్యాగం చేసిందనే వాదన రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. అంతేనా.. అసదుద్దీన్ సహా మజ్లిస్ ఎమ్మెల్యేలంతా క్షేత్రస్థాయిలో తిరుగుతుండడం.. డ్రైనేజీ, రోడ్ల మరమ్మతులు, సిమెంటు రోడ్లు, పాఠశాలలు, ఆస్పత్రుల వంటి అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుండడాన్ని అక్కడ మారిన పరిస్థితులకు తార్కాణంగా చెబుతున్నారు.

అన్నా.. నువ్వే గెలుస్తున్నవ్!





మల్కాజ్‌గిరి బీజేపీ అభ్యర్థి ఈటలతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

- ఓ వివాహ కార్యక్రమంలో ఎదురుపడిన ఇద్దరు నేతలు
- ఆప్యాయంగా హత్తుకొని.. నీదే విజయం అన్న మల్లారెడ్డి
- ఆయన తీరుపై బీఆర్ఎస్‌లో చర్చ
- మాల్కాజ్‌గిరి పార్లమెంటు పరిధిలోనే మల్లారెడ్డి, ఆయన అల్లుడి నియోజకవర్గాలు

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీమంత్రి మల్లారెడ్డి తన మాటలతో మరోసారి హల్‌చల్ చేశారు. తమ ప్రత్యర్థి పార్టీ బీజేపీకి చెందిన మల్కాజ్‌గిరి అభ్యర్థి ఈటల రాజేందర్‌తో 'అన్నా! నువ్వే గెలుస్తున్నావ్' అని చెప్పటం చర్చనీయాంశమైంది. మేడ్చల్ మండలం రాయిలాపూర్ బీఆర్ఎస్ నేత గోపాల్‌రెడ్డి అన్న కూతురి వివాహం శుక్రవారం కండ్లకోయలో జరిగింది. ఈ శుభకార్యానికి ఈటల రాజేందర్, మల్లారెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించి తిరిగి వెళ్తున్నప్పుడు ఒకరికొకరు ఎదురుపడి ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ సందర్భంగా ఈటలతో మల్లారెడ్డి మాట్లాడుతూ.. 'అన్నా! నా కొడుకు సీటు గుంజుకున్నవ్. నువ్వే గెలుస్తున్నవ్ పో' అని గట్టిగా హత్తుకొని ఆల్ ద బెస్ట్ అని చెప్పారు (మల్కాజ్‌గిరి బీజేపీ టికెట్ కోసం మల్లారెడ్డి చిన్న కుమారుడు గతంలో ప్రయత్నించినట్లుగా వార్తలు వచ్చాయి). 'నువ్వెక్కన్నో.. నేనెక్కన్నో.. మల్లా మనం కలిసేదెక్కన్నో.. దా ఫొటో దిగుదాం' అని ఫొటో తీయించుకున్నారు. ఇటీవల బీఆర్ఎస్ నుంచి బీజేపీలో చేరిన జిల్లా రైతుసమితి మాజీ అధ్యక్షుడు నందారెడ్డిని చూసి.. నా కుడి భుజం నీకిచ్చిన అంటూ ఈటల భుజం తట్టారు. అయితే, ఈ మధ్య మీడియాకు దూరంగా ఉంటూ రాజకీయ కార్యకలాపాలు చేపడుతున్న మల్లారెడ్డి.. వివాహ వేడుకలో బీజేపీ అభ్యర్థితో నువ్వే గెలుస్తున్నావంటూ చెప్పటం బీఆర్ఎస్ నేతలను విస్మయపరిచింది. అయితే, మల్లారెడ్డి నలుగురి ముందు సరదాగా అన్న మాటలను ఇతర పార్టీల కన్నా ఆయన సొంత పార్టీ నాయకులే సీరియస్‌గా తీసుకుంటున్నారు. తమ నేత బీజేపీకి అభయహస్తం అందిస్తున్నాడా? అన్న కోణంలో చర్చించుకుంటున్నారు. కష్టకాలంలో ఉన్న పార్టీని తక్కువ చేసేలా మల్లారెడ్డి మాట్లాడారంటూ బీఆర్ఎస్ నేతలు కొందరు అంటుండగా, ప్రచారం కోసమే ఆయన ఇలా హల్‌చల్ చేశారని మరికొందరు అంటున్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోనే మల్లారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న మేడ్చల్, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డి నియోజకవర్గం మల్కాజ్‌గిరి ఉండటం గమనార్హం. మొత్తానికి మల్లారెడ్డి, ఈటల మధ్య సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.





బరిలో పొంగులేటి వియ్యంకులు

ఖమ్మంలో మంత్రి వియ్యంకుడు రఘురాంరెడ్డి

మెదక్‌లో తమ్ముడి వియ్యంకుడు వెంకట్రామిరెడ్డి

ఖమ్మం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): లోక్‌సభ ఎన్నికల బరిలో ఉన్న ఆ ఇద్దరు అభ్యర్థులు వేర్వేరు పార్టీలకు చెందినవారు. అయితే.. ఆ ఇద్దరూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి వియ్యంకులు కావడం విశేషం. మంత్రికి స్వయాన వియ్యంకుడైన రామసహాయం రఘురాంరెడ్డి ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున బరిలో నిలిచారు. మరోవైపు.. మెదక్ పార్లమెంటు స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ ఐఏఎస్ పి.వెంకట్రామిరెడ్డి.. మంత్రి పొంగులేటి సోదరుడైన ప్రసాదరెడ్డికి వియ్యంకుడు. కాగా, మంత్రి పొంగులేటి తన వియ్యంకుడు రఘురాంరెడ్డికి టికెట్ సాధించడంలో కీలక పాత్ర పోషించారు. అలాగే మొదటి నుంచీ కాంగ్రెస్ కుటుంబం కావడం, రఘురాంరెడ్డి తండ్రి సురేందర్‌రెడ్డి కూడా ఎమ్మెల్యేగా, ఎంపీగా పలుసార్లు పార్టీ నుంచి గెలవడం.. ఆయనకు అనుకూలాంశంగా మారింది. కాగా, ఖమ్మం నుంచి కాంగ్రెస్ టికెట్ కోసం ప్రసాదరెడ్డి చివరివరకు ప్రయత్నించినా.. అధిష్ఠానం రఘురాంరెడ్డికి అవకాశం ఇచ్చింది. దీంతో ప్రసాదరెడ్డి పోటీ నుంచి తప్పుకొన్నారు.

ఉందిగా మే.. డిసెంబరు పైన..!

ఎమ్మెల్యేలుగా ఓడి.. ఎంపీలుగా బరిలోకి పలువురు.. మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్న నేతలు

- పార్టీ మారి మరీ.. లోక్‌సభకు పోటీ చేస్తున్న మాజీలు
- గతంలో ఇలా గెలిచిన వారికి కలిసొచ్చిన అదృష్టం

(ఆంధ్రజ్యోతి, హైదరాబాద్)

కుదిరితే అసెంబ్లీ.. లేదంటే పార్లమెంటు. ఏదో ఒక చట్టసభలో 'అధ్యక్షా' అనాలన్నదే వారి లక్ష్యం. ఈ ప్రయత్నంలో నాలుగు నెలల క్రితం జరిగిన శాసనసభ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన పలువురు నేతలు.. ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. వార్షిక పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులు 'మే' నెలలో జరిగే అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు రాస్తున్నట్లుగానే.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిన పలువురు నేతలు కూడా 'మే' నెలలోనే పార్లమెంటు ఎన్నికలను ఎదుర్కొంటున్నారు. గత ఎన్నికల్లో కొందరు నేతలు ఇలా పోటీ చేసి పార్లమెంటులో అడుగు పెట్టిన నేపథ్యంలో.. ఈసారి తాము కూడా ఎంపీలం అవుతామన్న విశ్వాసంతో బరిలోకి దిగారు. వారు ఎవరెవరో పరిశీలిస్తే..

ఈటల రాజేందర్ (బీజేపీ)



బీఆర్ఎస్‌లో సుదీర్ఘకాలం కొనసాగి.. పలుమార్లు ఎమ్మెల్యేగా గెలిచి.. మంత్రి పదవి కూడా చేపట్టిన ఈటల రాజేందర్ ఆ తరువాత ఆ పార్టీ నుంచి బయటికి వచ్చి బీజేపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో మరోసారి బీజేపీ తరఫున హుజూరాబాద్‌తోపాటు గజ్వేల్ నుంచి కూడా పోటీ చేసి రెండు చోట్లా ఓడిపోయారు. దీంతో లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజిగిరి నుంచి పోటీ చేస్తూ తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

కొప్పుల ఈశ్వర్ (బీఆర్ఎస్)



ఉద్యమకాలం నుంచి బీఆర్ఎస్‌లో ఉంటూ పలుమార్లు ధర్మపురి నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, గత ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించిన కొప్పుల ఈశ్వర్.. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. ప్రస్తుతం పార్లమెంటు ఎన్నికల్లో ఆయన పెద్దపల్లి లోక్‌సభ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో ఇక్కడి నుంచి బీఆర్ఎస్ తరఫున ఎంపీగా గెలిచిన వెంకటేశ్ నేత ఆ పార్టీని వీడడంతో అధిష్ఠానం కొప్పుల ఈశ్వర్‌ను బరిలోకి దించింది.

ఎం.రఘునందన్‌రావు (బీజేపీ)



దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గానికి 2020లో జరిగిన ఉప ఎన్నికలో గెలిచిన రఘునందన్‌రావు.. ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ఓటమి పాలయ్యారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో మెదక్ పార్లమెంటు స్థానం నుంచి తిరిగి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. మెదక్‌తో ఉన్న అనుబంధం, దేశంలో బీజేపీకి ఉన్న సానుకూల వాతావరణంతో ఎంపీగాగెలుస్తానన్న విశ్వాసంతో రఘునందన్‌రావు ఉన్నారు.

ప్రవీణ్‌కుమార్ (బీఆర్ఎస్)



ఐపీఎస్ అధికారిగా, గురుకులాల సొసైటీ కార్యదర్శిగా పనిచేసిన ప్రవీణ్‌కుమార్.. ఉద్యోగం నుంచి స్వచ్ఛంద పదవీ విరమణ పొంది రాజకీయాల్లోకి వచ్చారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి.. ఎన్నికల్లో తొలి అడుగులో అపజయాన్ని చవిచూశారు. సిర్పూర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీఎస్పీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో బీఎస్పీకి పొత్తు కుదర్చాలని ప్రయత్నించి భంగపడ్డారు. చివరికి తానే బీఆర్ఎస్‌లో చేరారు. నాగర్‌కర్నూల్ రిజర్వ్‌డ్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

నీలం మధు (కాంగ్రెస్)



సుదీర్ఘకాలం బీఆర్ఎస్‌లో పని చేసి 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరారు. ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ.. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి మధుకు టికెట్ ఇచ్చినట్లే ఇచ్చి వెనక్కి తీసుకోవడంతో బీఎస్పీ తరఫున పోటీ చేశారు. కానీ, ఎన్నికల్లో ఓటమిపాలయ్యారు. అనంతరం ఇటీవల తిరిగి కాంగ్రెస్‌లో చేరి.. మెదక్ లోక్‌సభ అభ్యర్థిగా టికెట్ దక్కించుకున్నారు.

శానంపూడి సైదిరెడ్డి (బీజేపీ)



దశాబ్దకాలానికి పైగా బీఆర్ఎస్‌లో పనిచేశారు. 2014 అసెంబ్లీ ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. అయితే 2019లో ఆ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో విజయం సాధించారు. తిరిగి 2023 ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ బరిలోకి దిగి ఓటమి పాలయ్యారు. ఇటీవల బీజేపీలో చేరి.. అనూహ్యంగా నల్లగొండ పార్లమెంటు స్థానానికి ఆ పార్టీ అభ్యర్థిత్వాన్ని దక్కించుకున్నారు.

అరూరి రమేశ్ (బీజేపీ)



బీఆర్ఎస్ తరఫున వర్ధన్నపేట నుంచి 2014, 2018 ఎన్నికల్లో వరుసగా 2సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2023 ఎన్నికల్లో ఓటమిపాలయ్యాక..నాటకీయ పరిణామాల నేపథ్యంలో బీజేపీలో చేరారు. వరంగల్ నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగారు.

బండి సంజయ్ (బీజేపీ)



కరీంనగర్ సిటింగ్ ఎంపీగా ఉన్న బండి సంజయ్.. గతంలో పలుమార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ కరీంనగర్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. 2020 మార్చి నుంచి 2023 జూలై వరకు తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేయడం ద్వారా బండి సంజయ్ జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు. మరోసారి కరీంనగర్ పార్లమెంటు స్థానం నుంచి బరిలోకి దిగారు.

ధర్మపురి అరవింద్ (బీజేపీ)



2019 పార్లమెంటు ఎన్నికలతో తొలిసారి ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన అరవింద్.. ఆ ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి ఎంపీగా గెలుపొందారు. నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ కుమార్తె అయిన కల్వకుంట్ల కవితను ఓడించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కోరుట్ల నియోజకవర్గం నుంచి పోటీచేసి ఓటమిపాలయ్యారు. తిరిగి నిజామాబాద్ నుంచి ఎంపీ ఎన్నికల్లో అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

నేతలకు కలిసొచ్చిన 2019 ఎన్నికలు

2019 పార్లమెంటు ఎన్నికలు.. తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్, బీజేపీలోని కొందరు నేతలకు బాగా కలిసివచ్చాయి. 2018 ముందస్తు అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలైన ప్రముఖ నేతలు.. ఆ వెంటనే 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగి ఎంపీలుగా గెలుపొందారు. కాంగ్రెస్ తరఫున గెలుపొందిన వారిలో ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రస్తుత మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఉన్నారు. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వరుసగా నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 2018లో అనూహ్యంగా ఓటమిపాలయ్యారు. దీంతో ఆ వెంటనే 2019లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో భువనగిరి నుంచి పోటీ చేసి ఎంపీగా ఎన్నికయ్యారు. ఇక రేవంత్‌రెడ్డి.. కొడంగల్ నుంచి వరుసగా మూడోసారి గెలిచేందుకు చేసిన ప్రయత్నం విఫలమై 2018లో ఓడిపోయారు. కానీ, ఆ వెంటనే మల్కాజిగిరి పార్లమెంటు స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. ఈ గెలుపు ఆయనకు రాజకీయంగా బాగా కలిసివచ్చింది. ఎంపీగా ఢిల్లీకి వెళ్లడం వల్ల కాంగ్రెస్ అధిష్ఠానంతో రేవంత్‌కు సాన్నిహిత్యం పెరిగింది. అది ఆయనకు టీపీసీసీ అధ్యక్ష పదవిని, ముఖ్యమంత్రి పీఠాన్ని దక్కేలా చేసింది. ఇక బీజేపీ నేత కిషన్‌రెడ్డి కూడా 2018లో అంబర్‌పేట నుంచి ఎమ్మెల్యేగా ఓడిపోయి.. 2019లో సికింద్రాబాద్ నుంచి ఎంపీగా గెలుపొందారు. తెలంగాణ రాష్ట్రం నుంచి గెలిచిన ఎంపీల్లో సీనియర్ కావడంతో కిషన్‌రెడ్డిని కేంద్ర మంత్రి పదవి వరించింది. ఇక బండి సంజయ్ కరీంనగర్ ఎంపీగా ఎన్నికయ్యాక రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు అయ్యారు. కాగా, కాంగ్రెస్ నేత ఉత్తమ్‌కుమార్ రెడ్డి 2018 ఎన్నికల్లో హుజూర్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచినా.. తిరిగి నల్లగొండ ఎంపీగా పోటీ చేసి గెలిచారు. అనంతరం ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేశారు.

తొలి రోజు కాళేశ్వరంపై ఒక్క ఫిర్యాదు రాలే!

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నిర్మాణ, నాణ్యత, నిర్వహణ లోపాలపై తొలి రోజైన శుక్రవారం ఒక్క ఫిర్యాదూ రాలేదు. వీటికి సంబంధించి ఫిర్యాదు అందజేయాలని కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ జస్టిస్ పినాకి చంద్రఘోష్ నోటిఫికేషన్ ఇచ్చారు. ఫిర్యాదుల కోసం కమిషన్ కార్యాలయంలో రెండు బాక్సులు ఏర్పాటు చేశారు. ఫిర్యాదులను చిరునామాకు తపాలా ద్వారా లేదా నేరుగా కమిషన్ కార్యాలయంలోని బాక్సుల్లో వేసే వెసులుబాటు కల్పించారు. ఫిర్యాదులు/నివేదికలు/సాక్ష్యాధారాలను నోటరీతో అఫిడవిట్ల రూపంలో సీల్డ్ కవర్‌లో మే 31వ తేదీలోపు కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీ(కాళేశ్వరం ప్రాజెక్టు), 8వ అంతస్తు, బూర్గుల రామకృష్ణారావు భవన్, డీ బ్లాక్, హైదరాబాద్ చిరునామాకు పంపాలని కమిషన్ కోరిన విషయం తెలిసిందే.

వచ్చే వారం జస్టిస్ చంద్రఘోష్ మేడిగడ్డ పర్యటన!

భూపాలపల్లి, ఏప్రిల్ 26: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను వచ్చే వారం మొదట్లో జస్టిస్ పినాకి చంద్రఘోష్ నేతృత్వంలోని విచారణ బృందం పరిశీలించనున్నట్టు తెలిసింది. విచారణ బృందం శుక్ర, శనివారాల్లో ఈ బ్యారేజీలను పరిశీలించేందుకు రానున్నట్లు వార్తలొచ్చాయి. అయితే బుధ, గురువారాల్లో హైదరాబాద్‌లో నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశాలు నిర్వహించారు. ముందు అనుకున్న షెడ్యూల్ ప్రకారం బ్యారేజీలను సందర్శించాల్సి ఉన్నా సమయాభావం వల్ల వాయిదా వేసుకున్నారు. అధికారుల నుంచి అన్ని రకాల సమాచారాన్ని తీసుకున్నాక వచ్చే వారం మొదట్లో బ్యారేజీలను సందర్శించనున్నారని తెలిసింది. దెబ్బతిన్న మేడిగడ్డ ఏడో బ్లాకులోని మూడు పియర్లను పరిశీలించడంతోపాటు అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో లీకేజీలను అధ్యయనం చేసి సంబంధిత బాధ్యులను విచారించే అవకాశం ఉందని తెలుస్తోంది.

రూ. 5.10 కోట్ల విలువైన గంజాయి దహనం

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 26: నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 39 కేసుల్లో స్వాధీనం చేసుకున్న దాదాపు రూ.5.10 కోట్ల విలువైన గంజాయిని జిల్లా ఎస్పీ చందనాదీప్తి పర్యవేక్షణలో పోలీసులు శుక్రవారం దహనం చేశారు. అనంతరం చందనాదీప్తి మాట్లాడారు. రూ.5,10,75,000 విలువైన 2,043 కిలోల గంజాయిని కోర్టు ఉత్తర్వుల ప్రకారం దహనం చేసినట్లు ఆమె తెలిపారు. గంజాయిని అక్రమంగా రవాణా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మత్తు పదార్థాలతో కలిగే అనర్థాలపై కళాశాలలు, పాఠశాలల్లో పోలీసు కళాజాతాతో అవగాహన కల్పిస్తున్నామని ఆమె తెలిపారు. మత్తు పదార్థాల సరఫరా గురించి తెలిస్తే 8712671111 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

వెబ్‌సైట్‌లో టెట్ మాక్ టెస్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల కోసం అధికారులు మాక్ టెస్ట్ అవకాశాన్ని అందుబాటులోకి తీసుకువచ్చారు. అభ్యర్థుల ప్రాక్టీస్ కోసం మాక్ మోడల్ టెస్ట్‌ను నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు శుక్రవారం మాక్ టెస్ట్‌ను టెట్ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చారు. అభ్యర్థులు వెబ్‌సైట్‌లోకి లాగిన్ అయ్యి ఈ మాక్ టెస్ట్ రాయవచ్చు. దీని ద్వారా అభ్యర్థులు సమయపాలనను తెలుసుకోవడంతో పాటు తమ బలాలు, బలహీనతలను గుర్తించి ఆ ప్రకారం పరీక్షకు సన్నద్ధమయ్యే అవకాశం ఉంటుంది. మే 20 నుంచి జూన్ 3 వరకు కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) పద్ధతిలో టెట్ జరగనుంది.

ఏటా రెండు సార్లు సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు

ఏడాదికి రెండు సార్లు బోర్డు పరీక్షలను నిర్వహించే దిశగా సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ విషయమై కేంద్ర విద్యాశాఖ నుంచి సూచనలు తీసుకున్న సీబీఎస్ఈ అధికారులు ఇప్పటికే కసరత్తు మొదలు పెట్టినట్టు తెలిసింది. ఈ విధానం వల్ల విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని, అలాగే వారి ప్రతిభ మరింత వెలుగులోకి వస్తుందని అధికారులు భావిస్తున్నారు.

'నూర్' సెంటర్‌తో హెరిటేజ్‌శాఖ ఒప్పందం


రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాలలోని పురాతన సంపద పరిరక్షణకు న్యూఢిల్లీలోని ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ రాయబారి కార్యాలయంలోని 'నూర్ ఇంటర్నేషనల్ మైక్రో ఫిలింసెంటర్'తో తెలంగాణ హెరిటేజ్ శాఖ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. పురాతన రాత ప్రతులు, చిత్రకళాఖండాలు, చారిత్రాత్మక కళా సంపద పత్రాల పరిరక్షణ- డిజిటలైజేషన్ కోసం ఈ ఒప్పందం జరిగింది. 'నూర్' సంస్థ డైరెక్టర్ డాక్టర్ మెహదీ ఖాజాపిరి, తెలంగాణ హెరిటేజ్ శాఖ డైరెక్టర్ భారతి హోలీకేరీ అవగాహన ఒప్పందం పత్రంపై సంతకాలు చేశారు. హెర్బల్ టెక్నాలజీతో నూర్ సంస్థ చేపట్టే పరిరక్షణ ప్రక్రియతో పురాతన రాతప్రతులు, దస్తావేజులు, ఇతర అమూల్య కళాఖండాలు మరో వందేళ్ల వరకు సురక్షితంగా ఉంటాయి.

ట్యాపింగ్ కేసు నిందితులకు బెయిల్ నిరాకరణ

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన ఎస్ఐబీ ప్రధాన కార్యాలయంలో హార్డ్‌డిస్కుల ధ్వంసం, ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. జుడీషియల్ రిమాండ్‌లో ఉన్న నిందితులు ప్రణీత్ రావు, భుజంగరావు, తిరుపతన్నల బెయిల్ పిటిషన్లను నాంపల్లి కోర్టు కొట్టివేసింది. ఈ కేసులో పోలీస్ కస్టడీ ముగిసినందున బెయిల్ మంజూరు చేయాలని నిందితులు కోర్టును ఆశ్రయించారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉందని, ఈ కేసులో మరికొందరు నిందితులు పరారీలో ఉన్నారని.. ఈ సమయంలో వీరికి బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తుపై ప్రభావం పడుతుందని దర్యాప్తు అధికారుల తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి దర్యాప్తు అధికారుల విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని నిందితుల బెయిల్ పిటిషన్లను కొట్టివేస్తూ శుక్రవారం తీర్పు వెలువరించారు. కాగా ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకరిగా ఉన్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ (ఓఎస్డీ) రాధాకిషన్‌రావు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించిన న్యాయమూర్తి తదుపరి విచారణ 29కి వాయిదా వేశారు.

ప్రభాకర్‌రావుపై లుక్‌అవుట్ నోటీసు

హైదరాబాద్ సిటీ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తులో భాగంగా మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ ప్రభాకర్ రావును భారత్‌కు రప్పించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విదేశాల్లో ఉన్న ప్రభాకర్‌రావుపై ఇప్పటికే లుక్‌అవుట్ నోటీసు జారీ చేశామని, రెడ్ కార్నర్ నోటీసు ఇచ్చేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయన్నారు. కేసు దర్యాప్తు నిష్పక్షపాతంగా జరుగుతోందని తెలిపారు. దర్యాప్తు ఓ కొలిక్కి వచ్చిన తర్వాత అన్ని విషయాలు మీడియాకు వివరిస్తామన్నారు. ప్రభాకర్ రావుపై రెడ్ కార్నర్ నోటీసు ఇచ్చేందుకు తాము ప్రయత్నిస్తున్న తరుణంలోనే రెడ్ కార్నర్ నోటీసు జారీ అయినట్టుగా ప్రచారం జరుగుతుండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఇలాంటి వార్తలు దర్యాప్తుపై ప్రభావం చూపుతాయన్నారు.



జేఈఈ మెయిన్స్‌ల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించిన ఆల్ఫోర్స్ కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి

ఇంటర్, జేఈఈ ఫలితాల్లో అల్వాల్ ఆల్ఫోర్స్ ప్రతిభ

అల్వాల్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలయిన ఇంటర్, జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో అల్వాల్ సర్కిల్ పరిధిలోని ఆల్ఫోర్స్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల చైర్మన్ నరేందర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం కళాశాల ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఉత్తమ ఫలితాలు సాధించాలంటే విద్యార్థులు కఠోర శ్రమతో పాటు అంకిత భావం, లక్ష్యసాధన దిశగా ఏకాగ్రత కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా జేఈఈ మెయిన్స్‌లో ఉత్తమ ప్రతిభ కనపర్చిన రవిచంద్ర, ప్రహర్ష్, ఇతర విద్యార్థులను, ఇంటర్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను నరేందర్‌రెడ్డి అభినందించారు.

లోక్‌సభ నామినేషన్ల పరిశీలన పూర్తి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్) రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ఆయా నియోజకవర్గాల పరిధిలో అభ్యర్థులు, వారి తరఫున హాజరైన ప్రతినిధుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు నామినేషన్ పత్రాల పరిశీలన చేపట్టారు. అన్ని పత్రాలు, అఫిడవిట్‌లో పేర్కొన్న వివరాలు సక్రమంగా ఉన్న వారి నామినేషన్లను అధికారులు ఆమోదించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ని నామినేషన్లు ఆమోదం పొందాయి? ఎన్ని తిరస్కరణకు? గురయ్యాయనే దానిపై ఎన్నికల అధికారుల నుంచి ప్రకటన రావాల్సి ఉంది. అయితే, ప్రస్తుతమున్న సమాచారం మేరకు రాష్ట్రంలో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లన్నీ ఆమోదం పొందాయి. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో బీఎస్పీ అభ్యర్థి మంద జగన్నాథం దాఖలు చేసిన నామినేషన్ తిరస్కరణకు గురైంది. పార్టీ బీఫామ్ సమర్పించకపోవడం, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధిగా ఉన్నప్పుడు వివిధ బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించారు. నాగర్‌కర్నూల్ స్థానానికి సంబంధించి మంద జగన్నాథం సహా 13 మంది నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. వరంగల్ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన మాజీ మంత్రి, సినీ నటుడు పల్లి బాబుమోహన్‌కు కూడా చేదు అనుభవం ఎదురైంది. బాబూమోహన్ అందజేసిన నామినేషన్‌లో ప్రతిపాదకుల సంతకాలు సక్రమంగా లేకపోవడం, అఫిడవిట్‌లో సరైన వివరాలు ఇవ్వకపోవడంతో తిరస్కరించారు. తాను ప్రజాశాంతి పార్టీలో చేరలేదని, తనకు అందిన ఆహ్వానం మేరకు కేఏ పాల్‌ను కలిస్తే ఆయన మెడలో పార్టీ కండువా వేశారని నామినేషన్ దాఖలు సందర్భంగా బాబూమోహన్ గురువారం విలేకరులతో చెప్పిన సంగతి తెలిసిందే. ఇక, చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ నామినేషన్ అంశంలో కొంత ఉత్కంఠ రేగినప్పటికీ చివరి నిమిషంలో ఆమోదం లభించింది. టీడీపీ రాష్ట్ర అధ్యక్షునిగా కాసాని రాజీనామా చేసిన రోజు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో తనపై జరిగిన దాడికి సంబంధించిన కేసు వివరాలను అఫిడవిట్‌లో పేర్కొనలేదని ఏఎస్‌రావు అనే వ్యక్తి ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఎఫ్ఐఆర్‌లో కాసాని పేరు ఉండగా చార్జిషీట్‌లో మాత్రం లేదు. దీనిపై రిటర్నింగ్ అధికారి వద్ద సుదీర్ఘవాదనల అనంతరం కాసాని నామినేషన్‌కు ఆమోదం లభించింది. కాగా, నల్లగొండ పార్లమెంట్ స్థానానికి 56 మంది 114 సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా 25 నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. భువనగిరి స్థానానికి 61 మంది నామినేషన్లు దాఖలు చేయగా 10 మంది నామినేషన్లు తిరస్కరించారు. వరంగల్ స్థానానికి 58 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా 10 మందివి, మహబూబాబాద్‌లో 30 మంది అభ్యర్థుల్లో ఐదుగురి నామినేషన్లు తిరస్కరణకు గురయ్యాయి. చేవెళ్ల పార్లమెంట్ స్థానానికి 64 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా అందులో 17 నామినేషన్లను అధికారులు తిరస్కరించారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి 42 మంది నామినేషన్లు వేయగా ఏడుగురి నామినేషన్లకు ఆమోదం లభించలేదు. మల్కాజిగిరి స్థానానికి 114 మంది నామినేషన్లు వేయగా అందులో 77 తిరస్కరణకు గురయ్యాయి. కాగా, తిరస్కరణకు గురైన అభ్యర్థులు సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించిన సొమ్మును వెనక్కి ఇస్తామని, నామినేషన్ తిరస్కరణకు కారణాలను అభ్యర్థులకు తెలియజేస్తామని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు. నామినేషన్ల ఉపసంహరణకు ఈ నెల 29, సోమవారం తుది గడువు. శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో అభ్యర్థుల నుంచి ఉపసంహరణ దరఖాస్తులు స్వీకరించరు. దీంతో సోమవారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల లోపు అభ్యర్థులు తమ నామినేషన్‌ను ఉపసంహరించుకునే అవకాశం ఉంది. ఈ గడువు పూర్తి అయిన తర్వాతే ఏ నియోజకవర్గంలో ఎంత మంది అభ్యర్థులు బరిలో ఉన్నారనే అంశంపై స్పష్టత వస్తుంది.



ప్రాంతీయ పార్టీలను దెబ్బ తీసే కుట్ర

పట్టు పెంచుకునేందుకు ఏకమైన బీజేపీ, కాంగ్రెస్.. చోటే భాయ్, బడే భాయ్.. ఎవరికి ఓటేసినా మీటర్లే

- పాలమూరుకు జాతీయ హోదా ఇవ్వలేదు
- హామీలను అమలు చేయని కాంగ్రెస్
- రైతు బంధు ఉంచుతరో ఊడగొడతరో
- మహబూబ్‌నగర్ రోడ్ షోలో కేసీఆర్
- తెలంగాణ కోసం అందరూ పోరాడితే తాను నాయకత్వం వహించానని వ్యాఖ్య

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్, బీజేపీ ఏకమై ప్రాంతీయ పార్టీలను దెబ్బతీసి, వాటి ప్రాబల్యం పెంచుకునే కుట్రలు చేస్తున్నాయని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోపించారు. కాంగ్రెస్‌కు బీఆర్ఎస్ బీ టీం అని బీజేపీ అంటుందని, బీజేపీకి బీ టీం అని కాంగ్రెస్ ఆరోపిస్తుందని, నిజానికి బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ సెక్యులర్ ప్రభుత్వాన్ని నడిపిందని, ప్రాణం పోయినా సెక్యులర్‌గానే ఉంటామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో పార్టీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు కోసం శుక్రవారం ఆయన రోడ్డు షో నిర్వహించారు. క్లాక్ టవర్ చౌరస్తాలో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. 'రాష్ట్రంలో చోటే భాయ్, కేంద్రంలో బడే భాయ్‌ల్లో ఎవరికి ఓటు వేసినా వ్యవసాయ బావులవద్ద మీటర్లు పెట్టడం ఖాయం. నేను సీఎంగా ఉన్నప్పుడు ప్రాణం పోయినా, తలకాయ తెగిపడినా వ్యవసాయ కనెక్షన్లకు మీటర్లు పెట్టనని స్పష్టం చేశా' అని గుర్తు చేశారు. ప్రధాని మోదీ 2014లో ఇచ్చిన హామీలు ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. బేటీ పడావో- బేటీ బచావో, మేక్ ఇన్ ఇండియా, సబ్‌కా సాత్- సబ్ కా వికాస్, డిజిటల్ ఇండియా, అచ్చేదిన్, అమృత్‌కాల్, ఆత్మనిర్భర భారత్, ఫసల్ బీమా యోజన ఏవీ అమలు కాలేదన్నారు. అధికారంలోకి వస్తే ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తానని చెప్పారని, ఇప్పటి వరకు ఎవరికీ ఇవ్వలేదని విమర్శించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా ఇవ్వాలని వంద ఉత్తరాలు రాశానని, అయినా ఇవ్వలేదని విమర్శించారు. రాష్ట్రానికి నవోదయ పాఠశాలలు, మెడికల్ కాలేజీలు ఏమీ ఇవ్వలేదని తప్పుబట్టారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏడు మండలాలు, సీలేర్ పవర్ ప్రాజెక్టును ఏపీకి కట్టబెట్టిందని మండిపడ్డారు. ఆంధ్రోళ్లు నీళ్లెత్తుకుపోతుంటే పాదయాత్ర చేసిన రఘువీరారెడ్డికి డీకే అరుణ హారతులు పట్టిందని, అలాంటి వ్యక్తికి ఓటేయాలా? అని ప్రశ్నించారు.



మహబూబ్‌నగర్ రోడ్ షోకి హాజరైన జనం.. మాట్లాడుతున్న కేసీఆర్

ఐదు నెలల్లో ఏమీ చేయలే...

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలవుతోందని, మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చినా ఏమీ చేయలేదని కేసీఆర్ విమర్శించారు. రైతుబంధు కింద రూ.15 వేలు రాలేదని, రూ.2 లక్షల రుణమాఫీ కాలేదని, వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వలేదని తప్పుబట్టారు. ఆడపిల్లలకు స్కూటర్లు ఇవ్వలేదని, కానీ రాష్ట్రంలో లూటీ నడుస్తోందని విమర్శించారు. మహిళలకు రూ.2500 పింఛన్ రాలేదని, ఆసరా పింఛన్ రూ.4 వేలకు పెరగలేదని అన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం లేదని, అంబేడ్కర్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ కింద ఇచ్చే రూ.20 లక్షలను ఆపేశారని ఆరోపించారు. ప్రతి విషయంలో మోసం, ప్రతి స్కీంలో దగా చేస్తుంటే.. ప్రాణాలకు తెగించి తెచ్చిన తెలంగాణ నాశనమవుతుంటే కేసీఆర్ చూస్తూ ఊరుకోరని, అందరితో కలిసి యుద్ధం చేస్తారని తెలిపారు. ఐదు నెలల్లో ఏం చేశావని సీఎంను అడిగితే గుడ్లు పీకి గోలీలు ఆడుకుంటా, పేగులు పీకి మెడల వేసుకుంటా, ముడ్డి మీద చెడ్డి గుంజుకుంటా, చర్లపల్లి జైల్లో వేస్తా అని అనడం మర్యాదనా అని ప్రశ్నించారు. ూతెలంగాణ కోసం అందరూ కలిసి పోరాడితే నేను నాయకత్వం వహించాను. పదేండ్లలో ఏనాడూ కరెంటు పోలేదు. ఇప్పుడు అసలు ఎప్పుడు ఉంటుందో తెలియడం లేదు. మహబూబ్‌నగర్ రైతులు 30 ఎకరాల భూమి ఉండి కూడా హైదరాబాద్‌లో ఆటోలు నడుపుకునేవారు. అలాంటి వారిని ఆదుకోవాలని రైతుబంధు పెట్టాం. ఇప్పుడు 5 ఎకరాలు ఉన్నవారికే ఇస్తామని అంటే.. వారి అయ్య జాగీరా!? ఆరేడు ఎకరాలున్న రైతులు కోటీశ్వరులా!? 25 ఎకరాలపైన ఉన్నవారికి బంద్ చేస్తే ఒక లెక్క ఉంటది. ఐదెకరాలకే బంద్ పెడతారట. రైతుబంధు, రైతుబీమా ఉంచుతారో, ఊడగొడుతారో తెలియడం లేదూ అని వ్యాఖ్యానించారు. వారి మెడలు వంచాలంటే కులాలు, మతాలకు అతీతంగా బీఆర్ఎస్ అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే.. బీజేపీ గెలుస్తుందని, బీజేపీ గెలవడం దేశానికి మంచిది కాదని ముస్లిములకు పిలుపునిచ్చారు.

రేవంత్‌రెడ్డికి తన కుర్చీపై తనకే నమ్మకం లేదు

- మంత్రిగా అనుభవమూ లేని సీఎం ఆయన
- అందుకే పాలన చేతకాక ఆరోపణలు
- ప్రాజెక్టుల కోసం దీక్షలు చేశా: డీకే అరుణ



కొడంగల్/దౌల్తాబాద్/బొంరాస్‌పేట్, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తన కుర్చీ మీద తనకే నమ్మకం లేదని మహబూబ్‌నగర్ బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ ఎద్దేవా చేశారు. శుక్రవారం ఆమె వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని దౌల్తాబాద్, బొంరాస్‌పేట్ మండలాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం కొడంగల్‌లో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు పూనంచంద్ లాహోటి నివాసంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి మంత్రిగా పనిచేసిన అనుభవం కూడా లేదని, అందుకే అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. పాలన చేతకాక ఓట్ల కోసం తనపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కల్వకుర్తి పాలన తేవాలని రేవంత్ చూస్తున్నారని, ఆయనతో పాటు ఎంపీ అభ్యర్థి కూడా కల్వకుర్తి వ్యక్తే అని చెప్పారు. ఎన్నికల హామీలైన రైతుల రుణమాఫీ, క్వింటాల్ ధాన్యానికి రూ.500 బోనస్, మహిళలకు నెలకు 2,500 ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. జిల్లా వాసినని చెప్పుకుంటున్న రేవంత్‌రెడ్డి పాలమూరుకు చేసిందేమీ లేదని విమర్శించారు. తాను గతంలో మంత్రిగా కొడంగల్ నియోజకవర్గంలో కళాశాలలు, విద్యుత్ సబ్‌స్టేషన్లు ఇలా ఎన్నో పనులకు ప్రారంభోత్సవాలు చేశానని, భీమా, నెట్టెంపాడు ప్రాజెక్టుల కోసం నిరాహార దీక్షలు చేశానని గుర్తుచేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని చెప్పారు. బీజేపీకి ఓట్లేసి, మరోసారి మోదీని ప్రధానిగా చేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, తన గెలుపును ఎవరూ ఆపలేరని ఆమె స్పష్టం చేశారు.

శాశ్వత న్యాయమూర్తులుగా జస్టిస్ శ్రీనివాసరావు, జస్టిస్ రాజేశ్వర్‌రావు

రాష్ట్రపతి ఆమోదం.. 30న ప్రమాణ స్వీకారం

హైదరాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హైకోర్టులో అదనపు న్యాయమూర్తులుగా విధులు నిర్వర్తిస్తున్న జస్టిస్ జగ్గన్నగారి శ్రీనివాసరావు, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావులను శాశ్వత న్యాయమూర్తులుగా నియమిస్తూ రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. ఈ నియామకాలను నోటిఫై చేస్తూ కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. అదనపు న్యాయమూర్తులుగా ఉన్న వీరిని శాశ్వత న్యాయమూర్తులుగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి ఈనెల 16న సిఫార్సు చేసింది. వారిద్దరూ ఇచ్చిన తీర్పులను సుప్రీంకోర్టు జడ్జీ కమిటీ మదింపు చేసి, 'గుడ్' అన్న రేటింగ్ ఇచ్చిందని కొలీజియం పేర్కొంది. ఈ ఇద్దరు న్యాయమూర్తులు ఈనెల 30న ఉదయం 10 గంటలకు హైకోర్టు మొదటి కోర్టు హాల్‌లో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ పేర్కొన్నారు.



జస్టిస్ శ్రీనివాసరావు, జస్టిస్ రాజేశ్వర్‌రావు

తనిఖీల్లో రూ. 52 లక్షల పట్టివేత

ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్: ఎన్నికల కోడ్ నేపథ్యంలో.. చెక్‌పోస్టులలో తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. శుక్రవారం వివిధ చెక్‌పోస్టుల వద్ద దాదాపు రూ.52లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. మహబూబాబాద్ జిల్లాలో కేసముద్రం నుంచి నెక్కొండకు కారులో వెళ్తున్న ఓ గుమస్తా నుంచి 18 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. మరో ఘటనలో... ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భూక్య కొండయ్య అనే రైతు వద్ద రూ.3.50లక్షలు పట్టుబడాయి. జిల్లాలోని మరో మూడు ప్రాంతాల్లో చేసిన తనిఖీల్లో 3 లక్షలు పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని కేపీహెచ్‌బీ ప్రాంతంలో శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో ప్రైవేటు సంస్థ వాహనంలో రవాణా చేస్తున్న రూ.25 లక్షలను పోలీసులు సీజ్‌చేశారు. అలాగే వికారాబాద్ జిల్లా అంగడిచిట్టెంపల్లి గేట్ చెక్‌పోస్టు వద్ద కారులో రూ.2.37లక్షలు లభ్యమయ్యాయి. ఆదిలాబాద్ జిల్లా బేల మండలంలోని శంకర్‌గూడ, పిప్పర్‌వాడ చెక్‌పోస్టుల వద్ద 1.73 లక్షలు పట్టుబడింది.



దమ్మాయిగూడ రోడ్ షోలో మాట్లాడుతున్న ఈటల

భూములు అమ్మకుండా రుణమాఫీ చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా..

- మల్కాజిగిరి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సవాల్

కీసర రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో ప్రభుత్వ భూములు అమ్మకుండా రైతులకు రుణమాఫీ చేస్తే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటానని మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ సవాల్ చేశారు. శుక్రవారం మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ నుంచి నాగారం వరకు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో భూములు అమ్మనిదే రుణమాఫీ చేయలేని పరిస్థితి నెలకొందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప మిగతావేవీ అమలు చేయడం లేదని చెప్పారు. ఇప్పుడు 17 ఎంపీ సీట్లు గెలిపిస్తే హామీలు అమలు చేస్తామని కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఎద్దేవా చేశారు. 'జై శ్రీరాం అంటే బువ్వ పెడుతుందా' అని అన్న కేసీఆర్ మాటకు స్పందిస్తూ.. జైశ్రీరాం అన్నం పెడ్తుందో...ఆపదలో ఆదుకుంటుందో ప్రజలు చూసుకుంటారన్నారు. మోదీ ఏందీ గీడీ ఏందీ అన్న కేసీఆర్ పరిస్థితి ఏమైందో చూస్తున్నామని, సీఎం రేవంత్‌రెడ్డి కూడా అలాగే మాట్లాడుతున్నారన్నారు. దేశంలో మోదీ నాయకత్వంలో అనేక రంగాల్లో పెను మార్పులు వస్తున్నాయని, ప్రజల ఆకాంక్షల మేరకు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. సుస్థిర పాలన, దేశ భద్రత మోదీ నాయకత్వంలోని బీజేపీతోనే సాధ్యమన్నారు.


అగ్గి వీరుడు!

- రంగారెడ్డి జిల్లాలో అలెన్ పరిశ్రమలో అగ్నిప్రమాదం.. ఒకరికి తీవ్ర గాయాలు
- సాహసోపేతంగా ఐదుగురిని కాపాడిన 16 ఏళ్ల బాలుడు
- రూ.12 కోట్ల మేర ఆస్తి నష్టం



మంటల్లో కాలిపోతున్న అలెన్ హోమియో, ఫార్మాస్యుటికల్ పరిశ్రమ

షాద్‌నగర్/నందిగామ, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): యాభై మంది పనిచేస్తున్న పరిశ్రమలో అగ్ని ప్రమాదం జరిగి మంటల్లో చిక్కుకుంటే.. అత్యంత సాహసోపేతంగా వ్యవహరించి ఐదుగురి ప్రాణాలు కాపాడాడో 16 ఏళ్ల బాలుడు! రంగారెడ్డి జిల్లా నందిగామ మండల కేంద్రంలో జరిగిందీ ఘటన. స్థానిక అలెన్ హోమియో, హెర్బల్ ఫార్మాస్యూటికల్ పరిశ్రమలో కొద్దిరోజులుగా మరమ్మతులు జరుగుతున్నాయి. అందులో భాగంగా శుక్రవారం సాయంత్రం వెల్డింగ్ పని చేస్తుండగా నిప్పురవ్వలు ఎగిశాయి. హోమియో ఔషధాల తయారీకి వినియోగించే ఆల్కహాల్, ఇతర రసాయనాలు అప్పటికే అక్కడ పడి ఉండడంతో.. ఆ నిప్పురవ్వలు పడగానే ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు శరవేగంగా వ్యాపించి అక్కడే ఉన్న 15 ఆల్కహాల్ బ్యారెళ్లకు అంటుకోవడంతో మంటల తీవ్రత పెరిగింది. ఆ సమయంలో పరిశ్రమలో పనిచేస్తున్న 50 మందిలో అత్యధికులు వెనక భాగంలో ఉన్న మెట్లపైనుంచి సురక్షితంగా కిందికి చేరుకున్నారు. నాలుగో అంతస్తులో ఉన్న ఆరుగురు వ్యక్తులు కిందికి రావడానికి ఇబ్బంది పడ్డారు. వారిలో కేఎల్ఎన్ చారి అనే ఉద్యోగి.. ప్రాణాలు కాపాడుకోవడానికి అంత ఎత్తు నుంచి కిందికి దూకేయడంతో ఆయనకు తీవ్రగాయాలయ్యాయి. మిగతా ఐదుగురినీ సాయిచరణ్ అనే బాలుడు కాపాడాడు. తన స్నేహితుడి తల్లి అదే కంపెనీలో పనిచేస్తుండడంతో.. అగ్నిప్రమాద వార్త తెలియగానే అతడు పరుగుపరుగున అక్కడికి చేరుకున్నాడు. నాలుగో అంతస్తులో కొందరు చిక్కుకుపోయిన విషయం తెలుసుకుని పరిశ్రమ గేటు దూకి, తాడు సాయంతో నాలుగో అంతస్తులోకి చేరుకుని అదే తాడుతో ఇద్దర్ని సురక్షితంగా కిందికి దించాడు. అంతలో అగ్నిమాపక శకటం వచ్చింది. వెంటనే అతడు తాడుతో కిందికి దిగి.. ఫైరింజన్‌కు ఉన్న భారీ నిచ్చెనను నాలుగో అంతస్తు వరకూ చేరవేశాడు. అక్కడ ఉన్న మిగతా ముగ్గురూ కిందికి దిగడానికి సాయపడ్డాడు. అతడు చూపిన ధైర్యసాహసాలకు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు. ఎమ్మెల్యే శంకర్ రూ.5వేలు రివార్డుగా ఇవ్వగా.. తీసుకోవడానికి బాలుడు నిరాకరించాడు. తనకు చేతనైన సాయం చేశానని, డబ్బు వద్దని చెప్పడంతో.. ఎమ్మెల్యేతో సహా అక్కడ ఉన్నవారంతా సాయిచరణ్‌ను ఎంతగానో కొనియాడారు. కాగా.. అగ్నిప్రమాదంలో రూ.12 కోట్ల ఆస్తినష్టం వాటిల్లిందని పరిశ్రమ యాజమాన్యం తెలిపింది.



సాయిచరణ్‌ను అభినందిస్తున్న డీసీపీ నారాయణరెడ్డి

కన్న కొడుకును కడతేర్చిన తండ్రి

- జల్సాలతో 20 లక్షల అప్పు చేసిన కొడుకు
- ఉన్న భూమి అమ్మాలని తండ్రిపై ఒత్తిడి
- లేకుంటే చంపేస్తానని బెదిరింపు
- భయంతో కొడుకునే చంపిన తండ్రి
- కరీంనగర్ జిల్లాలో ఘటన

కరీంనగర్ క్రైం, ఏప్రిల్ 26: జల్సాలకు అలవాటు పడిన కొడుకు చంపుతానని బెదిరించడంతో భయపడిన ఓ తండ్రి చివరికి కొడుకునే హతమార్చాడు. కరీంనగర్ రూరల్ మండలం చింతకుంటకు చెందిన పెరుమాండ్ల శ్రీనివాస్ దంపతులకు కొడుకు శ్రీనివాస్(21), ఓ కూతురు ఉన్నారు. శివసాయి హైదారాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నానని తండ్రికి అబద్ధం చెబుతూ పనిపాటా లేకుండా స్నేహితులతో జల్సాలు చేస్తూ రూ.20 లక్షల వరకు అప్పులు చేశాడు. అవి తీర్చేందుకు తమకు ఉన్న 3 గుంటల భూమిని అమ్మాలని తండ్రిని ఆరునెలలుగా ఒత్తిడి చేస్తున్నాడు. జల్సాలు మానాలని తండ్రి ఎంతచెప్పినా శివసాయి వినలేదు. భూమిని విక్రయించకుంటే తండ్రిని చంపేస్తానని బెదిరించడం మొదలుపెట్టాడు. దాంతో కొడుకు ఎక్కడ తనను చంపేస్తాడానో అని భయపడిన శ్రీనివాస్ కొడుకు ఇంటికి వచ్చే సమయానికి బయటకు వెళ్లడం చేస్తుండేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంచంపై నిద్రిస్తున్న శివసాయి తలపై శ్రీనివాస్ రోకలిబండతో దాడి చేశాడు. శివసాయి తప్పించుకునే ప్రయత్నం చేయగా కళ్లలో కారం పొడి చల్లి రోకలిబండతో మరో నాలుగుసార్లు తలపై కొట్టాడు. దాంతో శివసాయి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆ తర్వాత శ్రీనివాసే పోలీసులు ఫోన్ చేసి విషయం చెప్పి లొంగిపోయాడు.



శివసాయి(ఫైల్)

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
నవ్య
స్మార్ట్
శనివారం • 27 ఏప్రిల్ 2024



స్మార్ట్ గ్లాసెస్‌కు ఏఐ సామర్థ్యాలు

రేబాన్ లేటెస్ట్ స్మార్ట్ గ్లాసెస్‌కు జనరేటివ్ ఏఐ ఫీచర్లను అమెరికాకు చెందిన టెక్నాలజీ జెయింట్ మెటా ప్రకటించింది. ముఖ్యంగా లార్జ్ లాంగ్వేజ్ మోడల్ మెటా ఏఐ 2(ఎల్ఎల్ఏఎంఏ 2)పై రన్ అయ్యే మెటా ఏఐ చాట్‌బోట్‌కు సంక్లిష్టంగా ఉండే యూజర్ సందేహాలను అర్థం చేసుకునే సామర్థ్యం ఉంది. అంతేకాదు, సులువుగా అర్థమయ్యే విధంగా సదరు సందేహాలను నివృత్తి కూడా చేస్తుంది. దీనికి తోడు వీడియో కాలింగ్ సదుపాయాన్ని కూడా అందిస్తోంది. మెటా కొద్దికాలంగా ఏఐ సామర్థ్యాలను వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ యాప్‌లపై ఇండియా సహా వివిధ దేశాల్లో పరీక్షిస్తోంది. ఇప్పుడు ఇది రేబాన్ స్మార్ట్ గ్లాసులకు వర్తింపజేసింది.

ఇక ఇది ఎలా పనిచేస్తుందో చూద్దాం. అలా రహదారిపై వెళుతున్న బాటసారికి దారిలో సరికొత్త ల్యాండ్‌మార్క్ కనిపించిందని అనుకుందాం. ఆ గ్లాసెస్ ధరించిన యూజర్ వెంటనే 'హే మెటా' అంటూ పలకరించి, ఇప్పుడు తానేమి చూస్తున్నాను అని అడగవచ్చు. వెంటనే ఆ గ్లాసులు అందులో ఇమిడి ఉన్న 12 ఎంపీ హెచ్‌డీ కెమెరాతో విజువల్స్‌ను విశ్లేషిస్తుంది. ఇంటర్నెట్ కనెక్టివిటీ తప్పనిసరిగా ఉండాలి. చెవికి దగ్గరగా పెట్టుకున్న ఓపెన్ ఇయర్ స్పీకర్ల ద్వారా సమాధానాన్ని తెలియజేస్తుంది. అదేవిధంగా హోటల్ మెనూలో ఉన్న ఐటమ్స్ వేరే భాషలో ఉంటే ఇంగ్లీష్‌లో అవేంటో చెబుతుంది. వాట్సాప్, ఫేస్‌బుక్ మెసెంజర్ యాప్‌తో కూడా ఇంటిగ్రేట్ అయి ఉంటుంది. ఒకసారి అప్డేట్ చేసుకుంటే వీడియో కాల్స్ చేసుకోవచ్చు. అమెరికా సహా 15 దేశాల్లో ఇది అందుబాటులో ఉంది. వందకు మించి కస్టమ్ ఫ్రేమ్, లెన్స్ కాంబినేషన్స్‌తో మార్కెట్లోకి ఈ కళ్ళద్దాలు వచ్చాయి.



నెట్ లేకుండానే ఫైల్స్ పంపుకోవచ్చు!



వాట్సాప్ మరికొన్ని ఫీచర్లను విడుదల చేసే యత్నంలో ఉంది. ఆఫ్‌లైన్‌లోనూ ఫైల్స్ షేరింగ్, కాంటాక్ట్‌లకు అదనంగా నోట్స్ జోడింపు వంటివి ఇందులో ఉన్నాయి. 'డబ్ల్యుఏ బేటాఇన్ఫో' ప్రకారం సెల్యులర్ డేటా లేదా ఇంటర్నెట్ కనెక్షన్ లేకుండానే వివిధ ఫైల్స్ అంటే ఫొటోలు, డాక్యుమెంట్లను సమీపంలో వాట్సాప్ యూజర్లకు పంపుకోవచ్చు. ఆండ్రాయిడ్ బేటా వెర్షన్‌లో వీటిని కనుగొంది. ఇందుకోసం నియర్‌బై యూజర్లను ఎంచుకోవాల్సి ఉంటుందని స్క్రీన్‌షాట్స్ ద్వారా అర్థమవుతోంది. కాంటాక్ట్‌లకు నోట్స్‌ను జత చేయడంపై కూడా వాట్సాప్ పనిచేస్తోందని సమాచారం. అంటే కాంటాక్ట్‌కు సంబంధించిన అదనపు సమాచారాన్ని కలుపుకోవచ్చు. ఆ సమాచారం యూజర్ పర్సనల్ రిఫరెన్స్‌కు ఉపయోగపడుతుంది. దీన్ని క్రియేట్ చేసిన యూజర్‌కు మాత్రమే ఆ సమాచారం కనిపించడం ఇందులోని ప్రధాన విశేషం. మొబైల్ యూజర్లకు తోడు వాట్సాప్ వెబ్‌లోనూ ఈ సదుపాయం అందుబాటులో ఉండనుంది. అయితే ఈ రెండు ఫీచర్లూ బేటా టెస్టింగ్ దశలోనే ఉన్నాయి.

బ్రౌజర్లలోకి రెడ్‌లైన్ స్టీలర్ ట్రోజాన్!



ఎప్పటికప్పుడు కట్టుదిట్టాలు చేస్తున్నప్పటికీ హ్యాకర్లు ఏదో ఒక రూపంలో తమ చేతికి పని చెబుతూనే ఉన్నారు. తాజా మాల్వేర్ ఏకంగా బ్రౌజర్లలోని పాస్ వర్డ్‌లను తస్కరించి హ్యాకర్లకు పంపుతోంది. రెడ్‌లైన్ స్టీలర్ మాల్వేర్‌ను హ్యాకర్లు ఉపయోగిస్తున్నారని 'మెక్‌అఫీ' రీసెర్చ్ టీమ్ పేర్కొంది. ఇది గేమర్లను టార్గెట్ చేస్తోంది. డౌన్‌లోడింగ్ వ్యవహారంలో మోసపూరితమైన కోడ్‌తో పని సాగిస్తోంది. అదనపు పాయింట్లు, లైవ్, ఆటకు అవసరమైన ఆయుధాల కోసం ఫైల్స్‌ను స్నేహితులతో షేర్ చేసుకోవాలి. సరిగ్గా అక్కడే మోసపూరిత కోడ్స్‌ను పంపి మోసాలకు పాల్పడుతున్నారు. చీట్‌ల్యాబ్ పేరిట ఈ దందా సాగుతోంది. వాస్తవానికి చీట్‌ల్యాబ్ ఎప్పుడూ ప్రయోజనాలను ప్రామిస్ చేయదు. ఒకసారి ఇన్‌స్టాల్ అయిన తరవాత సిస్టమ్‌లోనే అది అంతర్ధానమవుతుంది. అయితే రెడ్‌లైన్ స్టీలర్ ట్రోజాన్ మాత్రం లా బైట్‌కోడ్ ఉపయోగించి మోసాలకు తెరలేపుతోంది. యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌లను సంగ్రహించి హ్యాకర్లకు పంపుతోంది. అధికారిక స్టోర్ల నుంచి యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవడం నుంచి గేమింగ్ కోడ్స్‌ను అవాయిడ్ చేయడం, కొత్తవాటిపై క్లిక్ చేయకపోవడం వంటి జాగ్రత్త చర్యలతో మాత్రమే ఈ మోసాల నుంచి గట్టెక్కగలమని నిపుణులు సూచిస్తున్నారు.

విండోస్ 11 అప్డేట్



ఇలా చేస్తే యాడ్స్ నుంచి తప్పించుకోవచ్చు

విండోస్ 11లో ఈ నెల మొదటి నుంచి స్టార్ట్ మెనూ యాడ్స్‌పై టెస్టింగ్ ఆరంభమైంది. కొంతమంది యూజర్లకు ఈ యాడ్స్ దాడి అస్సలు తెలియదు. ఈ వారంలో యూజర్ల చెంతకు తాజా అప్డేట్ చేరుతోంది. రికమెండెడ్ విభాగంలో ఒక పార్ట్‌గా ఈ యాడ్స్ కనిపిస్తున్నాయి. మైక్రోసాఫ్ట్‌కు చెందిన విండోస్ తాజా అప్డేట్‌లో భాగం ఈ పర్సనలైజ్డ్ ప్రకటనలు. 'ద వెర్జ్' రిపోర్ట్ ప్రకారం ఇప్పటికిది టెస్టింగ్‌లో ఉంది. మైక్రోసాఫ్ట్ సైతం సపోర్ట్ పేజీలో ఈ విషయాన్ని వెల్లడించింది. కొందరు యూజర్లకు ఈ ప్రకటనలు కనిపిస్తున్నాయి. అయితే ఈ యాడ్స్ తాకిడిని తట్టుకోలేని యూజర్లు వీటిని ఇలా డిజేబుల్ చేసుకోవచ్చు.

- స్టార్ట్‌మెనూపై క్లిక్ చేయాలి. సెట్టింగ్స్ యాప్‌ను కనుగొని దానిపై కూడా క్లిక్ చేయాలి. తదుపరి పర్సనలైజేషన్‌పై క్లిక్ చేయాలి.
- పర్సనలైజేషన్ మెనూలో స్టార్ట్‌పై క్లిక్ చేయాలి.
- షో రికమెండేషన్స్ ఫర్ టిప్స్, యాప్ ప్రమోషన్స్, మోర్ టైటిల్ కింద ఉన్న వాటిలో నాలుగో ఆప్షన్‌ను కనుగొని దాని టోగెల్‌ను టర్నాఫ్ చేయాలి. అంతే ప్రకటనలు ఇక రావు.



థ్రెడ్స్‌లో ఆర్కైవ్ ఫీచర్

థ్రెడ్స్ కొత్త ఫీచర్ల కోసం సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగా పాత పోస్టులు ఆటోమేటిక్‌గా హైడ్ చేసేందుకు ఉద్దేశించిన ఆప్షన్‌ను ప్రస్తుతం టెస్టింగ్‌లో ఉంచింది. ప్రస్తుతానికి ఈ ఫీచర్ కొద్దిపాటి యూజర్లకు మాత్రమే అందుబాటులో ఉంటుంది. ఇప్పటికిప్పుడు వ్యక్తిగత పోస్టులు మాన్యువల్‌గా లేదా ఆటోమేటిక్‌గా ఆర్కైవ్ చేసుకోవచ్చు. అది కొంతకాలానికే పరిమితం. అలాగే ఆ పోస్టులను తిరిగి ఎప్పుడైనా రన్నింగ్‌లో పెట్టుకోవచ్చు. అయితే ఈ ఫీచర్‌ను డిఫాల్ట్‌గా పెట్టవద్దని పలువురు కోరుతున్నట్టు ఇన్‌స్టాగ్రామ్ హెడ్ తెలిపారు. తమ పోస్టులను ఆర్కైవ్ చేసే వెసులుబాటు కల్పించాలని పలువురు ఎక్స్(ట్విటర్) ద్వారా అభ్యర్థించారని సమాచారం.




సున్నిత సమాచారం షేర్ కాకుండా..?

ఆండ్రాయిడ్ 14 వరకు ఇకపై స్క్రీన్ షేరింగ్‌లో హ్యాకర్ల బారిన పడకుండా ఉండొచ్చు. ముఖ్యంగా సెన్సిటివ్ సమాచారం షేర్ కాకుండా చూసుకోవచ్చు. మొత్తమ్మీద దీన్నో శక్తిమంతమైన ఫీచర్‌గా చెప్పవచ్చు. ఈ ఏడాది మధ్యలో రాబోయే వెర్షన్‌లో ఈ ఫీచర్ ఉంటుందని భావిస్తున్నారు. పాస్‌వర్డ్స్, సెన్సిటివ్ నోటిఫికేషన్స్ డిస్‌ప్లే కాకుండా గూగుల్ చర్యలు తీసుకోనుంది. 'ఆండ్రాయిడ్ పోలీస్' రిపోర్ట్ ప్రకారం లేటెస్ట్ ఆండ్రాయిడ్ బేటా 1.1లో 'డిజేబుల్ స్క్రీన్ షేర్ ప్రొటెక్షన్' పేరిట ఈ సమాచారం ఉంది. అయితే ఇంకా ఇది ఎనేబుల్ కావాల్సి ఉంది. అంటే ఇంకా టెస్టర్ల చేతికి రాలేదు.

గూగుల్ మెసేజెస్‌లో న్యూ సెల్ఫీ ఫీచర్

గూగుల్ మెసేజెస్‌లో 'సెల్ఫీ జీఐఎఫ్' ఫీచర్ అందుబాటులోకి వస్తోంది. ఇంటరాక్టివ్ మెసేజింగ్ అనుభవం మరింత మెరుగ్గా ఉండేందుకు గూగుల్ మెసేజెస్ దీన్ని విడుదల చేసింది. దీన్ని ఉపయోగించుకునేందుకుగాను యూజర్లు మొదట కాన్వర్సేషన్‌ను ఓపెన్ చేయాలి. కెమెరా ఐకాన్‌పై లాంగ్ ప్రెస్ చేయాలి. కస్టమ్ కెమెరా ఇంటర్‌ఫేస్ అప్పుడు మీనియేచర్ కెమెరా వ్యూఫైండర్‌ను చూపుతుంది. సింగిల్ టాప్‌తో స్కోలబుల్ గ్యాలరీ కూడా కనిపిస్తుంది. స్పెసిఫిక్ కాన్వర్సేషన్ ప్రాంప్ట్‌తో సెల్ఫీ జీఐఎఫ్ ఆప్షన్‌ని యాక్సెస్ చేసుకోవచ్చని '9టు5గూగుల్' తెలిపింది. యానిమేటెడ్ సెల్ఫీని రికార్డ్ చేసుకోవచ్చు. ఒకసారి సెలెక్ట్ చేసుకుంటే మూడు సెకెండ్ల రికార్డింగ్ ఇనీషియేట్ అవుతుంది. తద్వారా యానిమేటెడ్ సెల్ఫీని ఆటోమేటిక్‌గా రూపొందించుకోవచ్చు. యూజర్లు మాన్యువల్ ఆప్షన్‌ను కూడా ఎంచుకోవచ్చు. రెడ్ బటన్ ఉపయోగించి రికార్డింగ్‌ను రీస్టార్ట్ చేసుకోవచ్చు. ఈ చిన్నపాటి జీఐఎఫ్‌లు కెమెరా రోల్‌లోనే నేరుగా సేవ్ అవుతాయి. వాటిని స్నేహితులు, బంధువులకు పంపుకోవచ్చు. ఇదే కాకుండా మరికొన్ని ఫీచర్లను షేర్ చేసే యత్నాల్లో గూగుల్ మెసెజెస్ ఉంది.



ప్రొడక్ట్

కెమెరా హంగులతో ఒప్పో స్మార్ట్‌ఫోన్

ఒప్పో - ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లను అలరించే చర్యలు తీసుకుంటోంది. ఒప్పో తాజాగా కెమెరా సెంట్రిక్ స్మార్ట్ ఫోన్ 'ఫైండ్ ఎక్స్7 అల్ట్రా'ని చైనాలో విడుదల చేసింది. ఈ ఫోన్‌లో ప్రధాన ఆకర్షణ తొలి క్వాడ్ మెయిన్ కెమెరా. హైపర్ టోన్ ఇమేజెస్ ఇంజన్‌తో ఇది వచ్చింది. దీనికి తోడు లెటెస్ట్ హార్డ్‌వేర్‌ను దీనిలో ఉంచారు. సెకండ్ జనరేషన్ సెన్సర్ అంటే ఎల్‌వైటీ -506 సెన్సర్‌తో 50ఎంపీ అల్ట్రా-వైడ్ కెమెరా ఇందులో ఉంది. దీంతో ఫొటోగ్రఫీ సామర్థ్యం మరింత మెరుగ్గా ఉంటుంది. రిఫ్లక్షన్‌ను 50 శాతం తగ్గిస్తుంది. 23ఎంఎం ఆప్టికల్ ఫోకల్ లెంథ్ ఉంటుంది. రాత్రనక, పగలనక ఏ సమయంలో అయినా పిక్చర్ల



క్లారిటీ బాగుంటుంది. ఇది కాకుండా రెండు పెరిస్కోప్ కెమెరాలు కూడా ఉంటాయి. అందులో ఒక దానికి 3ఎక్స్ ఆప్టికల్ జూమ్ ఉంటుంది. 1/1.56 ఇంచీల సోనీ ఐఎంఎక్స్ 890 సెన్సర్‌తో ఉంటుంది. క్లోజప్, పోర్ట్రయిట్‌లకు సంబంధించి ఇది స్పెషల్ ప్రొడక్ట్ అని చెప్పవచ్చు. 50ఎంపీ 6ఎక్స్ పెరిస్కోప్ టెలిఫొటో కెమెరాలో 1/2.5-1 ఇంచీల సోనీ ఐఎంఎక్స్ 858 సెన్సర్, 135 ఎంఎం ఫోకల్ లెంథ్ కలిగి ఉంటుంది. 32 ఎంపీ ఫ్రంట్ కెమెరాలో ఎల్‌వైటీ -506 సెన్సర్ ఉంటుంది. హైపర్‌టోన్ ఇమేజ్ ఇంజిన్, జూమ్, హ్యాజల్‌బ్యాండ్ పోర్ట్రయిట్ మోడ్, హ్యాజల్‌బాండ్ మాస్టర్ మోడ్ దీని ప్రత్యేకతలుగా చెప్పవచ్చు.

కే12

ఒప్పో - క్వాల్కామ్‌కు చెందిన స్నాప్‌డ్రాగన్ 7జెన్ 3ఎస్ఓసీ పవర్‌తో కె12ని చైనాలో విడుదల చేసింది. 12జీబీ ర్యామ్, 512జీబీ వరకు ఆన్‌బోర్డ్ స్టోరేజీ సదుపాయం ఉన్నాయి. సెంటర్డ్ హోల్-పంచ్ అమోల్డ్ డిస్‌ప్లేకు తోడు డ్యూయల్ రేర్ కెమెరాలు ఉన్నాయి. 5000ఎంఏహెచ్ బ్యాటరీ సపోర్ట్ ఉంది. ఇన్-డిస్‌ప్లే ఫింగర్‌ప్రింట్ సెన్సర్ ఉంది. ఐపీ54 రేటింగ్‌తో డస్ట్ అలాగే స్ప్లాష్ రెసిస్టెన్స్ ఉంది. బరువు 186 గ్రాములు. క్వింగ్‌యాన్, స్టార్ నైట్ రంగుల్లో లభిస్తున్నాయి. మూడు వేరియంట్లతో ఇవి లభిస్తున్నాయి. 8జీబీ + 256 జీబీ వేరియంట్ ఒప్పో కే12 ధర రమారమి ఇండియన్ కరెన్సీలో రూ.20,700. 12జీబీ + 256 జీబీ అయితే రూ.23,000, 12జీబీ + 512 జీబీ అయితే రూ.28,700





దేశీ మార్కెట్లోకి నార్జో '70 సిరీస్'

రియల్‌మి నార్జో 70ఎక్స్, 70 సిరీస్ ఫోన్లు ఇండియన్ మార్కెట్లోకి వచ్చాయి. రెండు రంగుల్లో ఇవి అందుబాటులో ఉన్నాయి. ఆరంభ ధర రూ.12,000. 70ఎక్స్ సిరీస్ ఫోనుల్లో 6.72 ఇంచీల ఫుల్ హెచ్‌డీ, 45-120హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేటు, 950 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ కలిగి ఉన్నాయి. ట్రిపుల్ స్లాట్(రెండు నానో సిమ్స్, ఒక మైక్రో ఎస్‌డీ కార్డు), సైడ్‌లో ఫింగర్‌ప్రింట్ సెన్సర్, 3.5 ఎంఎం ఆడియో జాక్ ఉన్నాయి. 6ఎన్ఎం మీడియాటెక్ 6100 + ఆక్టోకోర్ ప్రాసెసర్ ఉంది. స్టోరేజీని రెండు టీబీల మేరకు విస్తరించుకోవచ్చు. 45 వాట్స్ చార్జింగ్ స్పీడ్‌తో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. 50ఎంపీ, 8 ఎంపీ రెండు కెమెరాలు ఉన్నాయి. సెల్ఫీ, వీడియో కాలింగ్ కోసం 8ఎంపీ కెమెరా ఉపయోగపడుతుంది. 4జీబీ ర్యామ్, 128 స్టోరేజీ అయితే రూ.11,999; 6జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజీ అయితే రూ.13,4999కి లభిస్తాయి.

రియల్‌మి 70 5జీ విషయానికి వస్తే 6.7 ఇంచీల ఫుల్ హెచ్‌డీ, అమోల్డ్ స్క్రీన్, 120హెచ్‌జెడ్ రిఫ్రెష్‌రేటు 2000 నిట్స్ మేర పీక్ బ్రైట్‌నెస్ ఉన్నాయి. ఐపీ 54 డస్ట్ అలాగే వాటర్ రెసిస్టెంట్ రేటు కాగా దీనికి సైడ్‌లో ఫింగర్‌ప్రింట్ సెన్సర్, 3.5 ఎంఎం. ఆడియో జాక్ ఉన్నాయి. డ్యూయల్ స్లాట్(ఒకటి నానో సిమ్, ఇంకొకటి మైక్రో ఎస్‌డీ కార్డు) కోసం ఉన్నాయి. ఆండ్రాయిడ్ 14పై రన్ అయ్యే ఇవి 45వాట్స్ ఫాస్ట్ చార్జింగ్ కేపబిలిటీతో 5000 ఎంఏహెచ్ బ్యాటరీ ఉంది. స్టోరేజీ 128జీబీ అయినప్పటికీ ర్యామ్ 6జీబీ అయితే రూ.15,999, 8జీబీ ర్యామ్ అయితే రూ.16,999కి లభిస్తాయి. మిస్టీ ఫారెస్ట్ గ్రీన్, స్నో మౌంటెయిన్ బ్లూ రంగుల్లో ఈ రెండు సిరీస్‌లకు చెందిన స్మార్ట్ ఫోన్లు లభ్యమవుతున్నాయి.

మరింత మెరుగ్గా ఐపాడ్ ఎయిర్!

అప్‌డేట్



యాపిల్ - ఎయిర్‌పాడ్ ఎయిర్‌ను మరిన్ని మెరుగైన ఫీచర్లతో తెచ్చే యత్నాల్లో ఉంది. డిస్‌ప్లేని 10.9 ఇంచీల నుంచి 12.9 అంటే రెండు ఇంచీల మేర పెంచనుంది. దీంతో ఐపాడ్ ప్రొ రేంజ్‌లో మాదిరిగా బైఫర్కేటెడ్ డిస్‌ప్లే ఆప్షన్లు ఉండబోతున్నట్టు '9టు4మేక్' పేర్కొంది. మినీ లెడ్ డిస్‌ప్లే కారణంగా సంప్రదాయ ఎల్‌సీడీ ప్యానల్స్‌తో పోల్చుకుంటే కాంట్రాస్ట్, బ్రైట్‌నెస్, పవర్ ఎఫిషియెన్సీ బాగా ఉంటాయి. ఇందులో కెమెరాను రీడిజైన్ చేస్తున్నట్టు సమాచారం. వెర్టికల్లీ - ఓరియెంటెడ్ మాడ్యూల్ ఉండనుంది. అది మరింత పెద్ద కెమెరాను ఉంచేందుకు వీలుకల్పిస్తోంది. తద్వారా యాంటిసిపేటెడ్ ఫ్లాష్ ఉంటుంది. అంటే ఫొటోగ్రఫీ సామర్థ్యాలను పెంచుతోందని అర్థం చేసుకోవాలి. అల్యూమినియం డిజైన్‌తో మేజిక్ కీబోర్డ్‌ను కూడా మారుస్తోంది. ఫ్రంట్ ఫేసింగ్ టైమ్ కెమెరా స్థానాన్ని కూడా మారుస్తోంది. ఆ మార్పుతో కెమెరా అలైన్‌మెంట్ మెరుగవుతుంది. డిస్‌ప్లే అలాగే కెమెరా ఇంప్రూవ్‌మెంట్స్‌కు తోడు ఎం2 లేదా ఎం2 చిప్‌తో అత్యద్భుత పర్ఫార్మెన్స్ ఇచ్చేందుకు సన్నద్ధమవుతోందన్న వార్తలు వినవస్తున్నాయి. అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడాల్సి ఉంది.

ఇన్ఫో



ఐఫోన్‌తో షార్ట్ ఫిల్మ్స్



చేతిలో స్మార్ట్ ఫోన్ ఉంటే ప్రపంచం మన గుప్పిట్లో ఉంటుందనేది ఈనాటి మాట. వాటికున్న కెమెరాతో ప్రతీది ఇమేజ్ రూపంలో భద్రపర్చుకునే పరిస్థితి కలిగిందన్నదీ వాస్తవమే. అయితే ఇప్పుడు అయిదుగురు ఫిల్మ్ మేకర్లు ఏకంగా షార్ట్ ఫిల్ములనే తీశారు. అదీ ఐఫోన్ 15 ప్రొ మాక్స్‌తో అంటే సాంకేతికత ఏ స్థాయిలో పురోగతి చెందిందో అర్థం చేసుకోవచ్చు. బిగుతైన కథకు తోడు ఐఫోన్ ఉంటే ఫిల్మ్ నిర్మాణానికి ఇక కావాల్సింది నటులు మాత్రమే. ఐఫోన్ 15 ప్రొ మాక్స్‌ని గత ఏడాది విడుదల చేసిన సందర్భంలోనే యాపిల్ సీఈఓ టిమ్ కుక్ ఇది ప్రొఫెషనల్ ఫిల్మ్ మేకింగ్ కోసమని అన్నారు. అది ఇప్పుడు నిజమైంది. అయిదుగురు నిర్మాతలు తీసిన ఆ షార్ట్ ఫిల్ములు ఇప్పుడు ఉచితంగానే 'మామీ యూట్యూబ్'లో చూడవచ్చు. క్రాసింగ్ బోర్డర్స్, ఒబర్, ఏ న్యూలైఫ్, జై టు జలాల్ టు, మిర్రర్ - ఈ అయిదింటిని ఒక్కసారి చూస్తే వ్యవహారం ఇకపై మెగాపిక్సెల్ కాదని, కథనాన్ని నడిపించే తీరేనని భావించడం ఖాయం.

ముంబై అకాడమీ ఆఫ్ మూవింగ్ ఇమేజ్(మామి) ఈ ఫిల్మ్‌మేకర్లను ఎంపిక చేసింది. ఐఫోన్ 14 ప్రొ తోనే సుప్రసిద్ధ డైరెక్టర్ విశాల్ భరద్వాజ్ ఒక సినిమా తీసి అప్పట్లో సంచలనం సృష్టించారు.

ఇప్పుడు తాజాగా అయిదుగురు ఐఫోన్ 15 ప్రొతో ఆ బాట పట్టారు. '15 ప్రొ మాక్స్‌తో సినిమా తీశాం, కలర్ కరక్షన్ కోసం పంపాం, అంతకు మించి జిమ్మిక్కులు ఏమీ లేవు' అని క్రాసింగ్ బోర్డర్స్ సినిమా మేకర్ అనడం ఈ స్మార్ట్ ఫోన్ పనితనానికి ఒక మచ్చుతునక. ఇండో-నేపాల్ సరిహద్దుల్లో ఒక మహిళ సాగించే స్మగుల్డ్ గూడ్స్ వ్యవహారంపై తీసిన కథ ఇది. డిఫాల్ట్‌గా ఉన్న 24 ఎంఎం మెయిన్ కెమెరాతో మొదట్లో వైడ్ షాట్స్ చివరకు వచ్చేసరికి 120 ఎంఎం టెలిఫొటో కెమెరాతో అద్భుతమైన పనితనం చూపించడానికి వీలైందని 'మిర్రర్' మేకర్ తెలిపారు. ఐఫోన్‌తోనే కాలం గడిపే అబ్బాయి కథ ఇది. వాయిస్ మెమో యాప్‌తో ఆడియో చక్కగా సాధ్యమైందని 'ఒబర్' మేకర్ తెలిపారు. చుట్టుపక్కల శబ్దాలను సదరు యాప్‌తో చాలా బాగా పట్టుకోగలిగామని చెప్పారు. ఈ ధ్వనులకు కేవలం 15 ప్రొ మాక్స్‌కు తోడు వాయిస్ మెమో యాప్, ఎక్స్‌టర్నల్ మిక్ సరిపోయాయని అన్నారు. మైగ్రేట్ అయిన ఫ్యాక్టరీ వర్కర్ చుట్టూ తిరిగిన కథనం 'ఏ న్యూ లైఫ్'లో రియల్ టైమ్‌లో వీడియో కాల్స్ తీయగలిగారు. ఫోన్‌కుతోడు ట్రైపాడ్‌పై స్మాల్ రిగ్ కేజ్ ఉపయోగించి మొత్తం పనికానిచ్చారు. ఏతావతా స్టోరీ టెల్లింగ్‌లో 15 ప్రొమాక్స్ మ్యాజిక్ చేస్తోందని చెప్పవచ్చు.

క్రాఫ్ట్స్ అండ్ డిజైన్ సంస్థలో డిగ్రీ, పీజీ

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● శనివారం 27 ఏప్రిల్ 2024
diksuchi@andhrajyothy.com

జైపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్రాఫ్ట్స్ అండ్ డిజైన్(ఐఐసీడీ)- బీ డిజైన్, ఎం డిజైన్, ఎం ఒకేషనల్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. నిబంధనల మేరకు స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. డిగ్రీలో మూడేళ్లు, పీజీలో ఏడాది కోర్సు పూర్తయ్యాక ఎనిమిది వారాల ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్ పూర్తిచేయాల్సి ఉంటుంది. నాన్ రెసిడెంట్ ఇండియన్స్, సార్క్ దేశాల అభ్యర్థులు, ఇతర విదేశీ విద్యార్థులు కూడా ఈ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు ఎంట్రెన్స్ రాయనవసరం లేదు. వీరికి స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్, డిజిటల్ పోర్ట్‌ఫోలియో, ఆన్‌లైన్ ఇంటర్వ్యూ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

డిగ్రీ, పీజీ స్పెషలైజేషన్‌లు
- హార్డ్ మెటీరియల్ డిజైన్
- సాఫ్ట్ మెటీరియల్ డిజైన్
- ఫైర్డ్ మెటీరియల్ డిజైన్
- ఫ్యాషన్ క్లాతింగ్ డిజైన్
- జ్యువెలరీ డిజైన్
- క్రాఫ్ట్ కమ్యూనికేషన్

బీ డిజైన్: ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. ఇందులోనే ఏడాది వ్యవధిగల ఫౌండేషన్ కోర్సు ఉంటుంది. ఏడాదికి రెండు చొప్పున మొత్తం ఎనిమిది సెమిస్టర్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో మొత్తం 180 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. ఏడాది కోర్సు పూర్తయ్యాక డిప్లొమా, రెండేళ్ల తరవాత అడ్వాన్స్‌డ్ డిప్లొమా, మూడేళ్ల తరవాత బీ ఒకేషనల్ డిగ్రీతో ప్రోగ్రామ్ నుంచి వైదొలగే వీలుంది.

ఎం డిజైన్: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో నాలుగు సెమిస్టర్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో 90 సీట్లు ఉన్నాయి. బీ డిజైన్/బీఆర్క్/బీఏ డిజైన్/బీఎస్సీ డిజైన్/బీ ఒకేషనల్ డిజైన్/తత్సమాన కోర్సులు పూర్తి చేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎం ఒకేషనల్: దీనిని నాన్ డిజైన్ డిగ్రీ కోర్సులు చేసిన అభ్యర్థులకు ప్రత్యేకించారు. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఏడాది వ్యవధిగల ఫౌండేషన్ కోర్సు ఉంటుంది. మొత్తం ఆరు సెమిస్టర్‌లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో 90 సీట్లు ఉన్నాయి.

బోధనాంశాలు: డిగ్రీ ప్రోగ్రామ్‌లో క్రాఫ్ట్ అండ్ డిజైన్, స్కిల్స్ అండ్ అప్లికేషన్స్, హిస్టరీ ఆఫ్ క్రాఫ్ట్, మెటీరియల్స్-సైన్స్, టూల్స్-టెక్నిక్స్-ప్రాసెస్, ఫీల్డ్ ఎక్స్‌పోజర్, కస్టమర్-మార్కెట్ నీడ్స్, డిజైన్ ప్రాసెస్ తదితర అంశాలు బోధిస్తారు.

- పీజీ ప్రోగ్రామ్‌లలో రీసెర్చ్, కాన్సెప్ట్, డిజైన్-సిస్టమ్స్ అండ్ సొల్యూషన్ థింకింగ్, అడ్వాన్స్ ఎక్స్‌ప్లొరేషన్ ఆఫ్ మెటీరియల్స్-డిజైన్ పాజిబిలిటీస్, ఇన్నోవేషన్స్, బిజినెస్ ఆఫ్ క్రాఫ్ట్ అండ్ డిజైన్, సోషల్ ఆంత్రప్రెన్యూర్‌షిప్ అండ్ లీడర్‌షిప్ అంశాలు వివరిస్తారు.

ఎంట్రెన్స్ టెస్ట్ వివరాలు: ఇందులో రెండు దశలు ఉంటాయి. మొదటిది జనరల్ అవేర్‌నెస్-క్రియేటివిటీ అండ్ పర్సెప్షన్ టెస్ట్. ఇందులో అభ్యర్థుల అబ్జర్వేషన్, విజువల్ ఇంటర్‌ప్రిటేషన్, జనరల్ అవేర్‌నెస్ స్కిల్స్ పరిశీలిస్తారు. రెండోది మెటీరియల్-కలర్స్-కాన్సెప్ట్ టెస్ట్. ఇందులో మెటీరియల్స్, మెటీరియల్ హ్యాండిలింగ్, ప్లాన్ అండ్ స్ట్రాటజీ, మల్టిపుల్ సొల్యూషన్స్, కలర్స్ తదితరాలపై అభ్యర్థుల పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు. అభ్యర్థులు కాన్సెప్ట్ టెస్ట్‌కు అవసరమైన పెన్స్, పెన్సిల్స్ (హెచ్‌బి, 2బి, 4బి, 6బి), సీజర్స్, స్కేల్, సెల్లో టేప్, పేపర్ కట్టర్, ఫెవీ స్టిక్, ఎరేజర్, కంపాస్, కలర్ పెన్సిల్స్, వాటర్ కలర్స్, బ్రష్‌లు వెంట తెచ్చుకోవాలి. తరవాత పర్సనల్ ఇంటర్వ్యూ ఉంటుంది. ఇందులో ఆప్టిట్యూడ్ టు క్రాఫ్ట్, ఇంటెలిజెన్స్ కోషంట్, కమ్యూనికేషన్ ఎబిలిటీ, క్రాఫ్ట్ అండ్ డిజైన్‌కు సంబంధించిన జనరల్ అవేర్‌నెస్, పర్సనల్ అచీవ్‌మెంట్స్, కరిక్యులర్ యాక్టివిటీస్ ఆధారంగా అభ్యర్థుల ప్రావీణ్యాన్ని పరీక్షిస్తారు. పోర్ట్ ఫోలియో ప్రజంటేషన్ పూర్తిగా అభ్యర్థి క్రియేటివ్ వర్క్‌కు సంబంధించి ఉండాలి. ఇందులో స్కెచింగ్, పెయింటింగ్, ఎంబ్రాయిడరీ, ఫొటోగ్రఫీ, మోడల్స్, ఎక్స్‌ప్లొరేషన్ విత్ మెటీరియల్స్, క్రియేటివ్ రైటింగ్ తదితర అంశాలు ఉండేలా చూసుకోవాలి. జనరల్ అవేర్‌నెస్-క్రియేటివిటీ అండ్ పర్సెప్షన్ టెస్ట్‌కు 35 శాతం, మెటీరియల్-కలర్స్-కాన్సెప్ట్ టెస్ట్‌కు 45 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



ముఖ్య సమాచారం
- **దరఖాస్తు ఫీజు:** ఇండియా సహా సార్క్ దేశాల అభ్యర్థులకు రూ.1,750; ఎన్ఆర్ఐలు సహా విదేశీ విద్యార్థులకు రూ.3,500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 28
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మే 30 నుంచి
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 18 నుంచి 21 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 28
- **ప్రోగ్రామ్ ఫీజు చెల్లింపు:** జూలై 1 నుంచి 12 వరకు
- **సెషన్స్ ప్రారంభం:** జూలై 15 నుంచి
- **వెబ్‌సైట్:** www.iicd.ac.in

ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (ఏపీ ఎస్‌సీహెచ్‌ఈ)- 'ఆర్ట్ అండ్ డిజైన్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఏడీసెట్) 2024' నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దీనిని కడపలోని డా.వైఎస్సార్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ (వైఎస్సార్ఏఎఫ్‌యూ) నిర్వహిస్తోంది. ఇందులో సాధించిన మెరిట్ ఆధారంగా బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్(బీఎఫ్ఏ), బ్యాచిలర్ ఆఫ్ డిజైన్(బీ డిజైన్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. వీటిని ఆంగ్ల మాధ్యమంలో చదవాల్సి ఉంటుంది. నిబంధనలకు లోబడి ఫీ రీయింబర్స్‌మెంట్ వర్తిస్తుంది.

స్పెషలైజేషన్‌లు-సీట్లు
- బీఎఫ్ఏ ప్రోగ్రామ్‌లో అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్, ఫొటోగ్రఫీ, యానిమేషన్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. యానిమేషన్‌లో 60 సీట్లు; మిగిలినవాటిలో స్పెషలైజేషన్‌కు 40 చొప్పున మొత్తం 160 సీట్లు ఉన్నాయి.
- బీ డిజైన్ ప్రోగ్రామ్‌లో ఇంటీరియర్ డిజైన్ స్పెషలైజేషన్ ఉంది. ఇందులో 60 సీట్లు ఉన్నాయి.
- ప్రతి ప్రోగ్రామ్‌లో 15 శాతం సీట్లను ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు ప్రత్యేకించారు.

అర్హత: ఎంపీసీ, ఎంఈసీ, బైపీసీ, ఎంబైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్‌లలో ఒకదానితో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏడీ సెట్ 2024 వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో మొత్తం 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ నాలెడ్జ్, ఆర్ట్ అండ్ కమ్యూనికేషన్ స్కిల్స్, టెక్నికల్ డీటెయిల్స్ ఆఫ్ అప్లయిడ్ ఆర్ట్, పెయింటింగ్, స్కల్ప్చర్, యానిమేషన్, ఫొటోగ్రఫీ, ఆర్ట్ హిస్టరీ, డిజైన్ స్కిల్స్ అంశాలనుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం మార్కులు 100. రెండు కోర్సులకూ(బీఎఫ్ఏ, బీ డిజైన్) కామన్ పేపర్ ఇస్తారు. ప్రశ్నపత్రం తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో అర్హత సాధించాలంటే కనీసం 35 శాతం మార్కులు రావాలి.

ముఖ్య సమాచారం
- **ట్యూషన్ ఫీజు:** ఏడాదికి రూ.37,000
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1000; బీసీ అభ్యర్థులకు రూ.750; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500



- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 22
- **కరెక్షన్ విండో ఓపెన్:** జూన్ 1 నుంచి 3 వరకు
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** జూన్ 4 నుంచి
- **ఏడీసెట్ 2024 తేదీ:** జూన్ 13
- **వెబ్‌సైట్:** www.ysrafu.ac.in, https://cets.apsche.ap.gov.in

జాబ్ కార్నర్

టీఎంసీలో వివిధ ఖాళీలు

మొత్తం ఖాళీలు: 87

టాటా మెమోరియల్ సెంటర్‌కు చెందిన టాటా మెమోరియల్ హాస్పిటల్...ముంబయి, గువహటి, విశాఖపట్నంలోని టీఎంసీ ఆసుపత్రుల్లో మెడికల్, నాన్-మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. మెడికల్ ఆఫీసర్ 'ఇ': **8 పోస్టులు**
2. మెడికల్ ఫిజిసిస్ట్: **2 పోస్టులు**
3. ఆఫీసర్ ఇన్‌చార్జ్: **1 పోస్టు**
4. సైంటిఫిక్ అసిస్టెంట్: **2 పోస్టులు**
5. అసిస్టెంట్ నర్సింగ్ సూపరింటెండెంట్: **1 పోస్టు**
6. ఫిమేల్ నర్స్: **58 పోస్టులు**
7. కిచెన్ సూపర్‌వైజర్: **1 పోస్టు**
8. టెక్నీషియన్ 'సి': **1 పోస్టు**
9. టెక్నీషియన్ 'ఎ': **4 పోస్టులు**
10. స్టెనోగ్రాఫర్: **6 పోస్టులు**
11. లోయర్ డివిజన్ క్లర్క్: **3 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, 12వ తరగతి, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: మే 7
వెబ్‌సైట్: tmc.gov.in

ఐఐఎంఆర్‌లో సీనియర్ రీసెర్చ్ ఫెలో

హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌లో ఉన్న ఐకార్-ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
ఖాళీలు: 2
అర్హత: సంబంధిత విభాగంలో మాస్టర్ డిగ్రీ, నెట్ అర్హతతోపాటు పని అనుభవం ఉండాలి.
వేతనం: నెలకు రూ.31,000 **ఇంటర్వ్యూ తేదీ:** మే 6
దరఖాస్తుకు చివరి తేదీ: ఏప్రిల్ 30
దరఖాస్తులు పంపాల్సిన ఈమెయిల్: balakrishna@millets.res.in
వెబ్‌సైట్: https://www.millets.res.in/ad.php





ఫార్మాస్యూటికల్ కోర్సుల్లో ప్రవేశానికి
నైపర్ జేఈఈ

గువహటీలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్)- జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) 2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ ఎగ్జామ్ ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న క్యాంపస్‌లలో మాస్టర్స్, పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ ఎగ్జామ్ రాయాలంటే జీప్యాట్/గేట్/నెట్ అర్హత తప్పనిసరి.

క్యాంపస్‌లు: అహ్మదాబాద్, గువహటీ, హాజీపూర్, హైదరాబాద్, కోల్‌కతా, రాయ్‌బరేలీ, ఎస్ఏఎస్ నగర్.

స్పెషలైజేషన్‌లు: బయోటెక్నాలజీ, మెడిసినల్ కెమిస్ట్రీ, మెడికల్ డివైసెస్, నేచురల్ ప్రొడక్ట్స్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్, ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్, రెగ్యులేటరీ టాక్సికాలజీ, ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్, రెగ్యులేటరీ అఫైర్స్, ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(ప్రాసెస్ కెమిస్ట్రీ), ఫార్మసీ ప్రాక్టీస్, బయోఫార్మాస్యూటికల్స్.

మాస్టర్స్ ప్రోగ్రామ్‌లు

- **కోర్సులు:** ఎంఫార్మసీ, ఎంటెక్(ఫార్మసీ), ఎంటెక్, ఎంఎస్(ఫార్మసీ), ఎంబీఏ(ఫార్మసీ)
- **సీట్లు:** అన్ని క్యాంపస్‌లలో కలిపి మొత్తం సీట్లు 990. హైదరాబాద్ క్యాంపస్‌లో 170 సీట్లు ఉన్నాయి. ఎంఎస్(ఫార్మసీ) కోర్సులో మెడిసినల్ కెమిస్ట్రీ 20, నేచురల్ ప్రొడక్ట్స్ 10, ఫార్మాస్యూటికల్ అనాలిసిస్ 20, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ 25, ఫార్మాస్యూటిక్స్ 25, ఫార్మాకోఇన్ఫర్మాటిక్స్ 10, రెగ్యులేటరీ అఫైర్స్ 10; ఎంటెక్(ఫార్మసీ) కోర్సులో ఫార్మాస్యూటికల్ టెక్నాలజీ(ప్రాసెస్ కెమిస్ట్రీ) 20, బయోటెక్నాలజీ 20; ఎంటెక్ కోర్సులో మెడికల్ డివైజెస్ 10 సీట్లు ఉన్నాయి. అహ్మదాబాద్ క్యాంపస్‌లో 150, గువహటీలో 160, హాజీపూర్‌లో 60, కోల్‌కతాలో 100, రాయ్‌బరేలీలో 100, ఎస్ఏఎస్ నగర్‌లో 250 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** స్పెషలైజేషన్‌ను అనుసరించి బీఫార్మసీ, బీఏఎంఎస్, బీవీఎస్సీ, బీడీఎస్, ఎంబీబీఎస్, ఎమ్మెస్సీ(ఆర్గానిక్ కెమిస్ట్రీ/బోటనీ/అనలిటికల్ కెమిస్ట్రీ/ఫార్మకాలజీ/టాక్సికాలజీ/లైఫ్ సైన్సెస్/బయో కెమిస్ట్రీ/మెడికల్ బయో టెక్నాలజీ/జువాలజీ/బయోలాజికల్ సైన్సెస్/ఫిజికల్/ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ/మాలిక్యులర్ బయాలజీ/బయోఇన్ఫర్మాటిక్స్/మైక్రోబయాలజీ/బయో ఫిజిక్స్/ఫుడ్ సైన్స్/లైఫ్ సైన్సెస్), బీఈ/బీటెక్(బయో ఇన్ఫర్మాటిక్స్/ఎలక్ట్రానిక్స్/బయో ఇంజనీరింగ్/బయో మెడికల్ ఇంజనీరింగ్/బయోటెక్నాలజీ/కెమికల్/మెటీరియల్ సైన్స్/బయో కెమికల్) కోర్సుల్లో ఒకటి పూర్తిచేసి ఉండాలి. కనీసం 60 శాతం మార్కులు తప్పనిసరి.
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్:** ఇందులో మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. జనరల్ ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్, రీజనింగ్, జనరల్ నాలెడ్జ్ అంశాలనుంచి 25 శాతం ప్రశ్నలు; బీఫార్మసీ, ఎమ్మెస్సీ సిలబస్‌ల నుంచి 75 శాతం ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు అర మార్కు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే పావు మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం 2 గంటలు. ఈ పరీక్షలో సాధించిన ప్రతిభ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి ఎంఎస్(ఫార్మసీ), ఎంఫార్మసీ, ఎంటెక్(ఫార్మసీ) కోర్సుల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

పీహెచ్‌డీ

- **సీట్లు:** అన్ని క్యాంపస్‌లలో కలిపి మొత్తం సీట్లు 73. అహ్మదాబాద్ క్యాంపస్‌లో 4, గువహటిలో 22, హాజీపూర్‌లో 9, కోల్‌కతాలో 10, రాయ్‌బరేలీలో 14, ఎస్ఏఎస్ నగర్‌లో 14 సీట్లు ఉన్నాయి.
- **అర్హత:** విభాగం-స్పెషలైజేషన్‌ను అనుసరించి ఎంఎస్(ఫార్మా), ఎంఫార్మసీ, ఎంటెక్ (ఫార్మసీ), ఎమ్మెస్సీ, ఎంఈ, ఎంటెక్, ఎండీ, ఎంవీఎస్సీ, ఎంబీఏ, ఫార్మాడీ కోర్సుల్లో ఒకటి పూర్తిచేసి ఉండాలి. ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ఎండీ, ఎంవీఎస్సీ, ఎండీఎస్, ఫార్మాడీ, స్పాన్సర్డ్ అభ్యర్థులు మినహా అందరికీ జీప్యాట్/గేట్/నెట్ అర్హత తప్పనిసరి. సీఎస్ఐఆర్/ యూజీసీ/ఐసీఎంఆర్/డీబీటీ/డీఎస్‌టీ నుంచి నెట్-జేఆర్ఎఫ్ అర్హత ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- **ఎంట్రెన్స్ ఎగ్జామ్:** కెమికల్ సైన్సెస్, బయోలాజికల్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ సైన్సెస్, ఫార్మాస్యూటికల్ మేనేజ్‌మెంట్ విభాగాలకు ఉదయం సెషన్‌లో మెడికల్ డివైజెస్ విభాగానికి మధ్యాహ్నం సెషన్‌లో ఎగ్జామ్ నిర్వహిస్తారు. ఎగ్జామ్‌లో 170 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. సంబంధిత పీజీ స్థాయి సిలబస్ నుంచి 75 శాతం ప్రశ్నలు; జనరల్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్, జనరల్ ఆప్టిట్యూడ్‌కు, జనరల్ ఇంగ్లీష్, ఆప్టిట్యూడ్ అండ్ రీజనింగ్‌లకు సంబంధించి 25 శాతం ప్రశ్నలు అడుగుతారు. మొత్తం మార్కులు 85. పరీక్ష సమయం 2 గంటలు. తప్పుగా గుర్తించిన సమాధానానికి పావు మార్కు కోత విధిస్తారు. ఈ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులను ఇంటర్వ్యూకి పిలుస్తారు. దీనికి 15 మార్కులు కేటాయించారు.

ముఖ్య సమాచారం
- **మాస్టర్స్ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.3000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1500
- **పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, దివ్యాంగులు, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.4000; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.2000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 24
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ
- **వెబ్‌సైట్:** www.niperguwahati.ac.in

లిటిల్స్



మీకు తెలుసా?

- పిచ్చుక జాతికి చెందిన ఈ పక్షిని 'లాంగ్ టైల్డ్ రోజ్ ఫించ్' అంటారు.
- ఈ రోజ్ ఫించ్ రష్యా, కజకిస్తాన్, దక్షిణ కొరియా, ఉత్తర కొరియా, మంగోలియా, జపాన్ దేశాల్లో ఉంటాయి.
- ఉష్ణమండల ప్రదేశాల్లో, సమశీతోష్ణ గడ్డిభూముల్లో ఎక్కువగా ఉంటాయి.
- దీన్ని పంజరాల్లో పెంచుకుంటారు. అయితే పంజరంలో ఎక్కువ కాలం ఉండలేదు.
- చిన్న ముక్కు, పక్షి కంటే ఎక్కువగా తోక ఉండటం వల్ల లాంగ్ టైల్డ్ అని పిలుస్తారు.




- మగపక్షులు రోజ్ కలర్‌లో ఉంటాయి. వాటి గొంతు శ్రావ్యంగా ఉంటుంది.
- ఆడపక్షులు బూడిద రంగు, తెలుపు రంగుల్లో కనపడతాయి.
- ఇవి ఒక చోట నుంచి మరొక చోటకు సులువుగా మైగ్రేట్ అవుతాయి.

ఎంత మంది మనుషులు ఉన్నారు?



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



7 తేడాలు గుర్తించండి



డైలీ సుడోకు - 292

4		2				1		7
	7		6					
	5	9	1			2		
	3			5		7		
	1		8		6		2	
		4		9			5	
		7			4	3	1	
					8		7	
3		6				5		2

సుడోకు - 291 సమాధానం

3	9	4	5	8	1	6	2	7
8	5	6	7	4	2	3	1	9
7	2	1	6	3	9	5	4	8
6	4	8	9	1	5	2	7	3
9	3	5	8	2	7	1	6	4
2	1	7	4	6	3	9	8	5
5	6	9	1	7	4	8	3	2
4	8	2	3	5	6	7	9	1
1	7	3	2	9	8	4	5	6

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.